
'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 3

బుధవారం 26-3-2025




**పంజాబ్ తొలి పంచ్**
ఐపీఎల్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌పై 11 పరుగులతో గెలుపు -16లో



**'కారు'చౌక ఈవీ బేరం!**
ఎలక్ట్రిక్ కార్లపై అదిరిపోయే డిస్కౌంట్ల 'మార్చ్' నడుస్తోంది -14లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



**'జమిలి' జేపీసీ గడువు పొడిగింపు**
జమిలి ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లులపై అధ్యయనానికి ఏర్పాటైన జేపీసీ గడువును లోక్‌సభ పొడిగించింది.
వివరాలు 6లో ▸



**బంగ్లాదేశ్‌లో సైనిక పాలన!**
బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్‌పై తిరుగుబాటుకు సైన్యం సిద్ధమవుతున్నట్లు మీడియా పేర్కొంది.
వివరాలు 6లో ▸



**సుంకాల కోతకు సిద్ధం..**
అమెరికాలో వచ్చే నెల 2 నుంచి ప్రతీకార టారిఫ్‌లు అమల్లోకి రాబోతున్న నేపథ్యంలో భారత్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.
వివరాలు 6లో ▸



**రూ.లక్ష కోట్లతో ఢిల్లీ బడ్జెట్**
ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం తమ తొలి బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. మొత్తం బడ్జెట్ విలువ రూ.లక్ష కోట్లు కావడం విశేషం.
వివరాలు 6లో ▸

## న్యూస్‌రీల్

### చేనేతకు 'తెలంగాణ లేబుల్'



చేనేత ఉత్పత్తుల ప్రాముఖ్యతను చాటేలా వాటికి 'ప్రత్యేక లేబుల్' రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే మగ్గాలను జియో ట్యాగింగ్ చేసిన ప్రభుత్వం .. వాటిపై తయారుచేసే చేనేత ఉత్పత్తులకు 'తెలంగాణ లేబుల్' జారీ చేయనుంది.

- వివరాలు 3లో▶

### ఏఐ ఉందా.. జాబ్ ఇంద..



ప్రస్తుతం సంప్రదాయ విద్యార్హతలకు మించి మార్కెట్‌కు తగ్గట్టుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుంటేనే ఉద్యోగాన్వేషణలో విజయం సాధించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఏఐ రెడీ వర్క్‌ఫోర్స్ ఉండాలని కంపెనీలు భావిస్తున్నాయి.

- వివరాలు 13లో▶

### నిఘా నేత్రాలనూ వదలట్లేదు



వ్యక్తిగత భద్రత కోసం ఏర్పాటు చేసుకుంటున్న సీసీటీవీ కెమెరాలను సైతం సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేస్తున్నారు. అందులోని ఫుటేజీని సోషల్ మీడియాలో పెడతామని బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తారని సైబర్‌భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- వివరాలు 2లో▶

### నిందితుడిపై అస్పష్టత!



ఎంఎంటీఎస్ రైలులో జరిగిన అత్యాచార యత్నం కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. దర్యాప్తులో భాగంగా పోలీసులు బాధితురాలికి పలువురు పాతనేరస్తుల ఫొటోలు చూపించారు. ఇందులో ఒక పాత నేరస్తుడి ఫొటోతో నిందితుడికి పోలికలు ఉన్నట్లు చెప్పింది.

- వివరాలు 17లో▶



**బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు**

చర్యలకు ఇంకెంత సమయం కావాలన్న ధర్మాసనం

# వార్షికోత్సవం చేసుకుంటున్నారా?

**ఇప్పటికి ఏడాది అంటే...పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవం అయ్యిందా? అన్న జస్టిస్ గవాయి**

- పదవీకాలం పూర్తయ్యేవరకు వేచి చూడటం రీజనబుల్ టైం అవుతుందా? అని ప్రశ్న
- మీరు అడిగే సమయానికి ఒక నిర్దేశిత గడువు అనేది ఉండదా? అని నిలదీత
- కేసును ఆలస్యం చేసేందుకు డిలే టాక్టిక్స్ ఉపయోగించవద్దని వ్యాఖ్య
- అయినా తాము ఈ కేసు మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని స్పష్టీకరణ

**స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వొచ్చా? లేదా అనే అంశంపై మాత్రమే వాదనలు వింటున్నట్లు వెల్లడి**

**తదుపరి విచారణ ఏప్రిల్ 2కు వాయిదా.. అదేరోజు స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శి వాదనలు వింటామన్న ధర్మాసనం**

సాక్షి, న్యూఢిల్లీ: 'ఫిరాయింపులపై చర్యలు తీసుకునేందుకు ఇంకెంత సమయం కావాలి? ఎమ్మెల్యేల పదవీకాలం పూర్తి అయ్యేవరకు వేచి చూడటం రీజనబుల్ టైం (తగిన సమయం) అవుతుందా? న్యాయపరంగా చర్యలు తీసుకోవడానికి ఒక గడువు అనేది ఉండాలి కదా? పార్టీ ఫిరాయింపులపై మొదటి ఫిర్యాదు అందినప్పటి నుంచి ఇప్పటివరకు ఎంత సమయం అవుతోంది? ఏడాది అవుతోందని వార్షికోత్సవం జరుపుకుంటున్నారా?..' అంటూ స్పీకర్ కార్యాలయాన్ని ఉద్దేశించి సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. మీరు అడిగే సమయానికి ఒక నిర్దేశిత గడువు అనేది ఉండదా? అని ప్రశ్నిస్తూనే.. మరోపక్క ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వొచ్చా లేదా? అనే అంశంపై మాత్రమే తాము వాదనలు వింటున్నట్లు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 2వ తేదీకి వాయిదా వేసింది. అదేరోజు స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శుల వాదనలను వింటామని తెలిపింది. బీఆర్‌ఎస్ నుంచి పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌లపై ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్‌ల పేర్లతో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్‌ఎల్పీ).. ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, గూడెం మహి పాల్ రెడ్డి, అరికెపూడి గాంధీలపై బీఆర్‌ఎస్ పార్టీ, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు, తదితరులు రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జి మైస్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం

మిగతా 12వ పేజీలో ▶



# మూడున ముహూర్తం!

**కేబినెట్ విస్తరణపై రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు సమాచారం!**

- ➤ అదేరోజు మంత్రుల శాఖల్లో మార్పులు
- ➤ అసెంబ్లీ లాబీల్లో హాట్‌టాపిక్‌గా మంత్రివర్గ విస్తరణ
- ➤ ఢిల్లీ భేటీపై డిప్యూటీ సీఎం భట్టిని ఆరా తీసిన ఎమ్మెల్యేలు
- ➤ రాజగోపాల్‌రెడ్డి, వివేక్, శ్రీహరిలకు అభినందనలు
- ➤ ప్రస్తుత మంత్రుల్లో ఒకరిద్దరికి ఉద్వాసన పైనా చర్చ

**డిప్యూటీ స్పీకర్ రేసులో బాలూ నాయక్‌తో పాటు ఎన్.పద్మావతిరెడ్డి?**

సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ వచ్చే నెల 3న జరగనున్నట్టు సమాచారం. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్టానం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్టు తెలుస్తోంది. కేబినెట్ విస్తరణతో పాటు అదేరోజు మంత్రుల శాఖల్లో మార్పులు కూడా జరగనున్నాయని, ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు సమాచారం అందినట్లు పార్టీవర్గాలు వెల్లడించాయి. సోమవారం ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ అధిష్టానం, రాష్ట్ర పెద్దల భేటీ అనంతరం రాష్ట్ర పార్టీలో మంత్రివర్గ విస్తరణ అంశం హాట్‌టాపిక్‌గా మారింది. ఎవరెవరికి మంత్రి పదవులు వచ్చే అవకాశాలున్నాయి.. ఎవరి శాఖల్లో మార్పులు జరగొచ్చు.. ప్రస్తుత మంత్రుల్లో ఎవరినైనా తప్పిస్తారా? అనే అంశాలపై మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా నేతల్లో విస్తృత చర్చ జరిగింది. అటు కాంగ్రెస్ శ్రేణులు, ఇటు రాజకీయ వర్గాలతో పాటు శాసనసభ బడ్జెట్ సమావేశాలకు హాజరైన



మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా చర్చోపచర్చలు సాగించారు.

**ఇంకా సమాచారం లేదన్న ఆ ముగ్గురూ..**
మంగళవారం శాసనసభ లాబీల్లో మంత్రివర్గ విస్తరణే ప్రధాన చర్చనీయాంశం అయ్యింది. ఢిల్లీ వేదికగా జరిగిన చర్చల్లో

మిగతా 12వ పేజీలో ▶



# బీమా ధీమా లేదు

**పదేళ్లుగా పంటల బీమాపై ప్రభుత్వాల పిల్లిమొగ్గలు**

- ప్రధానమంత్రి ఫసల్ బీమాలో చేరని బీఆర్‌ఎస్ సర్కార్
- పంటల బీమా హామీని పట్టించుకోని రేవంత్ ప్రభుత్వం
- ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న రైతులకు నిరాశే..
- సర్కార్ దయతలిచి ఇచ్చే పరిహారమే గతి

సాక్షి, హైదరాబాద్: మనదేశంలో వ్యవసాయం అంటే ప్రకృతితో జూదం ఆడినట్లే.. కష్టపడి పండించిన పంట చేతికందుతుందన్న గ్యారంటీ లేదు. అందుకే ప్రభుత్వాలు రైతుల పంటలకు బీమా సౌకర్యం కల్పిస్తాయి. కానీ, రాష్ట్రంలో బీమా పథకాలు లేకపోవటం, కేంద్ర ప్రభుత్వ బీమా పథకంలో రాష్ట్రం చేరకపోవటంతో ప్రకృతి వైపరీత్యాలతో పంటలు కోల్పోయిన రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఇటీవల పలు జిల్లాల్లో కురిసిన అకాల వర్షాలకు 11,298 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖనే

మిగతా 3వ పేజీలో ▶

# ఆరు కేటగిరీల్లో యువ వికాసం

**మూడింటికి బ్యాంకు రుణంతో లింకు**

- మరో మూడింటికి లబ్ధిదారు వాటాతో పరిమితం
- పూర్తి మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- ఏప్రిల్ 5 వరకు ఓబీఎంఎంఎస్‌లో దరఖాస్తులు.. జూన్ 9వ తేదీ లోపు ప్రక్రియ మొత్తం పూర్తి



సాక్షి, హైదరాబాద్: రాజీవ్ యువ వికాసం పథకం కింద ఆరు కేటగిరీల్లో రాయితీలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మూడింటికి బ్యాంకు రుణాన్ని అనుసంధానం చేస్తారు. మరో మూడింటికి ప్రభుత్వం ఇచ్చే రాయితీ పోను.. మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారు నేరుగా భరించాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన (ఈబీసీ) నిరుద్యోగులకు యువ వికాసం పథకం కింద స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం ఆర్థికసాయం చేస్తుంది. ఈ పథకం పూర్తిస్థాయి మార్గదర్శకాలను మంగళవారం ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల వైస్‌చైర్మన్

మిగతా 13వ పేజీలో ▶

**ఎంపిక ప్రక్రియ ఇలా..**

- → ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఏప్రిల్ 5వ తేదీ వరకు కొనసాగుతుంది.
- → ఏప్రిల్ 6 నుంచి మే 20 వరకు మండల కమిటీలు దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేసి, ఆయా జాబితాలను జిల్లా కమిటీలకు సమర్పించాలి.
- → మే 21 – 31 తేదీల మధ్యలో జిల్లా కమిటీలు ఆయా జాబితాలను పరిశీలించి మంజూరీలు చేపట్టాలి
- → జూన్ 2 నుంచి 9 తేదీల మధ్య లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించాలి.

# ఈసారి గేట్‌వాల్వ్‌లు..

- ట్రయల్‌రన్ చేస్తుండగా పడిపోయిన వైనం
- 'దేవాదుల' నీటి విడుదలకు మళ్లీ బ్రేక్
- నీళ్ల ఎత్తిపోయడానికి ఆటంకం.. ఆస్ట్రియా వెళ్లిపోయిన ఇంజనీర్ల బృందం
- మళ్లీ వారొచ్చి మరమ్మతులు చేస్తేనే నీటి విడుదల



దేవాదుల పంపుహౌస్‌లోని మోటారు

- వివరాలు 13లో

# చేవెళ్ల రోడ్డు విస్తరణకు బ్రేక్

- మర్రి చెట్లకు అభయం ఇచ్చేవరకు విస్తరణ వద్దు
- జాతీయ హరిత ట్రిబ్యునల్ తీర్పు
- పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక శాస్త్రీయంగా లేదని అసంతృప్తి
- మళ్లీ నిపుణులతో శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేసి నివేదించాలని ఆదేశం



- వివరాలు 12లో

## ఇందుకేనేమో!




ఓట్లేయించుకున్నవారు జీతాలు పెంచుకున్నారు.. ఓటేసిన మనకు కనీస వేతనం లేదు!

# సొరంగంలో మరో మృతదేహం లభ్యం


- కన్వేయర్ బెల్టు సమీపంలో చేపట్టిన తవ్వకాల్లో గుర్తింపు
- మృతుడు జేపీ కంపెనీకి చెందిన ప్రాజెక్టు ఇంజనీర్ మనోజ్‌కుమార్‌గా నిర్ధారణ
- మృతుడి కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత



మనోజ్‌కుమార్

సాక్షి, నాగర్‌కర్నూల్: శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగ ప్రమాదంలో శిథిలాల కింద కూరుకుపోయిన వారిలో మరొకరి మృతదేహం మంగళవారం లభ్యమైంది. మృతుడిని జేపీ కంపెనీకి చెందిన ప్రాజెక్టు ఇంజనీర్ మనోజ్‌కుమార్ (50)గా గుర్తించారు. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో సహాయ బృందాలు మనోజ్‌కుమార్ మృతదేహాన్ని

మిగతా 3వ పేజీలో ▶



# అదిగో భద్రాద్రి.. గౌతమి ఇదిగో చూడండి..

**భద్రాచలం ఆలయ నూతన డిజైన్లను విడుదల చేసిన ప్రభుత్వం.. క్షేత్ర అభివృద్ధి దిశగా తొలి అడుగు..**

**మాడ వీధుల విస్తరణలో నిర్వాసితుల పరిహారం కోసం రూ.34 కోట్లు విడుదల**

- వివరాలు 5లో

దంతెవాడ–బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్

# ముగ్గురు మావోయిస్టులు మృతి

- వరంగల్ జిల్లాకు చెందిన కీలక నేత సుధాకర్, ఆయన అంగరక్షకుల మృతి
- సుధాకర్‌పై రూ.25 లక్షల రివార్డు
- కీలక నేతలే లక్ష్యంగా కొనసాగుతున్న పోలీసుల వేట



సుధాకర్ (ఫైల్)

సాక్షి, హైదరాబాద్/ సాక్షిప్రతినిధి, వరంగల్/ చర్ల: మావోయిస్టు కీలక నేతలే టార్గెట్‌గా సాయుధ పోలీసు బలగాలు తమ వేట ముమ్మరం చేశాయి. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో పట్టు సాధిస్తూ మావోయిస్టుల కీలక ప్రాంతాల్లోకి చొచ్చుకుపోతున్న బలగాలు నక్సల్స్ ఏరివేతను కొనసాగిస్తున్నాయి. తాజాగా మంగళవారం ఉదయం దంతెవాడ–బీజాపూర్ ప్రాంతంలోని గీడం పోలీస్‌ స్టేషన్ పరిధిలోని గిర్సాపర, నెల్గోడ, బోడ్గా, ఇకెలి గ్రామాల సరిహద్దు ప్రాంతాలలో నక్సల్స్ ఉన్నట్టు సమాచారం అందడంతో దంతెవాడ డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్ బృందం గాలింపు జరపగా చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ఇందులో డీకేఎస్‌జెడ్‌సీ (దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ) సభ్యుడిగా పనిచేస్తున్న హనుమకొండ జిల్లా మడికొండ పీఎస్ పరిధిలోని తరాలపల్లికి చెందిన మావోయిస్టు కీలకనేత అంకేశ్వరపు సారయ్య అలియాస్ సుధాకర్ అలియాస్ సుధీర్ అలియాస్ మురళి మృతిచెందినట్టు దంతెవాడ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ గౌరవ్ రాయ్ అధికారికంగా వెల్లడించారు. 1991లో మావోయిస్టు

మిగతా 5వ పేజీలో ▶

## క్లుప్తంగా...

### నా మాటలను ఉపసంహరించుకుంటున్నా

సునీతారెడ్డి నొచ్చుకోవడంతో స్పీకర్ దిద్దుబాటు



సాక్షి, హైదరాబాద్: 'మహిళలంటే నాకు చాలా గౌరవం. నాకు 8 మంది సిస్టర్స్ ఉన్నారు. సభ్యులు మాట్లాడే సమయంలో అధికార, విపక్ష సభ్యుల నుంచి రన్నింగ్ కామెంటరీతో విసుగు చెంది వినబుద్ధి కావడం లేదని అన్నాను. మిమ్మల్ని ఉద్దేశించి కాదు. మీ మనసుకు బాధ కలిగితే నా మాటలను ఉపసంహరించుకుంటున్నా'అని బీఆర్ఎస్ సభ్యులు సునీతా లక్ష్మారెడ్డిని ఉద్దేశించి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం శాసనసభలో బడ్జెట్ పద్దులపై చర్చ ప్రారంభమైన వెంటనే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, సోమవారం తాను సభలో మాట్లాడుతుండగా స్పీకర్ చేసిన వ్యాఖ్యలతో బాధపడ్డానని తెలియజేశారు. 'నాకే వినబుద్ధి కావడం లేదు, మీరెలా వింటున్నారో అనడం బాధాకరం'అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తానని స్పీకర్ తెలిపారు.

### ఉచిత బస్సుల వల్ల దేవాదాయ ఆదాయం పెరిగింది

శాసనసభలో మంత్రి కొండా సురేఖ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: తమ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల దేవాలయాల ఆదాయం పెరిగిందని దేవాదాయ మంత్రి కొండా సురేఖ తెలిపారు. దేవాదాయ శాఖ పద్దుపై శాసనసభలో మంగళవారం జరిగిన చర్చలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. పుష్కరాల నిర్వహణకు అవసరమైన నిధులు మంజూరు చేశామని, యాదగిరిగుట్ట, భద్రాచలం ఆలయాలను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. రూ. వంద కోట్ల ఆదాయం దాటిన దేవాలయాలకు పాలక మండళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. దేవాలయాల భూములు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు చేపడుతున్నామని, రెవెన్యూ, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి, ఫెన్సింగ్ చేస్తామని హామీ ఇచ్చారు. అటవీ శాఖ పద్దుపై చర్చకు సమాధానమిస్తూ, జీవ వైవిధ్యాన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నామన్నారు. హైదరాబాద్ జూపార్క్‌ను వేరే చోటుకు మార్చే ఉద్దేశం లేదన్నారు. క్రీడలకు కేటాయింపును గతం కన్నా నాలుగు రెట్లు పెంచామని, క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాగా రాష్ట్రంలో 20వేల ఎకరాల దేవాదాయ శాఖ భూములు కబ్జాకు గురయ్యాయని బీజేపీ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ ఆరోపించారు.

### భట్టిని కలిసిన మల్లారెడ్డి, పల్లా, దయాకర్‌రావు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు.. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిశారు. మంగళవారం అసెంబ్లీ లాబీల్లోని భట్టి చాంబర్‌కు ఈ ముగ్గురూ వచ్చారు. తన నియోజకవర్గంలోని ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ పనులకు సంబంధించి రూ.50 లక్షల నిధులు పెండింగ్ పెట్టారని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరుతూ భట్టికి మల్లారెడ్డి వినతిపత్రం అందించారు. అలాగే దేవాదుల నుంచి పాలకుర్తి, జనగామ నియోజకవర్గాలకు నీరివ్వాలని, తమ నియోజకవర్గాలకు నిధులు విడుదల చేయాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. కాగా, మధ్యాహ్నం తర్వాత భట్టి చాంబర్‌లో ముగ్గురు మంత్రులు సమావేశమయ్యారు. భట్టితో పాటు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ చాలాసేపు మాట్లాడుకున్నారు. వీరితో పాటు పలువురు ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు.

### మంత్రి పదవి వస్తుందనుకుంటున్నా

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు మంత్రి పదవి వస్తుందనుకుంటున్నానని అంటూనే ఢిల్లీ నుంచి మాత్రం తనకు ఎలాంటి ఫోన్ రాలేదని చెప్పారు. మంగళవారం అసెంబ్లీ లాబీల్లో ఆయన విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ కేబినెట్ విస్తరణపై ఢిల్లీలో సీరియస్‌గా చర్చ జరిగిందని తెలిపారు. తనకు భువనగిరి ఎంపీ బాధ్యత లిస్తే సమర్థవంతంగా నిర్వహించానని, ఇప్పుడు ఏ పదవి వచ్చినా సమర్థవంతంగా నిర్వహిస్తానని రాజగోపాల్‌రెడ్డి చెప్పారు.

### ఏది జరిగినా ఎదుర్కొంటా

ఎమ్మెల్యే కడియం



సాక్షి, హైదరాబాద్: తాను అందరిలాగా కాదని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు. ఉన్నది ఉన్నట్టు ఏదైనా చెప్పే అలవాటు తనకుందని, ఆ క్రమంలో ఏది జరిగినా ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉంటానని మంగళవారం అసెంబ్లీ లాబీల్లో ఆయన విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ చెప్పారు. సుప్రీంకోర్టులో అనర్హత కేసు గురించి విలేకరులు ప్రశ్నించగా తన తరఫున వకాలత్ ఇచ్చానని కడియం వెల్లడించారు.



# నిఘా నేత్రాలనూ వదలట్లేదు

ఇళ్లు కార్యాలయాల్లోని సీసీటీవీ ఫుటేజీని హ్యాక్ చేస్తున్న సైబర్ మోసగాళ్లు

అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్న సైబర్ భద్రతా నిపుణులు

ఎప్పటికప్పుడు పాస్‌వర్డ్ మార్చుకోవాలని సూచన

సాక్షి, హైదరాబాద్: వ్యక్తిగత భద్రత కోసం ఏర్పాటు చేసుకుంటున్న సీసీటీవీ కెమెరాలను సైతం సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేస్తున్నారు. అందులోని ఫుటేజీని వాడుకొని మోసగించేందుకు..సోషల్ మీడియాలో పెడతామని బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తారని సైబర్ భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో పాయల్ మెటర్నిటీ ఆస్పత్రి సీసీటీవీ కెమెరాలను సైబర్ మోసగాళ్లు హ్యాక్ చేయడంతో దీనిపై చర్చ మొదలైంది. ఇళ్లు, కార్యాలయాల్లోని సీసీటీవీ కెమెరాలు సైతం హ్యాకింగ్‌కు గురయ్యే ప్రమాదముందని, కొద్దిపాటి జాగ్రత్తలతో ఆ ముప్పు నుంచి తప్పించుకోవచ్చని సైబర్ నిపుణులు చెబుతున్నారు.

**సీసీటీవీ ఫుటేజీని ఎలా హ్యాక్ చేస్తారు?**



సీసీటీవీ కెమెరాలను ఇన్‌స్టాల్ చేసిన తర్వాత వాటి ఫీడ్‌ను చూసేందుకు మనం ఏర్పాటు చేసుకునే ఖాతాకు సంబంధించిన సీసీటీవీ కెమెరాలకు డిఫాల్ట్ పాస్‌వర్డ్‌లను చాలామంది మార్చరు. దీంతో హ్యాకర్లు సులభంగా కెమెరాల్లోకి చొరబడుతున్నారు. కొన్ని సీసీటీవీ కెమెరాల సాఫ్ట్‌వేర్‌లో లోపాలు ఉండటం కూడా హ్యాకర్లకు కలిసొస్తుంది. బలహీనమైన వైఫై నెట్‌వర్క్‌లు కూడా హ్యాకర్లకు సులభమైన లక్ష్యాలుగా మారుతాయి. ఫిషింగ్ ఈ-మెయిల్‌లతో హ్యాకర్లు యూజర్ల పాస్‌వర్డ్‌లు, ఇతర సమాచారాన్ని సేకరించి హ్యాకింగ్‌కు పాల్పడుతున్నారు.

**హ్యాక్ చేయడం వల్ల కలిగే నష్టాలు**

- వ్యక్తిగత గోప్యతకు భంగం కలుగుతుంది.
- ఇళ్లు, కార్యాలయాల్లోని ముఖ్యమైన సమాచారం దొంగిలిస్తారు.
- బెదిరింపులు, బ్లాక్‌మెయిల్‌లకు గురయ్యే ప్రమాదముంది.
- ఆర్థికంగా నష్టాలు కలిగే ప్రమాదం ఉంది.

**ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి**

- సీసీటీవీ కెమెరాలకు తప్పకుండా స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌లు పెట్టుకోవాలి. అవి సులువుగా ఇతరులు గుర్తించలేనట్టుగా ఉండాలి.
- సీసీటీవీల సాఫ్ట్‌వేర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి.
- వైఫై నెట్‌వర్క్‌ను సురక్షితంగా పెట్టుకోవాలి.
- అనుమానాస్పద లింక్‌లు, ఈ-మెయిల్‌లపై ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదు.
- అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే సైబర్ పోలీసులు లేదా సైబర్ క్రైమ్ పోర్టల్ 1930లో ఫిర్యాదు చేయాలి.

# కేటీఆర్.. మీరు సీఎం అవుతారు

**అప్పటివరకు ప్రతిపక్షంలో ఉండండి**

- తెలంగాణ ఏర్పాటులో మీ పాత్ర ఉంది
- కానీ.. కాంగ్రెస్, సోనియాదే ఎక్కువ పాత్ర
- అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'కేటీఆర్.. మీరు భవిష్యత్తులో ముఖ్యమంత్రి అవుతారు. రాష్ట్రంలో మరోసారి మేము అధికారంలోకి వస్తాం. అప్పటివరకు మీరు ప్రతిపక్ష పాత్ర పోషించండి. మీకు గతంలో రెండు పర్యాయాలు అధికారం ఇచ్చారు. మాకు కూడా ప్రజలు రెండు పర్యాయాలు అధికారం ఇస్తారు'అని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. తెలంగాణ ఏర్పాటులో బీఆర్ఎస్ పాత్ర ఉందని.. అయితే, ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ, సోనియాగాంధీ మరింత పెద్ద పాత్ర పోషించారని చెప్పారు. అందుకే తమకు కూడా ప్రజలు రెండు పర్యాయాలు అధికారం ఇస్తారని పేర్కొన్నారు. శాసనసభలో మంగళవారం రహదారులు, భవనాల శాఖ పద్దుపై చర్చకు ఆయన సమాధానమిచ్చారు.

**మీరు వదిలేస్తే.. మేం సరిదిద్దుతున్నాం**

బీఆర్ఎస్ ప్రభుత్వం మధ్యలోనే వదిలేసిన పనులను తాము ఇప్పుడు చక్కబెడుతున్నామని వెంకట్‌రెడ్డి తెలిపారు. 'మీరు కొన్ని మంచి పనులు చేశారు. కొన్ని తప్పులు చేశారు. కొన్ని ప్రారంభించి వదిలేశారు. అవన్నీ మేము సరిదిద్దుకుంటూ వెళ్తున్నాం. జూన్ 2న సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభిస్తాం. అల్వాల్‌లో కూడా డిఫెన్స్ నుంచి భూమి తీసుకుని అక్కడ నిర్మాణం ప్రారంభిస్తున్నాం. ఎల్‌బీ నగర్‌లో నిర్మించే టిమ్స్‌ను 24 అంతస్తుల నుంచి 14 అంతస్తులకు కుదించి వేగంగా పనులు కొనసాగుతున్నాయి. మీరు సచివాలయాన్ని అద్భుతంగా కట్టారు. అంచనా కంటే రూ.500 కోట్లు అదనంగా ఖర్చు చేశారు. ఇప్పుడు వేలకోట్ల రూపాయల బిల్లులు చెల్లించాల్సి ఉంది'అని తెలిపారు.

**మీరు ఫామ్‌హౌస్‌కు.. మేము ఢిల్లీకి**

'మీ అధిష్ఠానం ఫామ్‌హౌస్‌లో ఉంటే.. మా పార్టీ అధిష్ఠానం ఢిల్లీలో ఉంది. అందుకే మేము ఢిల్లీకి వెళ్తున్నాం. సీఎం ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా మీరు విమర్శించడం మంచిది కాదు'అని మంత్రి వెంకట్‌రెడ్డి అన్నారు. కాగా, పనులు చేసిన తరువాత బిల్లులు చెల్లించడం ప్రభుత్వాల బాధ్యత అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. వికారాబాద్-తాండూరు-జహీరాబాద్ రహదారిని జాతీయ రహదారిగా మార్చాలని కోరారు. సంగెం బ్రిడ్జిని మంజూరు చేయాలని భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి కోరారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి, మహబూబాబాద్ రామచంద్రునాయక్ కూడా మాట్లాడారు. మన్నెగూడ- అప్పా జంక్షన్ పనులు వెంటనే ప్రారంభించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సూచించారు. వికారాబాద్ జిల్లాలో ప్రతిపాదించిన నాలుగు రోడ్లకు కూడా తుదిరూపు ఇవ్వాలని కోరారు.

## అందాల పోటీలతో ఆదాయం ఎలా వస్తుంది?

బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీల వల్ల రాష్ట్రానికి ఆదాయం, ఉద్యోగాలు ఎలా వస్తాయో ప్రభుత్వం చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చలో కేటీఆర్ ప్రసంగించారు. ఫార్ములా-ఈ కోసం రూ.46 కోట్లు ఖర్చు చేయడాన్ని ప్రశ్నించిన వారు ఇప్పుడు అందాల పోటీలకు ఎలా ఖర్చు పెడుతున్నారని నిలదీశారు. ఫార్ములా-ఈ రద్దు మూలంగా టెస్లా కంపెనీ పెట్టుబడులు నిలిచిపోయాయన్నారు. ఫార్ములా-ఈ వల్ల రూ.700 కోట్ల ఆదాయం వచ్చిందని కేటీఆర్ తెలిపారు. సాంస్కృతిక సారథి కింద కేసీఆర్ ప్రభుత్వం 550 మందికి ఉద్యోగాలిచ్చారని, రామప్ప దేవాలయానికి యునెస్కో వారసత్వ గుర్తింపు తీసుకొచ్చామని చెప్పారు. సోమశిలలో పర్యాటక ప్రాజెక్టు, వరంగల్ కాళోజీ కళాక్షేత్రం, యాదాద్రి గుడిని కేసీఆర్ అద్భుతంగా నిర్మించారని కేటీఆర్ పేర్కొన్నారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ ప్రాంగణానికి ఎందుకు తాళం వేశారని ప్రశ్నించారు. అమరవీరుల స్మారకాన్ని ఎందుకు అందుబాటులోకి తీసుకురావడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఓఆర్ఆర్‌ను టీఓటీ విధానంలో 33 ఏళ్లకు లీజు ఇస్తే ఘోర తప్పిదం అని విమర్శించిన వారు పర్యాటక విధానంలో 99 ఏళ్ల లీజును ఎలా సమర్థిస్తారన్నారు.

## బడుల్లో బెంచీల స్కాం

రూ. 4-5 వేలకు దొరికే బెంచీకి రూ.14-18 వేల ఖర్చు చూపిస్తున్నారు: అక్బరుద్దీన్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బెంచీల కొనుగోలు పేరుతో భారీ కుంభకోణం జరుగుతోందని ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. మంగళవారం అసెంబ్లీలో పద్దులపై చర్చలో ఆయన మాట్లాడుతూ మార్కెట్లో రూ. 4-5 వేలకు మంచి బెంచీ వస్తుందని.. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో రూ. 14-18 వేల వరకు ఒక్కో బెంచీకి ఖర్చు చూపిస్తున్నారని పేర్కొన్నారు. ఫర్నిచర్ సరఫరాదారు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి అనుకూలంగా ఉండేవాడని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటున్నాడని ఆరోపించారు. ఈ అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. తాము అధికారంలోకి వస్తే విద్యాశాఖకు 15 శాతం నిధులు కేటాయిస్తానన్న కాంగ్రెస్.. ఇప్పుడు మాటతప్పి బడ్జెట్‌లో కేవలం 7.54 శాతం నిధులే కేటాయించిందని అక్బరుద్దీన్ విమర్శించారు. కాలంచెల్లిన కోర్సులతో యూనివర్సిటీల ప్రతిష్ఠ మసకబారుతోందని.. వెంటనే ప్రముఖ విదేశీ వర్సిటీల కోర్సులపై అధ్యయనం చేసి మన కోర్సుల్లో మార్పులు చేయాలని అక్బరుద్దీన్ సూచించారు. 3,944 బడుల్లో కేవలం 31 నుంచి 100లోపే విద్యార్థులు ఉన్నారని.. 1,200 బడుల్లో ఎన్‌రోల్‌మెంటే లేదని విమర్శించారు. అలాగే 2,017 బడుల్లో టాయిలెట్లు లేవని సభ దృష్టికి తీసుకెళ్లారు. విద్యాసంస్థల్లో త్రిభాషా విధానాన్ని అమలు చేయాలని కోరారు. కొత్త జూపార్కు ప్రతిపాదన విరమించుకోవాలని, హైకోర్టును తరలించాక పాత భవనాన్ని నిజాంనగల ప్రదర్శనకు కేటాయించాలన్నారు.

**వైఎస్సార్‌ను మరవలేను..**

అక్బరుద్దీన్ తన ప్రసంగంలో ఉమ్మడి ఏపీ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డిని తలుచుకున్నారు. ఆరోగ్యశ్రీ లాంటి పథకాలతో పేదలకు వైఎస్సార్ అండగా నిలిచారని.. 4 శాతం రిజర్వేషన్లతో మైనారిటీల జీవితాల్లో వెలుగులు నింపారని గుర్తుచేశారు. అడుగడుగునా మంచిపనులతో డాక్టర్ వైఎస్సార్ మదిలో నిలిచిపోయారని, ఆయన్ను మరువలేనన్నారు.

## ఓఆర్ఆర్‌ను అమ్ముకున్నోళ్లకు ట్రిపుల్ ఆర్‌పై మాట్లాడే అర్హత ఉందా?

**ప్రశాంత్‌రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి మండిపాటు**

- మంత్రే అవాస్తవాలు చెప్పారని తప్పుబట్టిన వేముల



సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)ను అమ్ముకున్న బీఆర్ఎస్ వారికి రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్)పై మాట్లాడే అర్హత ఉందా? అని ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రిపుల్ ఆర్ విషయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సభను తప్పుదోవపట్టిస్తున్నారని మండిపడ్డారు. ట్రిపుల్ ఆర్‌కు కేంద్రం '151ఏఏ'నంబర్‌ను కేటాయించిందని, 88 శాతం మంది రైతుల నుంచి భూసేకరణకు సమ్మతి తీసుకున్నామని స్పష్టం చేశారు. రెండు నెలల్లో కేంద్ర కేబినెట్‌లో ఆమోదించి అన్ని రకాల అనుమతులిస్తామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చారన్నారు. ఆర్అండ్‌బీ శాఖ పద్దులపై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డిల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అవాస్తవాలు మాట్లాడి సభను తప్పుదోవపట్టిస్తున్నారని ఒకరినొకరు విమర్శించుకున్నారు.

**కోమటిరెడ్డి చెప్పింది అవాస్తవాలే..**

'గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి రూ.8,112 కోట్లే ఖర్చు చేసిందని మొన్న సభలో మంత్రి కోమటిరెడ్డి అవాస్తవాలు మాట్లాడారు. ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయాలు, కేంద్ర గ్రాంట్లు, ఇతర వ్యయాలు కలిపి రోడ్లు, బ్రిడ్జిలకు రూ.22,180 కోట్లు విడుదలయ్యాయి. నేషనల్ హైవేలను కలిపితే మొత్తం రూ.32,832 కోట్లు ఖర్చు చేశాం'అని ప్రశాంత్‌రెడ్డి అభ్యంతరం తెలిపారు. ఉప్పల్ ఫ్లైఓవర్ నిర్మాణంలో జాప్యం జరగకుండా సబ్ కాంట్రాక్టర్ల పేరుతో ఎస్క్రో ఖాతాను తానే తెరిపించానని కోమటిరెడ్డి అనడం కూడా అవాస్తవమేనన్నారు. తాను ఆర్అండ్‌బీ మంత్రిగా ఉన్నప్పుడే ఖాతా తెరిపించానన్నారు. ట్రిపుల్ ఆర్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎకరా భూసేకరణ జరగలేదని తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆర్ఆర్ఆర్‌కు ఇంకా ఎన్‌హెచ్ నంబర్ కేటాయించకపోవడంతో కేంద్రం నిధులు రావన్నారు. ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్‌ను కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిన తర్వాత ఎందుకు మారుస్తున్నారని ప్రశ్నించారు.

## నమస్తే మంత్రిగారూ.. ఇప్పుడంతా మీ హవాయే!





మంత్రి పదవి రేసులో ఉన్న వివేక్ వెంకటస్వామికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పలకరింపు

గతంలో మీ హవా నడిచిందిగా అంటూ బదులిచ్చిన వివేక్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, చెన్నూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మధ్య మంగళవారం అసెంబ్లీ లాబీల్లో ఆసక్తికర చర్చ జరిగింది. మల్లారెడ్డికి వివేక్ ఎదురుపడగా 'నమస్తే మంత్రిగారూ'అంటూ వివేక్‌ను మల్లారెడ్డి పలకరించారు. మంత్రి పదవి దాదాపు ఖరారైనట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయన్ను అలా సంబోధించారు. అందుకు ప్రతిగా 'థ్యాంక్స్ మల్లన్న'అని వివేక్ స్పందించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కోమటిరెడ్డి, వివేక్ ఫ్యామిలీల హవా నడుస్తోందని పేర్కొనగా.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు 'నీ హవా నడిచింది కదా మల్లన్నా'అని వివేక్ బదులిచ్చారు.

**ఇప్పుడు కత్తులు దూసుడే..:** అనంతరం మల్లారెడ్డి విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ పార్లమెంటులో వాజ్‌పేయి లాంటి నేతలు మాట్లాడుతుంటే దేశ ప్రజలు ఆసక్తిగా చూసేవారని, ఉమ్మడి ఏపీలో రాజశేఖరరెడ్డి, చంద్రబాబు లాంటి నాయకులు అసెంబ్లీలో ప్రసంగిస్తుంటే ప్రజలు టీవీల ముందే ఉండేవారన్నారు. తెలంగాణలో కేసీఆర్ ఏం మాట్లాడుతారోననే ఆసక్తి ఉండేదని, ఇప్పుడు మాత్రం అసెంబ్లీలో బట్టలూడదీసుడు, కత్తులు దూసుడే ఉందని వ్యాఖ్యానించారు.

## నాణ్యమైన విద్య, వైద్యం మా ప్రభుత్వ విధానం

- బీఆర్ఎస్ హయాంలో ఒక్క టీచర్ పోస్టునూ భర్తీ చేయలేదు: మంత్రి శ్రీధర్‌బాబు
- 26 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామని హరీశ్‌రావు కౌంటర్
- విద్యారంగంపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టాలి: కూనంనేని





సాక్షి, హైదరాబాద్: నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానం అని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో రాష్ట్రంలో కుప్పకూలిన విద్యావ్యవస్థను బాగు చేసుకుంటూ ముందుకువెళుతున్నామని, పూర్తిగా సర్దుబాటు కావడానికి కొంత సమయం పడుతుందన్నారు. గత ప్రభుత్వం విద్యాశాఖలో ఒక్క టీచర్ పోస్టును కూడా భర్తీ చేయలేదని, మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 11 వేలకుపైగా టీచర్ పోస్టులను డీఎస్సీ ద్వారా చేపట్టామని తెలిపారు. మంగళవారం అసెంబ్లీలో విద్యాశాఖ, రోడ్లు భవనాలు, పర్యాటకం, ఎక్సైజ్‌శాఖ పద్దులపై చర్చ కొనసాగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ తరఫున సబితా ఇంద్రారెడ్డి విద్యాశాఖ పద్దుపై సుదీర్ఘంగా ప్రసంగించారు. ప్రస్తుతం విద్యావ్యవస్థకు కాంగ్రెస్ ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని విమర్శించారు. ఇదే సమయంలో కలుగజేసుకున్న శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు.. పైవిధంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 79 పాఠశాలలు తిరిగి పునఃప్రారంభించామని, ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరగడంతో క్రమంగా విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని మంత్రి వివరించారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క టీచర్ పోస్టును సైతం భర్తీ చేయలేదంటూ మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించడంతో బీఆర్ఎస్ సభ్యుడు, మాజీ మంత్రి హరీశ్‌రావు కలుగజేసుకున్నారు. 'మా హయాంలో 26 వేల ఉపాధ్యాయ నియామకాలు జరిగాయి. 8 వేల ఉద్యోగాలు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా చేశాం. గురుకులాల్లో 18 వేల నియామకాలు పూర్తి చేశాం'అని కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 1,913 స్కూళ్లు మూతపడ్డాయని, 257 గ్రామపంచాయతీల్లో అసలు ప్రభుత్వ పాఠశాలలే లేవని సబిత తెలిపారు.

**కాళేశ్వరం అప్పుల కుప్ప: యెన్నం**

బీఆర్ఎస్ పార్టీ పదేళ్లలో చేయని పనులు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోనే చేస్తున్నామని మంత్రి సీతక్క అన్నారు. బీటెక్ చదివిన విద్యార్థులు సైతం ఎందుకూ పనికిరానివారిగా మారుతున్న దుర్భర స్థితి ప్రస్తుత విద్యావ్యవస్థలో ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో తెలుగు మీడియం ఉపాధ్యాయులనే పెట్టడంతో విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మరో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, దశ దిశ లేకుండా బీఆర్ఎస్ హయాంలో లక్షల కోట్ల రూపాయలు కాళేశ్వరానికి ఖర్చు చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేశారని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఎన్నో మార్పులు వచ్చాయని, విద్యారంగంలోనూ విద్యార్థినులు పోటీపడుతున్నారని వివరించారు.

## బడుల్లో బ్రేక్‌ఫాస్ట్ ఆలోచన లేదు



విద్యాశాఖ బడ్జెట్ పద్దుపై చర్చలో మంత్రి దామోదర రాజనర్సింహ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం ఇచ్చే ఆలోచన ఏదీ రాష్ట్ర ప్రభుత్వానికి లేదని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. విద్యాశాఖ బడ్జెట్ పద్దుపై మంగళవారం అసెంబ్లీలో జరిగిన చర్చపై విద్యా మంత్రిత్వ శాఖను కూడా పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరఫున ఆయన సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి అడిగిన పలు ప్రశ్నలకు వివరణ ఇచ్చారు. ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలనుకున్న సమీకృత పాఠశాలల వల్ల ఇతర పాఠశాలలకు, గురుకులాలకు ఇబ్బంది లేదని.. వేటినీ మూసేయబోమని మంత్రి దామోదర స్పష్టం చేశారు. గత 7-8 ఏళ్లుగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందన్న దామోదర.. అదే సమయంలో గురుకులాల్లో విద్యార్థుల సంఖ్య కొంత పెరిగిందని వివరించారు. రాష్ట్రంలో 662 రెసిడెన్షియల్ స్కూళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, సుమారు 2 లక్షల మంది విద్యార్థులు అరకొర వసతులతోనే చదువుకుంటున్నారని చెప్పారు. అందుకే స్కూళ్ల మంజూరుతోపాటు అన్ని స్కూళ్లలో మౌలిక వసతుల కోసం దిద్దుబాటు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను రూ. 11,600 కోట్లతో ఏర్పాటు చేయనున్నట్లు ఓ ప్రశ్నకు బదులిచ్చారు. 11 వేలకుపైగా టీచర్లను భర్తీ చేయడంతోపాటు 12 యూనివర్సిటీలకు వీసీలను నియమించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ చర్చలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, గండ్ర సత్యనారాయణ మాట్లాడారు.

## నేడు ప్రశ్నోత్తరాలు రద్దు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం ప్రశ్నోత్తరాలు రద్దయ్యాయి. ఈ మేరకు ప్రశ్నోత్తరాలను రద్దు చేస్తున్నట్టు అసెంబ్లీ కార్యదర్శి వి.నరసింహాచార్యులు మంగళవారం రాత్రి బులెటిన్ విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం బుధ, గురువారాలు మాత్రమే అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బడ్జెట్ పద్దులపై చర్చ చేపట్టి.. వీలున్నంత త్వరగా ముగించేందుకు ప్రశ్నోత్తరాలను రద్దు చేశారు. బుధవారం బడ్జెట్ పద్దులపై చర్చ ముగిస్తుంది. గురువారం ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించడం ద్వారా వార్షిక బడ్జెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఆమోదం పొందనుంది. అనంతరం అసెంబ్లీ సమావేశాలు నిరవధికంగా వాయిదాపడనున్నాయి.

# ప్రపంచ దృష్టిని ఆకర్షించేందుకే అందాల పోటీ

పర్యాటక రంగం ద్వారా పెద్దఎత్తున ఉపాధి: మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: అందాల పోటీ ద్వారా తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేస్తామని, ఇందులో తప్పేముందని ఆబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. చాలా దేశాలకు తెలంగాణ అంటే తెలియదని, అందుకే హైదరాబాద్‌లో ఈ పోటీ నిర్వహిస్తున్నామని చెప్పారు. దీన్ని కొంతమంది వక్రీకరించడం సరికాదన్నారు. ఎక్సైజ్, పర్యాటకశాఖ పద్దులపై శాసనసభలో మంగళవారం చర్చ జరిగింది. సభ్యులు లేవనెత్తిన పలు సందేహాలకు మంత్రి బదులిచ్చారు. పర్యాటకరంగం ద్వారా ఉద్యోగ ఉపాధి పెద్దఎత్తున కల్పిస్తున్నామని, పర్యాటక పాలసీ ద్వారా ఐదేళ్లలో రూ. 15 వేల కోట్ల పెట్టుబడులు, 3 లక్షల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఎకో వెల్‌నెస్ టూరిజాన్ని అభివృద్ధి చేస్తామని, యాదగిరిగుట్ట సహా 27 ప్రత్యేక టూరిజం కేంద్రాలను గుర్తించినట్టు చెప్పారు. అంతర్జాతీయ సమావేశాలకు 20 వేల మంది సామర్థ్యంతో కన్వెన్షన్ సెంటర్ కట్టాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉందని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో బెల్ట్‌షాప్‌ల నియంత్రణలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. 1,200 మంది కొత్త వృద్ధ కళాకారులకు పెన్షన్లు ఇవ్వబోతున్నామని, తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన గద్దర్ సహా పలువురు ప్రముఖ కళాకారులకు రూ. కోటి ఇవ్వనున్నట్టు చెప్పారు. కాగా, అందాల పోటీ వల్ల ఆదాయం వస్తుందని, ఉద్యోగాలు వస్తాయని చెప్పడం ఏం న్యాయమని బీఆర్ఎస్ నేత కేటీఆర్ ప్రశ్నించారు. ఈ పోటీలకు రూ.54 కోట్లు వ్యయం చేస్తున్న సర్కారు, అదే ఫార్ములా వన్‌కు నిధులు వ్యయం చేయడాన్ని తప్పుపట్టడం డబుల్ స్టాండర్డ్ కాదా అని ప్రశ్నించారు. సచివాలయం ఎదుట అంబేద్కర్ విగ్రహానికి ఎందుకు ముసుగు తొలగించలేదని అడిగారు. దీనికి మంత్రి జూపల్లి బదులిస్తూ, అంబేద్కర్ విగ్రహం పెట్టడానికి బీఆర్ఎస్‌కు పదేళ్లు ఎందుకు పట్టిందని ప్రశ్నించారు.





**పలు పద్దులు ఆమోదం**

సుదీర్ఘ చర్చ అనంతరం పలు పద్దులను శాసనసభ మంగళవారం ఆమోదించింది. ఇందులో పాఠశాల, ఉన్నత, సాంకేతిక విద్య, క్రీడలు, యువజన సేవలు, రోడ్లు, భవనాలు, మద్య నిషేధం, సాంస్కృతిక, పురావస్తు, దేవాదాయ, అడవులు, శాస్త్ర సాంకేతిక, పర్యావరణం సంబంధిత పద్దులు ఉన్నాయి.

# మద్యం పారించిందే బీఆర్ఎస్

- ఎక్సైజ్ ఆదాయాన్ని పదేళ్లలో 400 రెట్లు పెంచారు
- గత ప్రభుత్వ ప్రతిపాదనలే మేం అమలు చేస్తున్నాం: జూపల్లి

సాక్షి, హైదరాబాద్: ఆదాయం పెంచుకొనేందుకు ప్రభుత్వం మద్యం అమ్మకాలను ప్రోత్సహించి కుటుంబాలను ఛిద్రం చేయాలని చూస్తోందన్న బీఆర్ఎస్ విమర్శలను ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఖండించారు. శాసనసభలో మంగళవారం బీఆర్ఎస్ సభ్యుడు వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎక్సైజ్ ఆదాయం పెంచి రూ.12 వేల కోట్ల అదనపు ఆదాయం రాబట్టుకోవాలనే ప్రతిపాదనను పునఃపరిశీలించాలని, కుటుంబాలను ఛిద్రం చేయరాదని కోరారు. అందుకు జూపల్లి కౌంటర్ ఇచ్చారు. 'మద్యం అమ్మకాల ద్వారా ఆదాయాన్ని పెంచింది ఎవరు? ప్రజలకు ఇలాంటి అలవాట్లు చేసింది ఎవరు? 2014 జూన్ 2 నాటికి రూ.9 వేల కోట్లు ఉన్న ఎక్సైజ్ వార్షిక ఆదాయాన్ని, 2023 డిసెంబర్ 6న అధికారంనుంచి దిగిపోయేనాటికి రూ. 34 వేల కోట్లకు పెంచింది మీరు కాదా? రూ.25 వేల కోట్ల అదనపు ఆదాయాన్ని పెంచారు. ఉల్టా చోర్ కొత్వాల్‌కో డాంటే అన్న చందంగా బీఆర్ఎస్ సభ్యుల తీరు ఉంది. ఏడాదికి 40 శాతం చొప్పున గత పదేళ్లలో 400 శాతం ఎక్సైజ్ ఆదాయాన్ని బీఆర్ఎస్ పెంచింది. ఆ లెక్కన తాము రూ.15 వేల కోట్ల ఆదాయం పెంచాల్సి ఉంటుంది. మొత్తం ఎక్సైజ్ ఆదాయాన్ని రూ.39 వేల కోట్లకు పెంచాలని గత ప్రభుత్వమే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దానిపై మేము 3-4 శాతం అదనంగా ప్రతిపాదనలు చేశాం'అని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బెల్టుషాపులను మూసివేయాలన్న వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్‌పై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. ఇప్పటికైనా బెల్ట్‌షాపులను తీసుకొచ్చామని ప్రశాంత్ రెడ్డి అంగీకరించారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ మద్యంపై మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని విమర్శించారు.

**మద్యం, డ్రగ్స్, గంజాయిలోనే రైజింగ్**

గత, ప్రస్తుత ప్రభుత్వాలు తెలంగాణను మత్తుపదార్థాలకు అడ్డాగా మార్చాయని బీజేపీ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ ఆరోపించారు. మద్యం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలనే ప్రతిపాదనలను తప్పుబట్టారు. తెలంగాణ రైజింగ్ అని ప్రభుత్వం నినాదం ఇచ్చిందని, వాస్తవంగా డ్రగ్స్, గంజాయి, మద్యం అమ్మకాల్లో తెలంగాణ రైజింగ్ అయిందని ఎద్దేవా చేశారు. మద్యం దుకాణాలకు దేవుళ్ల పేర్లు పెట్టకుండా చట్టం తేవాలన్నారు.

# చేనేతకు 'తెలంగాణ లేబుల్'

- ప్రత్యేక హ్యాండ్లూమ్ మార్క్ రూపొందించనున్న సర్కార్
- రాష్ట్ర చేనేత కార్మికులు, ఉత్పత్తులు ప్రోత్సహించేందుకు ప్రణాళికలు
- 'నేతన్న భరోసా'కింద ఏటా రూ.24 వేలు ఇచ్చేందుకు నిర్ణయం
- టెస్కో షోరూమ్‌ల ఆధునీకరణ, ఆన్‌లైన్ పోర్టల్‌పై దృష్టి

సాక్షి, హైదరాబాద్: దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో తెలంగాణ చేనేత ఉత్పత్తుల ప్రాముఖ్యతను చాటేలా వాటికి 'ప్రత్యేక లేబుల్'(తెలంగాణ హ్యాండ్లూమ్ లేబుల్/మార్క్) రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'తెలంగాణ లేబుల్'పై చేనేత వస్త్రాలను ఉత్పత్తి చేసే నేత కార్మికులకు అదనపు ప్రోత్సాహకాలు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని చేనేత మగ్గాలను జియో ట్యాగింగ్ చేసిన ప్రభుత్వం.. వాటిపై తయారు చేసే చేనేత ఉత్పత్తులకు 'తెలంగాణ లేబుల్'జారీ చేస్తుంది. ఈ చేనేత వస్త్రాలు తయారు చేసే కార్మికులకు 'తెలంగాణ నేతన్న భరోసా'పథకం కింద ప్రతినెలా రూ.2 వేలు చొప్పున ఏటా రూ.24 వేలు అదనంగా చెల్లిస్తారు. చేనేత వస్త్ర ఉత్పత్తులను మరమగ్గాల ద్వారా కాపీ కొట్టకుండా నిరోధించడంతో పాటు కొనుగోలుదారులకు నాణ్యతతో కూడిన అసలైన చేనేత వస్త్రాలు అందించడం లక్ష్యంగా 'తెలంగాణ లేబుల్'కు రూపకల్పన చేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఈ డిజైన్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ చేనేత విభాగం సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం భారతదేశంలో చేనేత, పట్టు వస్త్రాలకు ఢిల్లీ కేంద్రంగా పనిచేసే టెక్స్‌టైల్ కమిటీ 'హ్యాండ్లూమ్ మార్క్', 'సిల్క్ మార్క్'ను జారీ చేస్తోంది. ఈ మార్క్ కోసం టెక్స్‌టైల్ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం కొంత మొత్తం చెల్లించాల్సి వస్తోంది. అయితే ఇకపై టెక్స్‌టైల్ కమిటీ జారీ చేసే హ్యాండ్లూమ్ మార్క్‌కు బదులుగా ప్రత్యేక తెలంగాణ హ్యాండ్లూమ్ మార్క్‌ను ప్రభుత్వం జారీ చేయనుంది. తద్వారా తెలంగాణ చేనేత బ్రాండ్‌ను ప్రోత్సహించడంతో పాటు పోటీ మార్కెట్‌లో రాష్ట్ర సాంప్రదాయ ఉత్పత్తులు, నైపుణ్యానికి గుర్తింపు దక్కేలా చేయాలని భావిస్తోంది. చేనేత కార్మికుల జీవనోపాధి, సంక్షేమానికి 'తెలంగాణ లేబుల్'బాటలు వేస్తుందని ఆశిస్తోంది.

**విక్రయాలు పెంచేందుకు చేనేత బజార్లు**

చేనేత విక్రయాలు పెంచేందుకు తెలంగాణ చేనేత సహకార సంస్థ (టెస్కో) సహకారంతో అంతర్ రాష్ట్ర ప్రదర్శనలు, ఉమ్మడి పది జిల్లాల్లో స్థానికంగా జరిగే పండుగలు, ఉత్సవాలు, జాతర్లలో చేనేత బజార్లు ఏర్పాటు చేయనున్నారు. పోచంపల్లి ఇక్క త్, వరంగల్ దర్రీలు, గద్వాల, నారాయణపేట చేనే త వస్త్ర ఉత్పత్తులకు గిరాకీ పెంచేందుకు ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థలతోనూ సమావేశాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం టెస్కోకు తెలంగాణ వెలుపలా, బయటా కలిపి 31 షోరూమ్‌లు ఉన్నాయి. కాగా వినియోగదారులను ఆకట్టుకునేలా ఈ షోరూమ్‌ల ఆధునీకరణపై కూడా దృష్టి సారించారు. పోచంపల్లి ఇక్కత్, వరంగల్ దర్రీల ఎగుమతులను పెంచడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

**ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై దృష్టి**

టెస్కో షోరూమ్‌ల ద్వారా చేనేత వస్త్ర ఉత్పత్తుల వార్షిక టర్నోవర్ సుమారు రూ.15 కోట్ల మేర ఉంటోంది. వీటితో పాటు వివిధ ప్రభుత్వ విభాగాలకు విక్రయిస్తున్న వస్త్రోత్పత్తుల విలువ రూ.260 కోట్ల మేర ఉంది. అయితే ఆన్‌లైన్ విక్రయాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని చేనేత ఉత్పత్తుల కోసం ప్రత్యేక పోర్టల్‌కు రూపకల్పన జరుగుతోంది. ఈ పోర్టల్ ద్వారా తెలంగాణ మార్క్ చేనేత ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయిస్తారు. నేత కార్మికులు, మాస్టర్ వీవర్లు, చేనేత సహకార సొసైటీలను అనుసంధానం చేసే రీతిలో పోర్టల్ ఉంటుందని అధికారులు వెల్లడించారు.

# బీమా లేదు.. ధీమా లేదు

▶ మొదటి పేజీ తరువాయి

అధికారికంగా తేల్చింది. 13 జిల్లాలలోని 64 మండలాలలో 6,670 ఎకరాలలో వరి, 4,100 ఎకరాలలో మొక్కజొన్న, 309 ఎకరాలలో మామిడి, ఇతర పంటలు దెబ్బతిన్నట్లు మంత్రి తుమ్మల ప్రకటించారు. నష్టంపై నివేదిక వచ్చిన తరువాత పరిహారం చెల్లిస్తామని చెప్పారు కానీ.. ఎప్పటిలోగా రైతులను ఆదుకుంటారో చెప్పలేదు. గతంలో కూడా పంట నష్టం జరిగినప్పుడు ఇలాంటి ప్రకటనలే వచ్చాయి. కానీ, రైతులకు పైసా అందలేదు. ఈ నేపథ్యంలో పంటల బీమాపై మరోసారి చర్చ మొదలైంది.

**పదేళ్లుగా రైతులకు నిరాశే..**

రైతులకు పంటల బీమా అందించే 'జాతీయ వ్యవసాయ బీమా పథకం'(ఎన్ఏఐఎస్).. కేంద్ర ప్రభుత్వ రాష్ట్రీయ కృషి బీమా యోజన (ఆర్‌కేబీవై) కింద 2016 వరకు అమలులో ఉండేది. ఈ పథకాన్ని కేంద్రం 1999–2000లో ప్రవేశపెట్టింది. 2016లో కేంద్రం ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం (పీఎంఎఫ్‌బీవై) తీసుకొచ్చింది. కానీ, ఈ పథకంలో తెలంగాణ రాష్ట్రం చేరలేదు. కేంద్ర బీమా పథకం ప్రీమియం ఎక్కువ, వచ్చే పరిహారం తక్కువ అని చెప్పిన అప్పటి సీఎం కేసీఆర్.. అంత కంటే మంచి పథకాన్ని తెస్తామని చెప్పారు. 2018 నుంచి రైతుబంధు అమలు చేయటంతో ఇక బీమా జోలికి పోలేదు. ఎప్పుడైనా ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోతే ఆయా ప్రాంతాల్లో ఎకరాకు కొంత మొత్తాన్ని పరిహారంగా ఇచ్చే పద్ధతిని ప్రభుత్వం చేపట్టింది. ఇది కూడా గత పదేళ్లలో పెద్దగా అమలైన దాఖలాలు లేవు. ప్రభుత్వం మారినప్పటికీ అదే విధానం కొనసాగుతోంది.

**మాటలు మాత్రమేనా?**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో చేరనున్నట్లు తొలుత ప్రకటించింది. మంత్రి తుమ్మల వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకర్లతో సమావేశం కూడా నిర్వహించారు. దీంతో బీమా పథకం అమలు చేస్తారని రైతులు ఆశించారు. కానీ, చివరికి ఆ హామీ నీటిమూటగానే మిగిలింది. కేంద్ర పథకంలో చేరలేదు.. రాష్ట్ర ప్రభుత్వం సొంత పథకం కూడా తీసుకురాలేదు. దీంతో పంటలు దెబ్బతింటే రైతులు నష్టపోవాల్సి వస్తోంది. సీఎం పంటల బీమా అమలు చేస్తామని చెప్పినప్పటికీ, ఈ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవలి అకాల వర్షాలకు 11,298 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని అధికారికంగా ప్రకటించినప్పటికీ, వాస్తవంగా అంతకు రెండింతల విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమగ్ర పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

# అన్నగా అండగా ఉంటా..

- కేన్సర్ బాధితుడికి మంత్రి శ్రీధర్‌బాబు భరోసా
- బాధితుడి దుస్థితికి చలించిన మంత్రి
- అతని కోరికపై క్రికెట్ కిట్ అందజేత



నితిన్‌ను పరామర్శిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: కేన్సర్‌తో బాధపడుతున్న ఒక యువకుడి కోరిక మేరకు అతనికి మంత్రి శ్రీధర్‌బాబు క్రికెట్ కిట్ అందజేశారు. అన్నగా బాధితుడికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వివరాలివి. భూపాలపల్లి జిల్లా పాలిమల మండలం సర్వాయ్‌పేట గ్రామానికి చెందిన భౌత్ నితిన్ కేన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మంత్రి శ్రీధర్‌బాబు ఆసుపత్రికి వెళ్లి భౌత్ నితిన్‌ను పరామర్శించారు. ఆ సమయంలో 'సర్, నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. పెద్ద క్రికెటర్ కావాలని కలగన్న. నాకో క్రికెట్ కిట్ ఇప్పించండి'.. అని ఆ యువకుడు కోరడంతో మంత్రి కన్నీళ్లు పెట్టుకున్నారు. అప్పటికప్పుడు క్రికెట్ కిట్ తెప్పించి అతని కోరికను నెరవేర్చారు. సొంత అన్నలా అండగా ఉంటానని, ఏ అవసరమున్నా తనను నేరుగా సంప్రదించాలని నితిన్ తల్లిదండ్రులకు మంత్రి ధైర్యం చెప్పారు.

# ముస్లిం సోదరులకు సీఎం ఇఫ్తార్ విందు

**ఎన్నికల కోడ్‌తో సీఎం సహా మంత్రులు దూరం**

సాక్షి, హైదరాబాద్: రంజాన్ పర్వ మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం మంగళవారం హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో ఇఫ్తార్ విందు ఇచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇఫ్తార్ విందులో పాల్గొనేందుకు ఎన్నికల కమిషన్ అనుమతించకపోవడంతో సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రభుత్వ అధికారులు ఇఫ్తార్ విందుకు హాజరు కాలేదు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఇఫ్తార్ విందు కంటే అర గంట ముందు వచ్చి రెండు నిమిషాలు మత పెద్దలతో మాట్లాడి తిరిగి వెళ్లిపోయారు. మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అట్టహాసంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమం సాదాసీదాగా జరిగింది. ముస్లిం సోదరులు పెద్దఎత్తున విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో షాహీ మసీదు ఇమామ్ ఎహసాన్ అల్ హమామి, మక్కా మసీదు ఇమామ్ రిజ్వాన్ పాషా, తయ్యద్ పాషా, కాంగ్రెస్ నేతలు ఫిరోజ్ ఖాన్, ఉస్మాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# సొరంగంలో మరో మృతదేహం లభ్యం

▶ మొదటి పేజీ తరువాయి

సొరంగం నుంచి బయటకు తీసుకొచ్చాయి. నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఆయన కుటుంబానికి అప్పగించారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఆర్డీఓ సురేశ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం తరఫున మృతుని కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందించారు. అనంతరం మృతదేహాన్ని అంబులెన్స్‌లో మనోజ్‌కుమార్ స్వగ్రామం యూపీలోని ఉన్నావ్ జిల్లా బంగార్మావ్ గ్రామానికి తరలించారు. మనోజ్‌కుమార్ 2009 నుంచి జేపీ కంపెనీలో పనిచేస్తున్నారు. ఆయనకు భార్య స్వర్ణలత, కుమార్తె శైలజ (24), కుమారుడు ఆదర్శ్ (17) ఉన్నారు.

**ఎక్స్‌కవేటర్ ద్వారా తవ్వకాలతో మృతదేహం బయటకు..**

సొరంగంలోని 14వ కి.మీ. సమీపంలో ఫిబ్రవరి 22న పైకప్పు కూలడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు, ఇంజనీర్లలో 8 మంది ఆచూకీ గల్లంతవడం తెలిసిందే. రంగంలోకి దిగిన సహాయక బృందాలు ఈ నెల 9న ఒక మృతదేహాన్ని (గురుప్రీత్‌సింగ్) వెలికితీయగా డీ2 ప్రాంతానికి సుమారు 190 మీటర్ల దూరంలో వెనుక వైపు, కన్వేయర్ బెల్టుకు సమీపంలో మనోజ్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. సొరంగానికి కుడి వైపున కన్వేయర్ బెల్టు ఉండగా బెల్టు సమీపంలో ఇప్పటికే ఒకవైపు నుంచి తవ్వకాలు చేపడుతూ సహాయక బృందాలు మార్గాన్ని ఏర్పాటు చేస్తూ ఎడమ వైపున మట్టి వేశాయి. ఎక్స్‌కవేటర్ సాయంతో అక్కడి మట్టిని తొలగిస్తుండగా మంగళవారం మృతదేహం కనిపించింది. ప్రమాదానికి ముందు లోకో ట్రైన్‌లో కాంక్రీట్ సెగ్మెంట్లు, సామగ్రిని తీసుకెళ్లారని, ప్రమాద సమయంలో లోకోట్రైన్‌తో సహా చెల్లాచెదురై వెనక్కి కొట్టుకొచ్చి ఉంటుందని సహాయక సిబ్బంది అంటున్నారు. ఇదే ప్రాంతంలో నాలుగు ఎక్స్‌కవేటర్ల సాయంతో ముమ్మరంగా తవ్వకాలు, మట్టి తొలగింపు చేపట్టారు.



అబద్ధాలు చెప్పకూడదు.
తెలిసీ సత్యాన్ని తప్పుగా తెలియజేయకూడదు.
– బౌద్ధ ధర్మం



సాక్షి

బుధవారం, 26 మార్చి 2025

# మహానగరంలో ఏదీ భద్రత?

ఆడపిల్లల భద్రతకు ప్రమాదం పొంచి వున్నదని స్పష్టంగా కనబడుతున్నా కళ్లుమూసుకున్న పోలీస్ యంత్రాంగం సాక్షిగా హైదరాబాద్‌లో మొన్న శనివారం ఒక యువతిపై లైంగిక దాడి జరిగింది. ఎంఎంటీఎస్‌లో ప్రయాణిస్తుండగా బోగీలో ఎవరూలేని సమయం చూసి దుండగుడు దాడి చేయగా తప్పించుకునే యత్నంలో నడుస్తున్న రైలునుంచి ఆమె దూకి తీవ్ర గాయాలపాలైంది. పగలంతా కిక్కిరిసి వుండే ఎంఎంటీఎస్ రైళ్లు చీకటిపడే వేళకు దాదాపు ఖాళీ అవుతుంటాయి. జనం ఎక్కువున్న సమయాల్లో కూడా నిబంధనలకు విరుద్ధంగా ఆడవాళ్ల బోగీల్లో ఎక్కి వెకిలిచేష్టలకు పాల్పడటం, సెల్‌ఫోన్లు, ఆభరణాలు అపహరించటం వంటివి పెరిగాయని అనేకులు చెబుతున్నారు. హిజ్రాల ఆగడాలు సరేసరి. ఒంటరిగా ప్రయాణించకతప్పని స్థితిలో ఈ అరాచకాలు ఇంకెంత మితిమీర గలవో సులభంగానే అర్థం చేసుకోవచ్చు. ఈ మాదిరి ఉదంతాలపై నిత్యం ఫిర్యాదులు అందుతూనే ఉంటాయని మీడియా కథనాలు చెబుతున్నాయి. ప్రయాణికుల సంఘాలు కూడా ఆందోళనలు చేసినా పోలీసులు మేల్కొనలేదు. రైల్వే భద్రతా దళం(ఆర్‌పీఎఫ్), ప్రభుత్వ రైల్వే పోలీస్(జీఆర్‌పీ) విభాగం అసలు దీన్ని సమస్యగానే భావించలేదు. ఆ విభాగాలు కర్తవ్య నిర్వహణలో విఫలం కావటమే నిజమైన సమస్య. కనీసం చీకటిపడింది మొదలు అర్ధరాత్రి సర్వీసులు ఆగిపోయే వరకైనా బందోబస్తు అవసరమని గ్రహించలేదు. సరిగదా అంతక్రితం ఎంఎంటీఎస్ రైళ్లలోవుండే హోంగార్డుల్ని సైతం ఈమధ్య తొలగించారంటున్నారు. హైదరాబాద్ నగరంలో సుమారు 30 ఎంఎంటీఎస్ స్టేషన్లువుంటే కేవలం పది స్టేషన్లలో మాత్రమే భద్రత ఉండటం, అది కూడా అంతంత మాత్రం కావటం దారుణం. స్టేషన్లలో అక్కడక్కడ పేరుకు ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ కానిస్టేబుళ్లు కనబడుతుంటారు. కానీ మహిళల కోచ్‌లు ఎలావున్నాయో, భద్రత ఏ మేరకు అవసరమో గమనించేపాటి పని కూడా వారినుంచి ఆశించే స్థితి లేదంటే నిర్వాహకులు సిగ్గుపడాలి.

సాంకేతికత విస్తరించిన ఈ కాలంలో కూడా దాన్ని సవ్యంగా వినియోగించలేని అశక్తతలో ప్రభుత్వాలుండటం విచారకరం. హైదరాబాద్ నగర శివారులో 2019 నవంబర్‌లో ఒక మహిళా వైద్యురాలిని అపహరించి, ఆమెపై అత్యాచారం జరిపి హత్య చేసిన ఉదంతం చోటు చేసుకున్నప్పుడు అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దాన్ని తెలంగాణకు సంబంధించిందిగా చూడలేదు. అలాంటి పరిస్థితి ఏపీలో తలెత్తకూడదన్న సంకల్పంతో పోలీస్ వ్యవస్థను కదిలించి కేవలం మూడు నెలల వ్యవధిలోనే దిశ యాప్ అందుబాటులోకి తెచ్చారు. దిశ ప్రత్యేక పోలీస్ స్టేషన్లు నెలకొల్పారు. లక్షలాదిమంది ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవటంవల్ల ఆపత్కాలంలో అనేకమందిని రక్షించటం సాధ్యమైంది. 2021 సెప్టెంబర్‌లో ఉపాధ్యాయ ఎంపిక పరీక్ష రాయటానికి ఢిల్లీ వెళ్లిన ఏపీ యువతి తెల్లారుజామున దిగి ఆటో ఎక్కాక కీడు శంకించినప్పుడు దిశ యాప్ వల్లే పోలీసులను అప్రమత్తం చేసింది. ఏపీ పోలీసుల సమన్వయంతో ఆమె క్షేమంగా పరీక్ష రాసింది. తిరిగి ఏపీకి వెళ్లే రైలు ఎక్కేవరకూ సాయం దొరికింది. హైదరాబాద్‌లో బెంగళూరు వెళ్లే రైలెక్కిన మహిళ సైతం ఈ యాప్‌ను ఉపయోగించుకునే తనను తాను రక్షించుకోగలిగింది.

దేశంలో ఏ మూలనున్నా ఈ యాప్ ద్వారా సమాచారం అందుకుని మహిళలను రక్షించిన ఉదంతాలు కోకొల్లలు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక వెనకా ముందూ చూడకుండా దీన్ని రద్దుచేశారు. తొమ్మిది నెలలు జాప్యంచేసి, అదే యాప్‌కు సురక్షా అనే పేరు తగిలించి ఈ నెల మొదటివారంలో మళ్లీ తీసుకొచ్చారు. వేషం మారిన ఈ యాప్‌పై మహిళల్లో పెద్దగా ప్రచారం చేసిన దాఖలా కూడా లేదు. అఘాయిత్యాలు మితిమీరిన ఈ కాలంలో దిశవంటి యాప్‌ను కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేవరకైనా కొనసాగించాలన్న ఇంగితజ్ఞానం కూటమి ప్రభుత్వానికి లేకపోయింది. బహుశా ఆ యాప్ కొనసాగివుంటే ఎంఎంటీఎస్‌లో ఆపదలో చిక్కుకున్న యువతికి అది ఆసరాగా నిలిచేదేమో! ఎక్కడో వేరే రాష్ట్రంలోవున్న యువతులకు ఆపత్కాలంలో సాయపడటం మాట అటుంచి, తాడేపల్లిలో డీజీపీ కార్యాలయానికి కూతవేటు దూరంలో దుండగుల బారిన పడిన మహిళను కూడా కాపాడలేని అశక్తతలో ఏపీ పోలీసులు కూరుకుపోయారు. ఫలితంగా ఆ మహిళపై దుండగులు అత్యాచారం చేసి, హతమార్చారు. అదే ప్రాంతంలో మొన్న జనవరి 31న మరో మహిళ బలైంది. రాష్ట్రవ్యాప్తంగా ఈమాదిరి అఘాయిత్యాలకు అంతేలేదు.

ఎంఎంటీఎస్ ఉదంతంలో రైల్వే పోలీసులు బృందాలు ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. దుండగుడు పట్టుబడవచ్చు కూడా. ఈ ఉదంతం పోలీసులకు ఎలాంటి గుణపాఠం నేర్పిందోగానీ మళ్లీ మరోటి జరిగేవరకూ పట్టనట్టు వ్యవహరించే ధోరణికి ఇకనైనా స్వస్తి పలకాలి. ఖర్చు తగ్గించుకుని లాభార్జన చేయాలన్న యావ భద్రతకు తూట్లు పొడుస్తుందన్న సంగతి ఎంఎంటీఎస్ నిర్వాహకులు తెలుసుకోవాలి. ఆకతాయిలూ, అసాంఘిక శక్తులూ, యధేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించేవారూ తమకేం కాదన్న భరోసాతో ఉండటం మహిళలకూ, పిల్లలకూ ప్రాణాంతకమవుతుంది. రైల్వే స్టేషన్లతోపాటు బోగీల్లో సైతం సీసీ కెమెరాలుంటే, వాటిని నిత్యం పర్యవేక్షిస్తుంటే, తక్షణం చర్యలు తీసుకునే యంత్రాంగం పనిచేస్తే ఆగడాలను అరికట్టడం సులభమవుతుంది. అలాగే మహిళల రక్షణకు తగిన యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలి. గడప దాటితే క్షేమంగా తిరిగొస్తామో లేదోనన్న భయాందోళనల మధ్య పౌరులు బతికే దుఃస్థితి ఉండటం మంచిదికాదని ప్రభుత్వం, రైల్వేశాఖ గుర్తించాలి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** బ.ద్వాదశి రా.10.44 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** ధనిష్ఠ రా.11.54 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.11.44 నుండి 12.32 వరకు, **అమృత ఘడియలు:** ప.1.35 నుండి 3.11 వరకు.

**సూర్యోదయం :** 6.03
**సూర్యాస్తమయం:** 6.07
**రాహుకాలం :** ప.12.00 నుండి 1.30 వరకు
**యమగండం :** ఉ.7.30 నుండి 9.00 వరకు

# వైవిధ్య వైరుధ్యాలు

అభిప్రాయం




టంకశాల అశోక్

ఒక కుటుంబం నుంచి, సమాజం నుంచి, ఒక దేశం వరకు వైవిధ్యాలు అనేకం ఉంటాయి. వాటిని వైరుధ్యాలుగా మారకుండా చూసుకోవటంలోనే విజ్ఞత ఉంటుంది. ఆ విధంగా చూసినపుడు, లోక్‌సభ నియోజక వర్గాల పునర్విభజనపై తలెత్తిన వివాదం ఒక వైవిధ్య స్థితి నుంచి వైరుధ్య స్థాయికి చేరుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఈ అంశంపై ఈ నెల 22న చెన్నైలో జరిగిన సమావేశం దేశానికంతా ఒక హెచ్చరిక వంటిదని చెప్పాలి.

నియోజక వర్గాల పునర్విభజనతో ముడిపడి మరొక రెండు అంశాలు కూడా ఉన్నాయన్నది గుర్తించవలసిన విషయం. ఒకటి – హిందీ భాషను హిందీయేతర రాష్ట్రాలపై బలవంతంగా రుద్దుతున్నారనే ఫిర్యాదు. ఈ విషయం చెన్నైలో చర్చకు రాలేదు. కానీ ఎప్పటినుంచో ఉన్నదే. రెండవది – దక్షిణ–ఉత్తర భారతాల మధ్య సాధారణ రూపంలోనే ఉన్నాయనే విభేదాలు. ఈ భావన నియోజక వర్గాల పునర్విభజనకు, హిందీ భాషకు పరిమితమైనది కాదు. ఇటువంటి భావనలకు గల చరిత్ర మూడు దశలలో కనిపిస్తుంది. ఒకటి– ఉత్తరాది వారికి దక్షిణాది వారిపట్ల ఎప్పుడూ చిన్నచూపేనన్నది. రెండు – దాక్షిణాత్యుల రంగురూపులు, భాషా సంస్కృతులు, ఆహార విహారాల పట్ల స్వాతంత్ర్యానికి ముందు నుంచే ఉన్నదనే ఈసడింపు దృష్టి. మూడవది–ఈ రెండింటికన్నా ప్రమాదకరమైనది, ప్రాచీనమైనది. అది ఆర్య–ద్రవిడ వాదనలు.

### వివాదాలకు ఆస్కారం ఇచ్చేలా...

మరే దేశంలోనూ లేనంతటి వైవిధ్యాలు ఇక్కడ ఉన్నాయి. సాంస్కృతికంగా, విశ్వాసాలపరంగా ఒక ఏకరూపత, కనీసం స్థూలమైన విధంగా, అనాదిగా ఉండినప్పటికీ, బ్రిటిష్ వలస పాలన ముగిసినాక చరిత్రలో మొదటిసారిగా మొత్తం నాలుగు చెరగులకూ కలిపి భౌగోళికంగా, రాజకీయంగా దేశానికి ఏకరూపత సిద్ధించింది. వైవిధ్యాలను సరిహద్దులు చెరిపివేసి ఒకటి చేసే ప్రయత్నాలు 1885లో కాంగ్రెస్ వ్యవస్థాపన కాలం నుంచి మొదలై, 1947లో స్వాతంత్ర్య సాధన, 1950 నుంచి రాజ్యాంగం అమలు, 1951–52లో మొదటి సార్వత్రిక ఎన్నికలతో ఒక రూపానికి వచ్చాయి. వైవిధ్యాలు వైరుధ్యాలుగా మారగల అవకాశాలకు ఆ విధంగా ముగింపు పలికినట్లయింది. కనీసం అందుకు ఒక బలమైన ప్రాతిపదిక సూత్రరీత్యా ఏర్పడింది. దానిని అదే ప్రకారం స్థిరపరచి మరింత పటిష్ఠం చేయవలసిన బాధ్యతను చరిత్ర పాలకులకు అప్పగించింది. అందుకు పునాదుల స్థాయిలో భంగపాట్లు జరిగాయని అనలేముగానీ, వేర్వేరు సాయుల్లో జరుగుతూ వస్తున్న దాని పర్యవసానమే ప్రస్తుత వివాదాలు.



ఇటువంటి వివాదాలకు కేంద్ర ప్రభుత్వం ఆస్కారమివ్వనట్లయితే చెన్నై సమావేశపు అవసరమే ఉండేది కాదు. ఆ సమావేశం దరిమిలా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఏమీ స్పందించలేదుగానీ, దక్షిణాదికి చెందిన ముగ్గురు బీజేపీ మంత్రులు మాట్లాడుతూ, విభజనకు సంబంధించి ఇంకా నిర్ణయం జరగలేదు, విధివిధానాలు రూపొందలేదు, ప్రకటనేమీ వెలువడలేదు, అటువంటపుడు ఈ సమావేశాలు, విమర్శలు ఎందుకని ప్రశ్నించారు. విధివిధానాల రూపకల్పన, ప్రకటన జరగక పోవచ్చు. కానీ నష్టపోతా మనుకునే రాష్ట్రాలకు స్థూలమైన అభిప్రాయాలు కలగకుండా ఎట్లా ఉంటాయి? వారు ఆ విషయమై మాట్లాడకుండా ఎట్లా ఉంటారు?

> డీలిమిటేషన్ విధివిధానాల రూపకల్పన, ప్రకటన ఇప్పటికింకా జరగక పోవచ్చు. కానీ నష్టపోతామనుకునే రాష్ట్రాలకు స్థూలమైన అభిప్రాయాలు కలగకుండా ఎట్లా ఉంటాయి? మాట్లాడకుండా ఎట్లా ఉంటాయి?

ఇటువంటి విషయాలలో చర్చలు ఒక ప్రజాస్వామిక రాజకీయ వ్యవస్థలో ముందునుంచే జరుగుతాయి తప్ప, అంతా ముగిసిపోయే వరకు ఆగవు. విషయం వివాదాస్పదమవుతున్న సూచనలు కనిపించినప్పుడు చర్చలు మరింత అవసరం. కానీ అమిత్ షా అదేమీ చేయకుండా, దక్షిణాదికి ఎటువంటి నష్టం ఉండదనీ, అక్కడి స్థానాలు ఇప్పటికన్నా పెరుగుతాయనటం మొదలుపెట్టారు. ఇందులో ఒక చాతుర్యం ఉంది. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాలు రెండింటికీ స్థానాలు ఇప్పటికన్న పెరిగినా, దక్షిణాదికన్న ఉత్తరాదికి పెరిగేవి చాలా ఎక్కువని, ఆ విధంగా రెండు ప్రాంతాల మధ్య గల ప్రస్తుత వ్యత్యాసం బాగా ఎక్కువవుతుందని అంచనా. అమిత్‌షా ఈ కోణాన్ని దాచిపెడుతున్నారు. అట్లాగాక ఏ వ్యత్యాసమూ, నష్టమూ ఉండదనుకుంటే ఆయన ఆ మాటను దక్షిణ రాష్ట్రాలను సమావేశపరచి వివరించాలి.

### సమావేశం అవసరం!


చెన్నైలో జరిగిన సంయుక్త కార్యాచరణ కమిటీ సమావేశానికి పార్టీ తేడాలు లేకుండా పలువురు హాజరయారంటేనే, విభజన ప్రతిపాదనలు ఎటువంటి అనుమానాలను కలిగిస్తున్నాయో అర్థమవుతుంది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ పాల్గొనటం. ఎందుకంటే, దేశమంతటాగల ఆ పార్టీ ఇటువంటి వైఖరి తీసుకుంటే వారికి ఉత్తరాదిన వ్యతిరేకత రాగలదనీ, ఆ భయంతో వారు హాజరు కాకపోవచ్చుననీ బీజేపీ అంచనా వేసింది. కానీ విభజనకు వ్యతిరేకంగా పార్టీ అధ్యక్షుడు ఖర్గే ముందుగానే మాట్లాడారు. ఇందులో రెండవవైపున చూస్తే, విభజనకు అనుకూలించటం వల్ల బీజేపీ దక్షిణాదిన నష్టపోగలదనే అభిప్రాయం ఉన్నా, ఆ పార్టీ అదే వైఖరికి కట్టుబడి ఉంటున్నది. దీనిని బట్టి ఇరువురూ, ఆ యా ప్రాంతాలలో ప్రజాభిప్రాయాలు ఎట్లున్నా తమ వైఖరులను మార్చుకోదలచలేదని అర్థమవుతున్నది. దాని పర్యవసానాలు ఏమిటన్నది తర్వాతి విషయం. అది సూత్రబద్ధమైన వైఖరి అనుకుంటే మాత్రం ఆ మేరకు వారిని మెచ్చుకోవాలి.

ఈ వైవిధ్యాలన్నీ వైరుధ్యాలుగా మారి తీవ్ర స్థాయికి వెళ్ళకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, పార్టీలను సమావేశపరచాలి. ఈ విషయమై తమ అభిప్రాయాన్ని ఒక తీర్మానంగా ఆమోదించిన చెన్నై సమావేశం, ఆ తీర్మాన ప్రతిని ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల కాలంలోనే ప్రధాని మోదీకి అందజేయగలమని ప్రకటించింది. ఆయన ఆ సందర్భాన్ని అవకాశంగా తీసుకుని ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయటం మంచిదవుతుంది. చెన్నైలో తీర్మానించినట్లు విభజనను 25 సంవత్సరాల వరకు గాక, దక్షిణాదికి ఆమోదయోగ్యమయే ప్రత్యామ్నాయాన్ని కనుగొనే వరకు నిరవధికంగా వాయిదా వేయటం మంచిది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

# విభజన కుట్ర

అభిప్రాయం



ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి

'స్టాలిన్ దున్నపోతు ఈనిందని అందరికీ ఆహ్వానాలు పంపితే దక్షిణాదికి చెందిన ప్రాంతీయ పార్టీల నేతలు ఆ దూడను కట్టేయడానికి చెన్నైకి పరుగులు పెట్టారు.' లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాదికి అన్యాయం జరిగిపోతోందంటూ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఏర్పాటు చేసిన సమావేశం అచ్చంగా ఇలాగే జరిగింది. అన్యాయం జరిగిపోతోందని బీజేపీని గుడ్డిగా వ్యతిరేకించడమే పనిగా పెట్టుకున్న పార్టీలు ఆ సమావేశానికి వెళ్లాయి. చెన్నైలో ఓ స్టార్ హోటల్‌లో కోట్లు ఖర్చు పెట్టి నిర్వహించిన సమావేశంలో ఒక్కరంటే ఒక్కరైనా ఎలా అన్యాయం జరుగుతుందో చర్చించారా? జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల విభజన జరుగుతుందనీ, దక్షిణాదిలో జనాభా తగ్గిపోయారనీ, ఉత్తరాదిలో పెరిగిపోయారనీ, అందుకే దక్షిణాదికి సీట్లు తగ్గుతాయనీ వీరంతా ఓ నిర్ణయానికి వచ్చేశారు. నిజానికి ఈ ప్రక్రియలో ఇంతవరకూ ఒక్క అడుగు కూడా పడలేదు. ముందుగా జనాభా లెక్కలు పూర్తి చేయాలి. అప్పుడే ఉత్తరాదిలో ఎంత పెరిగారు, దక్షిణాదిలో పెరిగారా, తగ్గారా అన్న స్పష్టత వస్తుంది. ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ ఏర్పాటవుతుంది. జనాభా లెక్కల ప్రకారమే పునర్విభజన చేస్తారన్నది కూడా అపోహే! అలా అయితే ఈశాన్య రాష్ట్రాలకు 25 లోక్‌సభ సీట్లు ఉండేవా?

ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని పదే పదే చెబుతున్న ప్రధాని, కేంద్ర హోంమంత్రి... ఏ రాష్ట్రానికీ ఒక్క సీటు కూడా తగ్గదని వివిధ సందర్భాల్లో స్పష్టం చేశారు. 2023లో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ డీలిమిటేషన్ ప్రక్రియను 2026 తర్వాత జనగణన డేటా ఆధారంగా చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తోందని ప్రకటించారు. ప్రతి ఓటరుకూ సమాన ప్రాతినిధ్యం లభించేలా చేస్తామన్నారు. ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడేలా డీలిమిటేషన్ ఉంటుందన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్థానిక జనాభా వైవిధ్యం, గిరిజన సముదాయాల ప్రాతినిధ్యాన్ని కాపాడేలా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 'డీలిమిటేషన్ అనేది కేవలం స్థానాల సంఖ్యను పెంచడం లేదా తగ్గించడం కాదు, ప్రజాస్వామ్యంలో సమానత్వాన్ని స్థాపించే ప్రక్రియ' అని స్పష్టం చేశారు

### రాజకీయ అలజడి కోసమే...

అయినా దక్షిణాదిలోని కొన్ని ప్రాంతీయ పార్టీలు కాకి లెక్కలను ప్రచారం చేస్తున్నాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలకు 42 లోక్‌సభ స్థానాలుంటే, పునర్విభజన తరువాత 34 అవుతాయని చెబుతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు ప్రస్తుతం 129 స్థానాలుంటే వీటి సంఖ్య 103కు పడిపోయే అవకాశం ఉందని చెబుతున్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, బిహార్ రాష్ట్రాలలోని స్థానాల సంఖ్య 174 నుంచి 204 స్థానాలకు చేరుకుంటుందని అంటున్నారు. నిజానికి ఈ లెక్కలు ఇచ్చింది ఓ విదేశీ సంస్థ. 'కార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్' అనే సంస్థ 'ఇండియాస్ ఎమర్జింగ్ క్రైసిస్ ఆఫ్ రిప్రజెంటేషన్' అనే నివేదిక సిద్ధం చేసింది. ఈ నివేదిక తప్ప, డీలిమిటేషన్ సీట్లపై మరో రిపోర్టు లేదు. కేంద్రం నుంచి అసలు లేదు. అయినా ఓ విదేశీ సంస్థ రిపోర్టును పట్టుకుని దేశంలో రాజకీయ అలజడి రేపడానికి డీఎంకే ప్రయత్నిస్తుంటే, ఆ పార్టీ ట్రాప్‌లో ఇతర పార్టీలు పడుతున్నాయి.

> ఉత్తరాదివారిని కించపరిచి తమిళనాడు డీఎంకే నేతలు ఏం సాధించాలనుకుంటున్నారు? ఉత్తరాది వారిలో దక్షిణాదిపై ఏకపక్షంగా వ్యతిరేకత పెంచే కుట్రలో భాగంగానే ఇలాంటి పనులు చేస్తున్నారు.

డీలిమిటేషన్ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదనీ, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదనీ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి కూడా స్పష్టం చేశారు. లోకసభ నియోజకవర్గాల పునర్విభజన గతంలో 2002లో ప్రారంభమైంది. 2008లో అమలులోకి వచ్చింది. ఈ ప్రక్రియ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 ప్రకారం జరిగింది. 2002లో డీలిమిటేషన్ చట్టం ఆమోదించిన తర్వాత, సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఒక కమిషన్ ఏర్పాటు చేశారు. ఈ కమిషన్‌లో ఎన్నికల కమిషన్ సభ్యులు, రాష్ట్రాల నుండి ప్రతినిధులు ఉన్నారు. 2001 జనాభా లెక్కల ఆధారంగా ప్రతి రాష్ట్రంలో లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల సంఖ్యను సమన్వయం చేశారు. దీని ప్రకారం, జనాభా పెరుగుదలకు అనుగుణంగా నియోజకవర్గాల సరిహద్దులు సవరించారు. మొత్తం లోక్‌సభ స్థానాల సంఖ్య మాత్రం మారలేదు. నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ వివిధ రాష్ట్రాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలు, పౌరుల నుండి సూచనలు స్వీకరించింది. ఈ సూచనలను పరిగణనలోకి తీసుకుని, సరిహద్దులను ఖరారు చేశారు. ఇప్పుడు కూడా అలాగే జరుగుతుంది. ఇంకా విస్తృత సంప్రతింపులకు కమిటీలు వేస్తారు.

### పరుష వ్యాఖ్యలు ఎందుకు?

ఉత్తరాదివాళ్ళు పందుల్ని కన్నట్లుగా పిల్లల్ని కంటున్నారనీ, అక్కడ బహుభర్తృత్వం ఉంటుందనీ డీఎంకేకు చెందిన మంత్రి దురై మురుగన్ వ్యాఖ్యానించారు. ఉత్తరాదివారిని కించపరిచి తమిళనాడు డీఎంకే నేతలు ఏం సాధించాలనుకుంటున్నారు? ఉత్తరాది వారిలో దక్షిణాదిపై ఏకపక్షంగా వ్యతిరేకత పెంచే కుట్రలో భాగంగానే ఇలాంటి పనులు చేస్తున్నారు. తమిళనాడు డీఎంకే పాలన నాలుగేళ్లు నిండకుండానే ప్రజా వ్యతిరేకత మూటగట్టుకుంది. అందుకే ఉత్తరాదిపై విషం చిమ్మి, వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో దక్షిణాది సెంటిమెంటుతో గెలవాలనుకుంటున్నారు.

హక్కుల కోసం పోరాటం చేయడం ప్రజాస్వామ్య హక్కు. కానీ ప్రాంతాల వారీగా భావోద్వేగాలు కలిగి ఉండే సమస్యల పట్ల పోరాడేటప్పుడు, విభజనవాదం చెలరేగే ప్రమాదం ఉంది. ప్రత్యేక ద్రవిడ దేశం కావాలని గతంలో కొంత మంది తమిళ నేతలు ప్రకటనలు కూడా చేశారు. ఇలాంటి విభజనవాదుల మధ్య దేశాన్ని సమైక్యంగా ఉంచుకోవడం ఇప్పుడు అత్యంత ముఖ్యం. ప్రత్యేక దేశం అనే మాట వినిపించిందంటే, అది విభజన వాదమే! దీన్ని ఏ మాత్రం ప్రోత్సహించకుండా, దక్షిణాది తన ప్రాధాన్యాన్ని కాపాడుకునేందుకు పోరాటం చేస్తే అది మంచి ప్రజాస్వామ్య విధానం అవుతుంది.

వ్యాసకర్త బీజేపీ ఏపీ ఉపాధ్యక్షుడు

ఇన్ బాక్స్

## స్వీయశిక్ష పరిష్కారమా?

ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాలో ఒక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయుల మాట వినడం లేదనీ, తల్లితండ్రులు సహకరించడం లేదనీ, దానితో విద్యార్థులలో క్రమశిక్షణ లోపించి విద్యాబోధన సరిగా జరగడం లేదని ఆవేదన చెందిన ప్రధానోపాధ్యాయుడు ఉదయం అసెంబ్లీలో విద్యార్థుల ముందు సాష్టాంగ ప్రణామం చేసి, గుంజీలు తీసి తన బాధను వెలిబుచ్చారు. తనకు తాను విధించుకున్న శిక్షతో అయినా విద్యార్థులు, తల్లితండ్రులలో మార్పు వస్తుందని ఆ ప్రధానోపాధ్యాయుడు భావిస్తున్నారు. శారీరక దండనల్ని నిషేధించడం వల్లే విద్యార్థులలో క్రమశిక్షణ లోపించిందని చాలా మంది ఉపాధ్యాయులు, తల్లితండ్రులు భావిస్తుంటారు. కానీ, అది నిజం కాదు. శారీరక దండన వల్ల విద్యార్థులలో మానసిక పరివర్తన రాదని అనేక పరిశోధనలు, అధ్యయనాలు తెలియచేస్తున్నాయి.

సమాజం, తల్లితండ్రుల నుండి ఆశించిన సహకారం లేకపోవడంతో ఉపాధ్యాయులు నిర్వేదానికి, నిర్లిప్తతకు గురి అవుతున్నారు. 'తల్లితండ్రులకు లేని శ్రద్ధ మాకెందుకు' అని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. తల్లితండ్రులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణ లోపించడంతో విద్యార్థుల క్రమశిక్షణ మరింత క్షీణిస్తుంది. దీనిని నివారించడానికి శారీరక దండన పరిష్కారం కాదు. ఉపాధ్యాయులు స్వీయశిక్ష విధించుకోవడం కూడా సరైనది కాదు. ఇది తాత్కాలికంగా సమస్యకు పరిష్కారం చూపినా, శాశ్వత పరిష్కారం మాత్రం కాదు. ఇలాంటి స్వీయశిక్షలు సమాజంలో ఉపాధ్యాయుల స్థాయిని తగ్గిస్తాయి. విద్యార్థులలో ఉపాధ్యాయుల పట్ల గౌరవం తగ్గుతుంది.

క్రమశిక్షణ సమస్యను నిరంతర కౌన్సెలింగ్, గైడెన్స్‌లతో మాత్రమే పరిష్కరించగలం. ప్రతీ బడిలో క్రమశిక్షణ లేని విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగానే ఉంటుంది. వారిని మొదట్లోనే గుర్తించి, వ్యక్తిగతంగా స్నేహపూరితంగా వ్యవహరిస్తూ వారిలో మార్పును తీసుకువచ్చే ప్రయత్నం చేయాలి. విద్యార్థుల క్రమశిక్షణా రాహిత్యం వెనుక ఉండే కారణాలూ వెతికి, వాటిని పరిష్కరించే ప్రయత్నం చేయాలి. అలాంటి విద్యార్థులను ఆటల్లో, ఇతర సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలి. క్రమశిక్షణా రాహిత్యం వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలు తెలియచేయాలి. తల్లితండ్రుల సహకారం వీలయినంత వరకు తీసుకోవాలి. విద్యార్థులలో స్వీయ విచక్షణ పెంపొందించేలా ప్రయత్నం చేస్తే ఉపాధ్యాయులు స్వీయ శిక్షలు విధించుకోవాల్సిన అవసరం రాదు.

– డా॥ అనుమాండ్ల వేణుగోపాల రెడ్డి । 99481 06198

# టీచర్లకూ ఈ జాడ్యం అంటిందా?

ఇటీవల జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కొందరు ఉపాధ్యాయుల ప్రవర్తన మొత్తం ఉపాధ్యాయ లోకాన్ని తలదించుకునేలా చేసింది. ఈ ఎన్నికల్లో డబ్బు తీసుకుని కొందరు ఉపాధ్యాయులు ఓటు వేయడం ద్వారా పవిత్రమైన వృత్తినే కాక ప్రజాస్వామ్యాన్ని కూడా పరిహాసం చేశారు. మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యాయ స్థానానికి జరిగిన ఎన్నికల్లో ఒక జాతీయ రాజకీయ పార్టీ తరఫున పోటీచేసిన అభ్యర్థి ఓటుకు 5 వేల చొప్పున ఒక్కొక్క టీచర్‌కు పంచారనే ఆరోపణ బలంగా వ్యాప్తి చెందింది. నిజంగా ఈ డబ్బు తీసుకుని ఉపాధ్యాయులు ఓటు వేసి ఉంటే వారిలో ఏ స్థాయిలో నైతిక విలువలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి టీచర్లు రేపటి భావిసమాజాన్ని ఎలా తయారు చేస్తారు? డబ్బులు ఇస్తే తీసుకోవడమే తలవంపులైతే... ఏకంగా 'మాకు ఐదు వేలు కావాలి, రెండు వేలైతే ఓటు వెయ్యం' అని బేరసారాలకు టీచర్లు దిగారంటూ వార్తలు వచ్చాయి. ఇంతకన్నా అవమానం ఉపాధ్యాయ లోకానికి ఏమన్నా ఉంటుందా?





గత దశాబ్ద కాలంగా తెలంగాణలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా ఉన్నవారు కూడా కొందరు రాజకీయ నాయకుల్లాగానే డబ్బులు వసూలు చేయడం, పైరవీలు చేయడం లాంటి పనులతో కోట్లకు పడగెత్తారనే ఆరోపణలూ ఉన్నాయి. ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్ర శాసన మండలిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ఎంతో హుందాతో, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేసేవారన్న సంగతిని ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి.

భారత సమాజంలో ఉపాధ్యాయుడి పాత్ర ఎంతో ఉన్నతమైనదీ, గౌరవప్రదమైనదీ! జ్యోతిబా పూలే – సావిత్రీబాయి పూలే దంపతులు సమాజంలోని మూఢ నమ్మకాలను పారదోలి వెలుగును నింపడానికి ఉపాధ్యాయ వృత్తినే ఆయుధంగా చేసుకున్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు వంటివారు సంఘ సంస్కర్తగా, విద్యావ్యాపకునిగా చేసిన సేవ ఉపాధ్యాయుని విలువను తెలియచేస్తోంది. సమాజాన్ని మార్చే అద్భుత అవకాశం ఉన్న విద్యారంగంలో నాటి విలువలు అడుగంటాయి. దీనికి కారణం ఒక విధంగా కార్పొరేట్ శక్తులు విద్యారంగంలోకి ప్రవేశించడమే కావచ్చు. విద్యావ్యాపారంలో కోట్లు సంపాదించినవారు రాజకీయాల్లోకి అడుగుపెట్టి రాజకీయ పార్టీల తరఫున ఎన్నికల్లో పోటీ చేసి డబ్బును వెదజల్లి గెలవడం ఇప్పుడు కనిపిస్తున్న దృశ్యం.

గత సంవత్సరం జరిగిన హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోటీచేసిన ఓ వ్యక్తి కోట్లు ఖర్చుపెట్టి, టీచర్లను ఆర్థిక ప్రలోభాలకు గురిచేశారనే ప్రచారం ఇందుకు ఒక ఉదాహరణ మాత్రమే!

ఈ పరిస్థితులను గమనిస్తుంటే రానున్న కాలాన్ని ఊహించడానికే భయమేస్తోంది. మేధా సంపత్తి, సేవా గుణం, వాక్చాతుర్యం ఉన్న ఉపాధ్యాయ సంఘాల నేతలకు బదులు ఇక డబ్బున్న కార్పొరేట్ విద్యాలయాల మేనేజ్మెంట్‌లకు చెందినవారే ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా గెలుస్తారు కాబోలు! అలా వీరు గెలవకుండా ఉండాలంటే లక్షల రూపాయలు జీతంగా పొందే టీచర్లు... ఐదు, పదివేలకు కక్కుర్తిపడి ఓటును అమ్ముకోకుండా ఓటు వేయడమే మార్గం.

– డా॥ కొండి సుధాకర్ రెడ్డి, రిటైర్డ్ సీనియర్ లెక్చరర్
మొబైల్: 89850 37713

# ప్రాప్తం లేనిది జరగదు!

జ్యోతిర్మయం

అసురులలో నముచి అనే పేరున్న ఒక వీరుడున్నాడు. విధివశాన ఒక సందర్భంలో సంపదనంతా పోగొట్టుకుని, ఒక ఏకాంత స్థలంలో కూర్చుని ఉన్న నముచిని చూశాడు ఇంద్రుడు. పరామర్శించే కోరికతో దగ్గర చేరి, మాటలలో ఓదార్పు ధ్వనిస్తుండగా 'సంపద అంతా పోయింది. చుట్టూ సేవక పరివారం లేదు. బంధువులు కూడా ముఖం చాటేసి ఉంటారు. ఈ హీన స్థితికి ఎంతగా దుఃఖిస్తున్నావో కదా!' అన్నాడు. ఇంద్రుడి మాటలలోని ఎగతాళిని గ్రహించిన నముచి 'ఏడవడం దేనికి? ఏడ్చినందు వలన పోయినది తిరిగి వస్తుందా? అదనంగా కావాలనుకున్నది సమకూరుతుందా? అలా కాకపోగా, శరీరానికీ మనస్సుకూ మరింత బాధ కలుగుతుందే తప్ప వేరే ప్రయోజనమేదీ కలుగదు. ఇది తెలిసినవాడిని కనుక, నేను దేనికీ ఏడుస్తూ కూర్చోను!' అని బదులిచ్చాడు. అంతటితో ఆగకుండా, సుఖదుఃఖాలు, కష్టనష్టాలు ఒక మనిషి జీవితంలో రావడం, పోవడం అనే స్థితికి సంబంధించిన ధర్మసూక్ష్మాల గురించి ఇంద్రుడికి గుర్తుచేయాలని 'సృష్టిలోని అన్ని ప్రాణులకు ఏలికై శాసించేవాడుగా ఒకరు ఉన్నారు. ఏ కాలానికి ఎవరికి ఏది ప్రాప్తమో అది ఆ కాలానికి, పల్లానికి ప్రవహించే నీటి చందంగా, ప్రాప్తించి తీరుతుంది. సుఖమైనా, దుఃఖమైనా – ఇది నాకు జరగాల్సి ఉంది కాబట్టే జరిగింది. ఆనందం–దుఃఖం, సంపద–ఆపద వంటి ద్వంద్వాలు ఎంత మాత్రమూ బాధించవు!' అని విశదపరిచాడు.

కం. **ధైర్యంబున వీర్యంబున / శౌర్యంబున బ్రజ్ఞ బడయ జాలునె నరు డె / క్కార్యము నప్రాప్యమయిన? / నార్యుం డది యెఱుగు గాన యడలడు శక్రా!** 'ధాతచే తనకు ప్రాప్తించేవిగా నిశ్చయింపబడని సంపదలను, సుఖాలను, ఏ వ్యక్తి అయినా తన మనోధైర్యంతో కాని, బలపరాక్రమంతో కాని, శౌర్యంతో కాని, బుద్ధి బలంతో కాని పొందగలుగుతాడా? పొందలేడు. తెలివైనవాడు అది గ్రహిస్తాడు కాబట్టి, ఓ ఇంద్రా! కలత చెందడు!' అని చివరలో సారాంశంగా చెప్పాడు నముచి. సంయమనము, స్థితప్రజ్ఞతతో కూడినవైన నముచి మాటలను విన్న ఇంద్రుడు, నముచిని మెచ్చుకుని తిరిగి స్వర్గానికి వెళ్ళిపోయాడు.

– భట్టు వెంకటరావు

తెలంగాణ ప్రభుత్వం
**రెవెన్యూ (భూ.సే.) శాఖ**
**ఫారం-సి**
**నోటిఫికేషన్**
(చట్టంలోని సెక్షన్ 11 క్రింద, 10ఎ మినహాయింపు ఇవ్వబడినది)(రూల్ 6/12 చూడండి)

గెజిట్ ఆర్.ఆర్.నం. 12 — తేది : 21.03.2025
ఫైల్ నం. జి2/109/2025 — తేది : 19.03.2025
నం. బి/1007/2018 — తేది : 28.02.2025
డి/593/2025

రంగారెడ్డి జిల్లా, ఆమనగల్లు మండలం, పోలేపల్లి గ్రామంలో గల మొత్తం ఎ. 12.18 1/2 గుంటల విస్తీర్ణం గల భూమి ప్రజోపయోగార్థం అనగా ఎంజికెఎల్ఐఎస్ ప్రాజెక్టు క్రింద ప్యాకేజీ-29 యొక్క టిబిఎల్ఎండ్ డిస్ట్రిబ్యూటరీ డి82 నిర్మాణం కొరకు అవసరమై ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం / కలెక్టర్‌వారు భావిస్తున్నారు.
అందువలన రంగారెడ్డి జిల్లా, ఆమనగల్లు మండలం, పోలేపల్లి గ్రామంలో పై సదరు ప్రాజెక్టు కొరకు కొంచెం ఎక్కువ లేదా తక్కువగా 12.18 1/2 ఎకరాలు అనగా 2.471 హెక్టార్ల ప్రామాణిక కొలతలు గల భూమి సేకరణ కొరకు ప్రతిపాదించబడినదని ప్రకటించడమైనది. వాటి పూర్తి వివరాలు దిగువ విధంగా ఉన్నాయి.

**షెడ్యూల్**
జిల్లా : రంగారెడ్డి — మండలం : ఆమనగల్లు — గ్రామం పోలేపల్లి

| క్ర. నం. | సర్వే నం. | టైటిల్ రకం | భూమి రకం | సేకరణ క్రింద విస్తీర్ణం (ఎకరాలు) | ఆసక్తి గల వ్యక్తి పేరు మరియు చిరునామా | సరిహద్దులు: ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు: రకం | సంఖ్య | కట్టడాలు: రకం | ప్లింత్ ఏరియా | రిమార్కులు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 |
| 1 | 42/అ | పట్టా | మెట్ట | 0.26 | గుమ్మల మధుసూదన్‌రెడ్డి తండ్రి చిన్న మల్లా | 40 | అంతమోని కుంట శివారు | 41 | 43 | | | | | |
| 2 | 42/ఇ | పట్టా | మెట్ట | 0.12 | గుమ్మల వెంకటరెడ్డి తండ్రి నారాయరెడ్డి | 40 | అంతమోని కుంట శివారు | 41 | 43 | | | | | |
| | మొత్తం | | | 0.38 | | | | | | | | | | |
| 3 | 43/ఇ | పట్టా | మెట్ట | 0.20 | గుమ్మల సువర్ణ భర్త నర్సిరెడ్డి | 44 | అంతమోని కుంట శివారు | 42 | 44 | | | | | |
| | మొత్తం | | | 0.20 | | | | | | | | | | |
| 4 | 44/11 | లావణి పట్టా | మెట్ట | 0.02 | ఒగ్గ కాశయ్య తండ్రి పెద్దయ్య | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 5 | 44/12/అ | లావణి పట్టా | మెట్ట | 0.01 | వగ్గ కృష్ణయ్య తండ్రి జంగయ్య | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 6 | 44/12/ఆ | లావణి పట్టా | మెట్ట | 0.01 | ఒగ్గ పరమేందర్ తండ్రి బాలయ్య | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 7 | 44/12/ఇ | లావణి పట్టా | మెట్ట | 0.01 | వగ్గ లాలయ్య తండ్రి వెంటయ్య | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 8 | 44/12/ఈ1 | లావణి పట్టా | మెట్ట | 0.01 | ఒగ్గ కృష్ణయ్య తండ్రి జంగయ్య | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 9 | 44/12/ఈ2 | లావణి పట్టా | మెట్ట | 0.01 | ఒగ్గ పోచమ్మ భర్త బాలయ్య | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 10 | 44/12/ఈ3 | లావణి పట్టా | మెట్ట | 0.01 | ఒగ్గ లాలయ్య తండ్రి వెంటయ్య | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 11 | 44/13/1 | లావణి పట్టా | మెట్ట | 0.01 | ఒగ్గ లక్ష్మమ్మ భర్త బాలయ్య | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 12 | 44/13/2 | లావణి పట్టా | మెట్ట | 0.01 | ఒగ్గ రామచంద్రయ్య తండ్రి మల్లయ్య | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 13 | 44/16 | లావణి పట్టా | మెట్ట | 0.03 | వగ్గ పెద్ద రాములమ్మ భర్త | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 14 | 44/2 | లావణి పట్టా | మెట్ట | 0.02 | ఒగ్గ వెంకటయ్య తండ్రి లక్ష్మయ్య | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 15 | 44/20 | లావణి పట్టా | మెట్ట | 0.15 | కేతావత్ కస్య తండ్రి రాము | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 16 | 44/20/1 | లావణి పట్టా | మెట్ట | 0.06 | కేతావత్ కిషన్ తండ్రి రాములు | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 17 | 44/20/అ | లావణి పట్టా | మెట్ట | 0.06 | కేతావత్ లక్ష్మీ తండ్రి రాములు | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 18 | 44/21/1 | లావణి పట్టా | మెట్ట | 0.02 | ఒగ్గ ఈశ్వరయ్య తండ్రి బాలయ్య | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 19 | 44/21/2 | లావణి పట్టా | మెట్ట | 0.02 | ఒగ్గ బాలకిష్టయ్య తండ్రి బాలయ్య | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 20 | 44/3/1 | లావణి పట్టా | మెట్ట | 0.01 | ఒగ్గ నరసింహ తండ్రి లాలయ్య | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 21 | 44/3 3/1 | లావణి పట్టా | మెట్ట | 0.01 | ఒగ్గ రామచంద్రయ్య తండ్రి లాలయ్య | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 22 | 44/3 3/2 | లావణి పట్టా | మెట్ట | 0.01 | ఒగ్గ పెంటమ్మ భర్త పుల్లయ్య | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 23 | 44/3 4 | లావణి పట్టా | మెట్ట | 0.01 | ఒగ్గ పెద జంగయ్య తండ్రి పెద్ద బాలయ్య | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 24 | 44/3 ఉ | లావణి పట్టా | మెట్ట | 0.01 | ఒగ్గ చిన్న జంగయ్య తండ్రి పెద్ద బాలయ్య | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 25 | 44/4 | లావణి పట్టా | మెట్ట | 0.02 | ఒగ్గ శేఖర్ తండ్రి రామయ్య | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 26 | 44/5 | లావణి పట్టా | మెట్ట | 0.02 | ఒగ్గ రాములమ్మ తండ్రి లాలయ్య | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 27 | 44/6 | లావణి పట్టా | మెట్ట | 0.02 | వగ్గ బలరాం తండ్రి జంగయ్య | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 28 | 44/7 | లావణి పట్టా | మెట్ట | 0.02 | ఒగ్గ లక్ష్మమ్మ భర్త ఒగ్గ బలరాం | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| 29 | 44/9 | లావణి పట్టా | మాగాణి | 0.02 | ఒగ్గ పెద్దమ్మ భర్త బలరాం | 45,53, 54 | అంతమోని కుంట శివారు | 40,43 | 56,57, 58,87, 88 | | | | | |
| | మొత్తం | | | 1.21 | | | | | | | | | | |
| 30 | 45/అ/అ | పట్టా | మెట్ట | 0.02 | కేతావత్ కస్య తండ్రి రాము | 47 | 40 | 46 | 53,54 | | | | | |
| | మొత్తం | | | 0.02 | | | | | | | | | | |
| 31 | 53/అ/1/3/1/1 | పట్టా | మెట్ట | 0.12 | కేతావత్ పస్య తండ్రి కేతావత్ రావ్య | 52 | 44 | 45,47 | 54 | | | | | |
| 32 | 53/అ/1 | పట్టా | మెట్ట | 0.10 | కేతావత్ దుబియ తండ్రి హన్య | 52 | 44 | 45,47 | 54 | | | | | |
| 33 | 53/అ/3 | పట్టా | మెట్ట | 0.12 | కేతావత్ రాజ్య తండ్రి తేజ్య | 52 | 44 | 45,47 | 54 | | | | | |
| 34 | 53/అ/ఆ/1 | పట్టా | మెట్ట | 0.10 | కేతావత్ కాస్య తండ్రి హన్య | 52 | 44 | 45,47 | 54 | | | | | |
| 35 | 53/ఇ/ఈ/2/1/1/1/1 | పట్టా | మెట్ట | 0.07 | కేతావత్ గజ్య తండ్రి హన్య | 52 | 44 | 45,47 | 54 | | | | | |
| 36 | 53/ఉ | పట్టా | మెట్ట | 0.08 | కేతావత్ పార్వ్య తండ్రి రావ్య | 52 | 44 | 45,47 | 54 | | | | | |
| | మొత్తం | | | 1.19 | | | | | | | | | | |
| 37 | 54/అ/అ | పట్టా | మెట్ట | 0.08 | కేతావత్ ఘన్స్య తండ్రి బక్క తుల్స్య | 51 | 44 | 53 | 55 | | | | | |
| 38 | 54/అ/1/1/1/1/ | పట్టా | మెట్ట | 0.03 | కేతావత్ పస్య తండ్రి కేతావత్ రావ్య | 51 | 44 | 53 | 55 | | | | | |
| 39 | 54/అ/1/1/1/2 | పట్టా | మెట్ట | 0.03 | కేతావత్ పాండు తండ్రి కేతావత్ లక్ష్మీ | 51 | 44 | 53 | 55 | | | | | |
| 40 | 54/అ/1/1/ | పట్టా | మెట్ట | 0.03 | కేతావత్ మణి తండ్రి సేన్య | 51 | 44 | 53 | 55 | | | | | |
| 41 | /1/1/ఆ/2 | పట్టా | మెట్ట | 0.03 | కేతావత్ బాల్య తండ్రి సేన్య | 51 | 44 | 53 | 55 | | | | | |
| 42 | 54/ఇ/ఈ/1 | పట్టా | మెట్ట | 0.06 | కేతావత్ రావ్య తండ్రి బీక్య | 51 | 44 | 53 | 55 | | | | | |
| 43 | 54/ఇ/ఈ/2/1 | పట్టా | మెట్ట | 0.03 | కేతావత్ నరేష్ తండ్రి కేతావత్ రావ్య | 51 | 44 | 53 | 55 | | | | | |
| 44 | 54/ఇ/ఉ | పట్టా | మెట్ట | 0.08 | కేతావత్ పస్సి తండ్రి రేక్య | 51 | 44 | 53 | 55 | | | | | |
| | మొత్తం | | | 0.37 | | | | | | | | | | |
| 45 | 56/అ/1 | పట్టా | మెట్ట | 0.19 | కొడిగారి జంగమ్మ భర్త తిరుపతయ్య | 55 | 57 | 44 | 60,58 | | | | | |
| 46 | 56/అ/అ/1/1/1 | పట్టా | మెట్ట | 0.01 | కొడిగారి లక్ష్మమ్మ భర్త మంత్రీశ్ | 55 | 57 | 44 | 60,58 | | | | | 0.06 |
| 47 | 56/అ/అ/2 | పట్టా | మెట్ట | 0.06 | కొడిగారి ముత్యాలమ్మ భర్త | 55 | 57 | 44 | 60,58 | | | | | |
| 48 | 56/అ/ఆ/1 | పట్టా | మెట్ట | 0.03 | కొడిగారి జంగయ్య తండ్రి వీరయ్య | 55 | 57 | 44 | 60,58 | | | | | |
| 49 | 56/అ/ఆ/2 | పట్టా | మెట్ట | 0.02 | కొడిగారి గోవర్ధన్ తండ్రి తిరుపతయ్య | 55 | 57 | 44 | 60,58 | | | | | |
| 50 | 56/అ/ఇ/1 | పట్టా | మెట్ట | 0.02 | కొడిగారి దమయంతి గార్డియన్ తల్లి రాధ | 55 | 57 | 44 | 60,58 | | | | | |
| 51 | 56/అ/ఇ/2 | పట్టా | మెట్ట | 0.02 | కొడిగారి అక్షిత గార్డియన్ తల్లి | 55 | 57 | 44 | 60,58 | | | | | |
| 52 | 56/అ/ఈ/2 | పట్టా | మెట్ట | 0.03 | కొడిగారి రాములమ్మ భర్త సోమయ్య | 55 | 57 | 44 | 60,58 | | | | | |
| 53 | 56/అ/ఉ/1 | పట్టా | మెట్ట | 0.03 | కొడిగారి సోమయ్య తండ్రి వీరయ్య | 55 | 57 | 44 | 60,58 | | | | | |
| | మొత్తం | | | 1.01 | | | | | | | | | | |
| 54 | 58/అ/5/2 | పట్టా | మెట్ట | 0.11 | కేతావత్ బాలరాజు తండ్రి కేతావత్ భీమ్యా | 57,59 | 44 | 44 | 86,87 | | | | | |
| 55 | 58/ఇ/1 | పట్టా | మెట్ట | 0.07 | కేతావత్ గోపాల్ తండ్రి బీక్య | 57,59 | 44 | 44 | 86,87 | | | | | |
| | మొత్తం | | | 0.18 | | | | | | | | | | |
| 56 | 59/అ/3 | పట్టా | మెట్ట | 0.15 | కేతావత్ రాజు తండ్రి భీమ్య | 60 | 58 | 58 | 84 | | | | | |
| 57 | 59/అ/1 | పట్టా | మెట్ట | 0.03 | కేతావత్ శ్రీను తండ్రి వాన్య | 60 | 58 | 58 | 84 | | | | | |
| 58 | 59/అ/2 | పట్టా | మెట్ట | 0.03 | కేతావత్ హర్య తండ్రి కేతావత్ వాన్య | 60 | 58 | 58 | 84 | | | | | |
| 59 | 59/అ/2/1 | పట్టా | మెట్ట | 0.05 | కేతావత్ లక్ష్మీరాం తండ్రి కేతావత్ హన్య | 60 | 58 | 58 | 84 | | | | | |
| 60 | 59/అ/2/2 | పట్టా | మెట్ట | 0.05 | కేతావత్ లాలు తండ్రి కేతావత్ హన్య | 60 | 58 | 58 | 84 | | | | | |
| 61 | 59/ఉ/1 | పట్టా | మెట్ట | 0.03 | కేతావత్ తుల్చిరాం తండ్రి కేతావత్ భీమ్యా | 60 | 58 | 58 | 84 | | | | | |
| 62 | 59/ఉ/2 | పట్టా | మెట్ట | 0.03 | కేతావత్ బాలరాజు తండ్రి కేతావత్ భీమ్యా | 60 | 58 | 58 | 84 | | | | | |
| | మొత్తం | | | 0.37 | | | | | | | | | | |
| 63 | 83/13/2/4 | పట్టా | మెట్ట | 0.05 | కేతావత్ లక్ష్మణ్ తండ్రి లోక్యా | 79 | 90 | 84,85 | 88,81 | | | | | |
| 64 | 83/5/1 | పట్టా | మెట్ట | 0.06 | కేతావత్ లక్ష్మణ్ తండ్రి లోక్యా | 79 | 90 | 84,85 | 88,81 | | | | | |
| 65 | 83/6/1 | పట్టా | మెట్ట | 0.06 | కేతావత్ లక్ష్మణ్ తండ్రి లోక్యా | 79 | 90 | 84,85 | 88,81 | | | | | |
| 66 | 83/8 | పట్టా | మెట్ట | 0.11 | కేతావత్ లక్ష్మణ్ తండ్రి లోక్యా | 79 | 90 | 84,85 | 88,81 | | | | | |
| | మొత్తం | | | 0.28 | | | | | | | | | | |
| 67 | 85/అ/1/1/1/1 | పట్టా | మెట్ట | 0.05 | కేతావత్ హన్య తండ్రి ఘన్స్య | 84 | 86 | 58 | 83 | | | | | |
| 68 | 85/అ/1/1/1/2 | పట్టా | మెట్ట | 0.03 | కేతావత్ బాలాజీ తండ్రి కేతావత్ భీమ్యా | 84 | 86 | 58 | 83 | | | | | |
| 69 | 85/అ/1/1/2 | పట్టా | మెట్ట | 0.03 | కేతావత్ తులసిరాం తండ్రి కేతావత్ భీమ్యా | 84 | 86 | 58 | 83 | | | | | |
| 70 | 85/అ/1 | పట్టా | మెట్ట | 0.02 | కేతావత్ బాలాజీ తండ్రి ధర్మ్య | 84 | 86 | 58 | 83 | | | | | |
| 71 | 85/అ/2 | పట్టా | మెట్ట | 0.05 | కేతావత్ ధర్మ్య తండ్రి బద్య | 84 | 86 | 58 | 83 | | | | | |
| 72 | 85/ఇ | పట్టా | మెట్ట | 0.05 | కేతావత్ బాల్య తండ్రి కేతావత్ లోక్య | 84 | 86 | 58 | 83 | | | | | |
| 73 | 85/ఈ/1/2 | పట్టా | మెట్ట | 0.06 | కేతావత్ జయరాం తండ్రి భాన్య | 84 | 86 | 58 | 83 | | | | | |
| 74 | 85/ఈ/2 | పట్టా | మెట్ట | 0.05 | కేతావత్ హెమ్య తండ్రి భాన్య | 84 | 86 | 58 | 83 | | | | | |
| 75 | 85/ఉ | పట్టా | మెట్ట | 0.05 | కేతావత్ ధాసింగ్ తండ్రి కుర్మ్య | 84 | 86 | 58 | 83 | | | | | |
| | మొత్తం | | | 0.38 | | | | | | | | | | |
| 76 | 90/ఇ/2 | పట్టా | మెట్ట | 0.02 | కేతావత్ జైపాల్ తండ్రి మున్య | 83 | 89 | 86 | 92 | | | | | |
| 77 | 90/ఇ/3 | పట్టా | మెట్ట | 0.02 | కేతావత్ చందు తండ్రి మున్య | 83 | 89 | 86 | 92 | | | | | |
| | మొత్తం | | | 0.04 | | | | | | | | | | |
| 78 | 92/అ1 | పట్టా | మెట్ట | 0.11 | కేతావత్ జెట్టి తండ్రి వెంకటయ్య | 88 | 91 | 90 | 93 | | | | | |
| 79 | 92/అ3 | పట్టా | మెట్ట | 0.11 | కేతావత్ సాయికుమార్ తండ్రి కేతావత్ | 88 | 91 | 90 | 93 | | | | | |
| 80 | 92/అ5/2 | పట్టా | మెట్ట | 0.22 | కేతావత్ దేవేందర్ తండ్రి రాములు | 88 | 91 | 90 | 93 | | | | | |
| | మొత్తం | | | 1.04 | | | | | | | | | | |
| 81 | 93/అ | పట్టా | మెట్ట | 0.10 | కేతావత్ బిచ్య తండ్రి లోక్య | 88 | 91 | 92 | 94 | | | | | |
| 82 | 93/ఆ | పట్టా | మెట్ట | 0.10 | కేతావత్ రాగ్య తండ్రి లోక్య | 88 | 91 | 92 | 94 | | | | | |
| 83 | 93/ఈ | పట్టా | మెట్ట | 0.10 | కేతావత్ పార్వ్య తండ్రి లోక్య | 88 | 91 | 92 | 94 | | | | | |
| | మొత్తం | | | 0.30 | | | | | | | | | | |
| 84 | 94/అ/1 | పట్టా | మెట్ట | 0.01½ | కొడిగారి యాదమ్మ భర్త లేట్ కొడిగారి | 88 | 94,95 | 93 | 96 | | | | | |
| 85 | 94/అ/2 | పట్టా | మెట్ట | 0.01 | కొడిగారి రామస్వామి తండ్రి లేట్ కొడిగారి | 88 | 94,95 | 93 | 96 | | | | | |
| 86 | 94/అ/3/1 | పట్టా | మెట్ట | 0.01 | కొడిగారి వెంకటయ్య తండ్రి లేట్ కొడిగారి | 88 | 94,95 | 93 | 96 | | | | | |
| | మొత్తం | | | 0.03½ | | | | | | | | | | |
| 87 | 95/3 | పట్టా | మెట్ట | 0.04 | కేతావత్ హేమ్లి భర్త బీక్య | 94,96 | అంతమోని కుంట శివారు | 91 | 97 | | | | | |
| 88 | 95/4 | పట్టా | మెట్ట | 0.08 | శ్రీమతి కేతావత్ లాక్లి (లేట్ | 94,96 | అంతమోని కుంట శివారు | 91 | 97 | | | | | |
| 89 | 95/5/అ | పట్టా | మెట్ట | 0.12 | కేతావత్ దీప్లా తండ్రి మున్య | 94,96 | అంతమోని కుంట శివారు | 91 | 97 | | | | | |
| 90 | 95/6 | పట్టా | మెట్ట | 0.09 | కేతావత్ భోజ తండ్రి రాములు | 94,96 | అంతమోని కుంట శివారు | 91 | 97 | | | | | |
| | మొత్తం | | | 0.33 | | | | | | | | | | |
| | పూర్తి మొత్తం | | | 12.18½ | | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస మరియు పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (యాక్ట్ నం.21 ఆఫ్ 2017) ద్వారా సవరించబడిన విధంగా భూసేకరణ, పునరావాస మరియు పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013లోని సెక్షన్ 11(1) (కేంద్ర చట్టం నం.30/2013) నిబంధనల ప్రకారం సంబంధితులందరికీ తెలియజేయుటకుగాను ఈ ప్రకటన జారీచేయబడినది.
ఈ భూమి ప్లానును జిల్లా కలెక్టర్ & RDO, కందుకూరు డివిజన్ కార్యాలయంలో ఏ పనిరోజునైనా కార్యాలయ పనివేళలలో తనిఖీ చేసుకోవచ్చును. సదరు చట్టంలోని సెక్షన్-12లో ఏర్పాటుచేసిన మరియు నిర్దిష్టపరిచిన విధంగా తమ పనిని తగువిధంగా నిర్వహించేందుకు భూమిలో ప్రవేశించి, సర్వేచేసి, ఏదేని భూమి స్థాయిలను తీసుకొనుటకు సబ్‌సాయిల్ త్రవ్వుటకు లేదా బోర్ వేయుటకు మరియు అవసరమైన అన్ని ఇతర చర్యలు తీసుకొనుటకు అధీకృత అధికారి అంటే ----- వారికి మరియు వారి సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం/ కలెక్టర్-కమ్- అప్రాప్రియేట్ గవర్నమెంట్ అధికారం ఇస్తోంది.
చట్టంలోని సెక్షన్ 11(4) క్రింద, కలెక్టర్ ముందస్తు ఆమోదం లేకుండా అట్టి ప్రకటన ప్రచురణ తేదీ నుండి ఏ వ్యక్తి అట్టి భూమిపై ఎటువంటి వ్యవహారములు చేయరాదు లేదా వ్యవహారములకు కారణం కారాదు అంటే అమ్మకం / కొనుగోలు మొ॥వి చేయరాదు లేదా అట్టి భూమిపై ఎటువంటి తాకట్టు రుణభారాలు కల్పించరాదు.
సేకరణకు అభ్యంతరాలు ఏవైనా ఉంటే మరియు నష్టపరిహారం కోసం సంప్రదింపుల ద్వారా పరిష్కారం కోసం ప్రయోజనంగల/ప్రభావిత వ్యక్తులందరు వారి క్లెయిములను చట్టంలోని సెక్షన్ 15 క్రింద ఏర్పాటుచేసిన విధంగా ఈ ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరవై రోజుల)లోగా భూమిలో ప్రయోజనం గలవారు జిల్లా కలెక్టర్/అధీకృత అధికారి సమక్షంలో వాటిని దాఖలు చేయవచ్చును.

సం/- తహశీల్దార్, ఆమనగల్లు మండలం — సం/- రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, కందుకూరు డివిజన్ — సం/- జాయింట్ కలెక్టర్ రంగారెడ్డి జిల్లా — సం/- జిల్లా కలెక్టర్ రంగారెడ్డి జిల్లా

DIPR RO No. 818/LA-PP/Advt/Pub/2024-25

# అదిగో భద్రాద్రి.. గౌతమి ఇదిగో చూడండి..

**భద్రాచలం ఆలయ నూతన డిజైన్లను విడుదల చేసిన ప్రభుత్వం**



**భద్రాచలం:** భద్రాచల క్షేత్ర అభివృద్ధికి తొలి అడుగు పడింది. దేవస్థానం అభివృద్ధిలో భాగంగా మాడ వీధుల విస్తరణ, ఇతర పనులకు ప్రభుత్వం కొన్నాళ్ల క్రితం రూ.60 కోట్లను మంజూరు చేసింది. మాడ వీధుల విస్తరణలో భాగంగా ఇళ్లు, భూములను కోల్పోతున్న వారిని రెవెన్యూ, దేవస్థానం అధికారులు గుర్తించగా.. 45 మందికి రూ.34 కోట్లు పరిహారం అందించాల్సి ఉంది. ఈక్రమంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవ ఆహ్వాన పత్రికను అధికారులు గత ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సీఎం భూసేకరణ, సర్వే వివరాలు ఆరా తీయడంతో.. నష్టపరిహారం విడుదల కావలసి ఉందని మంత్రి తుమ్మల చెప్పారు. ఇటీవల భద్రాచలం పర్యటనకు వచ్చిన మంత్రి పొంగులేటి సైతం.. రెండు, మూడు రోజుల్లో భూ నిర్వాసితుల పరిహారం అందుతుందని ప్రకటించారు. మంగళవారం రూ.34 కోట్లు విడుదల చేయగా.. ఏళ్ల తరబడి స్థానికులు, భక్తులు ఎదురుచూస్తున్న భద్రగిరి అభివృద్ధికి తొలి అడుగు పడినట్లయింది. ఈమేరకు 45 మంది నిర్వాసితులతో మంగళవారం ఆర్డీవో దామోదర్‌రావు సమావేశమై నిరభ్యంతర పత్రాలు స్వీకరించారు. వీరికి బుధవారం నష్టపరిహారం చెక్కులను ఇచ్చే అవకాశముండగా, శ్రీరామనవమి రోజు సీఎం రేవంత్ రెడ్డితో ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిపించేలా సన్నాహాలు చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యాన భద్రగిరి ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఆనంద్‌సాయి కొన్ని డిజైన్లను రూపొందించారు. మంగళవారం ప్రభుత్వం ఆలయ అభివృద్ధిపై కొత్త డిజైన్లను విడుదల చేసింది. ఈ డిజైన్లు ఆకట్టుకునేలా ఉన్నాయి.

# ముగ్గురు మావోయిస్టులు మృతి

▶ మొదటి పేజీ తరువాయి

ఉద్యమంలోకి వెళ్లిన సుధాకర్ అచెలంచెలుగా ఎదిగాడు. ప్రస్తుతం జనధనసర్కార్ స్కూల్స్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నాడు. తొలుత నర్సంపేట డివిజన్ ఇన్‌చార్జి, తర్వాత ఖమ్మం జిల్లా పరిధిలో కొంతకాలం... తర్వాత బస్తర్‌కు సుధాకర్ వెళ్లినట్టు సమాచారం. డీకేఎస్‌జెడ్‌సీలో కీలకంగా ఉన్న సుధాకర్‌పై రూ.25 లక్షల రివార్డు ఉంది. మావోయిస్టు చేసిన పలు కీలక ఆపరేషన్లలోనూ సుధాకర్ పాత్ర ఉన్నట్టు పోలీసులు తెలిపారు. సారయ్య అంగరక్షకులు బీజాపూర్ జిల్లా బైరాంగఢ్‌కు చెందిన పండరు అటరా, మన్ను బర్సాలు కూడా ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. వీరిపై రెండు లక్షల రివార్డు ఉందని ఎస్పీ చెప్పారు. ఘటనాస్థలి నుంచి ఇన్సాస్ రైఫిల్, పాయింట్ 303 రైఫిల్, పేలుడు పదార్థాలు, నిత్యావసరాల వస్తువులను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. తాజా ఎన్‌కౌంటర్ మృతులతో కలుపుకుని ఈ ఏడాదిలో ఇప్పటివరకు 116 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు వెల్లడించారు.


**కీలక నేతలను కోల్పోయిన మావోలు**

2025లో ఇప్పటివరకు, బస్తర్ రేంజ్‌లో వివిధ ఎన్‌కౌంటర్‌లలో 100 మంది నక్సలైట్లు మృతి చెందారు. డిసెంబర్ 2, 2024లో ములుగు జిల్లా పొలకమ్మ వాగు అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కురుసం మంగు, 2024 సెప్టెంబర్ మొదటివారంలో కర్కగూడేనికి అతి సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ సభ్యుడు లచ్చన్న, ఆయన భార్య తులసి అలియాస్ పునెం లక్కీ, పాల్వంచ మణుగూరు ఏరియా కమాండర్ కామ్రేడ్ రాము, పార్టీ సభ్యులు కోసి, సీనియర్ సభ్యులు గంగాల్, కామ్రేడ్ దుర్గేశ్ ఎదురుకాల్పుల్లో హతమయ్యారు. 2024 ఏప్రిల్‌లో ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేరు జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు సహా అగ్రనేత సుగులూరి చిన్నన్న అలియాస్ విజయ్ మృతి చెందారు. ఇలా తెలంగాణ ప్రాంతానికి చెందిన కీలక నేతల ఏరివేతలోనూ భద్రత బలగాలు పట్టు సాధిస్తున్నాయి. సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్‌గార్డ్)కు సరిహద్దున తెలంగాణ గ్రేహౌండ్స్, స్పెషల్ పోలీస్ బలగాల దాడులు ముమ్మరం కావడంతో మావోయిస్టులు ఆత్మరక్షణకే పరిమితం అవుతున్నారు.



మావోయిస్టుల మృతదేహాలు, స్వాధీనం చేసుకున్న ఆయుధాలు






నితీశ్ కుమార్

# నువ్వు కూర్చో.. పార్టీ మీ ఆయనది

## బిహార్ మండలిలో రబ్రీ దేవిపై సీఎం నితీశ్ విసుర్లు

**పట్నా:** బిహార్ శాసన మండలిలో మంగళవారం సీఎం నితీశ్ కుమార్, మాజీ సీఎం రబ్రీదేవి మధ్య వాడీవేడి చర్చ జరిగింది. ఆర్‌జేడీ ఎమ్మెల్సీలు పచ్చ రంగు బ్యాడ్జీలు ధరించి సభలోకి రావడం, ఆ పార్టీ నేత తేజస్వీ యాదవ్‌కు అనుకూలంగా నినాదాలు చేయడంతో సీఎం నితీశ్ కోపంతో ఊగిపోయారు. ఎమ్మెల్సీల బ్యాడ్జీలను మీడియాకు చూపుతూ ఆయన..ఇలాంటివి ఆర్‌జేడీలోనే సాధ్యమంటూ ఎద్దేవా చేశారు. ఆ పార్టీ నేత, మాజీ సీఎం రబ్రీదేవి జోక్యం చేసుకునేందుకు యత్నించగా నితీశ్ బిహారీ యాసలో..'నువ్వు కూర్చో..నీకేమీ తెలియదు. ఆర్‌జేడీ నీదికాదు, నీ భర్తది. ఈ విషయంలో నీ జోక్యం వద్దు'అంటూ అడ్డుకున్నారు. అంతటితో ఆగక.. 'ఈమెకు ఏమీ తెలియదు. కష్టాల్లో చిక్కుకున్నప్పుడు భర్త(లాలూ)ఈమెను సీఎంను చేశాడు'అని పేర్కొన్నారు. 1997లో సీఎంగా ఉన్న లాలు ప్రసాద్ దాణా కుంభకోణంలో ఇరుక్కుని, సీఎం కుర్చీపై భార్య రబ్రీని కూర్చోబెట్టడం తెల్సిందే. ఇటీవలి కాలంలో రబ్రీదేవి, నితీశ్ మధ్య తరచూ మాటల యుద్ధం జరుగుతోంది. గంజాయి మత్తులో సభకు వచ్చిన సీఎం నితీశ్, నాతోపాటు మహిళలను సైతం అవమానిస్తూ మాట్లాడారు'అంటూ రబ్రీదేవి ఆరోపించారు. ఓ కార్యక్రమానికి వెళ్లిన నితీశ్ జాతీయ గీతాలాపనను పట్టించుకోకుండా పక్కనున్న వారి తో సరదాగా మాట్లాడుతూ కన్పించడంతో 'మానసికంగా అనర్హుడు' అంటూ రబ్రీదేవి వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది.


రబ్రీదేవి

# ఆక్రమణలను ఖాళీ చేయాల్సిందే

## ఐరాస భద్రతా మండలిలో పాక్‌కు తేల్చిచెప్పిన భారత్

**ఐక్యరాజ్యసమితి:** ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వేదికగా పాకిస్తాన్‌పై భారత్ మరోసారి నిప్పులు చెరిగింది. జమ్మూకశ్మీర్ భూభాగాన్ని పాకిస్తాన్ చట్టవిరుద్ధంగా ఆక్రమిస్తూనే ఉందని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇప్పటిదాకా ఆక్రమించుకున్న భూభాగాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఖాళీ చేయాల్సిందేనని తేల్చిచెప్పింది. జమ్మూకశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని పునరుద్ఘాటించింది. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో శాంతి పరిరక్షణ ఆపరేషన్లపై సోమవారం భద్రతా మండలిలో జరిగిన చర్చలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ మాట్లాడారు. జమ్మూకశ్మీర్‌లోని కొంత భూభాగం ఇప్పటికీ పాకిస్తాన్ ఆక్రమణలో ఉందని చెప్పారు. దాన్ని ఖాళీ చేయాల్సిందేనని తేల్చిచెప్పారు. భద్రతా మండలిలో జమ్మూకశ్మీర్ అంశాన్ని తొలుత పాక్ ప్రతినిధి సయ్యద్ తారిఖ్ ఫతేమీ లేవనెత్తారు. దీనిపై పర్వతనేని హరీశ్ గట్టిగా బదులిచ్చారు. అనవసరమైన వ్యాఖ్యలు చేయొద్దని పాక్ ప్రతినిధికి హితవు పలికారు. జమ్మూకశ్మీర్ గురించి పదేపదే మాట్లాడినంత మాత్రాన మీరు చేసిన చట్టవిరుద్ధమైన పనులన్నీ చట్టబద్ధం కాబోవని అన్నారు. ఇలాంటి మతిలేని ప్రయత్నాలతో.. మీరు ప్రోత్సహిస్తున్న సీమాంతర ఉగ్రవాదాన్ని ఎప్పటికీ సమర్థించుకోలేరని స్పష్టంచేశారు. సంకుచిత, విభజన ఎజెండాను నెరవేర్చుకోవడానికి ఈ వేదిక దృష్టిని మళ్లించే ప్రయత్నం చేయొద్దని పాకిస్తాన్ ప్రతినిధికి సూచించారు.


హరీశ్

# బంగ్లాదేశ్‌లో త్వరలో సైనిక పాలన!

- మహమ్మద్ యూనస్‌పై తిరుగుబాటు జరిగే అవకాశం
- స్థానిక మీడియాలో వరుసగా కథనాలు
- అలాంటిదేమీ లేదని ఖండించిన బంగ్లా సైన్యం


మహమ్మద్ యూనస్

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో త్వరలో సైనిక పాలన అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు స్థానిక మీడియా వెల్లడించడం సంచలనాత్మకంగా మారింది. తాత్కాలిక ప్రభుత్వాధినేత, నోబెల్ బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్‌పై తిరుగుబాటుకు సైన్యం సిద్ధమవుతున్నట్లు మీడియా పేర్కొంది. గతేడాది అక్టోబర్‌లో ప్రధానమంత్రి పదవి నుంచి షేక్ హసీనా వైదొలిగిన తర్వాత మహమ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా బాధ్యతలు చేపట్టారు. ఆయన పనితీరు పట్ల ప్రజలతోపాటు సైన్యం అసంతృప్తిగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో యూనస్‌పై తిరుగుబాటు జరిగే అవకాశం కచ్చితంగా ఉన్నట్లు మీడియా స్పష్టంచేసింది. యూనస్‌ను పదవి నుంచి తొలగించి సైన్యమే అధికార పగ్గాలు చేపట్టబోతున్నట్లు బంగ్లాదేశ్ ప్రసార మాధ్యమాల్లో వరుసగా కథనాలు వస్తున్నాయి. బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ జనరల్ వాకర్ ఉజ్ జమాన్ నేతృత్వంలో సైన్యం సోమవారం అత్యవసరంగా సమావేశమైంది. ఐదుగురు లెఫ్టినెంట్ జనరల్స్, ఎనిమిది మంది మేజర్ జనరల్స్, ఇండిపెండెంట్ బ్రిగేడ్ కమాండింగ్ అధికారులు, పలువురు ఆర్మీ అధికారులు ఈ భేటీకి హాజరయ్యారు. భవిష్యత్తు కార్యాచరణపై వారు చర్చించినట్లు తెలుస్తోంది. దేశంలో తొలుత అత్యవసర పరిస్థితిని(ఎమర్జెన్సీ) ప్రకటించి, ఆ తర్వాత మహమ్మద్ యూనస్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసే అవకాశం ఉన్నట్లు బంగ్లాదేశ్ మీడియా అంచనా వేస్తోంది. సైన్యం ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు చెబుతోంది.

**అత్యవసర భేటీ జరగలేదన్న సైన్యం**

సైనిక ఉన్నతాధికారుల అత్యవసర సమావేశమేదీ జరగలేదని బంగ్లాదేశ్ సైన్యం తేల్చిచెప్పింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తప్పుడు ప్రచారం చేయొద్దని సూచించింది. మహమ్మద్ యూనస్‌పై తిరుగుబాటు అంటూ వస్తున్న వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టంచేసింది. ప్రభుత్వాన్ని కూలదోయాలన్న ఉద్దేశం లేదని పరోక్షంగా తేల్చిచెప్పింది. ప్రజలు తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రసార మాధ్యమాలకు సూచించింది.

# సుంకాల కోతకు సిద్ధం!

**55 శాతం అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌ల తగ్గింపు**

- విలువ రూ.1.96 లక్షల కోట్ల పైమాటే..
- భారత ప్రభుత్వం యోచన
- ట్రంప్ ప్రతీకార సుంకాల భారం తగ్గించడానికే..

**న్యూఢిల్లీ:** ఇండియాలో సుంకాలు అధికంగా ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. తమ ఉత్పత్తులపై విచ్చలవిడిగా సుంకాలు వసూలు చేస్తున్న దేశాల ఉత్పత్తులపై అదేస్థాయిలో సుంకాలు విధిస్తామని ఆయన ఇప్పటికే హెచ్చరించారు. ఇందులో చైనా, ఇండియా, మెక్సికో వంటి దేశాలు ఉన్నాయి. అమెరికాలో వచ్చే నెల 2వ తేదీ నుంచి ఈ ప్రతీకార టారిఫ్‌లు అమల్లోకి రాబోతున్నాయి. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అమెరికా నుంచి దిగుమతి అయ్యేవాటిలో 55 శాతం ఉత్పత్తులపై సుంకాలు తగ్గించాలని నిర్ణయానికొచ్చినట్లు ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ ఓ ప్రముఖ వార్తా సంస్థ తెలియజేసింది. తగ్గించే సుంకాల విలువ 23 బిలియన్ డాలర్లు(రూ.1.96 లక్షల కోట్లు)గా ఉండే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. టారిఫ్‌ల తగ్గింపు నిర్ణయం నుంచి మాంసం, మొక్కజొన్న, గోధుమలు, పాడి ఉత్పత్తులకు మినహాయింపు ఇవ్వనున్నట్లు పేర్కొంది. వీటిపై టారిఫ్‌లు యథాతథంగా అమలవుతాయని వివరించింది. ఆల్మండ్స్, పిస్తా, ఓట్‌మీల్, క్వినోవా వంటి వాటిపై సుంకాలు తగ్గుతాయని తెలిపింది. అమెరికా-ఇండియా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంలోభాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వార్తా సంస్థ వెల్లడించింది. అమెరికాలో ప్రతీకార సుంకాల వల్ల భారతదేశ ఉత్పత్తుల ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడనుంది. ఈ ప్రభావాన్ని తగ్గించడానికే అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌ల భారాన్ని భారత ప్రభుత్వం తగ్గించబోతున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.



**భారత్‌తో అమెరికాకు వాణిజ్య లోటు**

ప్రస్తుతం ఇండియాలో అమెరికా ఉత్పత్తులపై 5 శాతం నుంచి 30 శాతం సుంకాలు అమల్లో ఉన్నాయి. కొన్ని రకాల ఉత్పత్తులపై సుంకాలను క్రమంగా తగ్గిస్తూ.. పూర్తిగా ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ ప్రతిపాదన ఇప్పటికైతే చర్చల దశలోనే ఉంది. అమెరికాలో పెంచిన టారిఫ్‌లు అమల్లోకి వచ్చేలోగానే ఆ దేశంతో స్పష్టమైన ఒప్పందం చేసుకోవాలని భారత ప్రభుత్వం భావిస్తోంది. టారిఫ్‌ల భారం ఇరుదేశాలపై పడకుండా ఈ ఒప్పందం ఉండొచ్చని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అమెరికా ఉత్పత్తులపై ఇండియాలో సుంకాలు తగ్గిస్తే... ఇండియా ఉత్పత్తులపై అమెరికాలో సుంకాలు తగ్గించే అవకాశం ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఒకవేళ ప్రతీకార సుంకాల విషయంలో ట్రంప్ వెనక్కి తగ్గకపోతే భారత ప్రభుత్వం పునరాలోచన చేసే అవకాశం ఉంది. భారత ప్రధాని మోదీ ఫిబ్రవరిలో అమెరికాలో పర్యటించారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అయ్యారు. టారిఫ్‌ల వివాదాన్ని పరిష్కరించుకోవడానికి సాధ్యమైనంత త్వరగా వాణిజ్య చర్చలు ప్రారంభించాలని ఇరువురు నేతలు నిర్ణయానికొచ్చారు. ప్రస్తుతం ఇండియాతో అమెరికా వాణిజ్య లోటు 45.6 బిలియన్ డాలర్లుగా ఉంది. ఈ లోటును పూర్తిగా పూడ్చుకోవాలని ట్రంప్ ప్రభుత్వం యోచిస్తోంది.

# 'జమిలి' జేపీసీ గడువు పొడిగింపు



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఏకకాలంలో పార్లమెంట్ దిగువ సభ, రాష్ట్రాల్లో శాసనసభకు ఎన్నికలు నిర్వహించడానికి ఉద్దేశించిన లోక్‌సభలో ప్రవేశపెట్టిన రెండు బిల్లులపై అధ్యయనానికి ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) గడువును లోక్‌సభ మంగళవారం పొడిగించింది. ఈ కమిటీ కాల పరిమితిని పెంచేందుకు లోక్‌సభ తన అంగీకారం తెలిపింది. బీజేపీ పార్లమెంట్ సభ్యుడు, జేపీసీ ఛైర్మన్ అయిన పీపీ చౌదరి ప్రతిపాదించిన సంబంధిత తీర్మానానికి లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోద ముద్ర వేసింది. వర్షాకాల సమావేశాల చివరివారంలో తొలి రోజు వరకు కాలపరిమితిని పొడిగించింది. ఏకకాల ఎన్నికల నిర్వహణకు తీసుకొచ్చిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం గతంలో లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అయితే ఈ బిల్లు రాజ్యాంగ మౌలిక స్వరూప, స్వభావాలను మార్చేలా ఉందని విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో కేంద్రప్రభుత్వం ఆ బిల్లును పరిశీలన నిమిత్తం సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపింది. ఇందుకోసం కొత్తగా 39 మంది ఎంపీలతో కమిటీని ఏర్పాటుచేయడం తెల్సిందే. లోక్‌సభ నుంచి 27, రాజ్యసభ నుంచి 12 మంది సభ్యులతో కమిటీ కొలువుతీరింది. అయితే రాజ్యసభ నుంచి కొత్త వ్యక్తి జేపీసీలో సభ్యునిగా ఉంటారని లోక్‌సభ ప్రధాన కార్యదర్శి మంగళవారం ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయి రెడ్డి తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో జేపీసీలో ఒక ఖాళీ ఏర్పడింది. వాస్తవానికి ఈ కమిటీ కాలపరిమితి ఈ సెషన్ చివరి వారం తొలిరోజుతో ముగుస్తుంది. అంటే ఏప్రిల్ నాలుగోతేదీతో ముగియనుంది. అయినప్పటికీ ఈ బిల్లుకు సంబంధించిన పని ఇంకా పూర్తికాలేదని, అందుకే కాలపరిమితి పెంచాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని అధికార వర్గాలు తాజాగా వెల్లడించాయి. ఈ అంశంపై ఇప్పటికే పలువురు న్యాయనిపుణులతో సంప్రదింపుల ప్రక్రియ కొనసాగించింది. రాజకీయ పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలు, సంబంధిత వర్గాలతో ఇంకా సంప్రదింపులు జరపాల్సి ఉంది. ఇప్పటికే సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ యూయూ లలిత్, జస్టిస్ రంజన్ గొగోయ్, సీనియర్ లాయర్ హరీశ్ సాల్వే, ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏపీ షా జేపీసీ కమిటీ ఎదుట హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# చర్యల్లేకుండా బదిలీ సిఫార్సా!

**జస్టిస్ యశ్వంత్‌కు వ్యతిరేకంగా లాయర్ల నిరవధిక ధర్నా**

**ప్రయాగ్‌రాజ్:** ఇంట్లో అగ్నిప్రమాదంవేళ కరెన్సీ కట్టలు బయటపడిన ఉదంతంలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై చర్యలు చేపట్టకుండా ఊరకే బదిలీచేయాలని సిఫార్సు చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తూ అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు ఆందోళనకు దిగారు. హైకోర్టు మూడో నంబర్ గేటు వద్ద భారీ స్థాయిలో ధర్నా చేపట్టారు. గతంలో అలహాబాద్ హైకోర్టులో పనిచేసిన జడ్జి వర్మ తర్వాత పదోన్నతితో ఢిల్లీ హైకోర్టుకు వెళ్లారు. 'కాలిన కరెన్సీ' ఉదంతంలో మళ్లీ అలహాబాద్ కోర్టుకే బదిలీచేయాలని సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సుచేయడాన్ని అలహాబాద్ హైకోర్టు లాయర్లు వ్యతిరేకిస్తూ మంగళవారం నిరవధిక ధర్నాకు దిగారు. సిఫార్సు నిర్ణయాన్ని ఉపసంహరించుకునేదాకా తమ ఆందోళన ఆపబోమని అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివారీ స్పష్టంచేశారు.

**జడ్జి ఇంటికి త్రిసభ్య కమిటీ**

నిజానిజాలను నిగ్గుతేల్చేందుకు ఏర్పాటైన త్రిసభ్య కమిటీ తన దర్యాప్తును మంగళవారం ప్రారంభించింది. వివాదంలో కేంద్రబిందువుగా మారిన జడ్జి యశ్వంత్ ఇంటిని అంతర్గత కమిటీ సభ్యులు సందర్శించారు. పంజాబ్, హరియాణా హైకోర్టు చీఫ్ జస్టిస్ షీల్ నాగు, హిమాచల్ ప్రదేశ్ చీఫ్ జస్టిస్ జీఎస్ సంధావాలియా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనూ శివరామన్‌లు 30, తుగ్లక్ క్రిసెంట్‌లోని జడ్జి ఇంటి స్టోర్‌రూమ్‌కి వెళ్లి ఘటనాస్థలిని పరిశీలించారు.

# ద్రవ్యబిల్లుతో భారీ పన్ను ఉపశమనం

**ఆర్థిక బిల్లుపై చర్చలో విత్తమంత్రి సీతారామన్ సుదీర్ఘ ప్రసంగం**


ద్రవ్య బిల్లుపై మంగళవారం లోక్‌సభలో సమాధానమిస్తున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ:** ఆర్థిక బిల్లు, 2025తో పన్ను చెల్లింపుదారులకు భారీ ఉపశమనం లభించనుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. ద్రవ్యబిల్లుపై మంగళవారం లోక్‌సభలో చర్చ సందర్భంగా ప్రభుత్వం తరఫున బదులిస్తూ నిర్మల సుదీర్ఘంగా ప్రసంగించారు. '' నూతన ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక బిల్లుతో పన్ను చెల్లింపుదారులకు భారీగా ఉపశమనం లభించనుంది. మరోవైపు వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లలో 13.14 శాతం వృద్ధి అంచనాలు రావడం సంతోషకరం. ఇది వ్యక్తిగత ఆదాయాల పెంపును ప్రతిబింబిస్తుంది. కస్టమ్స్ సుంకాల హేతుబద్ధీకరణతో వస్తూత్పత్తి కర్మాగారాలకు ఎంతో తోడ్పాటునందిస్తున్నాం. దేశీయ సరకులకు విలువ జోడింపు సాధ్యమవుతుంది. ఎగుమతులూ ఊపందుకుంటాయి. వాణిజ్యం పెరుగుతుంది. దీంతో సాధారణ ప్రజలకూ ప్రయోజనం చేకూరుతుంది'' అని అన్నారు. 2025-26 ఆర్థికసంవత్సర బడ్జెట్‌లో వార్షిక ఆదాయపన్ను రిబేట్ పరిమితిని (కొత్త పన్ను విధానం) రూ. 7 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచడం తెల్సిందే. ''శాలరీ తరగతులకు సంబంధించి స్టాండర్డ్ డిడక్షన్‌ను సైతం లెక్కలోకి తీసుకుంటే వాళ్లకు ఏటా రూ.12.75 లక్షల వరకు పన్ను రిబేట్ రూపంలో భారీ ఉపశమనం లభించనుంది. ఆదాయపన్ను రిబేట్‌ను పెంచడం ద్వారా ప్రభుత్వ ఆదాయం కొత్త ఆర్థిక సంవత్సరంలో రూ.1 లక్ష కోట్లమేర తగ్గనుంది. ఏటా రూ.12 లక్షలకు పైబడి ఆదాయం ఉన్న వారూ కొంతమేర ఉపశమనం పొందొచ్చు. ఇక ఇన్‌కమ్‌ట్యాక్స్‌కు సంబంధించి ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూరుస్తున్న మధ్యతరగతి వాళ్లను సముచితంగా గౌరవించేందుకే ప్రభుత్వం ఐటీ రిబేట్‌ను ఏకంగా ఒకేసారి రూ.12 లక్షలకు పెంచింది'' అని నిర్మల అన్నారు.

**రూ.13.6 లక్షల కోట్ల ఆదాయం**

''2025-26 ఆర్థికంలో వ్యక్తిగత ఆదాయపన్ను వసూళ్ల రూ.13.6 లక్షల కోట్లకు చేరుకునే వీలుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరించిన అంచనాలు రూ.12.2 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇక ఆన్‌లైన్ ప్రకటనలకు సంబంధించి ఇప్పుడు వసూలు చేస్తున్న 6 శాతం ఈక్వలైజేషన్ లెవీ లేదా డిజిటల్ పన్నును రద్దుచేయాలనుకుంటున్నాం'' అని నిర్మల చెప్పారు. దీని కారణంగా గూగుల్, మెటా, 'ఎక్స్' వంటి సంస్థలు లబ్ధిపొందే వీలుంది. '' పారిశ్రామిక ఉత్పత్తులపై విధించే 7 శాతం కస్టమ్స్ సుంకాలను తొలగిస్తాం. 21 రకాల టారిఫ్ రేట్లు ఉండగా వాటిని ఎనిమిదికి తెచ్చాం. అందులో 'సున్నా' టారిఫ్ విభాగం కూడా ఉంది. ముడిసరుకులపై దిగుమతి సుంకాలు తగ్గించిన కారణంగా ఉత్పత్తి వ్యయాలు తగ్గి ఇకపై భారత్ నుంచి ఎగుమతులు ఊపందుకోనున్నాయి'' అని మంత్రి అన్నారు.

**వర్షాకాల సమావేశంలో కొత్త ఆదాయపన్ను బిల్లు**

''వర్షాకాల సమావేశంలో కొత్త ఆదాయ పన్ను బిల్లుపై చర్చిస్తాం. ఈ బిల్లును ఫిబ్రవరి 13న లోక్‌సభలో ప్రవేశపెట్టాం. ప్రస్తుతం ఈ బిల్లును సెలక్ట్ కమిటీ పరిశీలిస్తోంది. సెలక్ట్ కమిటీ అధ్యయనం తర్వాత తుది నివేదికను పార్లమెంట్ తదుపరి సెషన్ తొలి రోజునే సమర్పించాల్సి ఉంది. అందుకే వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లుపై చర్చిస్తాం'' అని నిర్మల అన్నారు. సాధారణంగా జూలై నుంచి ఆగస్ట్ దాకా వర్షాకాల సమావేశాలుంటాయి.

**35 సవరణలతో ఆర్థిక బిల్లుకు లోక్‌సభలో ఆమోదం**

పన్ను అధికారులు సెర్చ్ కేసుల్లో బ్లాక్ అసెస్‌మెంట్ కోసం అసెసీ మొత్తం ఆదాయం కాకుండా కేవలం బయటకు వెల్లడించని ఆదాయాన్నే గుర్తించేందుకు వీలుగా ఆర్థిక బిల్లు, 2025లో సవరణలను ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ సవరణలకు మంగళవారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. దీంతో 2024 సెప్టెంబర్ 1, ఆ తర్వాత కాలానికి ఇది వర్తించనుంది. సెర్చ్ కేసుల్లో మొత్తం ఆదాయం స్థానంలో వెల్లడించని ఆదాయం అన్న క్లాజును ప్రభుత్వం చేర్చింది. దీంతో సహా మొత్తం 35 సవరణలతో కూడిన ఆర్థిక బిల్లుకు ఆమోదం లభించింది. మొత్తంగా రూ.50.65 లక్షల కోట్ల అంచనా వ్యయంతో నూతన ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను మోదీ సర్కార్ రూపొందించడం తెల్సిందే.

# యూపీలో మరో దారుణం

- ప్రేమికుడు, కిరాయి హంతకుని సాయంతో భర్తను చంపిన భార్య
- పెళ్లయిన 2 వారాలకే దారుణం

**మెయిన్‌పురి:** ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి జిల్లాలో మరో హత్య కేసు వెలుగులోకి వచ్చింది. పెళ్లైన రెండు వారాలకే ప్రేమికుడితో కలిసి కుట్ర పన్ని భర్తను చంపించిందో భార్య. ఒకే గ్రామానికి చెందిన ప్రగతి యాదవ్, అనురాగ్ యాదవ్ పదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే.. ప్రగతి కుటుంబ సభ్యులు ఆమెకు బలవంతంగా మార్చి ఐదో తేదీన దిలీప్ యాదవ్‌తో వివాహం జరిపించారు. అయిష్టంగానే పెళ్లి చేసుకున్న ప్రగతి ఎలాగైనా దిలీప్‌ను అడ్డు తొలగించుకోవాలనుకుంది. అనురాగ్‌తో కలిసి దిలీప్‌ను హతమార్చాలని పథకం వేసింది. ఈ హత్యకు ఏర్పాట్లు చేయడానికి అనురాగ్‌కు ప్రగతి రూ .1 లక్ష ఇచ్చింది. రాంజీ అనే కిరాయి హంతకుడిని ఈ పని కోసం రూ.2 లక్షలకు నియమించుకున్నారు. దిలీప్ మార్చి 19వ తేదీన పని మీద కన్నౌజ్ జిల్లాకు వెళ్లి తిరిగొస్తూ పట్నా కెనాల్ సమీపంలో ఓ హోటల్ వద్ద ఆగాడు. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు దిలీప్ వద్దకొచ్చి తమ బైక్ పాడైందని, సాయపడాలంటూ దిలీప్‌ను తమ ఇంకో బైక్‌పై ఎక్కించుకుని తీసుకెళ్లారు. మార్గమధ్యంలో దిలీప్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి పొలంలో పడేసి పరారయ్యారు. దిలీప్‌ను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినా అప్పటికే పరిస్థితి విషమించడంతో మూడు రోజుల తర్వాత అతను మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి ఘటనాస్థలి సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తుల దృశ్యాలు రికార్డయ్యాయి. వీటి సాయంతో కిరాయి హంతకుడు రాంజీని గుర్తించి పోలీసులు అరెస్టు చేశారు. అతనిచ్చిన సమాచారంతో అనురాగ్, ప్రగతిని అదుపులోకి తీసుకున్నారు.

# సిగ్నల్ చాట్‌లో యుద్ధ రహస్యాలు

**చాట్ గ్రూపులో ఓ సీనియర్ జర్నలిస్టును చేర్చిన ట్రంప్ బృందం**

**వాషింగ్టన్:** అత్యంత రహస్యంగా ఉండాల్సిన అమెరికా యుద్ధ ప్రణాళికలు చిన్న పొరపాటు కారణంగా బహిర్గతమయ్యాయి. దేశ భద్రతపై అనుక్షణం అప్రమత్తంగా ఉండాల్సిన అమెరికా జాతీయ భద్రతా సలహాదారు మైఖేల్ వాల్జే ఈ రహస్యాల లీకేజీకి ప్రధాన కారకుడు కావడం గమనార్హం. అదృష్టవశాత్తు అవి ఒక బాధ్యతాయుతమైన సీనియర్ పాత్రికేయుడికి మాత్రమే తెలియడంతో ఆయన ఎవరికీ లీక్ చేయని కారణంగా అమెరికా జాతీయ భద్రతకు, సైన్యానికి ఎలాంటి ముప్పు వాటిల్లలేదు. తీవ్ర నిర్లక్ష్య ఘటనకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఈ ఘటన ఈనెల రెండోవారంలో జరిగింది. వివరాలను 'ది అట్లాంటిక్' మేగజైన్ ప్రధాన సంపాదకుడు జెఫ్రీ గోల్డ్‌బర్గ్ వెల్లడించారు.

**అసలేమైంది?**

సుయాజ్ కాలువ గుండా అత్యధిక స్థాయిలో రాకపోకలు సాగించే యూరప్ దేశాల వాణిజ్య నౌకలే లక్ష్యంగా యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు చిన్న రాకెట్లతో దాడులు ఉధృతం చేస్తుండటంతో వారిని నిలువరించేందుకు అమెరికా సిద్ధమైంది. హౌతీలకు ఇరాన్ మద్దతు సైతం అమెరికా ప్రతీకార దాడులకు మరో కారణం. హౌతీ స్థావరాలు, కీలక కమాండర్లే లక్ష్యంగా దాడులుచేయాలని అమెరికా నిర్ణయించుకుంది. ఇందుకోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, జాతీయ భద్రతా సలహాదారు మైఖేల్ వాల్జ్, విదేశాంగ మంత్రి రూబియో, నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబ్బార్డ్, ఆర్థిక మంత్రి స్కాట్, రక్షణమంత్రి పీట్ హెగ్సెత్, సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్, హోంల్యాండ్ సెక్యూరిటీ సలహాదారు స్టీఫెన్ మిల్లర్ తదితరులు రహస్యంగా 'సిగ్నల్' మెసేజింగ్ యాప్‌లో ఒక కొత్త గ్రూప్‌ను క్రియేట్ చేశారు. అయితే అమెరికా జాతీయ భద్రతా సలహాదారు మైఖేల్ వాల్జే పొరపాటున జెఫ్రీ గోల్డ్‌బెర్గ్‌ను ఈ గ్రూప్‌లో చేర్చారు. మేగజైన్ ఎడిటర్-ఇన్-చీఫ్ అయినందున తన నుంచి ఏదైనా సమాచారం, పైరవీ కోసం మైఖేల్ పేరుతో ఇంకెవరో అనామకుడు తనను ఈ గ్రూప్‌లో సభ్యుడిని చేశారేమో అని భావించి ఊరుకున్నాడు. అయితే మార్చి 13వ తేదీన ఇందులో సభ్యులు చాటింగ్ మొదలెట్టారు. మార్చి 15న యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులపై అమెరికా ఏఏ యుద్ధవిమానాల్లో ఎక్కడెక్కడ ఎన్ని బాంబులు వేయనుందో దాంట్లో పేర్కొన్నారు. ఇది చూసిన సంపాదకుడు జెఫ్రీలో ఆసక్తి ఎక్కువైంది. దాడులకు దాదాపు రెండు, మూడు గంటల ముందే ఈ సమాచారం 'సిగ్నల్' యాప్ చాటింగ్ ద్వారా ఈయనకు లీక్ అయింది. చాటింగ్‌లో పేర్కొన్న సమయానికే సరిగ్గా మార్చి 15వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు దాడులు జరగడంతో ఇది నిజమైన చాటింగ్ అని తర్వాత నిర్ధారించుకున్నారు. వెంటనే వాల్జ్, ఇతర అమెరికా ఉన్నతాధికారులకు తాను ఈ గ్రూప్‌చాట్‌లో ఉన్నానన్న విషయాన్ని చెప్తూ సిగ్నల్‌యాప్, ఈ-మెయిల్స్‌ద్వారా సందేశం పంపించారు. అయినా వాటిని ఎవరూ పట్టించుకోకపోవడం విడ్డూరం. విషయం తర్వాత అందరికీ తెలిశాక ట్రంప్ యంత్రాంగం అవాక్కైంది. '' బయటి వ్యక్తి నంబర్ ఇంతటి కీలకమైన గ్రూప్‌లో ఎలా యాడ్ అయిందో అర్థంకావట్లేదు'' అని జాతీయ భద్రతా మండలి అధికార ప్రతినిధి బ్రియాన్ అన్నారు. ఈ విషయం తనకేం తెలీదని ట్రంప్ అన్నారు.

# హవాలా డబ్బుతోనే బంగారం కొనుగోళ్లు

**అంగీకరించిన రన్యా రావు**

**బెంగళూరు:** దాదాపు రూ.13 కోట్ల విలువైన రూ.14.8 కిలోల బంగారంతో బెంగళూరు విమానా శ్రయంలో పట్టుబడిన కన్నడ నటి రన్యారావుపై ఉచ్చు బిగుసుకుంటోంది. హవాలా మార్గంలో తర లించిన డబ్బుతోనే బంగారం కొనుగోళ్లు జరిపి నట్లు డిపార్టుమెంట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ విచారణలో ఆమె అంగీకరించారు. మంగళవారం ప్రత్యేక కోర్టులో కేసు విచారణ సందర్భంగా అధికారులు ఈ విషయం వెల్లడించారు. నిధులను దొంగచాటుగా తరలించడంలో ఆమెకు నేరుగా ప్రమేయం ముందన్నారు. చట్టవిరుద్ధలావాదేవీ లపై మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు ఆమెను జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించాలని కోరారు. వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వు చే సింది. అదే సమయంలో, రన్యా బెయిల్ పిటిషన్‌పై విచారణను 27వ తేదీకి వాయిదా వేసింది.

# రూ. లక్ష కోట్లతో ఢిల్లీ బడ్జెట్

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం తమ తొలి బడ్జెట్‌ను మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. మొత్తం బడ్జెట్ విలువ రూ.లక్ష కోట్లు కావడం విశేషం . యమునా నది ప్రక్షాళన, మహిళా సాధికారత, మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీటి సరఫరా, రవాణా వంటి కీలక అంశాలకు 2025- 26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. దేశ రాజధానిని స్వయం సమృద్ధంగా మార్చడానికి ఇది ఒక రోడ్ మ్యాప్‌గా తోడ్పడుతుందని ప్రభుత్వం వెల్లడించింది. సీఎం రేఖా గుప్తా స్వయంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆర్థిక శాఖ ప్రస్తుతం ఆమె వద్దే ఉంది. ఢిల్లీలో అవినీతి, అసమర్థ పాలన ముగిసిపోయిందని సీఎం అన్నారు. గత ఆమ్ ఆద్మీ పార్టీ పాలకులు ప్రజాధనం విచ్చలవిడిగా దోచుకున్నారని ఆరోపించారు.

**బడ్జెట్‌లో కేటాయింపులు.. నిర్ణయాలు**

- మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.28,000 కోట్లు
- నగరంలో కాలుష్య నియంత్రణకు రూ.300 కోట్లు.
- యమునా నది ప్రక్షాళనకు రూ.500 కోట్లు, మురుగు నీటి శుద్ధి కేంద్రాల ఆధునీకరణకు మరో రూ.500 కోట్లు, మురుగు కాల్వల పునరుద్ధరణకు రూ.250 కోట్లు.
- సురక్షిత తాగు నీటి పథకాలకు సంబంధించిన ప్రాజెక్టులకు రూ.9,000 కోట్లు.
- ఆరోగ్య రంగానికి రూ.6,874 కోట్లు. గర్భిణులకు రూ.21,000 చొప్పున ఆర్థిక సాయం అందించడానికి, పౌష్టికాహార కిట్ల పంపిణీకి రూ.210 కోట్లు.
- రవాణా రంగానికి ఏకంగా రూ.12,952 కోట్లు
- మహిళకు ఉచిత బస్సు ప్రయాణ పథకంలో అవినీతిని అరికట్టడానికి పింక్ టికెట్ల స్థానంలో ఇకపై ప్రత్యేక కార్డులు.
- మహిళా సంక్షేమానికి రూ.5,100 కోట్లు. అర్హులైన మహిళలకు ఇకపై నెలకు రూ.2,500 చొప్పున ఆర్థిక సాయం.
- మహిళల భద్రతకు నగరమంతటా 50 వేల సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు.

# సాక్షి హైదరాబాద్

బుధవారం । 26 । మార్చి । 2025






**వాటర్ మాఫియా!**

మహా నగరంలో ప్రైవేటు నీటి ట్యాంకర్ల మాఫియా రాజ్యమేలుతోంది. జలమండలి ఉదాసీనత.. ప్రైవేటు నీళ్ల వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది.

-8లో



**స్నాక్స్ ఫర్ రిలాక్స్..**

చిరుతిండి మనలో ఉత్సాహాన్ని పెంచుతుంది. భావోద్వేగాలను మెరుగుపర్చడంలో శక్తిమంతమైన పాత్ర పోషిస్తుందని స్పష్టం చేస్తున్నారు నగర వాసులు.


- సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం

35.0/23.0

**వాతావరణం**

నగరంలో బుధవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 35, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.








## నీళ్లున్నా.. మోడులాయే!

ఒకవైపు మండు వేసవి.. మరోవైపు నిండు కుండలా చెరువు.. అందులోని కనిపిస్తున్న ఈ చెట్లు మాత్రం మోడుల్లా మారిపోయాయి. నగర శివారులోని తుర్కయాంజల్ చెరువులో ఈ దృశ్యం కనిపించింది. పచ్చదనంతో కళకళలాడాల్సిన ఈ చెట్లు ఇలా నిలువునా ఎండిపోవడం వెనుక కారణమేంటో అంతు చిక్కడంలేదు.

– సాక్షి, సిటీబ్యూరో

## నీటి బకెట్‌లో పడి 13 రోజుల పసికందు మృతి

అనుమానాస్పద రీతిలో ఘటన



మైలార్‌దేవ్‌పల్లి: పదమూడు రోజుల పసికందు నీటి బకెట్‌లో పడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన విజ్జి, ముదలి మణి దంపతులు ఐదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం బండ్లగూడ ప్రాంతానికి వచ్చారు. అలీనగర్ కాలనీలోని జయ అండ్ కో బిస్కెట్ కంపెనీలో పని చేస్తూ వర్కర్స్ క్వార్టర్స్‌లో ఉంటున్నారు. ముదలి మణి 13 రోజుల క్రితం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మంగళవారం ఉదయం భర్త పనికి వెళ్లాడు. ముదలి మణి బిడ్డను మంచంపై పడుకోబెట్టి బాత్రూంలోకి వెళ్లింది. కొద్ది సేపటి తర్వాత వచ్చి చూసేసరికి పాప కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురై చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికింది. అనంతరం నీటి బకెట్‌లో పాప పడి ఉన్నట్లు గమనించింది. వెంటనే స్థానికుల సహాయంతో పసికందును ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. 13 రోజుల పసికందు బకెట్‌లో పడే అవకాశం లేదంటూ ఈ ఘటనపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## మహిళల పట్ల వెకిలి చేష్టలు

- ప్రశ్నించిన కానిస్టేబుల్‌పై బీరు సీసాతో దాడి
- పోకిరీని చాకచక్యంగా పట్టుకున్న బాధితుడు



నిందితుడు పారిపోకుండా పట్టుకున్న బాధిత కానిస్టేబుల్ శ్రీకాంత్ (టీ షర్ట్)

బంజారాహిల్స్: మద్యం మత్తులో మితిమీరిన వేగంతో బైక్ రేస్‌కు పాల్పడటంతో పాటు దారిలో వెళ్లే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన సైకోను ఇదేంటని ప్రశ్నించిన కానిస్టేబుల్‌పై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఒడిశాకు చెందిన ఖాజావసీం అహ్మద్ చిష్టీ (33) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి ఓ హోటల్‌లో చెఫ్‌గా పని చేస్తూ హకీంపేట కుంటలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. మంగళవారం ఉదయం హకీంపేట వైపు నుంచి బైక్ రేసింగ్‌కు పాల్పడుతూ.. కార్లలో వెళ్లే మహిళల పట్ల వెకిలి చేష్టలు చేస్తూ అసభ్యకరంగా ప్రవర్తించసాగాడు. అదే సమయంలో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రైం కానిస్టేబుల్‌గా పని చేస్తున్న శ్రీకాంత్ విధి నిర్వహణలో భాగంగా అటు నుంచి వెళ్తుండగా.. అహ్మద్ చిష్టీ మితిమీరిన వేగంతో బైక్‌తో కట్‌లు కొడుతూ కనిపించాడు. ఇదేంటని కానిస్టేబుల్ శ్రీకాంత్ ప్రశ్నించగా.. తెలంగాణ భవన్ పక్కన కొత్తగా వేసిన రోడ్డు వద్ద అడ్డుపడి అక్కడే ఉన్న బీరు సీసాతో శ్రీకాంత్ తల, మెడ, చేతులపై పొడిచాడు. తీవ్ర గాయాల పాలైన బాధిత కానిస్టేబుల్ నిందితుడిని పారిపోకుండా పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. హత్యాయత్నం కింద అహ్మద్ చిష్టీపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## మద్యం మత్తులో తండ్రిని చంపిన కొడుకు

కుషాయిగూడ: మద్యం మత్తులో తండ్రి గొంతు నులిమి చంపేశాడు ఓ కొడుకు. ఈ ఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పతులావత్ శంకర్ (54) భార్య, కొడుకుతో కలిసి చర్లపల్లి డివిజన్ కుషాయిగూడ సాయినగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. శంకర్‌కు ఇద్దరు భార్యలు. చిన్న భార్య లాలీ, కొడుకు జగదీష్‌తో శంషాబాద్ మండలం అల్లికూర్ గ్రామం నుంచి గత 6 నెలల క్రితం కుషాయిగూడ ప్రాంతానికి వలస వచ్చి నివాసం ఉంటున్నారు. కొడుకు జగదీష్ కుటుంబ కలహాలతో తన భార్యకు దూరంగా తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. శంకర్ మద్యానికి బానిసై ఏ పని చేయకుండా ఆకతాయిగా తిరుగుతున్నాడు. మద్యానికి డబ్బుల కోసం నిత్యం భార్య, కొడుకుతో గొడవ పడేవాడు. డబ్బుల కోసం భార్య లాలీని వేధించడం, కొడుకు జగదీష్‌ను దూషించేవాడు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి భార్య, కొడుకుతో గొడవ పడ్డాడు. శంకర్, భార్య లాలీ, కొడుకు జగదీష్ ముగ్గురు కుషాయిగూడ పోలీసు స్టేషన్‌కు వెళ్లడంతో అప్పటికే శంకర్, జగదీష్ ఇద్దరూ మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించి సర్దిచెప్పిన పోలీసులు ఉదయం మాట్లాడదామని చెప్పి ఇంటికి పంపించారు. దీంతో శంకర్ నేరుగా ఇంటికి వెళ్లిపోయాడు. భార్య లాలీ నేరేడ్‌మెట్‌లో ఉంటున్న తన చిన్న కూతురు ఇంటికి వెళ్లింది. కొడుకు జగదీష్ మార్గంమధ్యలో మళ్లీ మద్యం తాగి అదే కోపంతో ఇంటికి వెళ్లాడు. ఇంట్లో శంకర్‌తో మళ్లీ గొడవ పడిన జగదీష్ తండ్రిని గొంతు నులిమి చంపేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇంటి యజమాని అంజిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. జగదీష్ పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

# నిఘా నిల్!

- నిర్భయ ఘటనతో అప్పట్లో అప్రమత్తం
- ఆ ఘటన తర్వాత అమలుకు నోచుకోని వైనం
- వందేభారత్ మినహా దూర ప్రాంత రైళ్లలోనూ కొరవడిన సీసీ కెమెరాలు
- భారీ వ్యయం దృష్ట్యా వెనుకంజ వేసిన రైల్వే శాఖ

### సబర్బన్ రైళ్లలో పదేళ్ల క్రితమే సీసీ కెమెరాలకు ప్రతిపాదనలు



సాక్షి, సిటీబ్యూరో: మహిళా ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఎంఎంటీఎస్ రైళ్లలోని మహిళల బోగీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, తప్పనిసరిగా భద్రతా సిబ్బందిని నియమించాలని పదేళ్ల క్రితమే ప్రతిపాదించారు. కానీ.. ఆ దిశగా ఇప్పటి వరకు ఒక్క అడుగూ ముందుకు పడలేదు. నగరంలోని వివిధ మార్గాల్లో నడిచే ఎంఎంటీఎస్, సబర్బన్, డెము, మెమూ రైళ్లలో ఏ ఒక్కదాంట్లోనూ ఇప్పటి వరకు ఒక్క సీసీ కెమెరా ఏర్పాటు చేయలేదు. ఢిల్లీలో నిర్భయ ఘటన చోటుచేసుకున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా అన్ని ప్రజారవాణా వ్యవస్థలు అప్రమత్తమయ్యాయి. ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో మహిళా ప్రయాణికులకు, పురుషులకు మధ్య అప్పట్లో ప్రత్యేకమైన గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. అదే సమయంలో దక్షిణమధ్య రైల్వేలో మహిళా ప్రయాణికుల భద్రత కోసం రైల్వేస్టేషన్‌లు, రైళ్లలో భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అలాగే తప్పనిసరిగా సీసీ కెమెరాలతో బలమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను రూపొందించారు. ప్రతి క్షణం రైళ్ల కదలికలను పర్యవేక్షించేలా ఆర్పీఎఫ్ కేంద్రాల్లో ప్రత్యేకంగా సాంకేతిక బృందాలను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కూడా ఉంది. ప్రత్యేకమైన మొబైల్ యాప్‌ను కూడా అప్పట్లో రూపొందించారు. కానీ సీసీ కెమెరాలు సహా చాలా వరకు అమలుకు నోచుకోలేదు. దీంతో మహిళా ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకంగానే మారింది.

**అడుగడుగునా నిర్లక్ష్యం..**

కోవిడ్‌కు ముందు నగరంలో ప్రతి రోజు సుమారు 121 ఎంఎంటీఎస్ సర్వీసులు నడిచేవి. 1.5 లక్షల మందికి పైగా రాకపోకలు సాగించేవారు. సికింద్రాబాద్, బేగంపేట్, హైటెక్‌సిటీ, లింగంపల్లి, నాంపల్లి, కాచిగూడ, ఫలక్‌నుమా వంటి ప్రధానమైన స్టేషన్‌లలో భద్రతా సిబ్బంది విధులు నిర్వహించేవారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ కూడా ఉండేది. కోవిడ్ సమయంలో ఎంఎంటీఎస్‌తో పాటు అన్ని రైళ్లు స్తంభించాయి. అప్పటి వరకు ఎంఎంటీఎస్ సర్వీసుల నిర్వహణలో ఎంతో బాధ్యతగా వ్యవహరించిన అధికారులు కోవిడ్ అనంతరం ఎంఎంటీఎస్ సేవలను పునరుద్ధరించినప్పటి నుంచి నిర్లక్ష్యం చూపుతూనే ఉన్నారు. కేవలం సమయపాలన, రైళ్ల నిర్వహణలోనే కాకుండా భద్రత అంశాన్ని సైతం విస్మరించారనే ఆరోపణలు ఉన్నాయి. నిర్భయ ఘటన నేపథ్యంలో చేసిన ప్రతిపాదనలు అమలుకు నోచుకోలేదు. మహిళా ప్రయాణికులు తమకు ఎదురయ్యే ఇబ్బందులను ఆర్పీఎఫ్‌కు తెలియజేసేందుకు ఒక మొబైల్ యాప్‌ను ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం ఆ మొబైల్ యాప్ సైతం నిరాదరణకు గురైంది. నగరంలో ఎంఎంటీఎస్ రెండో దశ విస్తరణ అనంతరం ప్రయాణికులు, సర్వీసుల సంఖ్య పెరగాల్సి ఉండగా అందుకు భిన్నంగా ప్రస్తుతం ప్రతి రోజు సుమారు 75 సర్వీసులే నడుస్తున్నాయి. రోజుకు 40 వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. కొన్ని రూట్లలో ఎంఎంటీఎస్ రైళ్ల నిర్వహణ కేవలం అలంకారప్రాయంగా మారింది.

**'మాతృభూమి' మాయం..**

నగరంలో 2003లో ఎంఎంటీఎస్ సర్వీసులను ప్రారంభించినప్పుడు రాజధాని సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ కంటే ఎంఎంటీఎస్ రైళ్లకే అత్యధిక ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించారు. ఉదయం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే ఎంఎంటీఎస్‌ను హైదరాబాద్ లైఫ్‌లైన్‌గా భావించారు. ఈ మేరకు అప్పట్లో మహిళా ప్రయాణికుల కోసం దక్షిణమధ్య రైల్వే ఎంతో ప్రతిష్టాత్మకంగా 'మాతృభూమి' ఎంఎంటీఎస్ సర్వీసులను ప్రవేశపెట్టింది. ఉదయం, సాయంత్రం మహిళా ప్రయాణికుల రద్దీ మేరకు ఈ సర్వీసులు అందుబాటులో ఉండేవి. పూర్తి భద్రతతో నడిచే ఈ సర్వీసులు మహిళలకు ఎంతో ప్రయోజకరంగా ఉండేవి. కానీ ఆక్యుపెన్సీని సాకుగా చూపుతూ అధికారులు మాతృభూమి ఎంఎంటీఎస్ సర్వీసుల్లో బోగీలను తగ్గించారు. సగానికి పైగా సాధారణ ప్రయాణికులతో నింపారు. దీంతో అప్పటి వరకు నిశ్చింతగా పయనించిన మహిళలకు ఇది ఇబ్బందిగానే మారింది. ఆ తర్వాత మాతృభూమి సర్వీసులను పూర్తిగా రద్దు చేశారు.

**పోకిరీలకు అడ్డాలుగా స్టేషన్‌లు..**

సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ వరకు 12 ఎంఎంటీఎస్ స్టేషన్‌లు ఉన్నాయి. సికింద్రాబాద్, మల్కాజిగిరి స్టేషన్‌లు మినహా ఆ రూట్‌లోని 10 స్టేషన్‌లలో సీసీ కెమెరాలు లేవు. పోలీసు భద్రత లేదు. దీంతో ఎంఎంటీఎస్ స్టేషన్‌లు గంజాయి బానిసలకు, పోకిరీలకు అడ్డాలుగా మారాయి. విద్యానగర్ నుంచి ఫలక్‌నుమా వరకు ఉన్న స్టేషన్‌లలో విద్యానగర్, కాచిగూడ వంటి ప్రధానమైన స్టేషన్‌లు మినహాయించి మిగతా స్టేషన్‌లలోనూ ఇదే పరిస్థితి. అన్ని చోట్ల అసాంఘిక శక్తులు రాత్రింబవళ్లు తిష్టవేసుకొని ఉంటాయి. అయినప్పటికీ నిఘా వ్యవస్థలు పని చేయకపోవడం గమనార్హం.

**దూరప్రాంత రైళ్లలోనూ సీసీ కెమెరాల్లేవ్..**

కొత్తగా అందుబాటులోకి వచ్చిన వందేభారత్ రైళ్లు మినహా దూరప్రాంతాలకు రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైళ్లలోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రయాణికుల భద్రత గాలిలో దీపంలా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. శతాబ్ది, దురంతో వంటి కొన్ని రైళ్లలో మాత్రం పరిమితంగా ఏర్పాటు చేశారు. నిత్యం ప్రయాణికుల రద్దీతో రాకపోకలు సాగించే నర్సాపూర్, గోదావరి, గౌతమి, దానాపూర్, నారాయణాద్రి, పద్మావతి, వెంకటాద్రి వంటి ప్రధానమైన రైళ్లలో సీసీ కెమెరాలు లేకపోవడం గమనార్హం. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ఆర్థికంగా ఎంతో భారం కావడం వల్లే వాటిపై దృష్టి సారించడం లేదని ఒక అధికారి చెప్పారు.

## వేడి నీటి బకెట్‌లో పడి నాలుగేళ్ల బాలుడి మృతి



బన్నీ (ఫైల్)

జవహర్‌నగర్: వేడి నీటి బకెట్‌లో పడిన బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన ఘటన జవహర్‌నగర్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ మార్కెట్ లైన్‌లో కాటి నర్సింహ, సుమలత దంపతులు ఇద్దరు కుమారులతో ఉంటున్నారు. నర్సింహ కూలిపనులు చేస్తుంటాడు. ఇద్దరు పిల్లలను చూసుకునేందుకు సుమలత తల్లి పుల్లమ్మ నర్సింహ ఇంటికి వచ్చింది. ఈ నెల 23న పుల్లమ్మ సమీపంలోని బంధువుల ఇంటికి నర్సింహ, సుమలతల చిన్న కుమారుడు బన్నీ(4)ని తీసుకుని వెళ్లింది. అప్పటికే ఆ ఇంట్లో హీటర్‌తో వేడి చేసిన నీటిని పెట్టి అక్కడే ఉంచారు. ఆ సమయంలో అక్కడే ఆడుకుంటున్న బన్నీ వేడి నీటి బకెట్‌లో పడిపోవడంతో ఛాతీ భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం బాలుడు మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారి బన్నీ మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

## అమ్మా.. నాన్నా.. సారీ

### బెట్టింగులకు దూరంగా ఉండలేకపోతున్నా

- క్రికెట్‌లో డబ్బులు పోవడంతో మనస్తాపం
- రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



సోమేశ్‌కుమార్ (ఫైల్)

మేడ్చల్ రూరల్: నేను సూసైడ్ చేసుకోవాలని డిసైడయ్యా.. దయచేసి నన్ను డిస్టర్బ్ చేయకండి.. నేను డబ్బుల విషయంలో ఆత్మహత్యకు పాల్పడడం లేదు. నా మైండ్ సెట్ కంట్రోల్ కావడం లేదు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నా. అమ్మా.. నాన్నా.. అండ్ ఫ్యామిలీ, ఫ్రెండ్స్.. సారీ.. అంటూ వాట్సాప్ స్టేటస్ పెట్టి సోమేష్‌కుమార్ అనే యువకుడు గౌడవెల్లి గ్రామ పరిధిలో రైలు కిందపడి తనువు చాలించిన ఘటన చోటుచేసుకుంది. మృతుడి కుటుంబీకులు, స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం.. ఏపీలోని అనకాపల్లి జిల్లా చోడవరం మండలం భోగాపురం గ్రామానికి చెందిన రమణ, కనకమ్మ దంపతులు బతుకుదెరువు కోసం 25 ఏళ్ల క్రితం నగరానికి వలసవచ్చి గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమారుడు సోమేశ్‌కుమార్ (29) కొంపల్లి సమీపంలో ఉన్న ఓ కంపెనీ వేర్‌హౌస్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. క్రికెట్ బెట్టింగులకు బానిసైన సోమేశ్ రూ.లక్షల్లో డబ్బులు పోగొట్టుకున్నాడు. గతంలో కుటుంబీకులు సోదరి వివాహం కోసం దాచిన డబ్బులు సైతం బెట్టింగ్స్‌లో కోల్పోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు కుమారుడిని మందలించారు. బెట్టింగ్ కారణంగా రూ.3.5 లక్షల వరకు అప్పులు చేయడంతో వాటిని తల్లిదండ్రులే చెల్లించారు. దీంతో మళ్లీ బెట్టింగులకు పాల్పడనంటూ చెప్పిన సోమేశ్ కుమార్ ఇటీవల ఐపీఎల్ క్రికెట్ మొదలవ్వడంతో మళ్లీ బెట్టింగుల వైపు మళ్లాడు. గత సోమవారం రాత్రి జరిగిన లక్నో- ఢిల్లీ మ్యాచ్ సందర్భంగా రూ.లక్ష క్రికెట్ బెట్టింగ్ యాప్‌లో బెట్టింగ్ వేశాడు. దురదృష్టవశాత్తు ఢిల్లీ మ్యాచ్ గెలవడంతో ఒక్క రోజే రాత్రికిరాత్రి రూ.లక్ష పోగొట్టుకున్నాడు. ఆ మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు సికింద్రాబాద్ రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పటిష్టంగా మాన్సూన్ యాక్షన్ ప్లాన్

- వేసవిలో అగ్ని ప్రమాదాలు తలెత్తకుండా చర్యలు
- సమన్వయ సమావేశంలో జీహెచ్‌ఎంసీ, హైడ్రా కమిషనర్లు



సాక్షి, సిటీబ్యూరో: రానున్న వర్షాకాలంలో నగరంలో ప్రజల కష్టాలను తొలగించే విధంగా మాన్సూన్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఫైర్ సేఫ్టీ, మాన్సూన్ యాక్షన్ ప్లాన్, నాలాల్లో పూడికతీత, నాలాల వద్ద భద్రత ఏర్పాట్లు, చెరువుల పునరుద్ధరణ అంశాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కలిసి ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో ఎదురయ్యే పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలో గుర్తించిన 141 నీటి నిల్వ ప్రాంతాల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. భవిష్యత్తులో నీటి నిల్వ ప్రాంతాలు లేకుండా శాశ్వత పరిష్కారం చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో సమస్యలకు ఆస్కారం లేకుండా పూడికతీత పనులు వర్షాకాలం లోపు పూర్తి చేయాలని సూచించారు. ప్రజల భద్రతకు, ట్రాఫిక్ అంతరాయం లేకుండా సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో సమష్టిగా పని చేయాలని పేర్కొన్నారు.

**చెరువులపై దృష్టి సారించాలి..**

నగరంలోని చెరువుల సంరక్షణ, పునరుద్ధరణలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వర్షాలప్పుడు నీరు పొంగిపొర్లకుండా నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని లేక్స్ అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల వారిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, నాలాల్లో ప్రమాదాలు సంభవించకుండా నాలా ఆడిట్ చర్యలు తీసుకోవాలని, ఆ పనులకు సర్కిల్‌కు ఒక ప్రత్యేక అధికారిని బాధ్యులను చేయాలని ఇలంబర్తి సూచించారు.

**అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించాలి**

వేసవిలో అగ్ని ప్రమాదాలు నివారించేందుకు నిబంధనల్ని కఠినంగా అమలు చేయాలని రంగనాథ్ సూచించారు. నివాస, వాణిజ్య భవన యజమానులు, నిర్వాహకులకు అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలతో అవగాహన కల్పించాలని చెప్పారు.

## న్యాయవాది హత్య కేసులో నిందితుడి రిమాండ్



నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

సంతోష్‌నగర్: న్యాయవాదిని హత్య చేసిన కేసులో నిందితుడిని ఐఎస్ సదన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. చంపాపేట్ ఈస్ట్ మారుతీనగర్‌కు చెందిన ఎర్రబాపు ఇజ్రాయిల్ (56)కు సంతోష్‌నగర్‌లోని శ్రీనివాస అపార్ట్‌మెంట్‌లో గ్రౌండ్ ఫ్లోర్ ఫ్లాట్ ఉంది. ఇజ్రాయిల్ శ్రీనివాస అపార్ట్‌మెంట్‌లో ఎలాంటి ఎలక్ట్రికల్ పని ఉన్నా తూర్పు మారుతీనగర్ శ్మశాన వాటిక గదిలో ఉండే గులాం దస్తగిరీ (49)ని పిలిపించి చేయించేవాడు. కాగా.. శ్రీనివాస అపార్ట్‌మెంట్‌లో ఓ వ్యక్తి, ఆయన భార్య వాచ్‌మెన్‌లుగా పని చేస్తున్నారు. దీంతో దస్తగిరీ అపార్ట్‌మెంట్‌కు రాకపోకలు సాగిస్తున్న సమయంలో సదరు మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడింది. విషయం తెలుసుకున్న న్యాయవాది ఇజ్రాయిల్ వాచ్‌మెన్ దంపతులను వారి స్వగ్రామానికి పంపించాడు. అనంతరం దస్తగిరీ తరచూ న్యాయవాది ఇజ్రాయిల్ వద్దకు వచ్చి వాచ్‌మెన్‌ను హత్య చేస్తే తనకు బెయిల్ ఇప్పించాలని కోరేవాడు. దంపతులను తిరిగి పిలిపించి తమను కలపాలని దస్తగిరీ సూచించగా.. దానికి న్యాయవాది ఇజ్రాయిల్ నిరాకరించారు. దీంతో ఇజ్రాయిల్‌పై కక్ష పెంచుకున్న దస్తగిరీ ఆయన కదలికలను కొన్ని రోజులుగా గమనించడం ప్రారంభించాడు. ఇందులో భాగంగా ఈ నెల 24 ఉదయం 8.50 గంటల సమయంలో న్యాయవాది ఇజ్రాయిల్ మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లి తిరిగి తన యాక్టివాపై తిరిగి ఇంటి వస్తున్నాడు. న్యూ మారుతీనగర్ కాలనీలో కాపు కాసి వేచి ఉన్న దస్తగిరీ.. ఇజ్రాయిల్‌పై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. దీంతో తీవ్ర గాయాలకు గురైన ఇజ్రాయిల్‌ను స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారుడ. దీనిపై న్యాయవాది ఇజ్రాయిల్ కూతురు ద్రాక్షవల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం నిందితుడు గులాం దస్తగిరీని అరెస్ట్ చేసి, అతని నుంచి కత్తి, సెల్‌ఫోన్, హోండా యాక్టివా ద్విచక్ర వాహనం, హెల్మెట్, కంటి అద్దాలు, చెప్పులను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

## 'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నికలో ఎంఐఎందే గెలుపు?

**కాంగ్రెస్ మద్దతు ఇచ్చినా.. ఇవ్వకున్నా..**

- పార్టీల వారీగా ఓట్ల బలాల ప్రకారం..




సాక్షి, సిటీబ్యూరో: త్వరలో జరగనున్న హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీకే గెలుపు అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇటీవల ముగిసిన ఎమ్మెల్సీల ఎన్నికల్లో తమకు సహకరిస్తే హైదరాబాద్ స్థానాన్ని ఇవ్వనున్నట్లు అధికార కాంగ్రెస్ ఎంఐఎంకు హామీ ఇచ్చినట్లు రాజకీయ ప్రచారం జరిగింది. ఆ లెక్కన కాంగ్రెస్ తమ అభ్యర్థిని పోటీకి దింపదు. ఒకవేళ అలా కాకుండా కాంగ్రెస్ తమ అభ్యర్థిని బరిలో దింపినా ఆ పార్టీకి తగినంత బలం లేదు. ఆ మాటకొస్తే.. ఒక్క ఎంఐఎంకు తప్ప మిగతా పార్టీలు వేటికి కూడా ఈ ఎన్నికల్లో గెలిచేంత బలం లేదు. ఈ ఎన్నికలో ప్రజలు ఎన్నుకున్న హైదరాబాద్ జిల్లా పరిధిలోని కార్పొరేటర్లు, లోక్‌సభ సభ్యులతో పాటు ఇక్కడ ఓటర్ల జాబితాలో పేరుండి జిల్లాను ఆప్షన్‌గా ఎంచుకున్న రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు ఓట్లు వేసేందుకు అర్హత కలిగి ఉంటారని సంబంధిత అధికారులు తెలిపారు. ప్రస్తుతం ముసాయిదా ఓటర్ల జాబితా మేరకు 110 మంది ఓటర్లున్నారు. వారిలో 81 మంది కార్పొరేటర్లు, 15 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు లోక్‌సభ సభ్యులు, నలుగురు రాజ్యసభ సభ్యులు, ఎనిమిది మంది ఎమ్మెల్సీలు ఉన్నట్లు సమాచారం. తుది జాబితా వెలువడేందుకు వచ్చే నెల 10వ తేదీ వరకు గడువున్నట్లు బల్దియా వర్గాల సమాచారం. ఇటీవల ఎమ్మెల్సీలుగా ఎన్నికైన వారు జాబితాలో చేరనున్నారు. ఓటర్లు పెరిగే అవకాశముంది.

**ఎంఐఎంకే మెజార్టీ..**

ఏ లెక్కన చూసుకున్నా అత్యధిక ఓటర్ల బలం ఎంఐఎంకే ఉంటుంది. దాదాపు యాభై మంది ఓటర్ల బలం ఆ ఒక్క పార్టీకి మాత్రమే ఉంది. మిగతా ఏ ఒక్క పార్టీకి కూడా అంత బలం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో మిగతా ఏ రెండు పార్టీలూ పొత్తులతో పోటీ చేసే అవకాశాలే లేవని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నిక అనేది పేరుకు మాత్రమేననే అభిప్రాయాలున్నాయి. అసలు పోలింగ్ జరిగేంతదాకా ఈ ప్రక్రియ సాగే అవకాశాలు కూడా లేవు. త్వరలో పదవీకాలం పూర్తికానున్న ఎంఎస్ ప్రభాకర్‌రావు ఎన్నిక సైతం పోటీ లేకుండానే ఏకగ్రీవం కావడం తెలిసిందే. అప్పట్లో బీఆర్‌ఎస్‌కు ఎంఐఎం మద్దతునిచ్చింది. ఇప్పుడు ఎంఐఎంకు కాంగ్రెస్ మద్దతునిస్తూ తమ అభ్యర్థిని పోటీకి నిలపదనే రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన ప్రభాకర్‌రావు ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉండటం తెలిసిందే.

## ఫ్లాగ్ డే ఫండ్‌కు ఎస్‌బీఐ భారీ విరాళం



సాక్షి, సిటీబ్యూరో: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోని హైదరాబాద్ సర్కిల్ ఉద్యోగులు తెలంగాణ సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి రూ. 37.16 లక్షలు విరాళంగా అందించి తమ దాతృత్వాన్ని, సామాజిక బాధ్యత పట్ల నిబద్ధతను ప్రదర్శించారు. ఇందులో భాగంగా ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ సాయుధ దళాల పతాక దినోత్సవ నిధి చైర్‌పర్సన్, తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు రూ. 37,16,500 విలువైన చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సైనిక్ వెల్ఫేర్ (తెలంగాణ) డైరెక్టర్ కల్నల్ రమేష్ కుమార్, జితేంద్ర కుమార్ శర్మ డీజీఎం, సీఎస్ఓ కెప్టెన్ సంజయ్ అపగే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఎస్‌బీఐ సిబ్బంది సామాజిక చొరవను అభినందించారు.

## నగరానికి నిధుల కేటాయింపు అంతంతే..

– అసెంబ్లీలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరం నుంచి రాష్ట్ర ఖజానాకు సింహభాగం ఆదాయం వచ్చి చేరుతున్నా..బడ్జెట్‌లో నిధుల కేటాయింపు మాత్రం మొక్కుబడిగా ఉందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో జీహెచ్‌ఎంసీ, జలమండలికి, ఇతర సంస్థలకు నామమాత్రంగా నిధులు కేటాయించారని గుర్తు చేశారు. వాటర్‌బోర్డుకు కేవలం రూ. 3,383 కోట్లు కేటాయించారని, అందులో 3,083 కోట్లు అప్పుల చెల్లింపు, ఉచిత నీటి రియింబర్స్‌మెంట్ కింద రూ.300 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. అభివృద్ధి పనులుకు ఏ మాత్రం కేటాయించలేదని పేర్కొన్నారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగు కోసం తక్షణమే రూ. 1500 కోట్లు కేటాయించాలన్నారు. జీహెచ్‌ఎంసీకి నిధులు కేటాయిపు పెంచాలన్నారు. నగర అభివృద్ధికి పెద్దపీట వేయాలన్నారు. విద్యారంగ సమస్యలు తక్షణమే పరిష్కారించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు మంజూరు చేయాలని రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# వాటర్ మాఫియా!

- ప్రైవేటు ట్యాంకర్ల దోపిడీ
- 80 గజాల్లో సైతం మూడు నాలుగు బోర్లు
- డిమాండ్‌ను బట్టి అధిక రేట్లు

సాక్షి సిటీబ్యూరో/కూకట్‌పల్లి/మణికొండ: మహానగరంలో ప్రైవేటు నీటి ట్యాంకర్ల మాఫియా రాజ్యమేలుతోంది. జలమండలి ఉదాసీనత.. ప్రైవేటు జల వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది. వాటర్‌బోర్డు ట్యాంకర్ల ధర తక్కువగా ఉన్నప్పటికి సరఫరాలో బుకింగ్ నుంచి డెలివరీ వరకు 12 నుంచి 24 గంటలు పడుతుండటం ప్రైవేట్ ట్యాంకర్ల ఆపరేటర్లకు కలిసి వస్తోంది. నగర శివారులోని ఖాళీ ప్లాట్లతో పాటు చెరువుల సమీపంలోని ఖాళీ స్థలాల్లో బోర్లు వేసి మరీ భూగర్భ జలాలను తోడేస్తున్నారు. స్థానిక నేతల అండదండలతో పగలు, రాత్రి అన్న తేడా లేకుండా నీటి దందా కొనసాగిస్తున్నారు. భూగర్భజలాలు అడుగంటి తాగడానికికే కాదు..కనీసం ఇతర అవసరాలకూ నీళ్లు లేక అల్లాడుతున్న నివాస సముదాయాల డిమాండ్ ట్యాంకర్ల రేట్లను పెంచేస్తోంది. ట్యాంకర్ దొరికితే చాలనే గత్యంతరం లేని పరిస్థితుల్లో..ఎంత ధరయినా పెట్టి ట్యాంకర్లు తెప్పించుకుంటున్నారు. వాస్తవంగా ప్రైవేటు ట్యాంకర్లపై ప్రభుత్వ పరమైన నియంత్రణ లేకపోవడంతో అడ్డగోలుగా బాదేస్తున్నారు. సాధారణంగా 5 వేల లీటర్ల వాటర్ ట్యాంకర్‌కు అవసరాన్ని బట్టి రూ.1000 నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు.



కూకట్‌పల్లి పరిధిలోని ఓ చెరువు సమీపంలో బోర్లు వేసి నీటిని నింపేందుకు సిద్ధం చేసిన ట్యాంకర్లు



ఖానాపూర్ గ్రామంలో వ్యవసాయ పొలాల్లో కొనసాగుతున్న నీటి వ్యాపారం

- కూకట్‌పల్లిలో ఓ చెరువుకు సమీపంలోని బస్తీలలో 80 గజాలలో రెండు, మూడు బోర్లు తవ్వి.. వాటి నుంచి అక్రమంగా నీటిని తోడేసి వ్యాపారం సాగిస్తున్నారు. అల్లాపూర్ డివిజన్, బాలాజీనగర్ డివిజన్ ప్రాంతాలలో అనేక బస్తీల్లో ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. బస్తీల్లో కొంత మంది పెద్దలు వాటాలు పంచుకుని..నీటి వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. మరోవైపు కాలనీల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయి ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారు. అల్లాపూర్, బాలాజీనగర్ డివిజన్‌ల పరిధిలోని కాముని చెరువు, మైసమ్మ చెరువు, సున్నం చెరువు, ఐడీఎల్ రంగదాముని చెరువు ప్రాంతాలను అడ్డాగా చేసుకుని నీటి వ్యాపారాన్ని సాగిస్తున్నారు.
- గండిపేట మండల పరిధిలోని మణికొండ, పుప్పాలగూడ, కోకాపేట, మంచిరేవుల, ఖానాపూర్, వట్టినాగులపల్లి, గౌలిదొడ్డి తదితర గ్రామాలలో నీటి ట్యాంకర్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, ఐటీ సంస్థలు, ఆసుపత్రులలో బోర్లు వట్టిపోవటంతో ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. దీంతో కొందరు వ్యవసాయ భూములను లీజుకు తీసుకుని బోర్లు వేసి రాత్రి, పగలు తేడా లేకుండా ట్యాంకర్ల ద్వార నీటిని తరలిస్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఆయా గ్రామాల్లోనూ నీటి ఎద్దడి ఏర్పడుతుందని స్థానికులు వాపోతున్నారు. రెవెన్యూ అధికారులు పలుమార్లు దాడులు చేసినా.. తాత్కాలికంగా నీటి వ్యాపారం ఆపేసి..మళ్లీ ప్రారంభించడం గమనార్హం.

## రూ.1.30 కోట్ల నగదు పట్టివేత

చాంద్రాయణగుట్ట: ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.1.30 కోట్ల నగదును చాంద్రాయణగుట్ట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ గురునాథ్ తెలిపిన వివరాల ప్రకారం ..చాంద్రాయణగుట్ట పూల్‌బాగ్ జంక్షన్ ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో అటుగా వచ్చిన కియా కారును నిలిపి తనిఖీ చేయగా మహ్మద్ యూసుఫుద్దీన్, సయ్యద్ అబ్దుల్ హదీల వద్ద రూ.1.30 కోట్ల నగదు లభ్యమయ్యింది. డబ్బుకు సంబంధించిన వివరాలు కోరగా, రియల్ ఎస్టేట్ వ్యాపారులమని, ల్యాండ్ కొన్నామని, అందుకు చెల్లించాల్సి ఉందని వారు పేర్కొన్నారు. సరైన పత్రాలు చూపని కారణంగా ఐటీ అధికారులకు అప్పగించారు.

## ట్రేడింగ్ ఫ్రాడ్‌లో అకౌంట్ సప్లయర్ అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: ట్రేడింగ్ ఫ్రాడ్ చేసే సైబర్ నేరగాళ్లకు అవసరమైన బ్యాంకు ఖాతాలు అందిస్తున్న గుర్‌గావ్ వాసిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతడిపై దేశంలో 43 కేసులు, రాష్ట్రంలో ఆరు కేసులు ఉన్నట్లు డీసీపీ దార కవిత మంగళవారం తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన హిమాన్షు స్వామి ప్రస్తుతం గుర్‌గావ్‌లో నివసిస్తున్నాడు. ఇతడు పవన్ జైన్‌తో కలిసి బ్యాంకు ఖాతాలు సమీకరిస్తూ సైబర్ నేరగాళ్లకు అందిస్తున్నాడు. నగరానికి చెందిన ఓ వ్యక్తికి సోషల్‌మీడియా ద్వారా ఎర వేసిన సైబర్ నేరగాళ్లు ట్రేడింగ్ పేరుతో రూ.20 లక్షలు స్వాహా చేశారు. ఈ కేసు దర్యాప్తులో పోలీసులు హిమాన్షు, పవన్ పాత్రను గుర్తించారు. గుర్‌గావ్ వెళ్లిన ప్రత్యేక బృందం హిమాన్షును అరెస్టు చేసింది. పరారీలో ఉన్న పవన్ కోసం గాలిస్తోంది.

## బస్సు కింద పడి మహిళ మృతి



త్రివేణి ఐడీ కార్డు

బొల్లారం: ఉద్యోగానికి బయలుదేరిన మహిళ యాక్సిడెంట్‌కు గురై మృతిచెందిన ఘటన తిరుమలగిరి పోలీసు స్టేషన్ పరిధిలోని చోటు చేసుకుంది. తిరుమలగిరి పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని త్రివేణి కుమారి(43) అల్వాల్ ఎంఈఎస్ కాలనీలో నివాసం ఉంటోంది. మంగళవారం ఉదయం ఆఫీసుకు వెళ్లేందుకు లాల్ బజార్ బస్టాప్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో ఆమెను ఓ కారు ఢీకొట్టడడంతో రోడ్డుపై పడిపోయింది. అదే సమయంలో ఈసీఐఎల్ నుంచి సికింద్రాబాద్‌కు వస్తున్న కంటోన్మెంట్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఆమె పైనుంచి వెళ్లింది. దీంతో త్రివేణి కుమారి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం తెలుసుకుని ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కారు, బస్సు డ్రైవర్ల నిర్లక్ష్యం వల్లే తన భార్య మృతి చెందిందని త్రివేణి భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ డ్రైవర్ నరేశ్, కారు డ్రైవర్ రమేశ్‌లపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# చిట్టీల పుల్లయ్య చిక్కాడు!

- బెంగళూరులో పట్టుకున్న సీసీఎస్ పోలీసులు
- పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం గాలింపు


సాక్షి, సిటీబ్యూరో: ఆంధ్రప్రదేశ్ నుంచి నగరానికి వలసవచ్చి, కూలీగా జీవితం ప్రారంభించి, చిట్టీల వ్యాపారంలోకి దిగి, అధిక వడ్డీ ఆశ చూపి దాదాపు రూ.100 కోట్ల మేర కాజేసిన పుల్లయ్యను సిటీ సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. గత నెల 21 నుంచి పరారీలో ఉన్న ఇతగాడిని బెంగళూరులో అదుపులోకి తీసుకున్న అధికారులు పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు. అనంతపురం జిల్లా గుత్తి సమీపంలోని చందన లక్ష్మింపల్లి గ్రామానికి చెందిన పుల్లయ్య తన స్వగ్రామంలోనూ చిట్టీల వ్యాపారం చేసి పలువురిని మోసం చేశాడు. దాదాపు 18 ఏళ్ల క్రితం నగరానికి వలసవచ్చిన ఇతగాడు బీకే గూడ దాసారం బస్తీలో చిన్న గుడిసె వేసుకుని జీవించాడు. కుమారుడు రామాంజనేయులు తాపీ మేస్త్రీగా, పుల్లయ్య తాపీ పనిలో కూలీగా పని చేసే వాడు. ఇలా స్థానికులతో పాటు దాసారం బస్తీలో ఉండే రిక్షా కార్మికులతో పరిచయాలు పెంచుకున్నాడు. 15 ఏళ్ల క్రితం చిట్టీల వ్యాపారం ప్రారంభించిన ఇతగాడు బిల్డర్లకు ఫైనాన్స్ కూడా చేశాడు. పశ్చిమ మండలంలోని ఎస్సార్‌నగర్, బల్కంపేట, బీకేగూడ, సనత్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన దాదాపు 500 మంది ఇతడికి ఖాతాదారులుగా మారారు. రూ.5 లక్షల నుంచి రూ.కోటి వరకు విలువైన చిట్టీలు వేశాడు. ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ నమ్మకం సంపాదించుకున్న పుల్లయ్య ఆపై ఆ మొత్తాలు తమ వద్దే ఉంచి, వడ్డీలు తీసుకునేలా చేశాడు. ఇలా దాదాపు రూ.100 కోట్ల వరకు కాజేసిన ఇతగాడు గత నెల 21న కుటుంబంతో సహా పారిపోయాడు. బాధితులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న సీసీఎస్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఎస్సార్‌నగర్‌లో నమోదైన కేసునూ ఈ విభాగానికే బదిలీ చేశారు. ముమ్మరంగా గాలించిన అధికారులు పుల్లయ్యను బెంగళూరులో పట్టుకున్నారు. ఈ కేసులో అతడి భార్య, కుమారుడు సైతం నిందితులుగా ఉండటంతో వారి కోసం గాలిస్తున్నారు. కాజేసిన సొమ్మును పుల్లయ్య ఎక్కడకు మళ్లించాడు? తదితర వివరాలు ఆరా తీస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి

భర్తకు తీవ్ర గాయాలు

కొత్తూరు: రోడ్డు ప్రమాదంలో ఓ పంచాయతీ కార్యదర్శి మృతి చెందిన సంఘటన మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని రామంతాపూర్‌కు చెందిన సక్కుబాయి (38), పాండు దంపతులు. సక్కుబాయి మహేశ్వరం మండలం ఎన్‌డీతండా పంచాయతీ కార్యదర్శిగా, పాండు అంబర్‌పేట్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మంగళవారం ఇద్దరూ కలిసి సక్కుబాయి అమ్మగారి గ్రామమైన కొందుర్గుకు స్కూటీపై వచ్చారు. గ్రామంలో గతంలో వారు కొనుగోలు చేసిన వ్యవసాయ క్షేత్రంలో చేపడుతున్న పండ్లతోట పనులు చూసి తిరుగుపయనమయ్యారు. మార్గమధ్యలో తిమ్మాపూర్ వద్దకు రాగానే హెచ్‌పీ పెట్రోల్‌బంకు వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. అదే సమయంలో లారీ అదుపుతప్పి పక్కనుంచి వెళ్తున్న వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీచక్రాలు బైకుపై నుంచి వెళ్లడంతో సక్కుబాయి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్ర గాయాలైన పాండును చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాదం కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## స్కూల్ బస్‌లో మంటలు



- విద్యార్థులను దింపేసి వస్తుండగా ఘటన
- సాగర్ రహదారిపై ట్రాఫిక్ జామ్

తుర్కయంజాల్: షార్ట్ సర్క్యూట్‌తో స్కూల్ బస్‌లో మంటలు చెలరేగిన ఘటన సాగర్ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. నాదర్‌గుల్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన బస్సు (టీజీ08 యూ1796) ఇంజాపూర్‌లో విద్యార్థులను దింపేసి, తిరిగి వెళ్తుండగా గుర్రంగూడ వద్ద డ్రైవర్ సీటు కింది నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ బస్సు దిగి, తోటి వాహనదారుల సహాయంతో మంటలను ఆర్పేసే ప్రయత్నం చేయడంతో పాటు ఫైరింజిన్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు. ప్రమాదం జరిగిన సమయంలో విద్యార్థులు లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో సాగర్ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

# ఆయిల్ వ్యాపారులే టార్గెట్

- ట్యాంకర్లు బుక్ చేసుకుని భారీ మోసాలు
- ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్న ద్వయం
- చాకచక్యంగా పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ టీమ్



సాయినందకిషోర్



అబ్దుల్ రహీం

సాక్షి, సిటీబ్యూరో: హోల్‌సేల్ ఆయిల్ వ్యాపారులను టార్గెట్‌గా చేసుకుని వరుస మోసాలకు పాల్పడి, ఏళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరు మోసగాళ్లను సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వీరిలో ఒకరిపై 9 వారెంట్లు, మరొకరిపై నాలుగు వారెంట్లు పెండింగ్‌లో ఉన్నట్లు అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు మంగళవారం వెల్లడించారు. ఓల్డ్ మలక్‌పేట హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన టి.సాయినందకిషోర్ 2006 నుంచి నేరబాట పట్టాడు. తానో రిటైల్ ఆయిల్ వ్యాపారినంటూ హోల్‌సేల్ వ్యాపారుల దగ్గరకు వెళ్తాడు. తొలుత చిన్నచిన్న మొత్తంలో ఖరీదు చేసి పక్కాగా చెల్లింపులు చేస్తాడు. ఆపై ట్యాంకర్లు బుక్ చేసుకుని, వాటిని మార్కెట్‌లో విక్రయించి, అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. 2017లో ఆజంపురకు చెందిన మహ్మద్ అబ్దుల్ రహీం ఇతడితో జట్టుకట్టాడు. వీళ్లిద్దరూ కలిసి ఇదే పంథాలో మోసాలు చేశారు. 25 నేరాలను నందకిషోర్ ఒక్కడే చేయగా.. మరో పది నేరాలు రహీంతో కలిసి చేశాడు. వీరిపై హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ, నల్లగొండల్లో కేసులు నమోదై ఉన్నాయి. 2006 నాటి కేసుల్లోనూ నందకిషోర్ కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవడంతో 9 వారెంట్లు జారీ అయ్యాయి. రహీంపై మరో నాలుగు వారెంట్లు ఉన్నాయి. పోలీసుల నిఘా తప్పించుకోవడానికి ఏడు మారుపేర్లతో చెలామణి అయిన నంద కిషోర్ ప్రస్తుతం ఘట్‌కేసర్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో క్యాంటీన్ నిర్వహిస్తున్నాడు. రహీం ర్యాపిడో డ్రైవర్ అవతారం ఎత్తాడు. వీరి కదలికలపై సౌత్-ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ ఎస్.సైదాబాబు నేతృత్వంలో ఎస్సైలు పి.సాయిరాం, షేక్ కవియుద్దీన్, ఎం.మధు వలపన్ని ఇరువురినీ అదుపులోకి తీసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం బంజారాహిల్స్, రామ్‌గోపాల్‌పేట ఠాణాలకు అప్పగించారు.

## చెరువుల అభివృద్ధి పనులు పరిశీలన

క్షేత్ర స్థాయిలో పర్యటించిన హైడ్రా కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో జరుగుతున్న చెరువుల అభివృద్ధి, పునరుజ్జీవం పనుల్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం పరిశీలించారు. మాదాపూర్‌లోని తమ్మిడికుంట, బొరబండ సమీపంలోని సున్నం చెరువు వద్దకు వెళ్లిన ఆయన పనులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. వీటిలో పూడిక తీతను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ఆయా చెరువులు చుట్టూ తిరిగిన ఆయన సుందరీకరణ, పచ్చదనం పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. ఈ ఏడాదికి టార్గెట్‌గా నిర్దేశించుకున్న ఆరు చెరువుల పనులు వర్షాకాలానికి పూర్తి చేయాలని, ఎక్కడా జాప్యం, అలసత్వం వద్దని అధికారులను ఆదేశించారు. అలాగే... ఖాజాగూడలోని కొత్త కుంటను (నానక్‌రామ్ కుంట) రంగనాథ్ పరిశీలించారు. కొత్త కుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో పరిస్థితిని గమనించారు. ఇదే విషయంపై ఇటీవల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కూడా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. వంశీరామ్ బిల్డర్స్ యాజమాన్యంతో మాట్లాడిన రంగనాథ్ చెరువులో వేసిన మట్టిని మూడునాలుగు రోజుల్లో తొలగించాలని, లేకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి తెలుసుకునేందుకు జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయాలన్నారు.

## దక్షిణాది రాష్ట్రాలకు నిధుల కేటాయింపులు పెరగాలి

జాతీయ సదస్సులో నిపుణులు



సదస్సులో మాట్లాడుతున్న ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ఆర్థిక శాస్త్ర విభాగం, తెలంగాణ రాష్ట్ర ఉన్నత మండలి, ఐసీఎస్‌ఎస్‌ఆర్-దక్షిణ భారతదేశ ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో 'భారతదేశంలో ఆర్థిక సమాఖ్యవాదం: వికేంద్రీకరణ, అభివృద్ధి, ఆర్థిక గతిశీలత' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (న్యూఢిల్లీ) విశిష్ట అధ్యాపకులు పినాకి చక్రవర్తి ముఖ్యఅతిథిగా హాజరై సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16వ ఆర్థిక సంఘం కోవిడ్ తర్వాత వివిధ రాష్ట్రాల్లో పర్యటించి ఆర్థిక అభివృద్ధి, నిర్వహణపై దృష్టి సారించిందన్నారు. రాష్ట్రాలు ఆర్థిక స్వయం ప్రతిపత్తి పొందడానికి పన్ను వికేంద్రీకరణను 42 శాతానికి ఆర్థిక కమిషన్ పెంచిందని వెల్లడించారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి, అంబేడ్కర్ వర్సిటీ ఉపకులపతి ఘంటా చక్రపాణి మాట్లాడుతూ సామాజిక ధర్మంలో భాగంగా సమాజంలోని అన్ని వర్గాలకు అంబేడ్కర్ విశ్వవిద్యాలయం సేవలు అందిస్తుందన్నారు. గత దశాబ్ద కాలంగా కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు జరగాల్సిన స్థాయిలో చేయకున్నా దక్షిణ భారతదేశం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. ఉత్తర-దక్షిణ ప్రాంతాలకు నిధుల కేటాయింపులపై సమగ్ర చర్చ జరగాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సభ్యులు అరవింద్ వారియర్, విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, సామాజిక శాస్త్రాల విభాగ డీన్ వడ్డాణం శ్రీనివాస్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కోయంబత్తూర్‌లో ఘరానా మోసగాడి అరెస్ట్

గచ్చిబౌలి: బంగారం కొనుగోలు పేరిట ఘరానా మోసానికి పాల్పడిన కేటుగాడిని తమిళనాడు పోలీసులు కోయంబత్తూర్‌లో అరెస్ట్ చేశారు. కమిషన్ ఇస్తానని చెప్పి గత శుక్రవారం రఫీ నుంచి 18 వేల డాలర్లు, చంద్రశేఖర్ నుంచి 500 గ్రాముల బంగారం తీసుకొని ఉడాయించాడు. బాధితుల ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రాథమిక దర్యాప్తులో భాగంగా ప్రత్యేక బృందాలు తమిళనాడుకు వెళ్లాయి. ఈ మేరకు నిందితుడు పగులు హసన్‌ను సోమవారం కోయంబత్తూర్‌లో అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి అక్కడి పోలీసులు బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. పీటీ వారెంట్‌పై హసన్‌ను హైదరాబాద్ తీసుకొచ్చేందుకు గచ్చిబౌలి పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. తాను ధనవంతుడినని, పెద్ద పెద్ద వ్యక్తులతో పరిచయాలు ఉన్నాయని ఫైవ్‌స్టార్ హోటల్‌కు వచ్చేవారిని నమ్మిస్తాడు. బంగారం కొనుగోలు, డాలర్ల ఎక్స్ఛేంజ్ పేరిట మోసాలకు పాల్పడడం అతని నైజం. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలో మోసాలకు పాల్పడినట్లుగా కూడా పోలీసులు గుర్తించారు.

## బాలికపై లైంగిక దాడి: పోక్సో కేసు నమోదు

హిమాయత్‌నగర్: ఇంటర్ చదువుతున్న ఓ బాలికకు మాయ మాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడిన నారాయణగూడ, దత్తానగర్‌కు చెందిన చతుర్వాల రోహిత్ సింగ్(21)ను మంగళవారం నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉండే ఓ మైనర్ బాలిక స్థానికంగా ఉన్న కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఇదే క్రమంలో ప్రైవేట్ ఉద్యోగం చేసున్న రోహిత్ సింగ్‌తో కొన్ని నెలల క్రితం ఆమెకు పరిచయం ఏర్పడింది. ఈ నెల 23న బాలికను ఇంట్లో నుంచి బయటకు పిలిపించిన రోహిత్ సింగ్ ముషీరాబాద్‌లోని ఓ గదికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితున్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టాగా నేరాన్ని ఒప్పుకున్నాడు. పోక్సో చట్టం కింద అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

# 'మహా' ప్రణాళికపై భారీ కసరత్తు

వివిధ విభాగాలతో హెచ్‌ఎండీఏ కమిషనర్ సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: రీజనల్ రింగ్ రోడ్డు వరకు విస్తరించిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా పరిధికనుగుణంగా 'మెగా మాస్టర్‌ప్లాన్-2050'పై హెచ్‌ఎండీఏ భారీ కసరత్తు చేపట్టింది. ఈ మేరకు మంగళవారం హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ వివిధ విభాగాలకు చెందిన అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కాంప్రహెన్సివ్ మొబిలిటీప్లాన్ (సీఎంపీ)పైన లీ అసోసియేషన్ రూపొందించిన ప్రాథమిక నివేదికతో పాటు హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా పరిధిలో బ్లూ, గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్‌పైన సమగ్రంగా చర్చించారు. ప్రణాళికా విభాగం, ఇంజనీరింగ్, అర్బన్‌ఫారెస్ట్, మాస్టర్‌ప్లాన్, ఇరిగేషన్ తదితర విభాగాలకు చెందిన అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా పరిధిలో ఉన్న చెరువులు, కుంటలు, నీటి వనరులు, అడవుల పరిరక్షణ, ట్రిపుల్ ఆర్ వరకు పచ్చదనం విస్తరణకు చేపట్టాల్సిన చర్యలపైన చర్చించినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఈ సమావేశంలో కృష్ణా, గోదావరి బేసిన్‌లపైన చర్చించారు. 2050 వరకు నగర అవసరాలకు సరిపడా నీటి లభ్యతపైన నిపుణుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. అలాగే ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు నివాస జోన్‌లు, ఆర్థిక అభివృద్ధి మండళ్లు, లాజిస్టిక్ హబ్‌లు, పారిశ్రామిక కేంద్రాలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపైన అధికారులు మాట్లాడారు. ఇప్పుడు ట్రిపుల్ ఆర్ వరకు అందుబాటులో ఉన్న అడవులతో పాటు నగరీకరణకు అనుగుణంగా పచ్చదనం విస్తరణ, పార్కుల అభివృద్ధి, తదితర అంశాలపైన చర్చించినట్లు అధికారులు తెలిపారు. ఎయిర్‌పోర్టుతో పాటు, వివిధ మార్గాల్లో మెట్రో రెండోదశ విస్తరణకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 2050 నాటికి ఇంకా ఏయే ప్రాంతాలకు మెట్రో విస్తరణకు అవకాశాలు ఉన్నాయనే అంశంతో పాటు, మెట్రో విస్తరణకు అవకాశం లేని ప్రాంతాల్లో ఏరకమైన ప్రజా రవాణా సదుపాయాలను అభివృద్ధి చేయాలనే అంశంపైన కూడా సమగ్రమైన చర్చ జరిగింది..

### సెప్టెంబర్ నాటికి ముసాయిదా...

హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా అభివృద్ధిపైన ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించిన నేపథ్యంలో సెప్టెంబర్ నాటికి మెగా మాస్టర్‌ప్లాన్-2050 ముసాయిదాను సిద్ధం చేయాలని హెచ్‌ఎండీఏ భావిస్తోంది. వచ్చే సంవత్సరం నాటికి పూర్తిస్థాయిలో సమగ్రమైన మహా ప్రణాళిక అందుబాటులోకి వచ్చేవిధంగా కార్యాచరణ చేపట్టారు. ఈ మేరకు మాస్టర్‌ప్లాన్ రూపకల్పన కోసం అంతర్జాతీయ కన్సల్టెన్సీల నుంచి దరఖాస్తులను స్వీకరించి త్వరలో అర్హత కలిగిన సంస్థను ఎంపిక చేయనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారి ఒకరు చెప్పారు.

## తాగునీటి పైప్‌లైన్ వేయిస్తా

కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



కట్టమైసమ్మ బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-2లోని సాగర్ సొసైటీని ఆనుకుని ఉన్న కట్టమైసమ్మ బస్తీలో మంగళవారం జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పర్యటించి బస్తీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే పైప్‌లైన్ వేయిస్తామని, ఇందుకు సంబంధించి పైప్‌లైన్ నిర్మాణ ప్రతిపాదనను రూపొందించాలని జలమండలి జీఎం హరిశంకర్‌కు సూచించారు. స్థానికంగా నీటి సమస్య లేకుండా చూడాలని కోరారు. బస్తీవాసులు ఎదుర్కొంటున్న మిగతా సమస్యలకు కూడా పరిష్కారం చూపుతామని కార్పొరేటర్ హామీనిచ్చారు..

## ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



మంత్రికి వినతి పత్రం అందజేస్తూ..

హిమాయత్‌నగర్: అసెంబ్లీ సమావేశాల అనంతరం ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చినట్లు ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఆవరణలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు వీఎస్.బోస్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గత నెలలో జరిగిన చర్చల్లో ఏప్రిల్ నెలలో ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తానని ఇచ్చిన హామీని గుర్తు చేసినట్లు చెప్పారు.

## నైపుణ్యం ఉంటేనే ఉద్యోగ అవకాశాలు

బీజేఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ్ కుమార్



ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న విద్యార్థులు

హిమాయత్‌నగర్: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యాలు పెంచుకుంటేనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సులభంగా లభిస్తాయని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ్ కుమార్ అన్నారు. నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణంలో జాబ్ మేళా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధికి దోహదపడే అనుభవాన్ని పెంచుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ పి.సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ నర్సింలు, డాక్టర్ రాపోలు శ్రీనివాస్, కడారి శ్రీనివాస్, డాక్టర్ రాజేశ్వర్, డాక్టర్ యాదయ్య, డాక్టర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఊరెళ్లొచ్చేసరికి చోరీ

వెంగళరావునగర్: ఓ మహిళ పిల్లలతో కలిసి ఊరికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో దొంగతనం జరిగిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పి.గీత సినీ పరిశ్రమలో పని చేస్తోంది. 7వ తేదీన స్వగ్రామం వరంగల్ వెళ్లి తిరిగి 24వ తేదీన వచ్చింది. ఇంటికి రాగానే తాళం పగలగొట్టి ఉంది. లోపలకు వెళ్లి చూడగా ఫోన్, రూ.21 వేల నగదు, వస్తువులు కనిపించ లేదు. దాంతో ఆమె మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్ చేస్తున్న యువకుడి అరెస్టు

వెంగళరావునగర్: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకుడిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఎన్టీఆర్ జిల్లా ప్రాంతానికి చెందిన బి.సాయి మనోహర్ కొంతకాలంగా పలు ప్రాంతాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. ఈ విషయాన్ని కొందరు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఎస్ఐ అవినాష్‌బాబు సోమవారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాడు. యూసుఫ్‌గూడ సమీపంలో యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తుండగా చూసి పోలీసులు అతడిని పట్టుకున్నారు. అతడిని విచారించగా మూడేళ్ల క్రితం ప్రైవేట్ జాబ్ చేసే వాడినని, ప్రస్తుతం ఆన్‌లైన్ బెట్టింగ్ చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# 'ఎల్ఆర్ఎస్'కు ఇక 6 రోజులే..

- ఈ నెల 31వ తేదీతో ఆఖరు
- సకాలంలో చెల్లిస్తే 25 శాతం రాయితీ
- అర్హత ఉన్న దరఖాస్తుదారులకు లేఖలు
- అవగాహన కలిగిస్తున్న అధికారులు



ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్‌లో సందేహాలు నివృత్తి చేస్తున్న సర్కిల్-18 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్

బంజారాహిల్స్: అక్రమ లే అవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ ఎల్ఆర్ఎస్‌కు ఈ నెల 31 వరకు గడువు ఉండటంతో ఇప్పటికే సంబంధిత అధికారులు అవగాహన కలిగించారు. ఎల్ఆర్ఎస్ యాప్‌లో ఆన్‌లైన్‌లోనూ ఫీజులు చెల్లించుకోవడానికి అవకాశం కల్పించారు. ప్రారంభంలో ఎల్ఆర్ఎస్ యాప్‌లో సాంకేతిక సమస్యలు ఉండగా, ఇప్పుడవి పరిష్కారమయ్యాయి. దీంతో ప్రతిఒక్కరూ ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులు కోరుతున్నారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్-17 పరిధిలో 180 మంది ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ ఫీజులు చెల్లించాల్సిందిగా ఇప్పటికే లెటర్లు రాశారు. ఈ నెల 30, 31 తేదీల్లో కూడా ఆన్‌లైన్‌లో ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించేందుకు అవకాశం ఉందని సర్కిల్-17 డీసీ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకునే వారికి ఎంత ఫీజు చెల్లించాలో కూడా వారందరికీ తెలియజేయడం జరిగిందన్నారు. లేఅవుట్ల క్రమబద్ధీకరణ ఈ నెల 31తో ముగిస్తున్నందున దరఖాస్తుదారులు త్వరితగతిన ఫీజు చెల్లించి 25 శాతం రిబేట్ పొందవచ్చని ఆయన వెల్లడించారు. సకాలంలో లేఅవుట్ల క్రమబద్ధీకరణ చేయించుకోవాలన్నారు. రుసుము చెల్లించిన 48 గంటల్లోనే ప్రొసీడింగ్స్ జారీ చేయడం జరుగుతుందన్నారు.

### జూబ్లీహిల్స్ సర్కిల్‌లో 1370 దరఖాస్తులు..

జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు మొత్తం 2,200 రాగా, ఇందులో 1,370 దరఖాస్తులు అర్హతకు నోచుకున్నాయి. వీరందరికీ ఫీజులు చెల్లించాల్సిందిగా లెటర్లు జనరేట్ చేయడం జరిగిందని సర్కిల్-18 టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు 41 మంది దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించాలని, వీటి ద్వారా రూ.1.30 కోట్లు వసూలు అయినట్లు చెప్పారు. ఈ నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందని, దరఖాస్తుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణకు ఈ నెల 31తో గడువు ముగుస్తున్నందున వారిని అప్రమత్తం చేసేందుకు సర్కిల్-18 డీసీ ప్రశాంతి పలుమార్లు సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ఫీజు జనరేట్ కోసం లేఖలు కూడా రాసినట్లు ఆమె వెల్లడించారు. అర్హత కలిగిన దరఖాస్తుదారులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సెలవు రోజుల్లోనూ ఆస్తి పన్ను వసూలు

- డీసీ రజనీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఖైరతాబాద్ సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డి

బంజారాహిల్స్: ఈ నెల 30వ తేదీన ఉగాది, 31న రంజాన్ పండగలు ఉన్నాయని, ఈ రెండు రోజులు సెలవులైనా సిబ్బంది అందుబాటులో ఉండి ఆస్తి పన్ను వసూలు చేస్తారని ఖైరతాబాద్ సర్కిల్-17 డీసీ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెలవులు ఉన్నాయి కదా? అని అసెస్‌మెంట్‌దారులు నిర్లక్ష్యం వహించవద్దని, ఈ నెల 29లోపు చెల్లించుకుంటే ఇంకా మంచిదన్నారు. తమ సిబ్బంది ఇప్పటికే పన్నులు చెల్లించాల్సిన వారికి నోటీసులు పంపించారని, ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకుని వెంటనే ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించాలని కోరారు. సమస్యలు ఉంటే ఆస్తి పన్ను పరిష్కార వేదికల్లో కూడా వాటిని పరిష్కరించుకోవచ్చన్నారు. మొండి బకాయిదారులకు ఇప్పటికే డిమాండ్ నోటీసులు, వారెంట్లు జారీ చేసినట్లు చెప్పారు. క్షత్రియా హోటల్ యాజమాన్యం ఈ నెల 29వ తేదీ వరకు చెల్లిస్తామని హామీనిచ్చిందని, ఒకవేళ చెల్లించకపోతే హోటల్ సీజ్ చేస్తామని చెప్పారు. ఇప్పటికే ఆస్తులు జప్తు చేస్తామని మొండి బకాయిదారులకు నోటీసులు కూడా అందించినట్లు చెప్పారు. పన్నులు చెల్లించకుంటే ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు.

## ఆదమరిస్తే అంతే..



పంజగుట్ట ప్రధాన రహదారి మోడల్ హౌజ్ వద్ద దెబ్బతిన్న మ్యాన్‌హోల్

బంజారాహిల్స్: పంజగుట్ట ప్రధాన రహదారి మోడల్ హౌజ్ ఎదుట ఓ భారీ మ్యాన్‌హోల్ దెబ్బతిని రెండు రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ రోడ్డులో పగలు, రాత్రి అన్న తేడా లేకుండా వేలాది వాహనాలు, వాహనదారులు ప్రయాణిస్తుంటారు. రెండు రోజుల క్రితం మ్యాన్‌హోల్ మూత పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా ఉండటంతో ట్రాఫిక్ పోలీసులు వాహనదారులను అప్రమత్తం చేసేందుకు ప్లాస్టిక్ కోన్స్‌ను ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. గడిచిన మూడు నెలల్లో ఇక్కడ ఉన్న మ్యాన్‌హోళ్లు దెబ్బతినడం ఇది రెండోసారి అని స్థానికులు తెలిపారు.

## ముదిరాజ్‌ల ప్రయోజనాలే లక్ష్యం

- తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్



మాట్లాడుతున్న డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్న ముదిరాజ్‌ల ప్రయోజనాలే లక్ష్యంగా ప్రణాళికతో ముందడుగు వేద్దామని తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. హైదర్‌గూడలోని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యాలయంలో లాల్‌దర్వాజా ముదిరాజ్ ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌ల సామాజిక, ఆర్థిక స్థితిగతులను అర్థం చేసుకుని అన్నిరంగాల్లో ముదిరాజ్‌లకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేసి లాల్‌దర్వాజా ప్రాంతంలోని ముదిరాజ్‌ల సమస్యలపై చర్చించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో లాల్‌దర్వాజా ముదిరాజ్ నేతలు విజయ్ కుమార్, జగదీష్, సుధాకర్, ధర్మవీర్, సదా, అనిల్ కుమార్, సురేందర్, సతీష్, కైలాష్, నవీన్, పోసాని అశ్విన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## లక్డీకాపూల్‌లోని ఓ హోటల్ గదిలో వ్యభిచారం

ఖైరతాబాద్: గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్న ఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. లక్డీకాపూల్‌లోని ఓ హోటల్ గదిలో వ్యభిచారం కొనసాగుతోందనే సమాచారం మేరకు ఖైరతాబాద్ పోలీసులు రైడ్ నిర్వహించి ఢిల్లీకి చెందిన ఓ యువతితో పాటు విటుడిని పట్టుకున్నారు. ఢిల్లీకి చెందిన యువతి ప్రతినెలా పలు రాష్ట్రాలు తిరుగుతూ వ్యభిచారం నిర్వహిస్తోంది. ఈ క్రమంలో లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌కు వచ్చిన ఆమె హోటల్ గదిలో వ్యభిచారం చేస్తుండగా పోలీసులు శనివారం రాత్రి రైడ్ నిర్వహించి ఆమెను హోంకు తరలించారు. సహకరించిన పబ్ నిర్వాహకుడు కార్తీక్ దాస్‌ను రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి సెల్‌ఫోన్‌తో పాటు రూ.9వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

## రాష్ట్రంలో తగ్గుతున్న సంతాన సాఫల్య రేటు



సదస్సులో సంతానోత్పత్తి నిపుణులు, గైనకాలజిస్టులు

బంజారాహిల్స్: అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ)లో వచ్చిన ఆధునిక పరిణామాలపై నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ, ద అబ్‌స్టెట్రిక్ అండ్ గైనకాలాజికల్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్(ఓజీఎస్‌హెచ్) సంయుక్త ఆధ్వర్యంలో బంజారాహిల్స్ తాజ్‌కృష్ణా హోటల్‌లో సంతాన సాఫల్య సదస్సును మంగళవారం నిర్వహించారు. నగరవ్యాప్తంగా ఉన్న గైనకాలజిస్టులు, ఫెర్టిలిటీ నిపుణులు సుమారు 500 మంది వరకు హాజరై పలు సమస్యలపై లోతుగా విశ్లేషించారు. ఈ సదస్సుకు ఫిగో గౌరవ కోశాధికారి డాక్టర్ శాంతకుమారి, ఓజీఎస్‌హెచ్ కార్యదర్శి డాక్టర్ మంజులరావు, ఓ నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీకి చెందిన డాక్టర్ హిమదీప్తి, డాక్టర్ సరోజ కొప్పుల, సంతానోత్పత్తి నిపుణులు డాక్టర్ దుర్గా వైట్ల, డాక్టర్ దివ్యారెడ్డి తదితరులు హాజరై ప్రసంగించారు. సంతానోత్పత్తి, సంతాన సాఫల్య రేటు రాష్ట్రంలో గణనీయంగా పడిపోతోందన్నారు. జీవనశైలి మార్పు, ఆలస్యంగా గర్భం దాల్చడం, జీవితంలో పెరుగుతున్న ఒత్తిడి వంటి అంశాలు మహిళలు, పురుషుల్లో సంతాన లేమికి కారణం అవుతున్నాయన్నారు. అండాల ఫ్రీజింగ్‌పై అవగాహన పెరుగుతోందన్నారు. పిల్లలను కనే విషయంలో ఆలస్యం చేయవద్దన్నారు.

# ఖైరతాబాద్‌లో ఫ్లెక్సీ వార్



కేబీఆర్ పార్కు కూడలిలో రాజు యాదవ్‌కు సీటివ్వాలంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ. చించేసిన అనంతరం

- ఉప ఎన్నిక వస్తే రాజు యాదవ్‌కు సీటు ఇవ్వాలంటూ ఫ్లెక్సీలు
- చర్చనీయాంశమైన ఫ్లెక్సీ వ్యవహారం
- సాయంత్రానికి ఫ్లెక్సీలను చించేసిన గుర్తు తెలియని వ్యక్తులు

బంజారాహిల్స్: మొన్నటి పార్లమెంటు ఎన్నికలు ముగిసిన నాటి నుంచి ఖైరతాబాద్‌లో ఏ రాజకీయ నేత నోట విన్నా ఉప ఎన్నికల మాట వినబడుతూనే ఉంది. సుప్రీం కోర్టులో కేసు బెంచి మీదికి వచ్చిన ప్రతీసారి ఈ ఉప ఎన్నిక టాపిక్ నియోజకవర్గంలో హాట్‌టాపిక్‌గా మారుతోంది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పాటు పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థిగా సైతం పోటీ చేశారు. అప్పటి నుంచి అనర్హత వేటు వార్తలు ఎప్పటికప్పుడు గుప్పుమంటూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం కేబీఆర్ పార్కుతో పాటు నియోజకవర్గంలోని పలు కూడళ్లలో ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైతే కాంగ్రెస్ పార్టీ కోసం 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న పంజగుట్ట మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ నేత రాజు యాదవ్‌కు టికెట్ కేటాయించాలంటూ ఫ్లెక్సీలు దర్శనమిచ్చాయి. ఖైరతాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల పేరుతో ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీ వ్యవహారం నియోజకవర్గ వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఈ వ్యవహారంపై దానం వర్గం గుర్రుగా ఉండగా ఈ ఫ్లెక్సీలు ఎవరు ఏర్పాటు చేశారన్న దానిపై అంతా ఆరా తీశారు. సాయంత్రానికి కేబీఆర్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు చించేయడం కొసమెరుపు.

## మాలలకు అవకాశాలు అందకుండా చేయడం రాజ్యాంగ విరుద్ధం



మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య

ఖైరతాబాద్: వర్గీకరణ చేసి దళితులను విభజించి రాజ్యాంగం కల్పించిన సమాన అవకాశాలను అందుకోకుండా చేయడం రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆరోపించారు. మింట్ కాంపౌండ్‌లోని అంబేద్కర్ స్ఫూర్తి భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తప్పుల తడకగా ఉన్న జస్టిస్ శమీమ్ అక్తర్ కమిషన్ రిపోర్టు ఆధారంగా ఎస్సీ వర్గీకరణ చేయడంతో దళితులను విభజించి రాజ్యాంగం కల్పించిన అవకాశాలను అందుకోకుండా చేయడమే అన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలోని 10 జిల్లాల్లో ఎస్సీల జనాభా, 54,32,680గా ఉంటే షమీమ్ అక్తర్ కమిషన్ ఇచ్చిన నివేదికలో మూడు గ్రూపులకు కలిపి జనాభాను 52,17,580గా చూపించి, మాలల జనాభాను 2,15,100 మందిని తగ్గించి చూపించి మాలలకు అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల కాలంలో రాష్ట్రంలో మాదిగలు అభివృద్ధి చెందారని లెక్కలు తెలియజేస్తుంటే మాలలను అభివృద్ధి చెందిన గ్రూపులో చేర్చి అన్యాయం చేశారన్నారు. ప్రస్తుతం మాల సమాజం ఆవేదనతో ఉందని, త్వరలో పోరాటం కొనసాగిస్తామన్నారు. సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జూర్గుల వెంకటేశ్వర్లు, మాల మహానాడు సీనియర్ నాయకులు జంగా శ్రీనివాస్, ఆనంద్‌రావు, మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం.సరళ, శ్రీకాంత్, రామాజనేయులు, అనిల్‌కుమార్, బాలకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## టౌన్‌ప్లానింగ్‌లో అక్రమాలను అడ్డుకోవాలని ఫిర్యాదు

సనత్‌నగర్: జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అక్రమాలు అడ్డుకోవాలని బేగంపేటకు చెందిన దళిత చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ కోరారు. ఈ మేరకు చీఫ్ సిటీ ప్లానర్ (సీసీపీ)ని మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. బేగంపేట, సికింద్రాబాద్ సర్కిళ్ల పరిధిలో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలే కనిపిస్తున్నాయని, ఇందుకు చైన్‌మెన్లు పెద్దమొత్తంలో ముడుపులు తీసుకుంటూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ముందుగా చైన్‌మన్లపై చర్యలు తీసుకోవాలనిచ, అలాగే జీహెచ్ఎంసీ పరిధిలో న్యాక్ ఇంజినీర్ల వ్యవస్థను కూడా పూర్తిగా తొలగించాలన్నారు. సీసీపీ కూడా సానుకూలంగా స్పందించారని నవీన్‌కుమార్ తెలిపారు.

## పూటకో మాట మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

- బీసీలకు క్షమాపణ చెప్పాలని బీసీ సంఘాల డిమాండ్



ఆర్.కృష్ణయ్య చిత్రపటాలను చూపుతున్న బీసీ సంఘాల నేతలు

హిమాయత్‌నగర్: 42 శాతం బీసీ రిజర్వేషన్లను పార్లమెంట్‌లో ఆమోదింపజేసే బాధ్యత బీసీ నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తీసుకోవాలని, లేదంటే బీజేపీకి రాజీనామా చేయాలని పలు బీసీ విద్యార్థి, యువజన, సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యామ్ కురుమ, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తదితరులు మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా బీసీ నేతగా, బీసీ ఉద్యమాలు చేస్తున్నానని చెప్పుకుంటూ అగ్ర కుల ప్రభుత్వాలతో కొట్లాడకుండా బీసీ ఉద్యమలను తాకట్టుపెట్టి వ్యక్తిగతంగా పదవులు పొందిన ఘనత బీజేపీ నాయకుడు ఆర్.కృష్ణయ్యకే దక్కిందన్నారు. పార్టీ మారుతూ పూటకో మాట మాట్లాడుతున్న కృష్ణయ్య బీసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. త్వరలోనే రాష్ట్రంలో ఉన్న బీసీ మేధావులు, కుల సంఘాలు, విద్యార్థి, యువజన, మహిళ సబ్బండ కులాలతో కలిసి నగరంలో బీసీ దర్బార్ ఏర్పాటు చేసి కృష్ణయ్య చీకటి రాజకీయాలను వివరిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు రావులకోల్ నరేష్ ప్రజాపతి, బీసీ జనసైన్యం రాష్ట్ర అధ్యక్షుడు సింగం నగేష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరసింహ నాయక్, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈడిగ శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మాదేశి రాజేందర్ గంగపుత్ర, నాయకులు నాగరాజుగౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

# ఖాళీ జాగాలో వారాంతపు సంత

- ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



ఫిలింనగర్‌లోని ఖాళీ జాగాను పరిశీలిస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా

ఫిలింనగర్: చిరు వ్యాపారులు వారాంతపు సంతలో కూరగాయలు విక్రయించేందుకు రోడ్డును ఆక్రమిస్తుండటంతో అంబులెన్స్‌లు కూడా రాకపోకలు సాగించలేని పరిస్థితులు తలెత్తుతున్నాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు ఇటీవలే వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా ఫిలింనగర్‌లోని ఏబీఎస్ నుంచి దర్గా వెళ్లే రోడ్డులోని వారాంతపు సంతను మరోచోటికి మార్చారు. ఫలితంగా చిరువ్యాపారులు ఇరుకైన స్థలంలో దుకాణాలు నిర్వహించుకోలేక ఇబ్బందులు పడుతుండటంతో మంగళవారం జీహెచ్ఎంసీ సర్కిల్-18 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆయన ఫిలింనగర్‌లో పర్యటించారు. ఏబీఎస్ నుంచి దర్గా వెళ్లే రోడ్డులో దీన్‌దయాళ్‌నగర్ బస్తీ వెనుక సీతారామస్వామి దేవాలయం వరకు సుమారు అర ఎకరం ఖాళీ స్థలం ఉండగా, ఇక్కడ సంత నిర్వహించుకోవడంతో పాటు రోడ్ల పక్కన ఉన్న చిన్న దుకాణదారులు కూడా ఇక్కడే తమ షాపులు ఏర్పాటు చేసుకునే విధంగా పరిశీలించారు. రాళ్లు, మట్టి దిబ్బలతో నిండి ఉన్న ఈ ప్రాంతాన్ని క్లీన్ చేస్తే వారాంతపు సంతతో పాటు ఈ రోడ్డులో ఫుట్‌పాత్‌లు, రోడ్లపై ఏర్పాటు చేసిన దుకాణదారులకు కూడా షెల్టర్ ఇచ్చేందుకు అవకాశం ఏర్పడుతుందని వారు తెలిపారు. స్థానిక నేతలు రామాంజనేయులు, శ్రీశైలం కూడా అధికారులతో పాటు పర్యటించి ఈ స్థలాన్ని క్లీన్ చేస్తే కూరగాయలు విక్రయించేవారికి, ఇతర చిరు వ్యాపారులకు ఎంతో వెసులుబాటు ఉంటుందని సూచించారు. అధికారుల నిర్ణయం పట్ల స్థానికులు కూడా హర్షం వ్యక్తం చేశారు. సంతలో కూరగాయలు అమ్ముతూ వందల మంది ఉపాధి పొందుతున్నారని, రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై దుకాణాలు ఏర్పాటు చేసుకుని చాలామంది ఉపాధి పొందుతున్నారని, వీరంతా ఉపాధి కోల్పోకుండా చూస్తామని అధికారులు తెలిపారు. జీహెచ్ఎంసీ అధికారులు కూడా ఖాళీగా ఉన్న ఈ ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు అంగీకరించింది. అధికారుల నిర్ణయాన్ని స్థానికులు కూడా స్వాగతించారు.

## 28న ఫార్మసిస్ట్ పోస్టులకు జాబ్‌మేళా

సాక్షి, సిటీబ్యూరో: ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో, అపోలో ఫార్మసీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్‌మేళా ఉంటుంది. అపోలో ఫార్మసీలో ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్టులుగా పనిచేయడానికి అర్హులైన వంద మందిని ఎంపిక చేయనున్నారు. డీ ఫారసీ, బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డిగ్రీ చేసిన 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయసు గలవారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చని యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఒక ప్రకటనలో తెలిపింది. వేతనం కనీసం రూ.11 వేల నుంచి రూ.25 వేల వరకు ఉంటుంది. ఆసక్తి ఉన్నవారు విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్‌తో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరోలో హాజరు పేర్కొన్నారు.

## ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

**రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత**



మాట్లాడుతున్న కల్వ సుజాత

మేడ్చల్: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని, అందుకు తన వంతు సహకారం అందిస్తానని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత అన్నారు. మంగళవారం మేడ్చల్ పట్టణంలో నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ, యువజన, మహిళా కమిటీల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఆర్యవైశ్యులు వినియోగించుకోవాలని, రాజకీయంగా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ముద్రించిన ఉగాది పంచాంగాన్ని ఆవిష్కరించారు. అనంతరం మేడ్చల్ మండల అధ్యక్షుడు వీరమల్లు శ్రావణ్ గుప్తా, మున్సిపాలిటీ అధ్యక్షుడు సకిలం చంద్రమౌళి, మేడ్చల్ మండల యువజన విభాగం అధ్యక్షుడు బొమ్మ వెంకట్, మహిళా అధ్యక్షురాలు రాగం సంగీత, ఇతర కార్యవర్గ సభ్యులతో చందా నాగభూషణం ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బెలిదే రమేష్ గుప్తా, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేష్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు చందా నాగభూషణం పాల్గొన్నారు.

## అందాల పోటీలు రద్దు చేయాలని ఆందోళన




నిరసన తెలుపుతున్న భారత జాతీయ మహిళా సమాఖ్య నేతలు

హిమాయత్‌నగర్: భారతదేశ నైతిక విలువలు, సాంస్కృతిక నైతికతను దిగజార్చే అసభ్యకరమైన అందాల పోటీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున మహిళలు ఆందోళన చేశారు. హైదరాబాద్‌లో మే 7 నుంచి 31 వరకు జరిగే 72వ మిస్ వరల్డ్–2025 అందాల పోటీలను వ్యతిరేకిస్తూ మంగళవారం హిమాయత్‌నగర్ జంక్షన్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు సృష్టించడంలో, మహిళల భద్రతను పెంచడంలో, మహిళలపై హింసాత్మక చర్యలను అరికట్టడంలో విఫలమైందన్నారు. సమస్యల నుంచి దృష్టి మరల్చడానికే ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ నాయకురాలు పి.ప్రేమ్ పావని మాట్లాడుతూ అసలే రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉన్నప్పుడు మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించడం మరింత భారం కాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి పడాల నళిని, ఎస్.ఛాయాదేవి, ఫైమీద, ఎన్.కరుణ కుమారి, జ్యోతి శ్రీమాన్, షహనా అంజుమ్, రొయ్యల గిరిజ, ఎం.లక్ష్మి, కె.అరుణ వి.కమల, ఎ.దేవమ్మ, సీహెచ్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ డ్రైనేజీపై కౌంటర్ వేయండి

**రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**

సాక్షి, హైదరాబాద్: రాజధానిలోని మోతీదర్వాజ నుంచి టోలిచౌకి వరకు భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సర్కార్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ డ్రైనేజీ నిర్మాణం కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఇళ్లలో ప్రకంపనలు వస్తున్నాయని, దీనిపై విచారణ జరపాలని హైకోర్టుకు నగరవాసి ఒకరు లేఖ రాశారు. ఇళ్లకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా నిర్మాణం చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ లేఖను సుమోటో టేకెన్ అప్ పిల్‌గా విచారణ జరిపేందుకు ఉన్నత న్యాయస్థానం అంగీకరించింది. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం విచారణ చేపట్టింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవేజ్ బోర్డు తరఫున న్యాయవాది వీరేశ్ కుమార్, రెవెన్యూ తరఫున జీపీ మురళీధర్‌రెడ్డి హాజరయ్యారు. ఇప్పటికే దాదాపు డ్రైనేజీ నిర్మాణం పూర్తయిందని జీహెచ్‌ఎంసీ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. డ్రైనేజీ నిర్మాణంపై మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేసింది.

# ఎంఎంటీఎస్ రైళ్లలో భద్రత పెంపు

- యువతిపై అత్యాచారయత్నం ఘటన నేపథ్యంలో చర్యలు
- అధికారులకు దిశానిర్దేశం చేసిన దక్షిణ మధ్య రైల్వే జీఎం
- కంపార్ట్‌మెంట్లలో అధిక సంఖ్యలో ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది మోహరింపు



ఎంఎంటీఎస్ రైళ్లలో మంగళవారం తనిఖీలు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది

సాక్షి, సిటీబ్యూరో: సబర్బన్ విభాగాల్లో రాకపోకలు సాగించే రైళ్లలో మహిళా ప్రయాణికుల భద్రతను పెంచే దిశగా దక్షిణ మధ్య రైల్వే చర్యలు చేపట్టింది. రెండు రోజుల క్రితం ఎంఎంటీఎస్ రైలులో చోటుచేసుకున్న అత్యాచారయత్నం ఘటన దృష్ట్యా అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు మంగళవారం సికింద్రాబాద్ రైల్‌నిలయంలో నిర్వహించిన సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ మహిళా ప్రయాణికుల భద్రతపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. బోగీల్లో అత్యవసర ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళల కంపార్ట్‌మెంట్లు, ఎంఎంటీఎస్ రైళ్లలో ఎక్కువ మంది మహిళా రైల్వే రక్షక దళ సిబ్బంది(ఆర్పీఎఫ్), ప్రభుత్వ రైల్వే పోలీస్(జీఆర్పీ) సిబ్బందిని మోహరించాలని సూచించారు. ఎంఎంటీఎస్ రైళ్లలో అర్ధరాత్రి, తెల్లవారుజామున ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు తప్పనిసరిగా గస్తీ నిర్వహించాలని సూచించారు.

### బోగీల్లో అత్యవసర ఫోన్ నెంబర్లు

- ఎంఎంటీఎస్‌తోపాటు అన్ని రైళ్లు, మహిళల కోచ్‌లు, అన్ని స్టేషన్‌లలో అత్యవసర ఫోన్ నంబర్లను ప్రదర్శించాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. రైల్వే స్టేషన్లలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా క్రమం తప్పకుండా ప్రయాణికుల భద్రతపై అవగాహన కార్యక్రమాలను ప్రచారం చేయనున్నారు.
- రైల్వే ప్రాంగణంలో పోస్టర్‌లను ఏర్పాటు చేస్తారు. హెల్ప్‌లైన్ నంబర్‌లను ప్రదర్శిస్తారు.
- అనుమానాస్పద వ్యక్తులు తారసపడినప్పుడు అధికారులకు సమాచారం అందజేసేందుకు ప్రయాణికులకు అవగాహన కల్పించే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేయనున్నారు.
- మహిళలపై జరిగే నేరాలపై తక్షణ స్పందన, దర్యాప్తు కోసం ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలి. ఉమ్మడి టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
- ఆర్పీఎఫ్ మేరీ సహేలి బృందాలు మహిళా ప్రయాణికుల భద్రతపైన నిరంతరం అప్రమత్తంగా ఉండాలి.
- అన్ని స్టేషన్‌లలో లైటింగ్ సదుపాయాన్ని పెంచాలని, అసాంఘిక శక్తుల కదలికలను గుర్తించేందుకు భద్రతా విభాగాలు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని నిర్ణయించారు.

### త్వరలో సీసీ కెమెరాలు....

- రియల్ టైమ్ పర్యవేక్షణతో అన్ని కంపార్ట్‌మెంట్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు.
- ప్రయాణికుల భద్రతపై కోచ్‌లలో డిస్‌ప్లే స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తారు.
- ప్రతి మహిళా కోచ్‌లో పానిక్ బటన్ ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేయాలని నిర్ణయించారు.
- భద్రతా హెల్ప్‌లైన్ 139ను మొబైల్ యాప్‌తో అనుసంధానించనున్నారు.
- మహిళా ప్రయాణికుల ఫిర్యాదులు, అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం మహిళా ఆర్పీఎఫ్ వాట్సాప్ గ్రూపులను విస్తృతం చేయనున్నారు.
- మద్యం సేవించి ఎంఎంటీఎస్ రైళ్లలోకి వచ్చేవారిని గుర్తించేందుకు బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షించనున్నారు.

## బీసీ రిజర్వేషన్లపై ఆర్.కృష్ణయ్య బాధ్యత తీసుకోవాలి

**పలు బీసీ విద్యార్థి, యువజన, సంక్షేమ సంఘాల నాయకుల డిమాండ్**



సమావేశంలో ఆర్.కృష్ణయ్య చిత్ర పటాలను చూపుతున్న బీసీ సంఘాల నేతలు

హిమాయత్‌నగర్ : నలభై రెండు శాతం బీసీ రిజర్వేషన్లను పార్లమెంట్‌లో ఆమోదింపజేసే బాధ్యత బీసీ నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తీసుకోవాలని, లేదంటే ఆయన అధికార బీజేపీకి రాజీనామా చేయాలని పలు బీసీ విద్యార్థి, యువజన, సంక్షేమ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యామ్ కురుమ, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా అగ్రకుల ప్రభుత్వాలతో కొట్లాడకుండా బీసీ ఉద్యమాలను తాకట్టు పెట్టి వ్యక్తిగతంగా పదవులు పొందిన ఘనత ఆర్.కృష్ణయ్యదేనని దుయ్యబట్టారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్‌పైకి కృష్ణయ్య తన అనుచరులను ఉసిగొలిపి అసభ్య పదజాలంతో దూషిస్తూ 'రాళ్లతో కొట్టి చంపుతాం, మాఫియాలతో చంపిస్తాం'అంటూ మాట్లాడటం దుర్మార్గమని అన్నారు. త్వరలోనే బీసీ మేధావులు, కుల సంఘాలు, విద్యార్థి, యువజన, మహిళలతో కలిసి హైదరాబాద్‌లో బీసీ దర్బార్ ఏర్పాటు చేసి కృష్ణయ్య చీకటి, మాఫియా రాజకీయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తామని అన్నారు. సమావేశంలో బీసీ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు రావులకోల్ నరేష్ ప్రజాపతి, బీసీ జనసైన్యం రాష్ట్ర అధ్యక్షుడు సింగం నగేష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరసింహ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సంగీత విద్వాంసుడు ఉషాకాంత్ కన్నుమూత



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు, గీత రచయిత ఉషాకాంత్ మంగళవారం మధ్యాహ్నం కన్నుమూశారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి, సంగీతంలోని అనేక విభాగాల్లో ప్రతిభను చాటారు. ఉషాకాంత్ అద్భుతమైన కచేరీలలో సంగీత బ్యాలెట్లు శ్రీ దత్త గాథ, కల్యాణ రామం, గీత గోవిందం, ఆండాళ్ కళ్యాణం, సప్త చల సంకీర్తనలు వంటివి ఉన్నాయి. టీటీడీ ప్రాజెక్టు 'పలికేది భాగవత మాత', 'చిలక పలుకులు'(తెలుగు నర్సరీ రైమ్స్) వంటి ప్రశంసలు పొందిన మ్యూజికల్ ఆల్బమ్స్ రూపొందించారు. ఘంటసాల అవార్డు (2003), శివగంగ (మ్యూజికల్ బ్యాలెట్), చలో–ఢిల్లీ (పిల్లల చిత్రం) కోసం జాతీయ అవార్డులు ఉన్నాయి. ఆయనకు కుమారుడు డాక్టర్ శ్రీకాంత్, కూతురు రాధికా లక్ష్మణ్ ఉన్నారు. అంత్యక్రియలు బుధవారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో జరగనున్నాయి.

## 'యువ వికాసం'లో రేషన్‌కార్డు నిబంధన తొలగించాలి

**– ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్**

హిమాయత్‌నగర్: రాజీవ్ యువ వికాస పథకం పేరుతో నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేస్తోందని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర విమర్శించారు. మంగళవారం ఏఐటీయూసీ భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే రేషన్ కార్డు తప్పనిసరని ప్రభుత్వం ప్రకటించిందని, ఈ నిబంధనను తొలగించాలని అన్నారు. 11 ఏళ్లుగా రేషన్‌కార్డులే జారీ చేయలేదని, వాటిల్లో యువత పేర్లు కూడా నమోదు కాలేదన్నారు. ఇలాంటి తరుణంలో ఈ పథకానికి యువత ఎలా దరఖాస్తు చేసుకుంటారని ప్రశ్నించారు. రేషన్ కార్డు లేని నిరుద్యోగ యువత గురించి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్నవారు తాజా యువ వికాస పథకం దరఖాస్తు చేసుకోగా, తిరస్కరణకు గురవుతున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్, నాయకులు మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి

- గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ డిమాండ్
- ధర్నాచౌక్‌లో భారీ ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న యూనియన్ గౌరవ అధ్యక్షుడు పాలడుగు భాస్కర్

కవాడిగూడ: సమస్యల పరిష్కారానికి గ్రామపంచాయతీ కార్మికులు కదిలివచ్చారు. ధర్నాచౌక్ దద్దరిల్లింది. గ్రామపంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, వేతనాలు పెంచాలని, ఆరు నెలల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని నినదించారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో గ్రామపంచాయతీ కార్మికుల చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న 60 వేల మంది కార్మికులకు ఆరు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా గ్రీన్ చానల్ ద్వారా చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఎన్నికల హామీలు అమలు చేయడం లేదని ఆరోపించారు. గ్రామపంచాయతీ సిబ్బందిని 2వ పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్‌లను సహాయ కార్యదర్శులుగా నియమించి అర్హులైన వారికి ప్రమోషన్ కల్పించాలన్నారు. ధర్నాలో యూనియన్ అధ్యక్షుడు జి.పాండు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటయ్య, కార్యదర్శి పి.సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గణపతిరెడ్డి, మహిళా కన్వీనర్ పుట్టా యాదమ్మ, ఉపాధ్యక్షులు మహేష్, అప్పిరెడ్డి, ఎస్.రాంచందర్, వెంకట్‌గౌడ్, దశరథ్, మల్లేష్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## స్ట్రీట్ లైట్ల నిర్వహణపై అవగాహన

లక్డీకాపూల్: నగరంలోని అన్ని స్ట్రీట్ లైట్లను సమర్థవంతంగా నిర్వహించడంలో స్ట్రీట్ లైట్ నిర్వహణ యాప్ కీలకమైనదని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో గ్రేటర్ పరిధిలోని అన్ని డివిజన్ల విద్యుత్ ఇంజనీర్లు, డివిజన్ ఎలక్ట్రీషియన్లు, టీజీ ఆన్‌లైన్ ఏజెన్సీ ద్వారా స్ట్రీట్ లైటింగ్ నిర్వహణ వ్యవస్థపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ స్ట్రీట్ లైట్ నిర్వహణ సిస్టమ్ యాప్ ద్వారా విద్యుత్ మీటర్లు, సెంట్రలైజ్డ్ కంట్రోల్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ ప్యానల్స్, లైట్లు, పోల్స్ వంటి అన్ని ఆస్తుల వివరాలను నమోదు చేసి వాటి పనితీరును ట్రాక్ చేయనున్నామని తెలిపారు. ఎక్కడైనా వీధి దీపాలు పని చేయకపోతే ఆ సమస్యను తక్షణమే గుర్తించి పరిష్కరించవచ్చన్నారు. ప్రత్యేకించి లైట్ల మరమ్మతులను వేగంగా చేయడం ద్వారా నగరవాసులకు మెరుగైన సేవలు అందించవచ్చని పేర్కొన్నారు. టీజీ ఆన్‌లైన్ ఏజెన్సీ ప్రతినిధులు యాప్ వినియోగంపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. స్ట్రీట్ లైట్ల ఆడిట్, డేటా ఎంట్రీ, మరమ్మతుల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు, జీహెచ్‌ఎంసీ విద్యుత్ విభాగానికి చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లతోపాటు డివిజన్ ఎలక్ట్రీషియన్లు పాల్గొన్నారు.



స్ట్రీట్ లైట్ల నిర్వహణ యాప్ శిక్షణ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

## రక్షణ చట్టం కోసం న్యాయవాదుల ఆందోళన

**అసెంబ్లీ ముట్టడికి యత్నం.. పలువురి అరెస్టు**



న్యాయవాదులను అరెస్ట్ చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు

సిటీ కోర్టులు: న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, రక్షణ చట్టాన్ని తీసుకురావాలని నాంపల్లి, సిటీ సివిల్ కోర్టులతోపాటు సిటీలోని అన్ని కోర్టుల న్యాయవాదులు ఆందోళనబాట పట్టారు. అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది ఇజ్రాయేల్ రెండు రోజుల కిందట ఓ వ్యక్తి చేతిలో దారుణంగా హత్యకు గురైన నేపథ్యంలో మంగళవారం సిటీలోని అన్ని కోర్టుల న్యాయవాదులు విధులను బహిష్కరించి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజావర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు రోడ్లపై బైఠాయించారు. అనంతరం అసెంబ్లీ ముట్టడికి యత్నించగా పోలీసులు వారిని అరెస్ట్ చేసి నాంపల్లి, కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. 2021లో మంథని ప్రాంతంలో న్యాయవాదులైన వామనరావు దంపతుల హత్య జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు అనేక మంది న్యాయవాదులపై దాడులు జరిగినా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎల్.ప్రభాకర్, గంప వెంకటేశం, డి.వెంకటేష్, కొండారెడ్డి, కె.నరేందర్, రవి కిషోర్, జక్కుల లక్ష్మణ్, సుదర్శన్, మల్లేశ్, మామిడాల రమేశ్, పలువురు మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

# నడకకు దారేది..!

- చార్మినార్ పరిసరాల్లో రంజాన్ మార్కెట్ కిటకిట
- సందర్శకులు, కొనుగోలుదారుల పడరాని పాట్లు



చార్మినార్- చార్ కమాన్ రోడ్డులో కాలు తీసి కాలు పెట్టలేని రద్దీ

చార్మినార్: చార్మినార్ పరిసరాల్లో అడుగడుగునా రద్దీ.. కనుచూపు మేర రంజాన్ శోభ.. చిరు వ్యాపారుల సందడి.. కొనుగోలుదారులతో కోలాహలం.. పగలు, రాత్రి తేడా లేకుండా అక్కడ రంజాన్ మార్కెట్ కిటకిటలాడుతోంది. జంటనగరాలకు చెందినవారే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం చార్మినార్ ప్రాంతానికి తరలివచ్చి ఇష్టమైన వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. చార్మినార్, మక్కా మసీదు సందర్శనకు వచ్చే పర్యాటకులు కూడా తోడవ్వడంతో ప్రతిరోజు మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి దాటిన అనంతరం కూడా రద్దీ కొనసాగుతోంది. చార్మినార్ కట్టడం చుట్టూ ఉన్న గ్రానైట్ రోడ్లన్నీ చిరువ్యాపారులతో నిండిపోయాయి. కనీసం నడకకు కూడా దారి దొరకడం లేదు. వెళ్లేందుకు ఒక దారి.. వచ్చేందుకు మరోదారి ఏర్పాటు చేయాల్సిన సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో వినియోగదారులు, సందర్శకులు పడరాని పాట్లు పడుతున్నారు. ఒక క్రమపద్ధతిలో వ్యాపారాలు కొనసాగడం లేదు. కాలినడకన వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని వినియోగదారులు కోరుతున్నారు.



చార్మినార్ చుట్టూ కొనసాగుతున్న రంజాన్ మార్కెట్

### చార్మినార్ రంజాన్ మార్కెట్ కిటకిట

చార్మినార్ రంజాన్ మార్కెట్‌లోకి వెళ్లడం, బయటికి రావడం కూడా కష్టతరంగా మారింది. రంజాన్ మార్కెట్‌లోకి కొత్తగా అడుగుపెట్టే వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. అఫ్జల్‌గంజ్ దాటి నయాపూల్ మీదుగా మదీనా ద్వారా పాతబస్తీలోకి అడుగు పెడితే... తాము ఎక్కడున్నామో.. తెలుసుకోలేని అయోమయ పరిస్థితుల్లో ఉంటున్నారు. రంజాన్ మాసం సందర్భంగా చార్మినార్–మక్కా మసీదు ప్రధాన రోడ్డులో కొనసాగుతున్న రంజాన్ మార్కెట్ జనం రద్దీతో కళకళలాడుతోంది. రంజాన్ మాసం సందర్భంగా ఫుట్‌పాత్ విక్రయాలు రోడ్డుపైకొచ్చాయి. అంతటా రంజాన్ మార్కెట్ కనిపిస్తోంది. వినియోగదారులతో దుకాణాలన్నీ బిజీగా మారాయి. పండుగను పురస్కరించుకొని ముస్లిం ప్రజలు పండుగ వస్తువులు ఖరీదు చేయడంలో నిమగ్నం కావడంతో పాతబస్తీ ముఖ్య వ్యాపార కేంద్రాలన్నీ సందడిగా కనిపిస్తున్నాయి.

## స్త్రీల గౌరవం పెంచే విధానాలు కావాలి

**అందాల పోటీలను వ్యతిరేకించిన మహిళా సంఘాలు**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

సుందరయ్య విజ్ఞానకేంద్రం: మహిళలను గౌరవించే, వారి ఔన్నత్యాన్ని చూపించే విధంగా ప్రభుత్వ విధానాలు ఉండాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని ఐద్వా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లు లక్ష్మి మాట్లాడుతూ విభిన్నమైన కళా వారసత్వం ఉన్న తెలంగాణలో ప్రపంచ సుందరి పోటీలను స్వాగతిస్తున్నామని ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ అనడం బాధాకరమని అన్నారు. అందాల పోటీలంటే మహిళల శరీరాలను అవమానించడం తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకురాలు విమలక్క మాట్లాడుతూ మహిళల అందాలను కొలతల చూపడం, అర్ధ నగ్న సౌందర్యాన్ని ప్రదర్శించడం అవమానకరమని అన్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని అందాల పోటీల మీద ఖర్చుపెట్టే బదులు ప్రజలకు విద్యా, వైద్య సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు అనసూయ, ఐద్వా అధ్యక్షురాలు అరుణజ్యోతి, కేఎన్ ఆశాలత, ఝాన్సీ, స్వరూప, ఇందిర పాల్గొన్నారు.

## త్వరలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్

- హామీ ఇచ్చిన పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వీవీ శ్రీనివాసరావు
- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి ధన్యవాదాలు తెలిపిన స్పెషల్ కానిస్టేబుల్ అభ్యర్థులు



ప్రజాభవన్ వద్ద చిన్నారెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్న పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులు


లక్డీకాపూల్: 2018 బ్యాచ్ టీఎస్‌ఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగ నియామక సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను త్వరలోనే ప్రారంభించనున్నట్లు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వీవీ శ్రీనివాసరావు వెల్లడించినట్టు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి తెలిపారు. మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి కార్యక్రమానికి 2018 బ్యాచ్ స్పెషల్ పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు భారీగా తరలివచ్చారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాభవన్ వద్ద బైఠాయించారు. నియామక ప్రక్రియలో జరుగుతున్న జాప్యంపై ఆవేదన చెందారు. ఈ సందర్భంగా సమస్యలను చిన్నారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే పోలీస్ రిక్రూట్‌మెంట్ చైర్మన్ శ్రీనివాసరావును ఫోన్‌లో సంప్రదించగా స్పెషల్ పోలీస్ కానిస్టేబుల్ 2018 బ్యాచ్ విషయమై త్వరలోనే తీసుకుంటామన్నారు. ఈ క్రమంలో నియామక ప్రక్రియ మొదలు పెట్టనున్నట్లు చెప్పారు. దీంతో అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తూ చిన్నారెడ్డికి బొకే ఇచ్చి ధన్యవాదాలు తెలిపారు.

**ప్రజావాణికి 368 దరఖాస్తులు**

ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 368 దరఖాస్తులు అందాయి. అందులో ఇందిరమ్మ ఇళ్ల కోసం 110 మంది అర్జీలు పెట్టుకున్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 76, విద్యుత్ శాఖకు 30, రెవెన్యూపరమైన సమస్యలపై 70 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 54 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నా రెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అప్పటికప్పుడు సంబంధిత అధికారులతో ఫోన్‌లో సంప్రదింపులు జరిపి పలు సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

## ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలి

**తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ**



అభివాదం చేస్తున్న విద్యుత్ జేఏసీ నేతలు

కవాడిగూడ: తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో డిస్కంలలో పనిచేస్తున్న దాదాపు 20 వేల మంది విద్యుత్ ఆర్టిజన్ కార్మికులను అర్హతలను బట్టి జేఎల్‌ఎం, జేపీఏ, జూనియర్ అసిస్టెంట్, సబ్ ఇన్‌జనీర్, ఆఫీస్ సబార్డినేట్‌గా కన్వర్షన్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ జేఏసీ చైర్మన్ కె. ఈశ్వర్‌రావు, కన్వీనర్ ఎంఏ వజీర్ డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ చేపట్టకపోతే నిరవధిక సమ్మెకు పిలుపునిస్తామని హెచ్చరించారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో భారీ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌రావు, వజీర్ మాట్లాడుతూ మంత్రులు, ఉన్నతాధికారులను కలిసి సమస్యలను విన్నవించుకున్నప్పటికీ వారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విధి నిర్వహణలో ఇప్పటికే సుమారు 3 వేల మంది ఆర్టిజన్ కార్మికులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 20 వేల మంది ఆర్టిజన్ కార్మికులు తీవ్రమైన పని భారాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఒకే సంస్థ ఒకే సర్వీస్ రూల్ పద్ధతిని అనుసరించి విద్యుత్ ఆర్టిజన్ కార్మికులందరినీ కన్వర్షన్ చేసే విధంగా ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నేత జె.వెంకటేష్, జేఏసీ కో చైర్మన్‌లు జి.నాగరాజు, నరేందర్, కో కన్వీనర్‌లు కె.వెంకటేష్, కృష్ణమాచారి, వి.తిరుపతి, జేఏసీ నాయకులు చంద్రారెడ్డి, లింగం, మురళీ, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

సాక్షి
11
హైదరాబాద్, బుధవారం, 26, మార్చి, 2025

# సిటీ ప్లస్



గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు

28, 29 తేదీల్లో

## స్పోర్ట్స్ హ్యాకథాన్

టీ కన్సల్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమం

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ కన్సల్ట్ ఆధ్వర్యంలో ఈనెల 28, 29 తేదీల్లో ప్రత్యేక 'స్పోర్ట్స్ హ్యాకథాన్–2025' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ హ్యాకథాన్‌లో భాగంగా అథ్లెటిక్స్, 2–కె అండ్ 5–కె రన్, చెస్, క్యారమ్స్, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, స్కేటింగ్, ఫుట్‌బాల్, స్విమ్మింగ్, టగ్ ఆఫ్ వార్ తదితర పోటీలను నిర్వహిస్తారు. ఈ స్పోర్ట్స్ హ్యాకథాన్‌లో స్కూల్ విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. పాఠశాల ప్రిన్సిపల్, ఫిజికల్ డైరెక్టర్/పీఈటీలు బాధ్యత తీసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన టాప్–50 మంది క్రీడాకారులను ఎంపిక చేసి వారికి క్రీడా నిష్ణాతులతో శిక్షణ ఇప్పించాలని టీ కన్సల్ట్ నిర్ణయించింది. ఈ పోటీలను టీ కన్సల్ట్, డబ్ల్యూటీటీసీ సంయుక్తంగా నిర్వహించనున్నారు. మరిన్ని వివరాలకు 8332888616, 9989938489లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.



ఆఫీసులో ఉండగా కలుద్దామని ఫ్రెండ్ ఫోన్ చేస్తే సమీపంలో ఉన్న ఏ ఛాయ్ క్యాంటీన్ లోనో, కేఫ్‌లోనో కలుద్దాం అని చెబుతాం.. ఏ పార్క్‌లోనో, ట్యాంక్ బండ్ మీదో ఒంటరిగా కూర్చున్నప్పుడు పల్లీలు అమ్మేవాడో, ముంత కింద పప్పు వాడో కనిపిస్తే.. నోటికి పని చెబుతాం.. ఇలా ఎందుకు చేస్తాం? ఆకలి తీర్చుకోడానికా? లేక అవి తినాలనే ఆతృతతోనా? అంటే రెండూ కాదు.. మన మూడ్‌ను మెరుగుపరుచుకోవడం కోసం అంటున్నారు నగరవాసులు.

- సాక్షి, సిటీబ్యూరో



పనిలో మునిగినా, పరీక్షల ఒత్తిడి ఉన్నా స్నాక్స్ రూటు

రొమాంటిక్ సందర్భాల్లోనూ జోడీ కట్టాల్సిందే

స్నాకింగ్‌తో మూడ్ మెరుగు అంటున్న 62 శాతం నగరవాసులు

గోద్రెజ్ అధ్యయనంలో వెల్లడైన వైనం

ఒత్తిడి చిత్తయినా, ఒబెసిటీతో జాగ్రత్తంటున్న వైద్యులు

# స్నాక్స్ ఫర్ రిలాక్స్..



చిరాకుగా ఉన్నా.. చిద్విలాసంతో ఉన్నా.. చిరుతిండికే ఓటు

రోడ్డు పక్కన దొరికే పానీ పూరీ కావచ్చు, థియేటర్‌లో కరకరమనిపించే పాప్ కార్న్ కావచ్చు.. సరదాగా లాగించే సమోసాలు కావచ్చు.. చిద్విలాసంతో నమిలేసే చిప్స్‌కావచ్చు.. ఇవన్నీ ఇంట్లో ముప్పూటలా తినేతిండికి అదనం. మన మూడ్స్‌ను మెరుగుపరిచే ఇంధనం.. గోద్రెజ్ ఫుడ్స్ లిమిటెడ్ ఎస్‌టీటీఈఎమ్ 2.0 స్నాకింగ్ రిపోర్ట్ ప్రకారం గత కొంతకాలంగా అధ్యయనాలు చెబుతున్న ఇదే అంశాన్ని అంగీకరిస్తున్నారు నగరవాసులు. చిరుతిండి మనలో ఉత్సాహాన్ని పెంచుతుంది. మన భావోద్వేగాలను మెరుగుపరచడంలో శక్తిమంతమైన పాత్ర పోషిస్తుందని స్పష్టం చేస్తున్నారు. ఎప్పుడు? ఎందుకు? ఏమిటి ఎలా.. సిటిజనులు స్నాక్‌కు సై అంటున్నారు? ఈ రిపోర్ట్‌లో పేర్కొన్న ప్రకారం చూస్తే..

### మంచి మూడుకు స్నాక్ బూస్ట్..

చిరుతిండి, హ్యాపీ మూడ్స్ ఒకదానికొకటి అనుబంధంగా ఉంటున్నాయనేది స్పష్టంగా తెలుస్తోంది. సర్వేలో పాల్గొన్నవారిలో 62% మంది మూడ్స్‌ను హ్యాపీగా ఉంచడం కోసం స్నాక్స్ తీసుకుంటారని అంగీకరించారు. అదే విధంగా 45% మంది పార్టీలు, వేడుకల సమయంలో ఫ్రోజెన్ స్నాక్స్ కోసం చూస్తామని చెప్పారు. అంటే విభిన్న రకాల వంటకాలు ఉన్నప్పటికీ స్నాక్స్ విలువ తగ్గదు అని దీనిద్వారా తెలుసుకోవచ్చు. ఎందుకంటే అవి వారి అనుభవాలను మరింతగా మెరుగుపరుస్తాయనే ఆలోచనతోనే అని చెబుతున్నారు. అలాగే నగరంలో 45% మంది వారాంతాల్లో కూడా ఫ్రోజెన్ స్నాక్స్‌ను ఇష్టపడతారు. వారి విశ్రాంతి సమయాలకు కొత్త రుచులను జత చేస్తారు.







### టైం ఏదైనా.. అటెన్షన్ కోసం..

పరీక్షల ముందు టెన్షన్ కావచ్చు.. రొమాంటిక్ సమయంలో అటెన్షన్ కావచ్చు.. కాదే సందర్భమూ స్నాకింగ్‌కు అనర్హం అంటున్నారు నగరవాసులు. నగరంలో 17% మంది విద్యార్థులు పరీక్షా సన్నాహక సమయంలో ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం చిరుతిండికి జై కొడుతున్నామని అంటున్నారు. మరోవైపు శృంగార సమయంలోనూ మానసిక స్థితిని బెటర్‌గా ఉంచేందుకు స్నాక్స్ తోడు కోరుకుంటున్నామని 16 శాతం మంది చెప్పారు.

### ఆట పాటల్లోనూ అదే బాట..

ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ పోటీ జరుగుతోంది. ఇలాంటి ప్రత్యక్ష క్రీడా ఈవెంట్‌లను కేఫ్స్‌లోనో, పబ్స్/క్లబ్స్‌లోనో వీక్షించే సమయంలో దాదాపు అందరి ముందూ ఏదో ఒక చిరుతిండి కనబడడం మనం గమనించవచ్చు. ఇదే విషయాన్ని అంగీకరిస్తూ నగరంలో 50% మంది తమ వీక్షణ అనుభవాన్ని మెరుగుపరచుకోడానికి స్నాక్స్‌కి సై అంటారు. అదే విధంగా 54% మంది నగరవాసులు టీవీ/ఒటీటీ/మొబైల్‌లో వెబ్ సిరీస్, సినిమాలు లేదా షోలను చూస్తున్నప్పుడు స్నాక్స్ తీసుకోడాన్ని ఇష్టపడతామని చెప్పారు.

### ఆరోగ్యకరమైనవి ఎంచుకుంటే మేలు..

స్నాక్స్ తీసుకోవడం తప్పుకాకున్నా.. ఒబెసిటీ ముప్పు వెంటాడుతూనే ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మితంగా తీసుకునే చిరుతిండిలో ఆరోగ్యకరమైన బాదం తదితర పప్పులు చేర్చాలని, విటమిన్లు, జింక్, ఫోలేట్ ఐరన్‌తో సహా 15 ముఖ్యమైన పోషకాల సహజ మూలంగా ఆల్మండ్స్ రోగ నిరోధకతను మెరుగుపరుస్తాయని పోషక నిపుణులు చెబుతున్నారు. ఇవి ఎప్పుడైనా ఆస్వాదించడానికి అనుకూలమైన చిరుతిండిగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా తేల్చింది. అలాగే నారింజ, ద్రాక్షపండు వంటి సిట్రస్ పండ్లు విటమిన్–సీ అందిస్తాయి. ఇది తెల్ల రక్త కణాల ఉత్పత్తికి అవసరమైన పోషకం–ఇన్‌ఫెక్షన్‌లకు వ్యతిరేకంగా రక్షణ ఇస్తుంది. ఈ పండ్లను స్నాక్స్‌గా మార్చుకోవడం రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇస్తుంది. అలాగే ఆకుకూరలతో కూడిన వెజ్ సలాడ్స్ కూడా మేలైనవేనని న్యూట్రిషనిస్టులు సూచిస్తున్నారు.

## నగరంలో చిచ్చా రచ్చ..




### హై ఎనర్జీతో రాహుల్ సిప్లిగంజ్ లైవ్ కాన్సర్ట్

సాక్షి, సిటీ బ్యూరో: ప్రముఖ ప్లే బ్యాక్ సింగర్, ఆస్కార్ విన్నర్ రాహుల్ సిప్లిగంజ్ నగర వేదికగా అతిపెద్ద లైవ్ కాన్సర్ట్ నిర్వహించనున్నారు. ఎల్బీ నగర్‌లోని సరూర్‌నగర్ గ్రౌండ్స్ వేదికగా చిచ్చా మాస్ రాంపేజ్ లైవ్ పేరిట అతిపెద్ద ఓపెన్ మ్యూజిక్ కాన్సర్ట్ నిర్వహిస్తున్నారు.! ఈనెల 29న తొలిసారిగా రాహుల్ సిప్లిగంజ్ పాల్గొంటున్న ఈ ఈవెంట్‌లో బీట్స్ మొదలు ఫోక్ సాంగ్స్ వరకూ విభిన్న సంగీత స్వరాలతో అలరించనున్నారు. భారీ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ వేదికగా రాహుల్ సిప్లిగంజ్ తన ఆస్కార్ హిట్ నాటు నాటును లైవ్‌లో పాడనున్నారు. చిచ్చా తన హై–ఎనర్జీ ప్రదర్శన ఆన్‌లైన్ వేదికగా అందుబాటులో ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు.



నగరం విభిన్న సంస్కృతుల సమ్మేళనంతో పాటు విభిన్న కళలకు గమ్యస్థానంగా నిలుస్తోంది. ఈ ఆనవాయితీ ఈనాటిది కాదు. నిజాం కాలం నుంచే వినూత్న, విదేశీ కళలకూ ప్రసిద్ధిగాంచింది. ఇందులో భాగంగానే నగర వేదికగా ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి 'ఇండియా ఆర్ట్ ఫెస్టివల్' (ఐఏఎఫ్) నిర్వహించనున్నారు. న్యూఢిల్లీ, ముంబై, బెంగళూరు వంటి విభిన్న నగరాల నుంచి ప్రముఖ ఆర్టిస్టులు ఈ కళా ఉత్సవంలో తమ కళలను ప్రదర్శించనున్నారు. 2011 నుంచి న్యూఢిల్లీ, బెంగళూరు, ముంబయి నగరాల్లో నిర్వహించే ఈ ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ రెండో ఎడిషన్‌లో భాగంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నారు. ఆర్ట్ ఫెస్టివల్‌తో పాటు ఫ్యూజన్ షోలు, లైవ్ మ్యూజిక్ షోలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో 'ది ఎటర్నల్ కాన్వాస్ - 12,000 ఇయర్స్ జర్నీ త్రూ ఇండియన్ ఆర్ట్' ప్రదర్శన హైలైట్‌గా నిలువనుంది. - సాక్షి, సిటీబ్యూరో

## సాంస్కృతిక నగరిలో.. ఇండియా ఆర్ట్ ఫెస్టివల్



- → ఏప్రిల్ 4 నుంచి 6 వరకూ కింగ్స్ క్రౌన్ కన్వెన్షన్‌లో నిర్వహణ
- → న్యూఢిల్లీ, బెంగళూరు, ముంబైతో పాటు హైదరాబాద్‌లో ఏర్పాటు
- → దేశవ్యాప్తంగా 200 మందికి పైగా కళాకారులు, 3500 పైగా కళాకృతులు

ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ ప్రదర్శనలో ప్రతి రాష్ట్రం నుంచి కళాకారులు పాల్గొనున్నారు. ఇందులో భాగంగానే ప్రత్యేకంగా 25 ఆర్ట్ గ్యాలరీలతో, 100 ఎయిర్ కండిషన్డ్ స్టాల్స్, దేశవ్యాప్తంగా 50 మంది దిగ్గజ కళాకారులతో పాటు దాదాపు 200 మంది ప్రముఖ, యువ, ఔత్సాహిక కళాకారులు రూపొందించిన 3,500 పైగా వైవిధ్యమైన పెయింటింగ్స్, శిల్పాలు ఈ ఆర్ట్ ఫెస్టివల్‌లో ప్రదర్శించనున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ ఆర్ట్ ఫెస్టివల్ రేతిబౌలి (మెహదీపట్నం) పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 68 దగ్గరున్న కింగ్స్ క్రౌన్ కన్వెన్షన్‌లో ఏప్రిల్ 4 నుంచి 6వ తేదీ వరకూ 11:00 నుంచి రాత్రి 8:00 గంటల వరకూ కొనసాగుతుంది.

### ప్రముఖ కళాకారుల ప్రదర్శన..

ప్రముఖ కళాకారులు జోగెన్ చౌదరి, మను పరేఖ్, క్రిషేన్ ఖన్నా, శక్తి బర్మన్, సీమా కోహ్లీ, పరేశ్ మెయితీ, యూసుఫ్ అరక్కల్, ఎస్ జి వాసుదేవ్, అంజోలీ ఎలా మీనన్, అతుల్ దోడియా, లక్ష్మా గౌడ్, టి వైకుంఠం, చింతల జగదీశ్, గిగి సర్కారియా, ఎంవి రమణా రెడ్డి, లక్ష్మణ్ ఏలె, అశోక్ భౌమిక్, గురుదాస్ షెనాయ్, జతిన్ దాస్, పి జ్ఞాన, రమేశ్ గోర్జాల తదితర ప్రముఖ కళాకారుల కళారూపాలు ప్రదర్శనలో కనువిందు చేయనున్నాయి.

### వైవిధ్యమైన కళావేదిక..



కళాకారులు తమ నెట్‌వర్క్ మరింతగా పెంచుకోడానికి, భిన్న రంగాలకు చెందిన ప్రేక్షకుల ఎదుట తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఇది చక్కటి వేదిక. తమ ఇళ్లను చక్కని సృజనాత్మక కళాఖండాలతో అందంగా అలంకరించుకోవాలని ఉవ్విళ్లూరే నగర యువతకు ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ చక్కని వేదికగా నిలుస్తుంది. యువ, మిడ్–కెరీర్ కళాకారులు తమ కళాకృతులను పలువురు దిగ్గజ కళాకారులతో పాటు ప్రదర్శించడానికి 'వన్–స్టాప్ ఆర్ట్ షాప్'గా ఈ వేదిక నిలుస్తుంది. హైదరాబాద్ నగరం నుంచి ఆర్ట్స్‌బ్రీజ్ ఆర్ట్ గ్యాలరీ, గ్యాలరీ సెలెస్టే, ఐకాన్ ఆర్ట్ గ్యాలరీ, స్నేహా ఆర్ట్స్, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ వంటి సంస్థలు తమ కళాకృతులను ప్రదర్శిస్తున్నారు. - రాజేంద్ర, డైరెక్టర్ -ఇండియా ఆర్ట్ ఫెస్టివల్



## అబానాలో రామ్ మిర్యాల లైవ్ మ్యూజిక్

సాక్షి, సిటీబ్యూరో: గచ్చిబౌలి జనార్దన్ హిల్స్‌లోని అబానా క్లబ్, కిచెన్‌లో శుక్రవారం రాత్రి ప్రముఖ సింగర్ రామ్ మిర్యాల లైవ్ మ్యూజిక్ ఉంటుంది. మనసును తాకే సంగీత స్వరాలు, గుర్తుండిపోయే జ్ఞాపకాలను సొంతం చేసుకోడానికి సంగీత ప్రియులు సిద్ధం కావాలని నిర్వాహకులు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి ప్రత్యక్ష ప్రసారం ఉండబోతోందని, ఆసక్తి ఉన్నవారు నిర్ణీత మొత్తాన్ని చెల్లించి తమ స్థానాన్ని రిజర్వు చేసుకోవాలని కోరుతున్నారు.

## ఆరోగ్యమే.. ఆనందం..

లైఫ్ ఈజ్ గుడ్ అధ్యయనంలో వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: జీవితంలో అన్నింటికన్నా మిన్న అయిన ఆనందాన్ని అందించేది ఆరోగ్యమేనని నగరవాసులు భావిస్తున్నారు. నీల్సన్ ఐక్యూ భాగస్వామంతో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ నిర్వహించిన లైఫ్ ఈజ్ గుడ్ అధ్యయనం ఈ విషయాన్ని వెల్లడించింది. నగరాల్లో నివసించేవారిని ఏది ఆనందంగా ఉంచుతోంది అనే అంశంపై నిర్వహించిన ఈ 'లైఫ్ ఈజ్ గుడ్ సర్వే'లో 45% మంది కుటుంబంతో గడిపే క్షణాలే ఆనందాన్ని ఇస్తాయనగా, కెరీర్‌లో విజయం సాధించడం అంటూ 49%, ఆరోగ్యం కీలకమైన అంశంగా 54% మంది చెప్పారు. డిజిటల్ కార్యకలాపాల్లో సామాజిక మాధ్యమాల ద్వారా 39% మంది విద్యార్థులు (18–24) ఆనందాన్ని కనుగొనడం గమనార్హం.





## సరికొత్త.. ఫ్యాషన్ కలెక్షన్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని జూబ్లీహిల్స్‌లో ఉన్న ప్రముఖ మహిళా దుస్తుల బ్రాండ్ హెచ్ అండ్ ఎమ్స్.. సరికొత్త ఫ్యాషన్ దుస్తుల శ్రేణి, యాక్సెసరీస్ నగర మార్కెట్‌లోకి విడుదల చేసింది. ప్రముఖ సంగీత కళాకారులు లైలా, కరోలిన్ పోలాచెక్ బ్రాండ్ అంబాసిడర్లుగా వీటిని విడుదల చేశారు. క్లాసిక్ రాక్ 'ఎన్' రోల్ భారీ షీర్ బ్లౌజ్‌ల నుంచి లేస్–అప్ షర్టింగ్, ట్యూనిక్స్, అల్లిక లేదా కుట్టు అలంకరణలతో కూడిన మినీ–స్కర్టులు, లేజర్–కట్ ప్లీటెడ్ రఫుల్ స్కర్ట్, అద్భుతమైన స్టడెడ్ బ్లేజర్ నుండి 70ల నాటి మల్టీ–పాకెట్ జాకెట్‌ల వరకూ ఈ కలెక్షన్స్‌లో భాగంగా ఉన్నాయని డిజైన్ డైరెక్టర్ ఎలియానా మస్గాలోస్ తెలిపారు.

## స్వచ్ఛమైన తెలుగు హాస్యం

నగరంలోని క్లిఫ్ కేఫ్ వేదికగా ప్రదర్శన




సాక్షి, సిటీ బ్యూరో: సిల్లీ సౌత్ కామెడీ ఆధ్వర్యంలో తెలుగులో క్లీన్ కామెడీ నైట్స్ ప్రదర్శిస్తోంది. హైదరాబాద్‌లో క్లీన్ కామెడీని ప్రోత్సహించడానికి క్లిఫ్ కేఫ్ వేదికగా ప్రదర్శిస్తున్న ఏకైక ఓపెన్ మైక్ ఇది. నగరంలో అసభ్యకరమైన భాష, అనైతికమైన అంశాలు లేకుండా స్వచ్ఛమైన ఆశయాన్ని అందించడానికి ప్రయత్నిస్తున్న ఏకైక కార్యక్రమమని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రస్తుత తరుణంలో పిల్లలతో పాటు కుటుంబ సమేతంగా అన్ని వయసుల వారికీ ఆహ్వానం పలుకుతున్నట్లు పేర్కొన్నారు. ఈ క్లీన్ కామెడీ కార్యక్రమాన్ని రాత్రి 8 గంటల నుంచి నిర్వహించనున్నారు.

# హద్దు మీరొద్దు

## పోలీసుల ఇష్టారాజ్యంపై ఏపీ హైకోర్టు తీవ్ర ఆగ్రహం

- పెద్దల మెప్పు కోసం పని చేయొద్దు.. సమస్య వస్తే వాళ్లు మిమ్మల్ని కాపాడరు
- పరిధులు గుర్తెరిగి పని చేయండి..
- ఏం చేస్తున్నా మేం చూడనట్లు ఉండాలని భావిస్తున్నారు
- పోలీసుల తీరు చూస్తుంటే మాకు బీపీ పెరిగిపోతోంది.. చాలా క్యాజువల్‌గా కేసులు పెడుతున్నారు
- అదే రీతిలో వాంగ్మూలాలను సృష్టిస్తున్నారు.. ప్రభుత్వంపై డ్రామా రూపంలో వ్యంగ్య విమర్శలు తప్పా?
- అది తప్పయితే.. ప్రతీ హీరోను, నటుడిని అరెస్ట్ చేయాలి
- పోలీసులనే కాదు.. మా మేజిస్ట్రేట్‌లను కూడా తప్పుపట్టాలి.. కాగితాల్లో ఏముందో కూడా చూడటం లేదు..
- ఈ విషయాన్ని మేం ఒప్పుకోవాల్సిందే

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

# 'మర్రి'కి అభయమిచ్చే వరకు విస్తరణ వద్దు

- జాతీయ హరిత ట్రిబ్యునల్ తీర్పు.. చేవెళ్ల రోడ్డు విస్తరణకు బ్రేక్
- మళ్లీ నిపుణులతో శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేసి నివేదించాలని ఆదేశం



బీజాపూర్ జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా హైదరాబాద్ శివారులోని అప్పా కూడలి నుంచి మన్నెగూడ కూడలి వరకు నాలుగు వరుసలకు విస్తరించే రోడ్డు ప్రాజెక్టుకు బ్రేక్ పడింది. విస్తరణలో ఎన్‌హెచ్ఏఐ (నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) సరిగ్గా వ్యవహరించకపోవటాన్ని తప్పుపట్టిన జాతీయ హరిత ట్రిబ్యునల్.. మళ్లీ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ రిపోర్టు (పర్యావరణంపై ప్రభావ అంచనా నివేదిక) అందించే వరకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించొద్దని ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం తీర్పు వెల్లడించింది.

- సాక్షి, హైదరాబాద్

నగర శివారులోని అప్పా కూడలి నుంచి చేవెళ్ల–వికారాబాద్ రోడ్డులోని మన్నెగూడ కూడలి వరకు జాతీయ రహదారిని ఎన్‌హెచ్ఏఐ నాలుగు వరుసలతో 60 మీటర్లకు విస్తరించాల్సి ఉంది. ఇది కర్ణాటకలోని బీజాపూర్ వరకు విస్తరించిన రోడ్డు. ఎగువన పరిగి మీదుగా రాష్ట్ర సరిహద్దు వరకు గతంలోనే రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలోని జాతీయ రహదారుల విభాగం ఈ రోడ్డును విస్తరించింది. నగర శివారు నుంచి మన్నెగూడ వరకు 46 కి.మీ. నిడివి ఎన్‌హెచ్ఏఐ అధీనంలో ఉంది. దాదాపు రూ.950 కోట్లతో ఈ పనులు చేపట్టాల్సి ఉంది. మన్నెగూడ వరకు రోడ్డుకిరువైపులా స్వాతంత్ర్యానికి పూర్వం నాటిన 915 మర్రి వృక్షాలున్నాయి. నాలుగు వరుసలకు విస్తరించాలంటే ఈ మొత్తం చెట్లను తొలగించాల్సి వస్తుంది. చేవెళ్ల, మొయినాబాద్ పట్టణాల వద్ద రోడ్డు విస్తరణలో ఇళ్లను కూడా తొలగించాల్సి రావటంతో ఆ రెండు చోట్ల బైపాస్ రోడ్లు నిర్మించాలనుకున్నారు. దీంతో మొయినాబాద్, చేవెళ్ల పట్టణాల వద్ద ఉన్న 232 చెట్లను తొలగించాల్సిన పని లేకుండాపోయింది. ఈ వృక్షాలను కొట్టకుండా కాపాడాలంటూ బాలాంత్రపు తేజ సహా పలువురు సామాజిక కార్యకర్తలు జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. పలుదఫాల విచారణ అనంతరం, ఆ వృక్షాల తొలగింపు వల్ల పర్యావరణంపై ఉండే ప్రభావాన్ని అంచనా వేయాలంటూ కేంద్ర అటవీ, పర్యావరణ శాఖను ట్రిబ్యునల్ ఆదేశించింది. దీంతో గతేడాది జనవరిలో ఆ శాఖ అధీనంలోని నిపుణుల అంచనా కమిటీ (ఈఏసీ) అధ్యయనం చేసి ఎన్‌హెచ్ఏఐకి నివేదిక సమర్పించింది. కొన్ని చెట్ల పరిరక్షణకు వీలుగా సెంట్రల్ మీడియం వెడల్పు తగ్గించామని, దాని వల్ల 50 చెట్లు తొలగించాల్సిన అవసరం లేకుండా పోయిందని, బైపాస్‌ల వల్ల 232 మిగులుతున్నాయని, స్థానిక ముడిమ్యాల అటవీ ప్రాంతం వద్ద మిగిలే మరి కొన్ని చెట్లు సహా మొత్తం 393 వృక్షాలు అలాగే మిగిలి ఉంటాయని, మిగతా వృక్షాలను ట్రాన్స్‌లొకేట్ పద్ధతిలో వేరే చోట నాటుతామని ట్రిబ్యునల్‌కు విన్నవించింది.

**మర్రి వృక్షాలే కేంద్రంగా..**

### ట్రిబ్యునల్ అసంతృప్తి.. ఏమన్నదంటే..

- ఎన్‌హెచ్ఏఐ సమర్పించిన నివేదికపై ట్రిబ్యునల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.
- ప్రస్తుతమున్న అలైన్‌మెంట్ ప్రకారమే రోడ్డును విస్తరించాలని ఎందుకు అనుకుంటున్నారు. కొత్తగా మరో రోడ్డు నిర్మిస్తే అయ్యే నష్టమేంటన్న మాటకు ఎందుకు స్పష్టమైన సమాధానం ఇవ్వటం లేదు.
- మర్రి వృక్షాలు కీలక భాగాల్లో సున్నితంగా ఉంటాయి. వాటిని ట్రాన్స్‌లొకేట్ చేసిన సందర్భంలో మనుగడ శాతం తక్కువగా ఉందని నివేదికలు చెబుతున్నాయి. అందులోనూ ఎక్కువ వయసు ఉన్న వృక్షాల మనుగడలో తీసుకునే చర్యలేమిటో శాస్త్రీయ బద్ధ నివేదిక రూపంలో సమర్పించలేదు.
- ట్రాన్స్‌లొకేట్ చేసిన తర్వాత వృక్షాలు మనుగడ సాగించేందుకు తీసుకునే చర్యలేమిటో ప్రాజెక్టు రిపోర్టులో చేర్చలేదు. దానికి సంబంధించి పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో వెల్లడించలేదు.
- అందుకే మరోసారి శాస్త్రీయపద్ధతిలో నిపుణుల ఆధ్వర్యంలో పర్యావరణ ప్రభావ అంచనా అధ్యయనం నిర్వహించి నివేదిక సమర్పించాలి. అప్పటి వరకు రోడ్డు విస్తరణ పనులను నిలిపివేయాలి.

# ఇచ్చేందుకు కేంద్రం సిద్ధం.. రాష్ట్రాలే వాడుకోవడం లేదు

- పీఎం కుసుమ్, పీఎం సూర్యఘర్ పథకాల వినియోగంలో తెలంగాణ ప్రభుత్వం అనాసక్తి
- రాజ్యసభలో కేంద్ర పునరుత్పాదక శాఖ మంత్రి ప్రల్హాద్ జోషి వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: పీఎం కుసుమ్, పీఎం సూర్యఘర్, సోలార్ పార్క్‌ల ఏర్పాటు వంటి కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను వాడుకోవడంలో గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విఫలం అయ్యాయని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రల్హాద్ జోషి తెలిపారు. తెలంగాణ సర్కారు వైఫల్యం వల్ల 3 వేల మెగావాట్ల ఒప్పందాన్ని ఉపసంహరించుకోవాల్సి వచ్చిందన్నారు. ఈ ప్రాజెక్టులకు కావాల్సిన భూసేకరణ అంశంపై ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపని విషయాన్ని ఇటీవల తనను కలిసిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి తెలియచేశామని కేంద్రమంత్రి పేర్కొన్నారు. సోలార్ పార్క్‌ల కోసం కేంద్రం ద్వారా విరివిగా నిధులు కేటాయిస్తున్నామని, పీఎం కుసుమ్, పీఎం సూర్యఘర్‌లాంటి పథకాల ద్వారా ప్రజలకు సబ్సిడీలు అందిస్తున్నామన్నారు. తెలంగాణకు ఇప్పటికే ఇచ్చిన లక్ష్యాల్ని పూర్తి చేస్తే మరిన్ని నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. రాష్ట్రాలలో ఏ ప్రభుత్వాలు ఉన్నా సహాయం చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ తెలంగాణ సహా కొన్ని రాష్ట్రాలు ఈ పథకాల్ని వాడుకోవడంలో విఫలం కావడం దురదృష్టకరమని జోషి అన్నారు. మరోవైపు 2025 ఫిబ్రవరిలో స్వయం సహాయక బృందాల ద్వారా సోలార్ ఎనర్జీ ఉత్పత్తి కోసం ప్రభుత్వ భూములను ఉపయోగిస్తామని రాష్ట్రం కొత్తగా కోరిందని ప్రల్హాద్ జోషి తెలిపారు. అయితే పీఎం కుసుమ్ పథకం కోసం కేవలం రైతుల భూములను మాత్రమే వినియోగించాలన్న నిబంధన ఉందన్నారు. ఆ మేరకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంటే పథకాన్ని అమలు చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉందని స్పష్టత ఇచ్చారు. మంగళవారం రాజ్యసభలో ఎంపీలు డా.కె.లక్ష్మణ్, కేఆర్ సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్రలు అడిగిన వివిధ ప్రశ్నలకు కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు.

# రబీ సీజన్‌లో 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: 2024–25 రబీ సీజన్‌లో తెలంగాణకు 12.02 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్ర ప్రభుత్వం సరఫరా చేసిందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. 2024, అక్టోబర్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 24 నాటికి 9.51 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా.. రైతులకు 10.34 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకం జరిగిందని వెల్లడించారు. కేంద్రం నుంచి 1.72 లక్షల మెట్రిక్ టన్నుల డీఏపీ, 0.95 లక్షల మెట్రిక్ టన్నుల ఎంఓపీ, 8.57 లక్షల మెట్రిక్ టన్నుల నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం, సల్ఫర్ కాంబినేషన్ ఫర్టిలైజర్ తెలంగాణకు అందాయని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కిషన్‌రెడ్డి తెలిపారు. ఎరువులకు వేపపూత పూయటం, మరుగున పడిన రూ.6,338 కోట్లతో రామగుండంలో ప్రారంభించిన రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ సహా అనేక ఎరువుల కర్మాగారాలతోపాటు నూతన కర్మాగారాలను ప్రారంభించటం, ఇప్పటికే ఉన్న కర్మాగారాలలో అధునాతన యంత్ర సామగ్రితో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచటం, జాతీయ స్థాయిలో ఎరువుల పర్యవేక్షణ వ్యవస్థ, ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా ఎరువుల బ్లాక్‌జీలను అరికట్టడం వంటి అనేక చర్యలు తీసుకున్నారన్నారు. రాష్ట్రాలకు సబ్సిడీతో అందజేసే అన్ని ప్రధాన ఎరువుల సరఫరాను 'ఇంటిగ్రేటెడ్ ఫెర్టిలైజర్ మానిటరింగ్ సిస్టం'అనే ఆన్‌లైన్ వెబ్ ఆధారిత పర్యవేక్షణ ద్వారా అవకతవకలు జరగకుండా కట్టుదిట్టం చేశారని కిషన్‌రెడ్డి తెలిపారు.

# శ్రీరామనవమి రోజున ట్రైబల్ మ్యూజియం ప్రారంభం

ప్రారంభించనున్న సీఎం • బ్రోచర్ ఆవిష్కరించిన పొంగులేటి, సీతక్క



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రులు పొంగులేటి, సీతక్క, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు

సాక్షి, హైదరాబాద్: భద్రాచలంలో 'ట్రైబల్ మ్యూజియం'ఏర్పాటుతో గిరిజనుల ఘన సంస్కృతి, వారసత్వాన్ని ప్రపంచానికి తెలియజేసేందుకు అవకాశం ఏర్పడిందని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీ ఆవరణలో భద్రాచలం ట్రైబల్ మ్యూజియం బ్రోచర్‌ను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ మంత్రి సీతక్క విడుదల చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఈ మ్యూజియం గిరిజన సంప్రదాయాలు, వేషభాషలు, జీవన విధానం, హస్తకళలు, ప్రజాగీతాలు, ఆచార వ్యవహారాలను ప్రత్యేకంగా ప్రదర్శించేందుకు ఉపయోగపడుతుందన్నారు. శ్రీరామనవమి వేడుకల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి దీనిని ప్రారంభిస్తారని ఆయన వెల్లడించారు. 'ట్రైబల్ మ్యూజియం ఏర్పాటుతో భద్రాచలం పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుంది. ఇది స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది'అని మంత్రి తెలిపారు.

## క్లుప్తంగా...

### అప్పుల్లో ఉన్నందుకే భూములు అమ్ముతున్నామంటున్నారు

- రాష్ట్రప్రభుత్వంపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఆరోపణలు



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రం రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, అందుకే భూములు అమ్ముతున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఆరోపించారు. సోమవారం రాజ్యసభలో విపత్తు నిర్వహణ సవరణ బిల్లు–2024పై జరిగిన చర్చలో లక్ష్మణ్ రాష్ట్రప్రభుత్వ తీరును ఎండగట్టారు. '1979లో అప్పటి ప్రభుత్వం హెచ్‌సీయూకు 2,300 ఎకరాలు కేటాయించింది. అందులో యూనివర్సిటీ, అటవీ భూములు, వైల్డ్ లైఫ్ ఉంది. ఇందులోని 400 ఎకరాలు అమ్మాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రజలు అడిగితే అప్పుల్లో ఉన్నాం కాబట్టి భూములు అమ్ముతున్నాం అని ప్రభుత్వం చెబుతోంది. 1908 నుంచి ఐదేళ్ల కిందటి వరకు హైదరాబాద్‌లో వరదలు వచ్చాయి. ఎమ్మెల్యేగా నేను కూడా పడవల్లో ప్రయాణం చేశాను. చాలామంది నిరాశ్రయులయ్యారు. వేలమంది మృతిచెందారు. అయినా ఆక్రమణలు, మురుగు వ్యవస్థ సరిగా లేదు. విపత్తుల కోసం నిధుల కేటాయింపులు లేవు' అని లక్ష్మణ్ విమర్శించారు.

### ఆశించిన అవకాశం రాకుంటే అసంతృప్తి సహజం

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



జగిత్యాల టౌన్: ఆశించిన అవకాశాలు రానప్పుడు అసంతృప్తి సహజమని, దానితో ఆగిపోకుండా ప్రజాసేవలో ముందుకు సాగుతానని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాలలోని ఇందిరాభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవమున్నా.. భవిష్యత్‌లో ప్రొటోకాల్ లభించదు కదా అని విలేకరుల ప్రశ్నకు జీవన్‌రెడ్డి పైవిధంగా స్పందించారు. ప్రజాసేవ చేసేందుకు ప్రొటోకాల్ అవసరం లేదన్నారు. ధరణి పోర్టల్‌ను ఆసరా చేసుకుని జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామశివారులో వంద ఎకరాల అసైన్డ్ భూమిని ఆక్రమించిన వారిపై, వారికి సహకరించిన అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ బాధ్యతగా భావించి 2024, జనవరి 18న నర్సింగాపూర్ శివారు సర్వే నంబర్ 437, 251లోని అసైన్డ్ భూముల వివరాలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరానని, 2025, జనవరి 7న వివరాలు అందాయని జీవన్‌రెడ్డి తెలిపారు. సర్వేనంబర్ 437లో వంద ఎకరాల భూమి అనర్హులకు కట్టబెట్టిన విషయాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు.

### జూబ్లీహిల్స్‌లో జగ్గారెడ్డి 'జయలక్ష్మి ఫిల్మ్స్'

- ఉగాదిన కార్యాలయ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: తాను తీయబోయే సినిమా కోసం మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి కొత్త కార్యాలయాన్ని తెరవబోతున్నారు. ఈనెల 30న జూబ్లీహిల్స్‌లో జయలక్ష్మి ఫిల్మ్స్ పేరుతో ఆయన కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. ఉగాది రోజున ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్‌లో కార్యాలయం ప్రారంభమవుతుందని, సినిమా వర్క్‌ను జగ్గారెడ్డి అక్కడి నుంచే పర్యవేక్షిస్తారని ఆయన సన్నిహితుల ద్వారా తెలిసింది. కాగా, సినిమా పోస్టర్లు, ఫొటోలకు భారీ స్పందన రావడంతో జగ్గారెడ్డి తీయనున్న సినిమాపై సినీ, రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

# మూడున ముహూర్తం!

▶ మొదటి పేజీ తరువాయి

పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చాంబర్ ఎమ్మెల్యేలతో హడావుడిగా కనిపించింది. పలువురు ఆశావహ ఎమ్మెల్యేలతో పాటు మంత్రులు భట్టి చాంబర్‌కు వచ్చి చర్చలు జరిపారు. అసలు ఢిల్లీలో ఏం జరిగిందన్న దానిపై ఆరా తీశారు. మరోవైపు రాజగోపాల్‌రెడ్డి, వివేక్, శ్రీహరిలకు బెర్తులు ఖాయమయ్యాయన్న వార్తల నేపథ్యంలో అసెంబ్లీలో ఈ ముగ్గురికి అభినందనలు వెల్లువెత్తాయి. అసెంబ్లీ సమావేశాల విధులకు హాజరైన వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, జర్నలిస్టులు కూడా ఆ ముగ్గురిని కలిసి అభినందనలు తెలిపారు. అందరికీ కృతజ్ఞతలు తెలిపిన ఆ ముగ్గురూ.. మరోవైపు ఇంకా సమాచారమేమీ లేదంటూ దాటవేసే ప్రయత్నం చేశారు.

**ఢిల్లీలో సాయంత్రం వరకు సీఎం కసరత్తు**

మంత్రివర్గ విస్తరణపై అధిష్టానంతో చర్చలు జరిపేందుకు సోమవారం ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు. అంతకుముందు మంగళవారం ఉదయం నుంచి హైదరాబాద్ బయలుదేరేంతవరకు ఢిల్లీలో ఒంటరిగానే గడిపారు. ఎలాంటి అపాయింట్‌మెంట్లు, పార్టీ పెద్దలతో ములాఖత్‌లకు వెళ్లని రేవంత్ మంత్రివర్గ కూర్పుపై ఏకాంతంగా కసరత్తు చేశారనే చర్చ జరుగుతోంది. కొత్తగా కేబినెట్‌లోకి తీసుకునే మంత్రులకు శాఖలు, ప్రస్తుతమున్న మంత్రుల శాఖల్లో మార్పుల గురించి ఓ అభిప్రాయానికి వచ్చే దిశలో ఆయన కసరత్తు చేశారని, ఈ మేరకు అధిష్టానానికి సమాచారమిచ్చారని తెలుస్తోంది. ఈ కసరత్తు నేపథ్యంలోనే అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పటికీ సాయంత్రం వరకు ఢిల్లీలోనే ఉండిపోయారని చెబుతున్నారు.

**ఇద్దరు కీలక మంత్రుల శాఖల్లో మార్పులు!**

కేబినెట్‌లోకి కొత్తగా నలుగురు లేదా ఐదుగురిని తీసుకుంటారనే చర్చతో పాటు ప్రస్తుత మంత్రుల్లో ఒకరిద్దరికి ఉద్వాసన పలకవచ్చనే చర్చ కూడా జరుగుతోంది. ఇందుకు సంబంధించి ఓ మహిళా మంత్రితో పాటు దక్షిణ తెలంగాణకు చెందిన మరో మంత్రి పేర్లు వినిపిస్తున్నాయి. వీరిని తప్పించేందుకు కారణాలున్నాయని కొందరు చెబుతుండగా, అధిష్టానం ఇప్పుడే ఆ నిర్ణయం తీసుకోదని, ప్రస్తుతమున్న మంత్రులంతా కొనసాగుతారని, కొత్తగా కొందరు మంత్రులవుతారని టీపీసీసీ వర్గాలంటున్నాయి. శాఖల మార్పుపై కూడా విస్తృత చర్చ జరుగుతోంది. ఒక సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు కీలక మంత్రులకు చెందిన శాఖల్లో మార్పులుంటాయని, ఓ మహిళా మంత్రికి అదనపు బాధ్యతలిస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు డిప్యూటీ స్పీకర్‌గా లంబాడా సామాజిక వర్గానికి చెందిన నల్లగొండ జిల్లా దేవరకొండ ఎమ్మెల్యే ఎన్.బాలూనాయక్ పేరు ప్రముఖంగా వినిపిస్తుండగా, కొత్తగా కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి పేరు కూడా చర్చలోకి వచ్చింది. డిప్యూటీ స్పీకర్‌గా ఈమెను నియమించే అవకాశాలు కూడా ఉన్నాయని అంటున్నారు. మరోవైపు చీఫ్ విప్ పదవిలో ఎవరిని నియమిస్తారు?, విప్‌లలో ఎవరికైనా మంత్రిగా అవకాశమిస్తే వారి స్థానంలో ఎవరిని నియమిస్తారన్న దానిపైనా రకరకాల చర్చలు జరుగుతుండడం గమనార్హం.

### పేపర్లు మాకు.. పదవులు వాళ్లకా?

కేబినెట్ విస్తరణ, పేర్ల ఖరారు వార్తల నేపథ్యంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోయినప్పటికీ జనాభా దామాషా ప్రకారం కాకుండా ఒకే సామాజిక వర్గానికి రాజకీయ ప్రాధాన్యత ఇస్తున్నారని అంటున్నారు. ఇప్పటికే ఉపముఖ్యమంత్రితో పాటు అసెంబ్లీ స్పీకర్‌గా మాల సామాజిక వర్గానికి చెందిన నేతలు ఉన్నారని, ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా మాల సామాజిక వర్గానికి చెందిన నాయకుడికే అవకాశం కల్పించారని, మళ్లీ మాల సామాజిక వర్గానికే మంత్రి పదవి ఇవ్వడమేంటంటూ అంతర్గత చర్చల్లో మాట్లాడుకుంటున్నారు. ఎస్సీ వర్గీకరణ తదితర తీర్మానాల పేపర్లు మాకిస్తారు..పదవులు వాళ్లకా అంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై నాలుగు నెలల క్రితమే పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు అధిష్టానం పెద్దలకు లేఖ రాశామని చెబుతున్నారు. తాజాగా మంగళవారం సైతం.. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, మందుల సామ్యేల్, తోట లక్ష్మీకాంతారావు, కాలె యాదయ్యలు మరో లేఖను పంపారు. పార్లమెంటు టికెట్ల కేటాయింపులో కూడా తమకు అన్యాయం జరిగిందని ఈసారి కేబినెట్‌లో తమ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా రాష్ట్రంలో ఉన్న 33 లక్షల మందికి పైగా మాదిగల మనోభావాలను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు.

# గుర్తింపు కార్డులిచ్చి లోపలికి పంపండి!

సాక్షి కథనంపై స్పందించిన విద్యాశాఖ

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, హైదరాబాద్: పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్న భోజనానికి అనుమతించాలని విద్యాశాఖ అన్ని జిల్లాల డీఈవోలకు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. 'విద్యార్థులకు ఆకలి పరీక్ష'శీర్షికతో 'సాక్షి'దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనంపై విద్యాశాఖ స్పందించింది. మధ్యాహ్న భోజనం అందించే సిబ్బందికి.. హెడ్మాస్టర్ సంతకంతో కూడిన గుర్తింపు కార్డు ఇవ్వాలని, వాటిని చూపించిన తర్వాతే అనుమతించాలని స్పష్టం చేసింది. ఐడీ కార్డు లేకుండా ఎవరినైనా అనుమతిస్తే ప్రధానోపాధ్యాయుడు, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. పరీక్ష కేంద్రంలో మధ్యాహ్నం ఒంటిగంటకే విద్యార్థులకు భోజనం అందించాలని ఆదేశించింది. గుర్తింపు కార్డులు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవోలు, డీఈవోలను ఆదేశించింది.



బడ్జెట్లో బ్రాహ్మణ పరిషత్ కు రూ. 100 కోట్లు కేటాయించిన నేపథ్యంలో మంగళవారం మంత్రులు శ్రీధర్, పొన్నంతో కలిసి డిప్యూటీ సీఎం భట్టిని సన్మానించిన బ్రాహ్మణ అఫీషియల్, ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

# ఇదేమైనా బీజేపీ సమావేశమా?

- సీఈఓ సమక్షంలో బీజేపీ, బీఆర్ఎస్ నేతల వాగ్వాదం
- ఓటర్ల జాబితాలో రోహింగ్యాలున్నట్టు బీజేపీ ఆరోపణలు.. తప్పుబట్టిన బీఆర్ఎస్

సాక్షి, హైదరాబాద్: ఇదేమైనా బీజేపీ సమావేశమా? ఇక్కడా మతాలపై రాజకీయాలేనా? అని బీజేపీ నేతలపై బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో రెండు పార్టీల నేతల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ఓటర్ల జాబితా శుద్ధీకరణపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సి.సుదర్శన్ రెడ్డి మంగళవారం తన కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశం వివాదానికి వేదికైంది. హైదరాబాద్‌లో రోహింగ్యాలు పెద్ద సంఖ్యలో ఆధార్‌కార్డులు, ఓటర్ ఐడీ కార్డులను పొందారని, వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోవడం లేదని బీజేపీ నేత పి.వెంకటరమణ అసంతృప్తి వ్యక్తంచేశారు. చదువు రాని వారిని బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ)గా నియమించడంతో వారి లాగిన్ ఐడీలను దుర్వినియోగం చేసి హైదరాబాద్ పాతబస్తీలో దొంగ ఓటర్లను నమోదు చేస్తున్నారని ఆరోపించారు. దీనికి బీఆర్ఎస్ అధికార ప్రతినిధులు దూదిమెట్ల బాలరాజు యాదవ్, రాకేశ్ తీవ్ర అభ్యంతరం తెలపడంతో ఇరు పార్టీల సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. ఇదేమైనా బీజేపీ పార్టీ సమావేశమా? ఎన్నికల సంఘం సమావేశమా? అని కాంగ్రెస్ నేతలు నిలదీశారు. ఇలా అయితే తాము సమావేశం నుంచి వాకౌట్ చేస్తామని వారు వెళ్లిపోయేందుకు సిద్ధం కాగా, సీఈఓ కార్యాలయ అధికారులు సముదాయించి కూర్చోబెట్టారు. బీజేపీ సభ్యులు తమ అభ్యంతరాలను రాతపూర్వకంగా ఇస్తే స్వీకరిస్తామని సీఈఓ వారికి సూచించడంతో వివాదం సద్దుమణిగింది.

# అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తేవాలి

న్యాయవాది హత్యను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా లాయర్ల ధర్నాలు



మంగళవారం హైకోర్టు ప్రధాన గేట్ ముందు ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

సాక్షి, హైదరాబాద్: న్యాయవాది ఇజ్రాయిల్ హత్యను నిరసిస్తూ బడ్జెట్ సమావేశాల్లోనే అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ హైకోర్టు ముందు న్యాయవాదులు మంగళవారం ఆందోళన చేపట్టారు. విధులను బహిష్కరించి హైకోర్టు పలు గేట్ల వద్ద బైఠాయించి నిరసన నిర్వహించారు. 6వ గేట్ నుంచి 4వ గేట్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమాల్లో హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) మాజీ అధ్యక్షుడు వి.రఘునాథ్, ప్రస్తుతం పోటీ చేస్తున్న జగన్, జనార్దన్‌గౌడ్ సుంకరి, కేవీ రామారావు తదితరులు పాల్గొన్నారు. హెచ్‌సీఏఏ విజ్ఞప్తి మేరకు హైకోర్టులోని పలు కోర్టు హాల్‌లు మధ్యాహ్నం తర్వాత కొనసాగలేదు. అలాగే రంగారెడ్డి కోర్టు సహా రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల్లో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

# అసెంబ్లీ ముట్టడికి బీజేపీ మహిళామోర్చా యత్నం

మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీజేపీ మహిళా మోర్చా అసెంబ్లీ ఎదుట నిరసన వ్యక్తం చేసేందుకు ప్రయత్నించింది. వాగ్దానాలు ఏమయ్యాయని వారు ప్రభుత్వాన్ని నిలదీశారు. దీంతో మహిళా నాయకులను, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. నిరసనలు తెలిపేందుకు వస్తే అరెస్టులు చేయడమేంటని, ఇదేనా ప్రభుత్వ నైతికత అంటూ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల ముందు హామీలతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకుని, అధికారంలోకి రాగానే వెనుకడుగు వేసిన కాంగ్రెస్ పార్టీ, మహిళలను మోసం చేస్తోందని ఆమె మండిపడ్డారు.

# వార్షికోత్సవం చేసుకుంటున్నారా?

▶ మొదటి పేజీ తరువాయి

మరోసారి విచారణ జరిపింది. స్పీకర్ కార్యాలయం తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వీ, ముకుల్ రోహత్గిలు హాజరయ్యారు. ఎస్ఎల్పీపై సీనియర్ న్యాయవాది ఆర్యమా సుందరం, రిట్ పిటిషన్‌పై దామ శేషాద్రినాయుడు, పి.మోహిత్‌రావు వాదనలు వినిపించారు.

**ఆ తీర్పుల ఆధారంగా చర్యలకు అవకాశం: ఆర్యమా సుందరం**

పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాల్సిందిగా గతేడాది మార్చి 15న తొలిసారి స్పీకర్‌కు తాము ఫిర్యాదు చేశామని ఆర్యమా సుందరం ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఆ తర్వాత ఏప్రిల్‌లో ఫిరాయింపులపై తొలిసారి కోర్టును ఆశ్రయించామని, జూన్‌లో రిట్ పిటిషన్ వేశామని చెప్పారు. దానం నాగేందర్ కాంగ్రెస్ బీ ఫామ్‌పై ఎంపీ ఎన్నికలకు పోటీ చేశారని, మరో ఎమ్మెల్యే తన కుమార్తె కోసం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని ప్రచారం చేశారని, తెల్లం వెంకట్రావ్ సైతం పార్టీ ఫిరాయించారని పేర్కొన్నారు. ఈ ముగ్గురు ఎమ్మెల్యేలపై వేర్వేరుగా ఫిర్యాదు చేసినా స్పీకర్ స్పందించలేదని, కనీసం నోటీసులు ఇవ్వలేదని వివరించారు. దీనిపై రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించగా ఈ వ్యవహారంపై విచారణ సమయాన్ని ఖరారు చేయాలన్న సింగిల్ బెంచ్ నాలుగు వారాలు గడువు ఇచ్చిందని గుర్తు చేశారు. దీనిపై స్పీకర్ కార్యాలయం అప్పీల్‌కు వెళ్లగా.. స్పీకర్‌కు తగినంత సమయం ఇవ్వాలన్న గ్రౌండ్స్‌పై ఈ ఉత్తర్వులను డివిజన్ బెంచ్ పక్కన పెట్టిందని తెలిపారు. కానీ ఇప్పటివరకు ఆ తగినంత సమయం అంటే ఎంతో చెప్పలేదన్నారు. స్పీకర్ తీసుకోవాల్సిన సమయంపై సుభాష్ దేశాయ్, కేశం మేఘచంద్, రాజేంద్ర సింగ్ రాణా కేసుల్లో సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందన్నారు. ఈ తీర్పుల ఆధారంగా పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉందని విన్నవించారు.

**స్పీకర్ రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉండాలి**

సుప్రీంకోర్టును ఆశ్రయించిన తర్వాతే.. ఈ ఏడాది ఫిబ్రవరి 13న మూడు వారాల్లో రిప్లై ఇవ్వాలని స్పీకర్‌కు సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చిందని ఆర్యమా సుందరం గుర్తు చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ గవాయి జోక్యం చేసుకున్నారు. 'ఇప్పటికి ఏడాది అంటే...పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవం అయ్యిందా? వార్షికోత్సం జరుపుకుంటున్నారా?' అంటూ ప్రశ్నించారు. కేసు విషయంలో డిలే ట్యాక్టిక్స్ (ఆలస్యం చేసే చిట్కాలు) ఉపయోగించొద్దని అన్నారు. సుందరం తన వాదనలు కొనసాగిస్తూ.. 'స్పీకర్ క్వాసి జ్యుడీషియరీ అధికారాలతో ఉన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉండాలి. రాజ్యాంగం కల్పించిన హక్కులు, అధికారాలను పరిరక్షించాల్సిన బాధ్యత స్పీకర్‌పై కూడా ఉంది. ఒకవేళ అది జరగడం లేదు అని భావిస్తే హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి కూడా రాజ్యాంగం అవకాశం కల్పించింది. స్పీకర్ క్వాషి జ్యుడీషియరీ అధికారాలతో ఒక ట్రిబ్యునల్‌గా వ్యవహరించాలి. స్పీకర్ అధికారాల్లోకి వెళ్లాలని, ఆయన విధుల్లో జోక్యం చేసుకోవాలని కోరడం లేదు కానీ, రాజ్యాంగ విధులు నిర్వర్తించాలని మాత్రమే మేము కోరుతున్నాం' అని అన్నారు.

**ఆ ధర్మాసనాలు స్పష్టంగా చెప్పలేదు: జస్టిస్ గవాయి**

గతంలో ఇలాంటి కేసులు విచారించిన రాజ్యాంగ ధర్మాసనాలు స్పీకర్‌కు సమయంపై స్పష్టత ఇవ్వలేదని, ఉన్నత ధర్మాసనాల తీర్పులను తాము తిరిగి ఎలా రాయగలమని జస్టిస్ గవాయి వ్యాఖ్యానించారు. దీంతో 'తగినంత సమయం' అనే విషయంలో ఒక్కో కేసులో ఒక్కో విధంగా నిర్ణయాలు జరిగాయని సుందరం చెప్పారు.

**వారంలోపే హైకోర్టును ఆశ్రయించారు: సింఘ్వీ**

ఫిరాయింపులపై గతేడాది జూలై మొదటి వారంలో స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తే, 9వ తేదీ నాటికే హైకోర్టులో పిటిషన్ వేశారని సింఘ్వీ చెప్పారు. నారిమన్ కేసులో ఫిర్యాదుకు, పిటిషన్‌కు మధ్య నిర్దిష్ట గడువు ఉండాలని కోర్టు తీర్పునిచ్చిందని చెప్పారు. ఇక్కడ ఫిరాయింపులపై ఫిర్యాదు అందగానే స్పీకర్ స్పందించి నోటీసులు ఇచ్చారని చెబుతుండగా జస్టిస్ గవాయి జోక్యం చేసుకుని.. గత విచారణ సందర్భంగా స్పీకర్, అసెంబ్లీ సెక్రటరీ, ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన విషయం గుర్తు చేశారు.

### వారిపై చర్యలు తీసుకోండి: బీజేఎల్పీ నేత పిటిషన్

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి కూడా మంగళవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆయన తరఫు న్యాయవాది మిథున్ శశాంక్ జోక్యం చేసుకుని.. ఫిరాయింపులకు సంబంధించి రాజ్యాంగంలోని అంశాలను ప్రస్తావించబోతుండగా.. జస్టిస్ గవాయి అసంతృప్తి వ్యక్తం చేశారు. 'తాము ఈ కేసు మెరిట్స్‌లోకి వెళ్లడం లేద ని ఇప్పటికే క్లారిటీ ఇచ్చాం. ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంలో స్పీకర్‌కి ఆదేశాలు జారీ చేయవచ్చా లేదా అన్న అంశాన్ని మాత్రమే పరిశీలిస్తున్నాం' అని చెప్పారు. ఈ వ్యవహారంలో తాము వాదనలు వినిపించేందుకు సమయం కావాలని రోహత్గి కోరారు. ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం విచారణ వాయిదా వేసింది.

# ఏఐ ఉందా జాబ్ ఇంద..

సాంకేతిక పురోగతివైపు జాబ్ మార్కెట్

ఏఐ రెడీ వర్క్‌ఫోర్స్ కోరుకుంటున్న కంపెనీలు

భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి

భారత్‌లో 2027 నాటికి ఏఐలో 23 లక్షల ఉద్యోగావకాశాలు!



సాక్షి, స్పెషల్ డెస్క్: 'ఒకప్పుడు ఐటీలో ఉద్యోగం చేయాలంటే ఆఫీసుకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనం లేదా కారు ఉంటే సరిపోయేది. ఇప్పుడలా కాదు. అభ్యర్థికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పరిజ్ఞానం తప్పనిసరి..'ఇవి ఒక ప్రముఖ కంపెనీ హెచ్‌ఆర్ హెడ్ చేసిన వ్యాఖ్యలు. ఆయన మాటలు ప్రస్తుత జాబ్ మార్కెట్‌లో వాస్తవ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. సంప్రదాయ విద్యార్హతలకు మించి మార్కెట్‌కు తగ్గట్టుగా ఉద్యోగులూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుంటేనే విజయం సాధించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఏఐ రెడీ వర్క్‌ఫోర్స్ ఉండాలని కంపెనీలు భావిస్తున్నాయి. ఒక్క భారత్‌లోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఇదే తీరు ఉంది. సాంకేతిక పురోగతి వైపు ప్రపంచ జాబ్ మార్కెట్ పయనిస్తోంది. కంపెనీల లేఆఫ్‌లకు కారణాల్లో ఒకటైన ఏఐ.. కొత్త ఉద్యోగ అవకాశాలకూ వేదిక అవుతోంది. భారత్‌లో 2027 నాటికి ఏఐలో 23 లక్షల ఉద్యోగావకాశాలు వెల్లువెత్తుతాయని బెయిన్ అండ్ కంపెనీ ఇటీవలి నివేదికలో వెల్లడించింది. నిపుణుల సంఖ్య మూడేళ్లలో 12 లక్షలకు చేరుకుంటుందని, కొరత 10 లక్షలకు పైమాటే అని వివరించింది.

**బడా కంపెనీల్లో లేఆఫ్స్..**

➤ ఏఐ సృష్టిస్తున్న ప్రభంజనం ప్రభావం లేఆఫ్స్ రూపంలో కనిపిస్తోంది. కంపెనీల ఆదాయాల్లో వృద్ధి లేకపోవడం, ఉత్పాదకత పడిపోవడం, వ్యయాలు అధికం కావడం, లాభాల కోసం ఇన్వెస్టర్ల ఒత్తిడి.. ఉద్యోగుల తీసివేతలకు కారణమవుతున్నాయి. టెక్నాలజీ కంపెనీలకు అగ్రరాజ్యంగా చెప్పుకునే యూఎస్‌లో ఉద్యోగుల తీసివేతలు కొనసాగుతూనే ఉన్నాయి. 2025లో ఇప్పటివరకు 89 టెక్ కంపెనీలు అంతర్జాతీయంగా సుమారు 23,400 మందిని ఇంటికి పంపించాయి. వీటిలో గూగుల్, మెటా, డిస్నీ, సిటీ గ్రూప్, హెచ్‌పీ, వాల్‌మార్ట్, ఫోర్డ్, స్టార్‌బక్స్ వంటి దిగ్గజాలు ఉన్నాయి. అమెజాన్ 18 వేల మందికి, ఐబీఎం 9 వేల మందికి, బోయింగ్ 10% మందికి ఉద్వాసన పలుకుతున్నాయని సమాచారం. సేల్స్‌ఫోర్స్ 30% మందిని ఇంటికి పంపనున్నట్టు తెలుస్తోంది. 2024లో 549 కంపెనీలు 1.52 లక్షల మందికి గుడ్‌బై చెబితే.. 2023లో ఏకంగా దాదాపు 1,200 కంపెనీలు 2.64 లక్షల మంది టెకీలను సాగనంపాయి. యూఎస్‌లో టెక్, సంబంధిత రంగాల్లో నిరుద్యోగిత రేటు 2022తో పోలిస్తే 2024లో 2.9 నుంచి 4.4 శాతానికి చేరుకుంది. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సర్వే ప్రకారం 41 శాతం అంతర్జాతీయ కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా వచ్చే ఐదేళ్లలో శ్రామిక శక్తిని తగ్గించుకోవాలని భావిస్తున్నాయి.

### భారత్‌లో అంత లేదు..

➤ భారత్‌లో ఐటీ కంపెనీలు నిశ్శబ్దంగా లేఆఫ్‌లు చేపడుతున్నాయి. ఒక్క బెంగళూరులోనే ఏడాదిలో 50,000 మంది టెకీలు ఉద్యోగాలు కోల్పోయారని సమాచారం. అయితే తీసివేతలు ఆందోళన కలిగించే స్థాయిలో లేవన్నది నిపుణుల మాట. హైదరాబాద్‌లో మాత్రం కంపెనీలు గతంలో మాదిరి ఇబ్బడిముబ్బడిగా కాకుండా ఆచితూచి నియామకాలు చేపడుతున్నాయి. టీసీఎస్ 1,80,000 నియామకాలకు శ్రీకారం చుట్టింది. ఇక మొత్తం లేఆఫ్‌లలో ఏఐ ప్రభావానికి గురైనవి 10% మాత్రమేనట. కరోనా కాలంలో కన్స్యూమర్ టెక్‌పై వ్యయాలు పెరగడంతో అందుకు తగ్గట్టుగా కంపెనీలు నియామకాలు చేపట్టాయి. నాటి రిక్రూట్‌మెంట్‌లో పరిమిత నైపుణ్యం గల వారు సైతం ఉన్నారు. వీరి వల్ల ఉత్పాదకతలో అసమతుల్యత ఏర్పడి కంపెనీలు క్లయింట్ల ఆగ్రహానికి లోనయ్యాయి. ఇటువంటి వారిపైనే ఇప్పుడు కత్తి వేలాడుతోంది. మరోవైపు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ (జీసీసీ) భారత్‌కు వెల్లువెత్తుతున్నాయి. ఈ కేంద్రాల్లో రిక్రూట్‌మెంట్ కొనసాగుతోంది.

### ప్రతి ఉద్యోగి నిత్య విద్యార్థిగా ఉండాలి



ప్రీమియం, క్వాలిటీ స్కిల్స్ ఉన్నవారికి ఎప్పటికీ డిమాండ్ ఉంటుంది. ఏఐ నిపుణులకు ప్రపంచ వ్యాప్తంగా భారీ కొరత ఉంది. డిమాండ్‌కు తగ్గ నైపుణ్యం పెంచుకోవడమే ఇప్పుడున్న మార్గం. కంపెనీలపై ఆధారపడకుండా సొంతంగానైనా నైపుణ్యం అందిపుచ్చుకోవాలి. టెక్నాలజీ రంగంలో పని చేస్తున్న ప్రతి ఉద్యోగి నిత్య విద్యార్థిగా ఉండాల్సిందే.

– వెంకారెడ్డి, హెచ్‌ఆర్ రంగ నిపుణులు

### క్యాంపస్‌లోనే కొట్టాలి..



విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లోనే జాబ్ కొట్టాలి. విఫలం అయితే కాస్త కష్టపడాల్సిందే. దొరికినా రూ.2.5 లక్షల లోపు వార్షిక ప్యాకేజీతోనే. నైపుణ్యం ఉన్నవారికి జీసీసీలు అధిక వేతనాలు ఆఫర్ చేస్తున్నాయి. నియామకాల్లో జీసీసీల హవా కొనసాగుతోంది.

– నానబాల లావణ్య కుమార్, కో–ఫౌండర్, స్మార్ట్‌స్టెప్స్

# టెన్త్ తెలుగు పేపర్ లీకేజీలో 13 మంది పాత్ర

**ఇందులో ఇద్దరు మైనర్లు 11 మందిని అదుపులోకి తీసుకున్నాం**

**ఆరుగురిని రిమాండ్‌కు పంపాం.. మరో ఐదుగురిని విచారిస్తున్నాం**

**ఇద్దరు పరారీలో ఉన్నారు: నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి వెల్లడి**

నకిరేకల్: పదోతరగతి తెలుగు ప్రశ్నపత్రం లీకేజీ కేసులో 13 మంది పాత్ర ఉందని, అందులో 11 మందిని అదుపులోకి తీసుకున్నట్టు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి చెప్పారు. మంగళవారం డీఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కేంద్రంలో ఈ నెల 21న పదోతరగతి తెలుగు పరీక్ష ప్రారంభమైన అరగంట తర్వాత ప్రశ్నపత్రం వాట్సాప్‌లో చక్కర్లు కొడుతూ డీఈఓకు చేరింది. వెంటనే ఆయన ఎంఈవో నాగయ్యకు ఫోన్ చేయగా, నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు 13 మందిని అదుపులోకి తీసుకొని విచారించారు. వీరిలో 11 మందిని స్నేహితులుగా పోలీసులు గుర్తించారు. ఆ రోజు(21న) ప్లాన్ ప్రకారం ఏ–1 చిట్ల ఆకాశ్, ఏ–3 చిట్ల శివ, ఒక బాలుడు కలిసి గురుకుల పాఠశాల వద్దకు స్కూటీపై వెళ్లారు. గేట్ వద్ద అప్పటికే పోలీసులు ఉండటంతో లోపలకు వెళ్లడానికి వారికి వీలు కాలేదు. దీంతో ఆ ముగ్గురు వెనుక వైపునకు వెళ్లారు. అక్కడ ఏ–11 రాహుల్ ఉన్నాడు. బాలుడు పరీక్ష కేంద్రం ఒకటో అంతస్తులోని రూమ్ నంబరు 8 వద్దకు చేరుకున్నాడు. ఆ గదిలో పరీక్ష రాస్తున్న తనకు పరిచయమున్న విద్యార్థిని ఉండటంతో ప్రశ్నపత్రం చూపించమని సైగ చేయగా, అతని వెనకాల మరో ఇద్దరు కూడా అక్కడకు చేరుకున్నారు. అయితే రాహుల్‌తో ఉన్న పరిచయం మేరకు ఆ విద్యార్థిని వెంటనే ఆ బాలుడికి ప్రశ్నపత్రం చూపించింది. ఆ బాలుడు తన ఫోన్‌లో ప్రశ్నపత్రం ఫొటో తీసుకొని కిందకు దిగాడు. ఆ బాలుడు తీసిన ఆ ఫొటో పేపర్‌ను మిగతా నిందితులు ఒకరి నుంచి ఒకరికి పంపుకున్నారు. ఆ పేపర్‌లో ఉన్న ప్రశ్నలకు.. ఏ–4 అయిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు గుడుగుంట్ల శంకర్ సమాధానాలు తయారు చేయగా, వాటిని రవిశంకర్ జెరాక్స్ షాప్‌లో జెరాక్స్ తీసుకున్నారు. నిందితులు సమాధాన పత్రాలను వారికి తెలిసిన వారికి ఇవ్వడానికి పరీక్ష కేంద్రానికి వెళ్లగా, అక్కడ పోలీసులను చూసి దొరికిపోతామేమోనని వెళ్లిపోయారు. ఈ కేసుపై పోలీసులు 13 మంది నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా, పేపర్ లీకేజీ వ్యవహారాన్ని బయటపెట్టారని డీఎస్పీ శివరాంరెడ్డి వివరించారు.

### బంధువుల పిల్లల కోసం...

నకిరేకల్‌కు చెందిన చిట్ల ఆకాశ్, చిట్ల శివ, గుడుగుంట్ల శంకర్, బి.రవిశంకర్, బండి శ్రీనుతో పాటు ఓ బాలుడిని ఈ నెల 23న రిమాండ్‌కు పంపామని డీఎస్పీ చెప్పారు. పోగుల శ్రీరాములు, తలారి అఖిల్‌కుమార్, ముత్యాల వంశీ, పల్స అనిల్‌కుమార్, పల్ల మనోహర్‌ను విచారిస్తున్నామన్నారు. రాహుల్‌తోపాటు మరోబాలుడు పరారీలో ఉన్నారని చెప్పారు. తమ బంధువుల పిల్లలు పదోతరగతిలో ఎక్కువ మార్కులు సాధించాలని కొంతమంది ఆకతాయిలు ఇదంతా చేశారన్నారు.

# కూతురి పరీక్ష.. తల్లిదండ్రులే ఇన్విజిలేటర్లు

కోరుట్ల: జగిత్యాల జిల్లా కోరుట్లలోని ఒక పాఠశాలలో ఉపాధ్యాయ దంపతులు ఇన్విజిలేషన్ నిర్వహిస్తున్న కేంద్రంలోనే.. వారి కూతురు పరీక్ష రాయటం వివాదాస్పదంగా మారింది. తాము ఇన్విజిలేషన్ నిర్వహించే పరీక్ష కేంద్రాల్లో సంతానం పరీక్ష రాయటం లేదని.. ఉపాధ్యాయులు పరీక్షలకు ముందే డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అలాంటి డిక్లరేషన్ ఇచ్చి కూడా.. తమ కూతురు పరీక్ష రాసే కేంద్రంలోనే ఉపాధ్యాయ దంపతులు ఇన్విజిలేషన్ చేశారు. దీనిపై ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు అభ్యంతరం తెలపడంతో ఈ విషయం వెలుగు చూసింది. ఇది ఉన్నతాధికారులతోపాటు కలెక్టర్ దృష్టికి కూడా వెళ్లడంతో.. ఉపాధ్యాయ దంపతులను పిలిపించి మాట్లాడినట్లు సమాచారం.

# అనుమతి లేకుండా ప్రాజెక్టులను ఎలా నిర్మిస్తారు?

**రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్**

సాక్షి, హైదరాబాద్: అనుమతి లేకుండా ప్రాజెక్టుల నిర్మాణాన్ని ఎలా కొనసాగిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్–2 ప్రశ్నించింది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతి కోసం సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)కి పంపామని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ ట్రిబ్యునల్‌కు వివరించారు. నీటి కేటాయింపుల అంశం ట్రిబ్యునల్ పరిధిలో ఉండడంతో ఆ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వలేమని సీడబ్ల్యూసీ పేర్కొందన్నారు. ట్రిబ్యునల్‌లో విచారణలో జరుగుతున్న సమయంలోనే 2006లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం ఆ ట్రిబ్యునల్‌కు డీపీఆర్‌లను సమర్పించిందని చెప్పారు. ఈ నేపథ్యంలో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలకు నీటి కేటాయింపులు చేయాలని కోరారు. ఏపీ, తెలంగాణలకు కృష్ణా జలాల పంపిణీపై ట్రిబ్యునల్ మంగళవారం రెండోరోజు విచారణ కొనసాగించింది. కావేరి ట్రిబ్యునల్ తీర్పును ప్రస్తావిస్తూ నీటి కేటాయింపుల్లో బేసిన్ పరిధిలోని ప్రాజెక్టులకే ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యనాథన్ కోరారు. తెలంగాణలో బేసిన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదన దశలో ఉన్న ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. శ్రీశైలం ఎడమ గట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ) ప్రాజెక్టు డీపీఆర్‌ను కేడబ్ల్యూడీటీ–1 ముందు ప్రతిపాదించినా, కార్యరూపం దాల్చని ఆ ప్రాజెక్టుకు 150 టీఎంసీలను కేటాయించాలని కోరారు. ఈ దఫా ట్రిబ్యునల్ విచారణ బుధవారంతో ముగియనుంది.

# క్లుప్తంగా...

## విమానంలో అత్యవసర ద్వారం తెరవబోయిన ప్రయాణికుడు

**అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసిన పోలీసులు**

శంషాబాద్: విమానం ల్యాండింగ్ సమయంలో ఓ ప్రయాణికుడు అత్యవసర డోరును తెరిచే ప్రయత్నం చేసిన సంఘటన శంషాబాద్ విమానాశ్రయంలో చోటు చేసుకుంది. మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో సౌదీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఇండిగో విమానం ల్యాండింగ్ అవుతుండగా పీఎస్ఆర్–ఎల్4క్యూ1క్యూఈ 19ఎఫ్ సీటులో కూర్చున్న మహ్మద్ ఖాదర్ ఉస్మాన్ (58) అత్యవసర ద్వారానికి ఉన్న డోరు కవర్‌ను పూర్తిగా తొలగించి దగ్గర పెట్టుకున్నాడు. గమనించిన ఇతర ప్రయాణికులు, సిబ్బంది వెంటనే వారించడంతో పాటు ల్యాండింగ్ అయిన వెంటనే ఆర్‌జీఐఏ పోలీసు ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. తీవ్ర ప్రమాదం చోటు చేసుకునేలా వ్యవహరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితుడు నగరంలోని కాలాపత్తర్‌కు చెందినవాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఆర్‌జీఐఏ పోలీసు ఔట్‌పోస్టు సీఐ బాలరాజు వెల్లడించారు.

## ఎస్సీ వర్గీకరణలో మాలలకు అన్యాయం

**మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య**



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ మాలలకు తీవ్ర అన్యాయం చేసిందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆరోపించారు. కమిషన్ నివేదిక తప్పులతడకగా ఉందని, 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలోని 10 జిల్లాల్లో ఎస్సీల జనాభా 54.32 లక్షలుగా ఉంటే జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ ఇచ్చిన నివేదికలో మూడు గ్రూపులకు కలిపి 52.17 లక్షలుగా చూపారని తెలిపారు. మాలల జనాభాను 2.15 లక్షలుగా చూపడంతో మాలలకు అన్యాయం జరిగిందన్నారు. కమిషన్ రిపోర్టుతో మాలలకు జరుగుతున్న అన్యాయంపై ఉద్యమిస్తామని, త్వరలో మాలమహానాడు రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని చెన్నయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఎలాంటి పరీక్ష నిర్వహించకుండా వీఆర్వోలను తీసుకోవాలి

**వీఆర్వో జేఏసీ విజ్ఞప్తి**

సాక్షి, హైదరాబాద్: వీఆర్వోలకు ఎలాంటి పరీక్ష నిర్వహించకుండా రెవెన్యూశాఖలోకి తీసుకోవాలని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల జేఏసీ సమావేశం కోరింది. ట్రెసా రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీశ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తంచేశారు. అయితే గ్రామస్థాయి రెవెన్యూ అధికారుల పోస్టును గ్రామ పాలనాధికారులు (జీపీవో)గా కాకుండా జూనియర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా మార్చాలని కోరారు. ట్రెసా, వీఆర్వోల జేఏసీ నాయకత్వం విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని గ్రామ రెవెన్యూ వ్యవస్థను తీసుకురావడం సంతోషకరమని, అయితే, గత ప్రభుత్వ నిర్వాకంతో వీఆర్వోలు కోల్పోయిన హక్కులన్నీ తిరిగి వారికి వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా, రాష్ట్ర స్థాయి వీఆర్వో జేఏసీ నేతలు పాల్గొన్నారు.

# ఈసారి గేట్‌వాల్వ్‌లు..

- ట్రయల్‌రన్ చేస్తుండగా పడిపోయిన వైనం.. 'దేవాదుల' నీటి విడుదలకు మళ్లీ బ్రేక్
- నీళ్లు ఎత్తిపోయడానికి ఆటంకం
- రిపేర్లు చేసి ఆస్ట్రియా వెళ్లిపోయిన ఇంజనీర్ల బృందం
- మళ్లీ వారొచ్చి మరమ్మతులు చేస్తేనే నీటి విడుదల



దేవాదుల పంపుహౌస్‌లో మోటారు

సాక్షిప్రతినిధి, వరంగల్/హసన్‌పర్తి: దేవాదుల ఎత్తిపోతలలో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేట పంప్‌హౌస్ నుంచి ధర్మసాగర్ చెరువులోకి నీటి విడుదలకు మళ్లీ బ్రేక్ పడింది. ట్రయల్‌రన్‌లో భాగంగా పంప్‌హౌస్ నుంచి చెరువులోకి నీటిని ఎత్తిపోస్తున్న క్రమంలో మంగళవారం గేట్‌వాల్వ్‌లు పడిపోయాయి. దీంతో అధికారులు మోటార్లు ఆపేయగా, నీటి విడుదల ప్రక్రియ మరో 4 రోజులపాటు వాయిదా పడింది.

### వారం రోజులుగా ఆటంకాలే...

జనగామ, సూర్యాపేట జిల్లాల్లో నాలుగు నియోజకవర్గాల్లో ఎండిపోతున్న వరి పంటలపై అసెంబ్లీలో చర్చ జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్టాండింగ్ క్రాప్‌ను కాపాడేందుకు దేవాదుల ప్రాజెక్ట్ థర్డ్ ఫేస్‌లోని దేవన్నపేట పంప్‌హౌస్ వద్ద పనులు పూర్తయిన ఒక మోటార్‌నైనా ప్రారంభించాలని నిర్ణయించారు. దేవన్నపేట పంపుహౌస్ నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్‌కు.. అక్కడి నుంచి నాలుగు నియోజకవర్గాలకు నీటిని సరఫరా చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఈ నెల 18న రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ , పొంగులేటి పంప్‌హౌస్‌లో మోటార్‌ను ప్రారంభించేందుకు ప్రయత్నం చేశారు. కానీ, సాంకేతికలోపం కారణంగా మోటార్ ఆన్ కాలేదు.

### ఆస్ట్రియా బృందం మళ్లీ వస్తేనే...

ఈ నెల 22వరకు శ్రమించిన 15 మంది ఆస్ట్రియా టెక్నికల్ బృందం.. నీటి ప్రవాహం, మోటార్ల పనితీరును పరిశీలించి ఏమైనా లోపాలు తలెత్తితే వెంటనే సంకేతాలు ఇచ్చేలా 'స్కాడా'విధానంలో సరిచేశారు. ఆదివారం ట్రయల్‌రన్ కూడా చేసిన ఆ బృందం తిరిగి ఆస్ట్రియాకు వెళ్లింది. బుధవారం (26న) మోటార్లు ప్రారంభించేందుకు ఏర్పా ట్లు చేసిన అధికారులు.. మంగళవారం ట్రయల్‌రన్‌గా ఆన్ చేయడంతో నీటి పంపింగ్‌కు కీలకమైన గేట్‌వాల్వ్‌లు పడిపోవడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. కాగా పడిపోయిన గేట్‌వాల్వ్ మరమ్మతుల కోసం ఆస్ట్రియా ఇంజనీర్ల బృందం రావాల్సి ఉందని, వారు మరమ్మతులు చేశాకే నీటి విడుదల జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

# నిమ్స్‌లో తొలిసారి రొబోటిక్ కిడ్నీ మార్పిడి

**33 ఏళ్ల యువకుడికి విజయవంతంగా శస్త్రచికిత్స**

లక్డీకాపూల్: నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) చరిత్రలో తొలిసారిగా రొబోటిక్ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. దాదాపు పదేళ్లుగా చివరిదశ మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న ఓ 33 ఏళ్ల నల్లగొండ యువకుడికి కొత్త జీవితాన్ని ప్రసాదించారు. బాధిత యువకుడు 2017లో.. జీవించి ఉన్న ఓ వ్యక్తి దానం చేసిన కిడ్నీ (లివింగ్ రిలేటెడ్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్)ని పొందాడు. అయితే కొంతకాలం తర్వాత అది క్రమంగా దెబ్బతింది. ఈ నేపథ్యంలో అతను నిమ్స్ వైద్యులను ఆశ్రయించాడు. బాధితుడికి వైద్య పరీక్షలు నిర్వహించిన యూరాలజీ వైద్యులు.. వ్యాధి తీవ్రత దృష్ట్యా అతనికి రెండోసారి కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. అయితే రెండోసారి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స క్లిష్టమైన ప్రక్రియ కావడంతో రొబోటిక్ సర్జరీకి మొగ్గుచూపారు. ఈసారి మరణించిన వ్యక్తి నుంచి సేకరించిన కిడ్నీ (కెడావరిక్ కిడ్నీ)ని నిమ్స్ యూరాలజీ విభాగం హెచ్‌ఓడీ వైద్యులు రామిరెడ్డి, రాహుల్, ధీరజ్ బృందం రోగికి విజయవంతంగా అమర్చింది.

**2 వేల కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లు: బీరప్ప**

నిమ్స్‌లోని యూరాలజీ మూత్రపిండ మార్పిడి విభాగం ఇప్పటివరకు 2 వేల శస్త్రచికిత్సలను నిర్వహించిందని సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. ఈ ఏడాదిలో 41 కిడ్నీ మార్పిడి ఆపరేషన్లను నిర్వహించామన్నారు. బాధిత యువకుడికి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగానే శస్త్రచికిత్స చేశామన్నారు.

# ఏప్రిల్ 13న 'మున్నూరు కాపుల రణభేరి'

**మున్నూరుకాపు ఆత్మగౌరవ సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌పటేల్**

కాచిగూడ (హైదరాబాద్): మున్నూరుకాపుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న వివక్షకు వ్యతిరేకంగా ఏప్రిల్ 13న హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద 'మున్నూరుకాపుల రణభేరి'పేరుతో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు మున్నూరుకాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన రాష్ట్ర అధ్యక్షుడు ఉగ్గే శ్రీనివాస్ పటేల్ ప్రకటించారు. మంగళవారం కాచిగూడలో చలో ఇందిరాపార్క్ మున్నూరుకాపు రణభేరి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కుటుంబ సర్వే కులగణనలో మున్నూరుకాపుల జనాభాను తక్కువచేసి చూపించారని ఆరోపించారు. గత ప్రభుత్వాల్లో ఇద్దరు, ముగ్గురు మున్నూరుకాపులు మంత్రులుగా ఉండేవారని, కానీ ఈ మంత్రివర్గంలో ఒక్క మున్నూరుకాపు కూడా లేకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో, ఎమ్మెల్సీ పదవుల్లో మున్నూరు కాపులకు తీవ్ర అన్యాయం జరిగిందని శ్రీనివాస్ విమర్శించారు. ఈ రణభేరికి రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిగా మున్నూరుకాపులు తరలి రానున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే 80 శాతానికి పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీలతో కలుపుకుని తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు.

# ఆస్తి పన్నుపై 90 శాతం వడ్డీ రాయితీ

- వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద అవకాశమిచ్చిన ప్రభుత్వం
- 31 లోపు చెల్లించిన వారికే అవకాశం

సాక్షి, హైదరాబాద్: ఆస్తి పన్ను బకాయిదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 2024–25 ఆర్థిక సంవత్సరం వరకు బకాయి పడిన ఆస్తి పన్నుపై 90 శాతం వడ్డీని మినహాయిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థలలో 'ఒకేసారి చెల్లింపు'(ఓటీఎస్) పథకం కింద ఈ మినహాయింపు అమలు కానుంది. పన్ను చెల్లింపుదారులు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలను వడ్డీతో సహా మార్చి 31వ తేదీలోపు చెల్లిస్తే, 90 శాతం వడ్డీని మినహాయిస్తారు. మిగిలిన 10 శాతం వడ్డీని మాత్రం ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది. ఈ మినహాయింపు మొత్తాన్ని భవిష్యత్తు చెల్లింపులలో సర్దుబాటు చేస్తారు. అయితే, ఈ పథకం గ్రేటర్ హైదరాబాద్ పురపాలక సంస్థ పరిధికి వర్తించదు. రాష్ట్రంలోని ఇతర అన్ని పట్టణ స్థానిక సంస్థలకు వర్తిస్తుంది.

# లారీలు వదిలేస్తావా.. లేపేయమంటావా?

**మైనింగ్ ఏడీ సత్యనారాయణకు అక్రమార్కుల బెదిరింపులు.. తాండూరులో ఉద్యోగం కత్తిమీద సాములా ఉందని ఆవేదన**

**పోలీసు రక్షణ ఉంటేనే విధులు నిర్వహిస్తామని స్పష్టీకరణ.. వివరాలు సేకరించిన డిప్యూటీ డైరెక్టర్ గోవింద్‌రాజు**



రికార్డులను పరిశీలిస్తున్న గోవింద్‌రాజు, సత్యనారాయణ

తాండూరు రూరల్: తాండూరు ప్రాంతంలో అక్రమార్కుల ఆగ డాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. మైనింగ్ శాఖలో ఏడీగా పనిచేస్తున్న ఓ అధికారి మాటలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. గత సోమవారం సాయంత్రం గౌతాపూర్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా వెళ్తున్న పది నాపరాయి లారీలను పట్టుకున్నారు. ఈ క్రమంలో మల్కాపూర్‌కు చెందిన లారీ ఫీల్డ్ అసిస్టెంట్ సూర్యకాంతరెడ్డిని ఏపీ12వీ 0152 నంబర్ గల లారీ ఢీకొట్టడంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న మైనింగ్ శాఖ హైదరాబాద్ రేంజ్ డిప్యూటీ డైరెక్టర్ గోవింద్‌రాజు, ఏడీ సత్యానారాయణ మంగళవారం తాండూరులో పర్యటించారు. అనంతరం ఏడీ మీడియాతో మాట్లాడుతూ.. మిర్యాణ్, మల్కాపూర్, కోటబాసుపల్లి నాపరాతి గనుల నుంచి రాయల్టీ లేకుండా వెళ్తున్న 11 లారీలను పట్టుకున్నామని తెలిపారు. అయితే 'మా లారీలను వదిలేస్తావా.. లేపేయమంటావా' అని కొంతమంది ఫోన్ చేసి బెదిరించారని ఆవేదన వ్యక్తంచేశారు. తాండూ రులో ఉద్యోగం కత్తిమీద సాములా ఉందని తెలిపారు. ఇక నుంచి పోలీసుల రక్షణ ఉంటేనే అక్రమ తవ్వకాలను పరిశీలించి రాయల్టీలను తనిఖీ చేస్తామని స్పష్టం చేశారు. పట్టుకున్న వాటిలో పది లారీలకు పెనాల్టీ విధించి వదిలేశామని, ఎఫ్ఏను ఢీకొట్టిన లారీపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

**అక్రమ మైనింగ్‌ను అరికడతాం:** తాండూరులో నాపరాతి, సుద్ద, ఎర్రమట్టి అక్రమ మైనింగ్‌ను అరికడతామని మైనింగ్ గోవింద్ రాజు ప్రకటించారు. మైనింగ్ ఏడీ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఘటనపై వివరాలు సేకరించారు. ఇకపై అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే వారిని ఉపేక్షించేంది లేదన్నారు.

# ఆరు కేటగిరీల్లో యువ వికాసం

▶ మొదటి పేజీ తరువాయి

అండ్ మేనేజింగ్ డైరెక్టర్లు ఈ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### అర్హతలివే..

- ➤ గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షల వార్షికాదాయం, పట్టణ(మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీ) ప్రాంతాల్లో రూ.2 లక్షల వార్షికాదాయం ఉన్నవారు అర్హులు.
- ➤ దరఖాస్తులో రేషన్ కార్డు వివరాలు సమర్పించాలి. రేషన్‌కార్డు లేకుంటే తాజా ఆదాయ ధ్రువీకరణ పత్రం వివరాలను ఇవ్వాలి.
- ➤ వ్యవసాయేతర కేటగిరీలకు దరఖాస్తుదారు వయసు 21 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలి.
- ➤ వ్యవసాయ అనుబంధ కేటగిరీ యూనిట్లకు వయసు 21 సంవత్సరాల నుంచి 60 ఏళ్ల మధ్య ఉండాలి. ఒక కుటుంబం నుంచి ఒక వ్యక్తికి మాత్రమే అర్హత (ఐదేళ్ల సమయంలో స్వయం ఉపాధి పథకాలకు)

### ప్రాధాన్యతలు..

మొదటిసారి ఎకనమిక్ సపోర్ట్ స్కీమ్(ఈఎస్ఎస్)కు దరఖాస్తు చేసుకునేవారికి, మహిళలకు 25 శాతం (ఒంటరి మహిళ, వితంతువులకు ప్రాధాన్యం), వికలాంగులకు 5 శాతం, తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలు, ఎస్సీ వర్గీకరణ ఉద్యమ కుటుంబాలకు, నైపుణ్యం గల వారికి ప్రాధాన్యం.

| యూనిట్ వ్యయం (రూ.లో) | రాయితీ (శాతం) | బ్యాంకు రుణం (శాతం) |
|---|---|---|
| 50,000 వరకు | 100 | - |
| 50,001 నుంచి 1,00,000 | 90 | 10 |
| 1,00,001 నుంచి 2,00,000 | 80 | 20 |
| 2,00,001 నుంచి 4,00,000 | 70 | 30 |
| అత్యంత పేద కుటుంబం | 90 | - |
| | 10 శాతం ఈఎంఎఫ్ | |
| చిన్న నీటిపారుదల | 10 | - |



### కావాల్సిన పత్రాలు

ఆధార్ కార్డు, రేషన్‌కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, తెలంగాణ ఏర్పాటు తర్వాత జారీచేసిన కుల ధ్రువీకరణ పత్రం, పర్మనెంట్ డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా సంబంధిత యూనిట్‌లెతై), పట్టాదారు పాసుపుస్తకం (వ్యవసాయ అనుబంధ పథకాలకు), సదెరమ్ సర్టిఫికెట్ (వికలాంగ కేటగిరీ), పాస్‌పోర్ట్ సైజు ఫొటోగ్రాఫ్, అత్యంత పేదలైతే వల్నరబుల్ గ్రూప్ సర్టిఫికేషన్ (మండల స్థాయి కమిటీ).

### దరఖాస్తు విధానం..

తెలంగాణ ఆన్‌లైన్ బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టం (ఓబీఎంఎంఎస్) వెబ్‌సైట్‌లో దరఖాస్తు సమర్పించాలి.దరఖాస్తు ఫారం భర్తీ చేసిన తర్వాత ప్రింట్ తీసుకోవాలి. ప్రింట్‌అవుట్‌తో పాటు అప్‌లోడ్ చేసిన ధ్రువీకరణ పత్రాలను జతచేసి సంబంధిత మండల ప్రజాపాలన సేవా కేంద్రాలు లేదా మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించాలి.

### మండల స్థాయిలో..

వచ్చిన దరఖాస్తులను మండలస్థాయిలో పరిశీలించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీఓ, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్/జోనల్ కమిషన్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. జిల్లా కలెక్టర్ నామినేట్ చేసిన ప్రత్యేకాధికారి, మండల పరిధిలోని అన్ని బ్యాంకుల మేనేజర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ కార్పొరేషన్ల ప్రతినిధులు, డీఆర్‌డీఏ ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు.

### జిల్లా స్థాయిలో...

జిల్లా స్థాయిలో ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కన్వీనర్‌గా డీఆర్‌డీఏ పీడీ, సభ్యులుగా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), సభ్యులుగా ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ ఈడీలు, మైనార్టీ సంక్షేమాధికారి, వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్లు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి, లీడ్‌బ్యాంక్ మేనేజర్ ఉంటారు.

- ➤ నిర్దేశించిన తేదీల్లో మండల, జిల్లా స్థాయి కమిటీలు దరఖాస్తులను పరిశీలించి అర్హులను గుర్తించాల్సి ఉంటుంది. అర్హులను ఖరారు చేసిన తర్వాత ఆ జాబితాను జిల్లా ఇన్‌చార్జి మంత్రికి కలెక్టర్ సమర్పించాలి.
- ➤ ఎంపికైన లబ్ధిదారులు స్వయం ఉపాధి యూనిట్ ఏర్పాటుకు సంబంధించిన సామగ్రి కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. రాయితీ నిధులు లబ్ధిదారుకు కాకుండా సదరు సంస్థ, ఏజెన్సీల పేరిట విడుదల చేస్తారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంకుకు ఇస్తారు.
- ➤ స్వయం ఉపాధి శిక్షణకు జిల్లా కమిటీలు కార్యాచరణ రూపొందించుకోవాలి.
- ➤ యూనిట్లు గ్రౌండింగ్ అయిన తర్వాత కూడా వాటిని విధిగా పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా అధికారులను నియమించుకుని తనిఖీలు చేపట్టాలి.

సాక్షి **బిజినెస్**
బుధవారం
26-3-2025

## స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

| సెన్సెక్స్ ▲ | నిఫ్టీ ▲ |
|---|---|
| 33 | 10 |
| 78,017 | 23,669 |

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11: 30 ముగింపు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 18,220 | ▲ | 31 |
| డోజోన్స్ | 42,550 | ▲ | 33 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 8,664 | ▲ | 26 |
| డాక్స్ | 23,110 | ▲ | 257 |
| షాంఘై | 3,370 | ▲ | 5 |
| నికాయ్ | 37,608 | ▲ | 172 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## బులియన్ రూ.లలో

ముంబై

| | | |
|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | | |
| 87,751 | ▲ | 32 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | | |
| 87,400 | ▲ | 32 |
| వెండి (కిలో) | | |
| 97,922 | ▲ | 515 |

## ఫారెక్స్ రేట్లు రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 85.30 | 86.32 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 109.50 | 112.36 |
| € | యూరో | ఎస్‌బీఐ | 91.40 | 94.05 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 56.27 | 57.71 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 51.81 | 56.84 |
| S$ | సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 61.90 | 66.58 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 21.97 | 23.53 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 22.46 | 24.24 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 10.94 | 12.76 |

## ఎన్‌పీఏల వేలానికి ప్రత్యేక పోర్టల్



**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌యూ) మొండిబాకీలను (ఎన్‌పీఏ) వేలం వేసే ప్రక్రియను మరింత క్రమబద్ధీకరించేందుకు 'బ్యాంక్‌నెట్' పేరిట కేంద్ర ఆర్థిక శాఖ ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. సరికొత్తగా తీర్చిదిద్దిన ఈ–ఆక్షన్ పోర్టల్‌ను ప్రారంభించినట్లు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. ఎన్‌పీఏ కేసుల పరిష్కార ప్రక్రియను పారదర్శకమైన విధంగా, వేగవంతం చేసేందుకు ఇది తోడ్పడుతుందని మంత్రి వివరించారు. ఆటోమేటెడ్ కేవైసీ సాధనాలు, సురక్షితమైన పేమెంట్ గేట్‌వేలు, బ్యాంకు ధ్రువీకరించిన ప్రాపర్టీ టైటిల్స్ మొదలైన వాటిని అనుసంధానించడంతో పాటు అధునాతన సాంకేతికతను ఉపయోగిస్తూ ప్రాపర్టీ వేలం ప్రక్రియ ఆసాంతం అత్యంత పారదర్శకంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. మరోవైపు, 15 ప్రభుత్వ ప్రాయోజిత రుణాలు, సబ్సిడీ పథకాలను ఒకే చోట అనుసంధానించేందుకు 'జన సమర్థ్ పోర్టల్' ఉపయోగపడుతోందని మంత్రి తెలిపారు. దరఖాస్తుదారు డేటాను డిజిటల్‌గా మదింపు చేసే ఈ ప్రక్రియతో రుణాల కోసం దరఖాస్తు చేసుకోవడం, అనుమతులను పొందడం మరింత సులభతరం అయ్యిందని వివరించారు.

# కారు చౌక ఈవీ బేరం!



- డిమాండ్ తగ్గుతుండటంతో ఆఫర్ల వెల్లువ
- కనీసం రూ.1 లక్ష.. గరిష్ఠంగా రూ.15 లక్షల వరకు తగ్గింపు
- జాబితాలో హైబ్రిడ్ వాహనాలు కూడా...
- వచ్చే నెల నుంచి రేట్ల పెంపు బాటలో ఆటోమొబైల్ కంపెనీలు

**తగ్గింపు ఇలా...**

| కంపెనీ | మోడల్ | డిస్కౌంట్ (రూ.లలో) |
|---|---|---|
| కియా | ఈవీ6 | 15 లక్షలు |
| హ్యుందాయ్ | ఐయానిక్5 | 4 లక్షలు |
| ఎంజీ | జెడ్ఎస్ | 2.5 లక్షలు |
| టాటా మోటార్స్ | కర్వ్ ఈవీ | 1.71 లక్షలు |
| టాటా మోటార్స్ | నెక్సాన్ ఈవీ | 1.41 లక్షలు |
| మారుతీ | గ్రాండ్ విటారా హైబ్రిడ్ | 1.35 లక్షలు |
| టాటా మోటార్స్ | పంచ్ ఈవీ | 1.2 లక్షలు |
| సిట్రాన్ | ఈసీ3 | 1 లక్ష |

■ డిస్కౌంట్‌లో క్యాష్, స్క్రాపేజ్, ఎక్స్ఛేంజ్ బోనస్‌లు, ఉచిత యాక్సెసరీలు, అదనపు వారెంటీ వంటివన్నీ కలిసి ఉన్నాయి




**ఎలక్ట్రిక్ కార్లపై అదిరిపోయే డిస్కౌంట్ల 'మార్చ్' నడుస్తోంది. ఈవీలకు డిమాండ్ తగ్గుముఖం పట్టడంతో పాటు ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో నిల్వలను తగ్గించుకోవడానికి ఆటోమొబైల్ కంపెనీలు ఆఫర్ల జోరు పెంచాయి. ఎలక్ట్రిక్‌తో పాటు హైబ్రిడ్ వాహనాలపై కూడా కనిష్ఠంగా రూ. 1 లక్ష నుంచి గరిష్ఠంగా రూ.15 లక్షల వరకు డిస్కౌంట్లు లభిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.**

ఏప్రిల్ 1 నుంచి రేట్ల పెంపు అమల్లోకి రానున్న నేపథ్యంలో వాహన కంపెనీలు ఈవీలపై భారీ డిస్కౌంట్లతో ఊరిస్తున్నాయి. గడిచిన కొన్ని వారాల్లో విడుదల చేసిన కొన్ని కొత్త మోడల్స్ మినహా దాదాపు అన్ని ఎలక్ట్రిక్ కార్లపై కనీసం రూ.1 లక్ష తగ్గింపును ఆఫర్ చేస్తున్నాయి. ఇందులో 2025 మోడల్స్‌తో పాటు 2024లో తయారైనవి కూడా ఉన్నాయి. కాగా, ఈ డిస్కౌంట్లలో క్యాష్ తగ్గింపు, స్క్రాపేజ్, ఎక్స్ఛేంజ్ బోనస్‌లు, ఉచిత యాక్సెసరీలు, అలాగే అదనపు వారంటీ వంటివన్నీ కలిసి ఉంటాయి. సాధారణంగా అమ్మకాలు మందకొడిగా ఉండే సంవత్సరాంతం (డిసెంబర్ నెల)లో వాహన సంస్థలు భారీగా డిస్కౌంట్లు ప్రకటిస్తుంటాయి. అయితే, ప్రస్తుతం ఈవీలపై ఇస్తున్న తగ్గింపు అప్పటితో పోలిస్తే రెట్టింపు స్థాయిలో ఉండటం విశేషం. దీనికి ప్రధానంగా డిమాండ్ తగ్గడమే కారణమని పరిశీలకులు పేర్కొంటున్నారు.

**కొత్త మోడల్స్ దన్ను...**

ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో ఈవీ కార్ల సేల్స్ 20,234 యూనిట్లుగా నమోదయ్యాయి. గతేడాదితో పోలిస్తే 26 శాతం పెరిగినట్లు వాహన డీలర్ల అసోసియేషన్ సమాఖ్య (ఎఫ్ఏడీఏ) పేర్కొంది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహనాల అమ్మకాలకు కొత్త మోడల్స్ దన్నుగా నిలుస్తున్నాయి. ఇందులో ఎంజీ విండ్సర్ వంటి మోడల్స్ అమ్మకాలు కీలకంగా నిలుస్తుండటమే కారణం. 2024లో 20 శాతం వృద్ధితో 99,165 ఈవీ కార్లు అమ్ముడయ్యాయి. కాగా, మార్కెట్ లీడర్ టాటా మోటార్స్ (43 శాతం వాటా) ఈవీ సేల్స్ ఈ ఏడాది తొలి రెండు నెలల్లో 19 శాతం మేర పడిపోవడం గమనార్హం.



**కియా.. బంపర్ ఆఫర్**

దక్షిణ కొరియా కార్ల దిగ్గజం కియా మోటార్స్ తన ఈవీ6 2025 వేరియంట్‌పై ఏకంగా రూ.15 లక్షల భారీ డిస్కౌంట్‌ను అందిస్తోంది. దీని రేంజ్ 650 కిలోమీటర్లు. అంతక్రితం రూ. 77 లక్షలుగా ఉన్న ఈవీ6 ఆన్‌రోడ్ ధర ఇప్పుడు రూ.62 లక్షలకు దిగొచ్చింది. ఇక హ్యుందాయ్ కూడా ఐయానిక్5 మోడల్‌పై రూ. 4 లక్షల తగ్గింపు ఆఫర్ చేస్తోంది. డిసెంబర్లో దీనిపై రూ.2 లక్షల డిస్కౌంట్ మాత్రమే కంపెనీ అందించింది. అయితే, జనవరిలో విడుదల చేసిన క్రెటా ఈవీపై మాత్రం ఎలాంటి డిస్కౌంట్ ఇవ్వడం లేదు. ఈవీ మార్కెట్లో అత్యధిక వాటాతో దూసుకెళ్తున్న టాటా మోటార్స్ పలు మోడల్స్‌పై రూ. 1.86 లక్షల వరకు ఆఫర్లను ప్రకటించింది. ఇటీవల ప్రవేశపెట్టిన కర్వ్ ఈవీపై గరిష్ఠంగా రూ.1.71 లక్షల తగ్గింపు లభిస్తోంది. నెక్సాన్ ఈవీపై రూ.1.41 లక్షలు , టియాగో ఈవీపై రూ.1.31 లక్షలు చొప్పున డిస్కౌంట్ ఇస్తోంది.

**హైబ్రిడ్‌లపైనా...**

మహీంద్రాతో పాటు కొన్ని కంపెనీలు ఈ ఏడాది కొత్త ఈవీలను తీసుకురావడంతో పాత మోడల్స్ పట్ల ఆసక్తి తగ్గిందని.. దీనికి తోడు అధిక ధరల ప్రభావం వల్ల కూడా డిమాండ్ తగ్గుముఖం పట్టిందని ప్రముఖ కార్ల కంపెనీకి చెందిన ఓ డీలర్ అభిప్రాయపడ్డారు. కాగా, ఈవీలతో పాటు హైబ్రిడ్ మోడల్స్ కూడా కారు చౌకగా దొరుకుతున్నాయి. మారుతీ సుజుకీ హైబ్రిడ్ కార్లు గ్రాండ్ విటారాపై రూ.1.35 లక్షలు, ఇన్విక్టోపై రూ.1.4 లక్షల చొప్పున ఆఫర్ నడుస్తోంది. అలాగే హోండా సిటీ ఈ–హెచ్ఈవీ దాదాపు రూ.1 లక్ష తక్కువకే దొరుకుతోంది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

## ఐటీ షేర్ల అండ.. ఏడోరోజూ ముందడుగు

- 78 వేల స్థాయిపైకి సెన్సెక్స్
- నిఫ్టీ లాభం పది పాయింట్లు



**ముంబై:** ఐటీ రంగ షేర్ల అండతో స్టాక్ సూచీల ర్యాలీ ఏడోరోజూ కొనసాగింది. అయితే లాభాల స్వీకరణతో ఆరంభ లాభాలు హరించుకుపోయాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే 757 పాయింట్లు ఎగసిన సెన్సెక్స్ చివరికి 33 పాయింట్లు పరిమిత లాభంతో 78 వేల స్థాయిపైన 78,017 వద్ద స్థిరపడింది. నిఫ్టీ పది పాయింట్ల స్వల్ప లాభంతో 23,669 వద్ద నిలిచింది. ఐటీ, ప్రైవేటు రంగ బ్యాంకు షేర్లు మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఇప్పటికీ అధిక విలువల వద్ద ట్రేడవుతున్న చిన్న, మధ్య తరహా కంపెనీల షేర్లలో విక్రయాలు చోటుచేసుకున్నాయి. బీఎస్ఈ స్మాల్ సూచీ 1.63%, మిడ్ క్యాప్ ఇండెక్సు 1.13 శాతం నష్టపోయాయి. ఏప్రిల్ 2 నుంచి అమల్లోకి రానున్న ప్రతీకార సుంకాల్లో మినహాయింపు ఉండొచ్చని ట్రంప్ సంకేతాలతో అంతర్జాతీయ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి.

- అధిక విలువ కలిగిన షేర్లలో ఇటీవల దిద్దుబాటు కారణంగా ఐటీ షేర్లకు డిమాండ్ నెలకొంది. పెర్సిస్టెంట్ 2.60%, కో ఫోర్జ్ 2.25% ర్యాలీ చేశాయి. ఎంఫసిస్, ఇన్ఫోసిస్ 1.50% పెరిగాయి. హెచ్‌సీఎల్ టెక్ 1%, టీసీఎస్, విప్రో షేర్లు అరశాతం మేర లాభపడ్డాయి.
- ప్రభుత్వరంగ బ్యాంకు షేర్లు భారీ నష్టాలు చవిచూశాయి. సెంట్రల్ బ్యాంక్ ఇండియా, యూకో బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 3–5% క్షీణించాయి.
- వచ్చే ఆర్థిక సంవత్సరంలో డిమాండ్ ఊపందుకుంటుందనే అంచనాలతో బ్రోకరేజ్ సంస్థ యూబీఎస్ సిమెంట్ రంగ షేర్లకు 'బై' కేటాయించింది. అల్ట్రాటెక్ 3.50%, ఏసీసీ, దాల్మియా భారత్, అంబుజా సిమెంట్స్ 3% పెరిగాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఈ ఏడాది ఐటీఈఎస్ కొలువుల జోరు | జీడీపీ వృద్ధికి ఎస్అండ్‌పీ కోత

## ఎనర్జీ స్టోరేజ్ సొల్యూషన్స్‌లోకి ప్యూర్ ఈవీ

**ప్యూర్‌పవర్ శ్రేణి ఆవిష్కరణ**



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ ప్యూర్ తాజాగా 'స్మార్ట్ ఇన్వర్టర్ల' విభాగంలోకి ప్రవేశించింది. గృహ, వాణిజ్య అవసరాల కోసం 'ప్యూర్‌పవర్' పేరిట విద్యుత్ స్టోరేజీ సొల్యూషన్స్‌ను ఆవిష్కరించింది. ఇవి 3 కేవీఏ, 5 కేవీఏ, 15 కేవీఏ సామర్థ్యంతో లభిస్తాయి. ధర రూ. 74,999 నుంచి రూ. 1,74,999 వరకు ఉంటుంది. సాంప్రదాయ ఇన్వర్టర్ల కన్నా మెరుగ్గా ఏసీలు, ఇతరత్రా ఉపకరణాలను కూడా ఉపయోగించుకునేందుకు అవసరమైనంత విద్యుత్‌ను ఇవి బ్యాకప్‌గా అందించగలవు. వీటికి బుకింగ్స్ ఏప్రిల్ 1 నుంచి, డెలివరీలు ఏప్రిల్ 30 నుంచి ప్రారంభమవుతాయని సంస్థ వ్యవస్థాపకుడు నిశాంత్ దొంగారి తెలిపారు. వీటిని పునరుత్పాదక విద్యుత్‌కు కూడా అనుసంధానించుకోవచ్చని పేర్కొన్నారు. పారిశ్రామిక అవసరాల కోసం (4 ఎండబ్ల్యూహెచ్ సామర్థ్యంతో) ప్యూర్‌పవర్ గ్రిడ్ ఉత్పత్తిని వచ్చే ఏడాది ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. దేశీయంగా పునరుత్పాదక విద్యుత్ వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ తెలిపారు. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుదుత్పత్తి సామర్థ్యం, మొత్తం వాహనాల్లో ఈవీల వాటాను 40 శాతానికి పెంచుకోవాలనేది లక్ష్యమని చెప్పారు.

## టెస్లాను ఓవర్‌టేక్ చేసిన బీవైడీ

**గతేడాది 107 బిలియన్ డాలర్ల ఆదాయం**



**బ్యాంకాక్:** అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లాకు గట్టి పోటీనిస్తున్న చైనా కంపెనీ బీవైడీ తాజాగా ఆదాయంపరంగా పోటీ సంస్థను అధిగమించింది. బ్యాటరీ ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహన విక్రయాలు 40% ఎగియడంతో 2024లో 107 బిలియన్ డాలర్ల ఆదాయం ఆర్జించింది. గతేడాది టెస్లా ఆదాయం 97.7 బిలియన్ డాలర్లుగా నమోదైంది. మరోవైపు 2024లో బీవైడీ నికర లాభం 34% పెరిగి 5.6 బిలియన్ డాలర్లకు చేరింది. కంపెనీ గతేడాది 43 లక్షల ఈవీలను విక్రయించింది. ఇందులో 29% అమ్మకాల వాటా చైనా వెలుపల హాంకాంగ్, తైవాన్ తదితర దేశాలదే ఉంది. బీవైడీ ఈ మధ్యే 5 నిమిషాల్లోనే వాహనాలను చార్జింగ్ చేసే సూపర్ ఫాస్ట్ ఈవీ చార్జింగ్ సిస్టంను ప్రకటించింది. అలాగే, టెస్లా మోడల్ 3 పోలిన కిన్ ఎల్ ఈవీ సెడాన్‌ను సగం రేటుకే ప్రవేశపెట్టింది.

---

**భవిత** • స్పర్ధయా వర్ధతే విద్య

# ఈఏపీసెట్‌తో ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మా

**బీటెక్.. ఇంటర్మీడియెట్ ఎంపీసీ విద్యార్థుల తొలి ప్రాధాన్యం! బైపీసీ విద్యార్థులు సైతం మెడిసిన్‌కు ప్రత్యామ్నాయ కోర్సుల గురించి అన్వేషిస్తున్న పరిస్థితి. ఇందుకోసం రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఎంట్రన్స్‌లపై ప్రత్యేకంగా దృష్టిపెడుతున్నారు. ఇలాంటి వారికి చక్కటి మార్గంగా నిలుస్తోంది.. ఈఏపీ (ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ) సెట్!! ఇందులో విజయం సాధిస్తే.. ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చరల్ అనుబంధ కోర్సుల్లో అడ్మిషన్ లభిస్తుంది. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ ఈఏపీసెట్-2025 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. ఏపీ-ఈఏపీసెట్ 2025తో ప్రవేశం కల్పించే కోర్సులు, దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..**



ఏపీ ఈఏపీ సెట్-2025

» ఆంధ్రప్రదేశ్‌లో ఈఏపీసెట్-2025 నోటిఫికేషన్ విడుదల
» ఇంజనీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మసీ కోర్సులకూ ఈ పరీక్ష ర్యాంకే ఆధారం
» మే 19 నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు

### ఈ కోర్సుల్లో ప్రవేశం

ఏపీ ఈఏపీ సెట్‌తో ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, బీటెక్(డైరీ టెక్నాలజీ), బీటెక్(అగ్రికల్చర్ ఇంజనీరింగ్), బీటెక్(ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ), బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ హార్టికల్చర్, బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హస్బెండ్రీ, బ్యాచిలర్ ఫిషరీస్ సైన్స్, బీఫార్మసీ, ఫార్మాడీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. ఈఏపీ సెట్‌లో పొందిన ర్యాంకు ఆధారంగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తారు.

### అర్హత

- ఇంజనీరింగ్ స్ట్రీమ్‌కు.. ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి. మూడేళ్ల డిప్లొమా కోర్సు ఉత్తీర్ణులు కూడా దరఖాస్తుకు అర్హులే.
- అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్ అభ్యర్థులు ఇంటర్మీడియెట్ బైపీసీ గ్రూప్‌లో ఉత్తీర్ణత సాధించాలి. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు సైతం ఈఏపీసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

### 160 మార్కులకు పరీక్ష

ఏపీ ఈఏపీసెట్ పరీక్ష మూడు విభాగాల్లో 160 మార్కులకు జరుగుతుంది. ఈ సెట్‌ను ఇంజనీరింగ్ స్ట్రీమ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్‌లుగా వేర్వేరుగా నిర్వహిస్తారు.

### ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్ష

- ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. మ్యాథమెటిక్స్ నుంచి 80 ప్రశ్నలు, ఫిజిక్స్ నుంచి 40 ప్రశ్నలు, కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే జరుగుతుంది.

### అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్

అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్‌లో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాలుంటాయి. బయాలజీ (బోటనీ, జువాలజీ) నుంచి 80 ప్రశ్నలు, ఫిజిక్స్ నుంచి 40 ప్రశ్నలు, కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. బయాలజీలో బోటనీ, జువాలజీ నుంచి 40 ప్రశ్నలు చొప్పున ఉంటాయి.

### పరీక్షలో రాణించేలా

#### మ్యాథమెటిక్స్

ఈఏపీసెట్‌లో 50 శాతం వెయిటేజీ ఉన్న సబ్జెక్ట్ మ్యాథమెటిక్స్. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. సిలబస్ అంశాల్లోని ప్రాథమిక సూత్రాలపై పట్టుసాధించాలి. దీంతోపాటు వేగం, కచ్చితత్వంపై దృష్టిసారించాలి. ఇంటర్ మ్యాథ్స్ సిలబస్‌ను ఆల్‌జీబ్రా, కాల్కులస్, జామెట్రీ, వెక్టార్ ఆల్‌జీబ్రా, ట్రిగనోమెట్రీగా విభజించొచ్చు. జామెట్రీకి వెయిటేజీ కొంత ఎక్కువగా కనిపిస్తోంది. ఇందులో 2డీ, 3డీ జామెట్రీ, లోకస్, ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ యాక్సెస్, స్ట్రైట్ లైన్స్, సర్కిల్, సిస్టమ్ ఆఫ్ సర్కిల్స్, పారాబోలా, ఎల్లిప్స్, డైరక్షన్ కొసైన్స్, డైరక్షన్ రేషియోస్, ప్లేన్ తదితరాలు కీలక అంశాలుగా ఉంటాయి. అదే విధంగా ఆల్‌జీబ్రా విభాగంలో ఫంక్షన్స్, మ్యాథమెటికల్ ఇండక్షన్, మ్యాట్రిసెస్, కాంప్లెక్స్ నంబర్స్, డిమోయర్స్ థీరమ్, క్వాడ్రాటిక్ ఎక్స్‌ప్రెషన్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్, పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, బైనామియల్ థీరమ్ తదితరాలపై పట్టు సాధించాలి. ట్రిగ్నోమెట్రీలో ట్రిగ్నోమెట్రిక్ రేషియోస్, ట్రిగ్నోమెట్రిక్ ఈక్వేషన్స్, ప్రాపర్టీస్ ఆఫ్ ట్రయాంగిల్ తదితర అంశాలను సమగ్రంగా ప్రిపర్‌కావాలి. వెక్టర్ ఆల్‌జీబ్రా నుంచి అయిదు లేదా ఆరు ప్రశ్నలు వస్తున్నాయి.

#### ఫిజిక్స్

ఇందులో హీట్ అండ్ థర్మోడైనమిక్స్ నుంచి దాదాపు పది ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. ఆ తర్వాత వర్క్ ఎనర్జీ పవర్, సిస్టమ్ ఆఫ్ పార్టికల్స్ అండ్ రొటేషనల్ మోషన్, లాస్ ఆఫ్ మోషన్, మోషన్ ఇన్ ఎ ప్లేన్, మూవింగ్ చార్జెస్ అండ్ మ్యాగ్నటిజం చాప్టర్ల నుంచి అయిదు లేదా ఆరు ప్రశ్నలు వస్తాయి. గ్రావిటేషన్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, ఆసిలేషన్స్, వేవ్స్, ఎలక్ట్రోస్టాటిక్ పొటెన్షియెల్ అండ్ కెపాసిటెన్స్ చాప్టర్ల నుంచి నాలుగు ప్రశ్నల చొప్పున వస్తాయి. పరీక్షలో అత్యధిక వెయిటేజీ ఉంటున్న మెకానిక్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆ తర్వాత ఎలక్ట్రిసిటీ, మోడ్రన్ ఫిజిక్స్ పాఠ్యాంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

#### కెమిస్ట్రీ

కెమిస్ట్రీని ఆర్గానిక్, ఇనార్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీలుగా విభజించుకొని చదవాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో పట్టు విజయంలో కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి దానిపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఇనార్గానిక్ తర్వాత వెయిటేజీ పరంగా వరుసగా ఆర్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీలు నిలుస్తాయి. కెమిస్ట్రీ అంటే సహజంగా చాలా మందికి తెలియని భయం ఉంటుంది. కాబట్టి ఆ భావనను పక్కనబెట్టి ప్రిపేరయితే కెమిస్ట్రీలోనూ మంచి మార్కులు పొందేందుకు ఆస్కారం ఉంటుంది. ఫిజికల్ కెమిస్ట్రీలో సొల్యూషన్స్ చాప్టర్ నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు. గ్రూప్ మూలకాలు, బాయిలింగ్, మెల్టింగ్ పాయింట్లు, ఎలక్ట్రో పాజిటివిటీ, ఎలక్ట్రో నెగెటివిటీ, ఫస్ట్ ఆర్డర్ రియాక్షన్, టైప్స్ ఆఫ్ ఎలిమెంట్స్, స్టాండర్డ్ రిడక్షన్, పొటన్షియల్ వాల్యూమ్ టాపిక్స్‌పైనా దృష్టిపెట్టాలి. వీటితోపాటు డి, ఎఫ్–బ్లాక్ ఎలిమెంట్లు, స్టాండర్డ్ రిడక్షన్ పొటెన్షియల్ వాల్యూ, వెస్పర్ థియరీ తదితరాలపై ఫోకస్ పెట్టాలి. ఆర్గానిక్ కెమిస్ట్రీని జనరల్, హైడ్రోకార్బన్లు, హాలో కాంపౌండ్లుగా విభజించుకొని చదవాలి.

#### బోటనీ

డైవర్సిటీ ఇన్ ది లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్స్ ఇన్ ప్లాంట్స్ (మార్ఫాలజీ), రీ ప్రొడక్షన్ ఇన్ ప్లాంట్స్, ప్లాంట్ సిస్టమాటిక్స్, సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్, ఇంటర్నల్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ ప్లాంట్స్, ప్లాంట్ ఎకాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, మైక్రోబయాలజీ(బ్యాక్టీరియా, వైరస్), జెనిటిక్స్, మాలిక్యులర్ బయాలజీ, బయో టెక్నాలజీ, ప్లాంట్స్, మైక్రోబ్స్ అండ్ హ్యూమన్ వెల్ఫేర్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

#### జువాలజీ

జువాలజీ నుంచి డైవర్సిటీ ఆఫ్ లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్ ఇన్ యానిమల్స్, యానిమల్ డైవర్సిటీ, లోకోమోషన్ అండ్ రీప్రొడక్షన్ ఇన్ ప్రొటొజోవా, బయాలజీ అండ్ హ్యూమన్ వెల్ఫేర్, స్టడీ ఆఫ్ పెరిప్లెనేటా అమెరికానా, ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్, హ్యూమన్ అనాటమీ అండ్ ఫిజియాలజీ, హ్యూమన్ రీప్రొడక్షన్, జెనిటిక్స్, ఆర్గానిక్ ఎవల్యూషన్, అప్లయిడ్ బయాలజీ అంశాలపై దృష్టి పెట్టాలి.

#### ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం

ఈఏపీసెట్ ప్రిపరేషన్‌లో అభ్యర్థులు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. అదే విధంగా షార్ట్ నోట్స్ రూపొందించుకోవాలి. ప్రాబ్లమ్స్ ప్రాక్టీస్ చేసేటప్పుడు దానికి సంబంధించిన సూత్రం, సిద్ధాంతంపై అవగాహన పెంచుకోవాలి. ఒక కాన్సెప్ట్‌కు చెందిన ప్రశ్నను భిన్న కోణాల్లో సాధించేందుకు కృషి చేయాలి. ప్రతిరోజు ప్రతి సబ్జెక్ట్‌కు సమయం కేటాయించాలి. ప్రతి చాప్టర్‌లోని సినాప్సిస్‌పై పట్టు సాధించాలి. పరీక్ష తేదీకి కనీసం నెల రోజుల ముందు నుంచి పూర్తిగా పునశ్చరణకే ప్రాధాన్యం ఇవ్వాలి.

### ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 2025, ఏప్రిల్ 24
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్:** 2025, మే 12
- **ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్ష తేదీలు:** మే 21 నుంచి 27 వరకు
- **అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్ తేదీలు:** మే 19, 20
- **పూర్తి వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తుకు వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in/EAPCET/Eapcet/EAPCET_HomePage.aspx

## జాబ్ పాయింట్



### ఆంధ్రప్రదేశ్‌లో 14 జిల్లా జడ్జి (ఎంట్రీ లెవల్) పోస్టులు

ఏపీ స్టేట్ జ్యుడిషియల్ సర్వీస్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన జిల్లా జడ్జి(ఎంట్రీ లెవల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో నోటిఫికేషన్ వెలువడిన తేదీ నాటికి 7 సంవత్సరాలకు తక్కువ కాకుండా న్యాయవాద వృత్తిలో పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.03.2025 నాటికి 35 నుంచి 45 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది చీఫ్ సెక్రటరీ టు ది గవర్నమెంట్,గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్,సెక్రటేరియట్ బిల్డింగ్స్,వెలగపూడి, అమరావతి, గుంటూరు జిల్లా–522238 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 27.03.2025.
» **వెబ్‌సైట్:** https://aphc.gov.in

### ఇండియా ఎగ్జిమ్ బ్యాంక్‌లో 28 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

ముంబైలోని ఎక్స్‌పోర్ట్–ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎగ్జిమ్ బ్యాంక్) మేనేజ్‌మెంట్ ట్రైనీల నియామకానికి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోంది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 28.
» **పోస్టుల వివరాలు:** మేనేజ్‌మెంట్ ట్రైనీ–డిజిటల్ టెక్నాలజీ–10, మేనేజ్‌మెంట్ ట్రైనీ–రీసెర్చ్ అండ్ అనాలసిస్–05, మేనేజ్‌మెంట్ ట్రైనీ–రాజ్‌భాష–02, మేనేజ్‌మెంట్ ట్రైనీ–లీగల్–05, డిప్యూటీ మేనేజర్–లీగల్–04, డిప్యూటీ మేనేజర్–01, చీఫ్ మేనేజర్–01.
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంసీఏ, పీజీ, లా డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 28.02.2025 నాటికి ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 33 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు 31 నుంచి 33 ఏళ్లు,ఈడబ్ల్యూఎస్/యూఆర్ అభ్యర్థులకు 28 నుంచి 40 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులకు రూ.65,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.48,480 నుంచి రూ.85,920, చీఫ్ మేనేజర్‌కు రూ.85,920 నుంచి రూ.1,05,280.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ, సర్టిఫికేట్‌ల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.04.2025
» **రాతపరీక్ష తేది:** మే 2025.
» **వెబ్‌సైట్:** www.eximbankindia.in

### సీఎస్ఐఆర్–ఎన్‌జీఆర్ఐ, హైదరాబాద్‌లో 19 సైంటిస్ట్ పోస్టులు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ)లో సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 19.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 21.04.2025 నాటికి 32 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.1,37,907.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 21.04.2025.
» **వెబ్‌సైట్:** www.ngri.res.in

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పదో తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, టెక్ట్స్ బుక్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- తెలంగాణ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- సైన్స్ మెథడాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-కెమిస్ట్రీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- రీజనింగ్



## లేడీ బౌన్సర్స్‌కు
# అడ్డే లేదు

**స్త్రీలను కొన్ని ఉపాధుల్లోకి రానీకుండా అడ్డుకుంటారు. అడ్డుకునేవారిని అడ్డుకుంటాం అంటున్నారు ఈ లేడీ బౌన్సర్లు. కొచ్చి, పుణె, ఢిల్లీ, ముంబైలలో లేడీ బౌన్సర్లకు గిరాకీ పెరిగింది. సెలబ్రిటీలను గుంపు నుంచి అడ్డుకుని వీరు కాపాడుతారు. స్పోర్ట్స్, మార్షల్ ఆర్ట్స్, బాడీ బిల్డింగ్ తెలిసిన స్త్రీలు ఈ రంగాన్ని ఎంచుకుంటున్నారు. రోజుకు రెండు వేల వరకూ ఫీజు. వివాహితలూ ఉన్నారు. వివరాలు...**

ఎనిమిది గంటలు డ్యూటీ. తీసుకెళ్లడం తీసుకు రావడం ఏజెన్సీ పని. భోజనం ఉంటుంది. బయట ఊర్లయితే రూము కూడా ఇస్తారు. రోజుకు రెండు వేల నుంచి రెండు వేల ఐదు వందలు సంపాదన. చేయాల్సిన పని?

- క్రౌడ్‌ను కంట్రోల్ చేయడం
- ఈవెంట్ సెక్యూరిటీ
- సెలబ్రిటీల రక్షణ
- సెలబ్రిటీలను ఎయిర్‌పోర్ట్ నుంచి రిసీవ్ చేసుకోవడం
- సంపన్నుల వేడుకల్లో హంగామా కోసం
- ప్రయివేటు సమస్యల్లో రక్షణ

ఇటీవల ఒక సినీ నటుడి ఇంటి గొడవల్లో బౌన్సర్లనే మాట ఎక్కువగా వినిపించింది. పోలీసుల రక్షణ వీలుగాని చోట ప్రముఖులు బౌన్సర్ల సాయం తీసుకోవడం సాధారణం అయ్యింది. ఒకప్పుడు పబ్‌లలో తాగి గొడవ చేసే వారి కోసం మాత్రమే బౌన్సర్లు ఉండేవారు. ఇప్పుడు అన్ని సేవలకు వారిని ఉపయోగిస్తున్నారు. సెక్యూరిటీకి మాత్రమే కాదు దర్పం చూపించడానికి కూడా శ్రీమంతులు బౌన్సర్లను వాడుతున్నారు. ఉదాహరణకు కలవారి పెళ్లిళ్లలో వరుడు/వధువు కల్యాణ వేదికకు వచ్చేప్పుడు వరుసదీరిన బౌన్సర్లు చెరో పక్క నడుస్తూ బిల్డప్ ఇస్తున్నారు. చూసేవారికి ఇది గొప్పగా ఉంటుంది. వేడుకలకు, బిజినెస్ మీటింగ్స్‌కు వచ్చే అతిథుల కోసం ఎయిర్‌పోర్ట్‌కు బౌన్సర్లను పంపుతున్నారు. కాలేజీ వేడుకలు, ప్రారంభోత్సవాలు, ఔట్‌డోర్ షూటింగ్‌లు... వీటన్నింటికీ బౌన్సర్లు కావాలి. ఎంతమంది బౌన్సర్లుంటే అంత గొప్ప అనే స్థితికి సెలబ్రిటీలు వెళ్లారు. దాంతో వీరి సేవలను సమకూర్చే ఏజెన్సీలు నగరాల్లో పెరిగాయి. మహిళా బౌన్సర్లు కూడా పెరిగారు.



### ఇబ్బందిగా మొదలయ్యి...

'మొదట ప్యాంటూ షర్టు వేసుకున్నప్పుడు ఇబ్బందిగా అనిపించింది. ఇంట్లో వాళ్లు కొత్తగా చూశారు. ఇరుగుపొరుగు వారు వింతగా చూశారు. కాని తరువాత అలవాటైపోయింది' అంది పుణెకు చెందిన ఒక మహిళా బౌన్సర్. 2016లో దేశంలోనే మొదటిసారిగా మహిళా బౌన్సర్ల ఏజెన్సీ ఇక్కడ మొదలైంది. ఆ తర్వాత ఢిల్లీ, ముంబై, బెంగళూరులలో ఇలాంటివి వచ్చాయి. ఇప్పుడు కేరళలో ఈ రంగంలోకి వస్తున్నవారు పెరిగారు. 'మేము ఎవరినో రక్షించడానికి వెళుతుంటే మా రక్షణ కోసం కొత్తల్లో కుటుంబ సభ్యులు ఆందోళన పడేవారు. కాని స్త్రీలు ఈ రంగంలో సురక్షితంగా పని చేయొచ్చని నెమ్మదిగా అర్థం చేసుకున్నారు' అని మరో బౌన్సర్ అంది.

### రెండు విధాలా ఆదాయం

కొచ్చిలో 'షీల్డ్ బౌన్సర్స్ ఏజెన్సీ'కి చెందిన మహిళా బౌన్సర్లు వేడుకలకు ప్రధాన ఆకర్షణగా మారారు. ఈవెంట్స్‌లో మహిళా అతిథులకు, స్టేజ్ రక్షణకు, అతిథుల హోటల్ నుంచి ఈవెంట్ వద్దకు తీసుకు రావడానికి వీరి సేవలు ఉపయోగిస్తున్నారు. 'సాధారణంగా ఈవెంట్స్ సాయంత్రాలు ఉంటాయి. బౌన్సర్ల పని అప్పటి నుంచి మొదలయ్యి అర్ధరాత్రి వరకూ సాగుతుంది. కాబట్టి పగటి పూట చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ లేదా ఇంటి పనులు చక్కబెట్టుకుంటూ మధ్యాహ్నం తర్వాత ఈ పని చేస్తున్నవారూ ఉన్నారు. దాంతో రెండు విధాల ఆదాయం ఉంటోంది' అని ఆ ఏజెన్సీ నిర్వాహకుడు తెలిపాడు.

### స్పోర్ట్స్ తెలిసినవారు

స్కూల్, కాలేజీల్లో స్పోర్ట్స్‌లో చురుగ్గా ఉన్న మహిళలు, వ్యాయామం ద్వారా జిమ్ ద్వారా దేహాన్ని ఫిట్‌గా ఉంచుకున్నవారు, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్న వారు మహిళా బౌన్సర్లుగా రాణిస్తారు. వెంటనే వారికి పని దొరికే పరిస్థితి ఉంది. దేశంలోని నగరాల్లో వివాహితలు, పిల్లలున్న తల్లులు కూడా వృత్తిలో రాణిస్తున్నారు. 'జనాన్ని అదుపు చేయడం, వారిని ఒప్పించి ఇప్పుడే దూరంగా జరపడం, ఆకతాయిలను కనిపెట్టడం, సెలబ్రిటీలతో వ్యవహరించే పద్ధతి తెలియడం, చట్ట పరిధిలో గొడవలను అదుపు చేయడం తెలిస్తే ఈ వృత్తి లాభదాయకం' అంటున్నారు ఈ మహిళా బౌన్సర్లు.

**బ్యూటిప్**

## మొటిమలు, మచ్చలు పోవాలంటే...



ముఖంపై మృతకణాలను ఎప్పటికప్పుడు తొలగించుకోకుంటే మొటిమలు, మచ్చలు లాంటి సమస్యలు తలెత్తుతాయి. అలా కాకుండా ఉండాలంటే ఇంట్లో ఆరోగ్యకరమైన స్క్రబ్‌ను తయారు చేసుకోవచ్చు. అందుకు మూడు టీస్పూన్ల బేకింగ్ సోడాలో ఒక టీస్పూన్ ఓట్స్ వేసి కొన్ని నీళ్లతో మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. రోజూ ఆఫీసు నుంచి ఇంటికి రాగానే ఈ మిశ్రమంతో ముఖాన్ని స్క్రబ్ చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.



## వియ్ హబ్ బ్రాండ్ అంబాసిడర్
# వంట గెలిచింది

ఆమె... వంటతో జీవితాన్ని నిలబెట్టుకుంటానని, వంటలతో అవార్డులు అందుకుంటానని, వియ్ హబ్ (విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ హబ్)కి బ్రాండ్ అంబాసిడర్ అవుతానని కలలో కూడా కలగనలేదు. పాలతో కూరలు వండే గుజరాత్ వాళ్లు ఆమె చేసిన పుదీనా పచ్చడిని లొట్టలేసుకుంటూ తిన్నారు. కొబ్బరి, అరటితో మసాలాలు లేని తేలిక ఆహారం తీసుకునే కేరళ వాసులు కూడా ఆమె చేతి రుచికి ఫిదా అయ్యారు. గోవా వాళ్లకు చేపలతో కొత్త వంటలను పరిచయం చేశారామె. ఈ విజయాలన్నీ ఆమెను రాష్ట్ర సెక్రటేరియట్ వైపు నడిపించాయి. తెలంగాణ సెక్రటేరియట్‌లో క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఆమె పేరు ఆకుల కృష్ణకుమారి. ఊరు మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లా, మూడు చింతలపల్లి గ్రామం. నెలకు లక్షకు పైగా ఆర్జిస్తున్న కృష్ణకుమారి జీవితం పలువురికి స్ఫూర్తిదాయకం.



కృష్ణకుమారి




కృష్ణకుమారి గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత ఒక ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా ఉద్యోగం చేశారు. ఆ తర్వాత కొంతకాలం ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో ఫ్రంట్ ఆఫీసర్. తనకు వంటలు చేయడం, వంటల్లో ప్రయోగాలు చేయడం ఇష్టం. ఆ ఇష్టంతో తాను చేసిన కొత్త వంటకాలను కొలీగ్స్‌కి ఇచ్చేవారామె. ''మా నాన్న టైలర్. ఓ రోజు సెర్ప్ (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ) డీపీఎమ్ సురేఖ గారు మా షాప్‌కి వచ్చారు. నన్ను చూసి నేను చేస్తున్న పని తెలిసిన తర్వాత ఆమె నాకో డైరెక్షన్ ఇచ్చారు. ఆ ధైర్యంతోనే నా కుటీర పరిశ్రమ మొదలైంది. తొలి ఆర్డర్ యూఎస్‌కి, డాక్టర్ గీతాంజలి మేడమ్ పది వేల రూపాయల ఆర్డర్ ఇచ్చారు. అలా మొదలైన నా జర్నీ ఇప్పుడు నెలకు లక్ష రూపాయలకు పైగా ఆదాయంతో విజయవంతంగా సాగుతోంది. మిల్లెట్స్‌తో ప్రయోగాలు నన్ను నిలబెట్టాయి.'' అన్నారు కృష్ణకుమారి.

### మహిళాశక్తి క్యాంటీన్

డ్వాక్రా స్వయంసహాయక బృందంలో చేరిన తర్వాత తన కార్యకలాపాలను వేగవంతం చేశారు కృష్ణకుమారి. హైదరాబాద్, రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చరల్ యూనివర్సిటీలో ఎన్ఐఆర్‌డీలో శిక్షణ తీసుకోవడంతో పాటు, తన ఉత్పత్తులకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికేషన్ వంటి ప్రక్రియలన్నీ పూర్తి చేసుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెట్టడంతో మొదలైన ఆమె జర్నీ సరస్ మేళా ఎగ్జిబిషన్‌లతో అండమాన్, కశ్మీర్ మినహా దేశమంతటికీ విస్తరించింది. ఆమె విజయపథం... ఎగ్జిబిషన్‌లో స్టాల్ కోసం అధికారులను అడగాల్సిన దశ నుంచి ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో స్టాల్ పెట్టవలసిందిగా కలెక్టర్ ఆఫీస్ నుంచి ఫోన్ కాల్ వచ్చే దశకు చేరింది.

### చిన్న రైతులే

నా ఉత్పత్తులకు స్వాద్ అనే బ్రాండ్‌నేమ్ రిజిస్టర్ చేశాను. పరిశ్రమ దమ్మాయిగూడలో ఉంది. ఆరుగురు మహిళలు పని చేస్తున్నారు. నేను ఉదయం తొమ్మిదిన్నరకు సెక్రటేరియట్‌కు చేరుకుంటాను. తిరిగి ఇంటికి చేరేటప్పటికి రాత్రి పదవుతుంది. యూనిట్‌లో నిన్న తయారైన మెటీరియల్‌ను ఈ రోజున కౌంటర్‌లో పెడతాను. ఏ రోజుకారోజు అమ్ముడైపోతాయి. సెక్రటేరియట్ క్యాంటీన్‌తోపాటు యూనిట్‌లోనే అవుట్‌లెట్ కూడా ఉంది. రాపిడో ద్వారా సప్లయ్ చేస్తున్నాం. వినియోగదారులు మా దగ్గరకు రావడం కంటే మేమే వినియోగదారుల దగ్గరకు వెళ్లాలనే ఉద్దేశంతో మొబైల్ యూనిట్ ప్రారంభించనున్నాను. నా సక్సెస్‌కి కారణం తోటలే. పచ్చళ్లు, పొడులు ఏవి చేయాలన్నా కూరగాయలు మార్కెట్ నుంచి తెచ్చుకోను. నేరుగా తోటలకే వెళ్లి తెచ్చుకుంటాను. భారీ స్థాయిలో పండించే వాళ్లు స్వయంగా మార్కెట్‌కు తరలించగలుగుతారు. చిన్న రైతులు తమకు తాముగా మార్కెట్‌కి తీసుకెళ్లాలంటే ఆ ఖర్చులు భరించలేరు. నేను వారి దగ్గర తీసుకుంటాను. నేను ఇష్టంతో ఎంచుకున్న ప్రొఫెషన్. నాకు ఉపాధినివ్వడంతోపాటు గుర్తింపును కూడా తెచ్చింది. ఇందులోనే భవిష్యత్తును నిర్మించుకుంటాను. మహిళల కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు మహిళలకు తెలియడం లేదు. ప్రభుత్వ పథకాల గురించి మహిళలకు అవగాహన కల్పించడం కోసం పని చేస్తాను.

– ఆకుల కృష్ణకుమారి, స్వాద్ ఫుడ్స్





తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గత ఏడాది జూన్ నెల రెండవ తేదీన జరిగిన వేడుకల్లో ఆమె స్టాల్ పెట్టారు. ఆ స్టాల్‌లోని ఉత్పత్తులను ఆసాంతం పరిశీలించిన మంత్రులు, ముఖ్యమంత్రి ఆమె అక్కడికక్కడే లైవ్ కౌంటర్‌లో వండిన తెలంగాణ రుచులకు కూడా సంతృప్తి చెందారు. డ్వాక్రా మహిళల కోసం శాశ్వతంగా ఒక వేదికను ఏర్పాటు చేయవలసిందిగా కోరడంతో 'సెక్రటేరియట్ క్యాంటీన్ మహిళలకే ఇద్దాం' అని నోటిమాటగా వచ్చిన ఉత్తర్వుతో అదే నెల 21న ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ మొదలైంది. అందులో కృష్ణకుమారితో పాటు పదిమంది మహిళలు తమ ఉత్పత్తులను విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. జయహో మహిళాశక్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

**లీగల్**

# పెళ్లి సంగతి తర్వాత... కౌన్సెలింగ్ ఇప్పించండి

మా అక్క తన విడాకుల అనంతరం మాతోనే ఉంటున్నారు. తనకి ఇద్దరు కూతుర్లు. పెద్ద కూతురి వయసు 29 సంవత్సరాలు. గత ఎనిమిది సంవత్సరాలుగా పెళ్లి సంబంధాలు చూస్తున్నాము. 2023వ సంవత్సరంలో ఒక అబ్బాయి పెళ్లి చూపులకు వచ్చినప్పుడు ''నేను మరొకరిని ప్రేమిస్తున్నాను అని చెప్పింది'' కానీ ఆ అబ్బాయి వివరాలు ఇవ్వలేదు. మేమే ఎలాగోలా అతని ఫోన్ నెంబర్ తెలుసుకుని అబ్బాయిని సంప్రదించగా తనకు జాబ్ వచ్చిన తరువాత మాత్రమే తమ ప్రేమ విషయం ఇంట్లో చెప్తాను అన్నాడు. తన కుటుంబ వివరాలు కూడా మాకు ఇవ్వలేదు. వారిది వైజాగ్ అని మాత్రమే తెలుసు. అమ్మాయిని వేరే సంబంధం చేసుకోమంటే మా మాట వినటం లేదు. ఎలా అయినా సరే అతన్నే పెళ్లి చేసుకుంటాను అంటుంది. ఇలా అయితే లాభం లేదు, ఇంట్లో నుంచి వెళ్లిపొమ్మని గట్టిగా చెప్పాము. అయినా లాభం లేదు. ఇటీవలే అబ్బాయికి ఉద్యోగం వచ్చినట్లు తెలిసింది కానీ, తర్వాత నుంచి మా మేనకోడలితో కూడా మాట్లాడడం మానేశాడు. మా అక్కకి ఆ అబ్బాయితో సంబంధం ఇష్టం లేదు. పరిష్కారం చూపగలరు.

– విజయ, హైదరాబాద్

మీ మేనకోడలు ఒక మేజర్. చట్టప్రకారం తను ఎవరిని పెళ్లి చేసుకోవాలి – ఎవరితో కలిసి బతకాలి, అసలు పెళ్లి చేసుకోవాలా వద్దా అనేది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయం పైనే ఆధారపడి ఉంటుంది. అందులో మూడో వ్యక్తి జోక్యం చేసుకోవటాన్ని చట్టం అంగీకరించదు.అది తల్లిదండ్రులైనా సరే! ఏమి చేసినా ఆ అమ్మాయి అంగీకారంతో మాత్రమే చేయవలసి ఉంటుంది. మీరు చెప్పినదాన్ని బట్టి చూస్తే ఆ అబ్బాయికి ఇంక ఇంట్రెస్ట్ లేనట్టు కనిపిస్తుంది. బహుశా మీ అమ్మాయి ఈ విషయం జీర్ణించుకున్నట్లు లేదు. తనకు కౌన్సిలింగ్ అవసరం అనిపిస్తుంది. మీ అమ్మాయి అతన్ని మాత్రమే పెళ్లి చేసుకుంటాను అనడానికి గల కారణం ఏమిటో ప్రేమగా మాట్లాడి తనకి ధైర్యాన్ని ఇస్తూ కనుక్కోండి. పరస్పర అంగీకారంతో ప్రేమించుకున్నట్టైతే సరేం అలా కాదు ఏదైనా వేరే కోణం ఉందేమో తెలుసుకోండి. శారీరక సుఖం కోసం ప్రేమిస్తున్నాను అంటూ వెంటపడుతూ కోరిక తీరినాక మోసపూరితంగా వదిలేస్తే, అందుకు తగిన శిక్షలు భారతీయ న్యాయ సంహితలో వున్నాయి. కఠిన చర్యలు తీసుకోవచ్చు. ఏది ఏమైనా, ఈ సమయంలో మీరు తనపై మరింత ఒత్తిడి పెట్టడం సరైనది కాదు. మీరు కలిగించే ధైర్యం–నమ్మకం తనకు చాలా అవసరం. కాబట్టి పెళ్ళి సంగతులు కాసేపు పక్కనబెట్టి ముందు తన మానసిక పరిస్థితి, తనకు ఏం కావాలి అనే అంశాలను తెలుసుకునే ప్రయత్నం చేయండి. వీలైతే కౌన్సెలింగ్ ఇప్పించండి.



- శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

**సేవాపథం**

# పేదోళ్ల వకీలమ్మ



సరళ మహేందర్‌రెడ్డి

'న్యాయవాది కావడం అనేది కేవలం వృత్తికి సంబంధించిన విషయం మాత్రమే కాదు. ప్రజల విశ్వాసాన్ని చూరగొనడం... సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత తను ఎప్పుడూ గుర్తు పెట్టుకోవడం కూడా' అనే ప్రసిద్ధ మాటను న్యాయవాదుల గురించి చెబుతుంటారు.

**నిజామాబాద్‌కు చెందిన కాటిపల్లి సరళ మహేందర్‌రెడ్డి న్యాయవాదిగా పేదలకు అండగా ఉండటమే కాదు...'సమాజానికి తిరిగి ఇవ్వాలి' అనే ఎరుకతో తన పాఠశాల ద్వారా పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తోంది. పిల్లలు వివిధ ఆటల్లో జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తోంది.**

### సామాజిక సేవే... విలువైన సంపద

న్యాయవాదిగా పేదలకు అండగా నిలవడమే కాదు సామాజికసేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటున్నందుకు సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని సేవాకార్యక్రమాల్లో భాగం కావాలనుకుంటున్నాను.

– సరళ మహేందర్‌రెడ్డి

డిగ్రీ చదువుతున్నప్పుడే వివాహం అయినప్పటికీ భర్త, హైకోర్ట్ న్యాయవాది మహేందర్‌రెడ్డి ప్రోత్సాహంతో ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన సరళ నిజామాబాద్ జిల్లా కోర్టులో ఎన్‌రోల్ అయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదటి మహిళా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసింది. ఉమ్మడి ఏపీ హైకోర్టులో ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా విశాఖ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల బాధ్యతలు చూసింది.

రోడ్డు ప్రమాదంలో మరణించిన తన బావగారు (భర్త అన్న) కాటిపల్లి రవీందర్‌రెడ్డి పేరుమీద ఎడ్యుకేషనల్ సొసైటీ ఏర్పాటు చేసి నర్సరీ నుంచి పదో తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తున్నారు. బీఈడీ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 300 మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందించారు. ఈ ఏడాది నుంచి 'బాలసదన్'లో ఉంటున్న 30 మంది అనాథ పిల్లలకు ఉచితంగా విద్యనందిస్తున్నారు. 'బాలసదన్' చిన్నారుల కోసం జిల్లా జడ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'భవిష్య జ్యోతి' ట్రస్ట్‌కు చైర్‌పర్సన్‌గా సరళ మహేందర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు.



### ఆటల్లో మెరిసేలా...

గ్రామీణ విద్యార్థులను ఆటల్లో ప్రోత్సహించేందుకు 'ఖేలో ఇండియా' కార్యక్రమాలు పాఠశాల ద్వారా నిర్వహిస్తున్నారు. ఖోఖో ఆటలను స్పాన్సర్ చేస్తున్నారు. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు హాకీలో జాతీయ స్థాయిలో ఆడారు. రెండు సార్లు రాష్ట్రస్థాయి జూడో మీట్ నిర్వహించారు. స్కూల్ విద్యార్థులు జూడోలో రాష్ట్రస్థాయిలో అండర్–17 విభాగంలో 3 కాంస్య పతకాలు సాధించారు. జూనియర్స్, సబ్ జూనియర్స్ సైతం జూడో రాష్ట్ర స్థాయిలో ఆడుతున్నారు.

– తుమాటి భద్రారెడ్డి,
సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

# గ్లోబల్ టు లోకల్

**జర్మన్ అమ్మాయి... మలయాళం ఎంత చక్కగా మాట్లాడిందో!**


విదేశాలకు వెళ్లడం, కొత్త కొత్త ప్రదేశాల్లో విహరించడం బాగానే ఉంటుంది కానీ భాషా సమస్యలు ఇబ్బంది పెడుతుంటాయి. కొందరు వేరే దేశాల్లో నివసిస్తున్నప్పటికీ స్థానిక భాషలు వారికి ఎప్పుడూ పరాయిగానే ఉండిపోతాయి.

ఎందుకంటే వారు ఎప్పుడూ మాట్లాడరు... మాట్లాడాలని ప్రయత్నించరు!

'నేర్చుకోవాలనే తపన ఉంటే... ఏ భాష అయినా మాట్లాడవచ్చు' అని చెప్పే వీడియో ఒకటి సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

క్లారా అనే జర్మనీ అమ్మాయి కొంత కాలంగా మన దేశంలో నివసిస్తోంది. ఆమె ఉబర్ క్యాబ్ డ్రైవర్‌తో స్పష్టమైన మలయాళంలో మాట్లాడుతున్న వీడియో క్లిప్ చూసి నెటిజనులు 'ఆహా' అంటున్నారు.

'ఇంగ్లీష్ మాట్లాడే ఫారినర్స్‌నే చూశాను గానీ ఇంత చక్కగా మలయాళం మాట్లాడే ఫారినర్‌ను చూడడం ఇదే మొదటిసారి' అని క్యాబ్‌డ్రైవర్ బోలెడు ఆశ్చర్యపోయాడు.




**ఆర్ట్ అండ్ కల్చర్**

# పాకిస్థాన్‌లో... ప్యార్ కియాతో డర్నా క్యా!

దేశాల మధ్య ఎంత దూరమైనా ఉండవచ్చు. ఎంత శత్రుత్వమైనా ఉండొచ్చు. అయితే కళకు ఆ దూరం తెలియదు. ఆ శత్రుత్వం తెలియదు.

'మొఘల్–ఎ–ఆజం' అనే సినిమా పేరు వినగానే ఒళ్లు పులకరించిపోతుంది. కాలాతీతమైన ప్రేమ కావ్యం ఇది. ఈ సినిమాకు మన దేశంలో ఎంత ఆదరణ, అభిమానం ఉందో పాకిస్థాన్‌లోనూ అంతే. పాక్‌లో ఈతరం ప్రేక్షకులు కూడా ఈ సినిమాను సొంతం చేసుకోవడం విశేషం. తాజా విషయానికి వస్తే...

పాకిస్థాన్‌లోని గవర్నమెంట్ కాలేజీ యూనివర్సిటీ (జిసియూ) విద్యార్థుల బృందం ఈ ఐకానిక్ చిత్రానికి నీరాజనం అర్పించింది.

'మొఘల్–ఎ–ఆజం' సినిమాను నాటకంగా ప్రదర్శిస్తే ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన ఇంతా అంతా కాదు!




'మొఘల్–ఎ–ఆజం' చిత్రంలో ఓ సన్నివేశం



## క్వార్టర్ ఫైనల్లో యూకీ బాంబ్రీ జోడీ

మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో భారత అగ్రశ్రేణి ప్లేయర్ యూకీ బాంబ్రీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. అమెరికాలోని ఫ్లోరిడాలో ఈ టోర్నీ జరుగుతోంది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో యూకీ బాంబ్రీ (భారత్)–నూనో బోర్జెస్ (పోర్చుగల్) ద్వయం 7–6 (7/4), 6–2తో జేమీ ముర్రే (బ్రిటన్)–ఆడమ్ పావ్లాసెక్ (చెక్ రిపబ్లిక్) జోడీపై విజయం సాధించింది.



## రెజ్లర్ సునీల్‌కు కాంస్య పతకం

ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజు భారత్‌కు ఒక కాంస్య పతకం లభించింది. జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో ఈ టోర్నీ జరుగుతోంది. మంగళవారం జరిగిన పురుషుల గ్రీకో రోమన్ స్టయిల్ 87 కేజీల విభాగంలో సునీల్ కుమార్ భారత్‌కు కాంస్య పతకాన్ని అందించాడు. కాంస్య పతక పోరులో సునీల్ 5–1 పాయింట్లతో చైనాకు చెందిన జియాజిన్ హువాంగ్‌పై విజయం సాధించాడు.

## ముల్లాన్‌పూర్‌లో మహిళల వన్డే వరల్డ్‌కప్ ఫైనల్!

**సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 26 వరకు టోర్నీ**



**న్యూఢిల్లీ:** ఈ ఏడాది భారత్ ఆతిథ్యమివ్వనున్న మహిళల వన్డే వరల్డ్‌కప్ క్రికెట్ టోర్నమెంట్ వేదికల వివరాలు బహిర్గతమయ్యాయి. ముల్లాన్‌పూర్ (పంజాబ్)లోని మహారాజా యాదవేంద్ర సింగ్ అంతర్జాతీయ స్టేడియం ఈ మెగా టోర్నీ ఫైనల్ మ్యాచ్‌కు ఆతిథ్యమివ్వనుందని సమాచారం. 34 వేల మంది ప్రేక్షకుల సామర్థ్యంగల ఈ స్టేడియం ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ జట్టుకు రెండో హోంగ్రౌండ్‌గా ఉంది. ముల్లాన్‌పూర్‌తోపాటు విశాఖపట్నం, తిరువనంతపురం, ఇండోర్, రాయ్‌పూర్‌లలో వరల్డ్‌కప్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ముల్లాన్‌పూర్, తిరువనంతపురం, రాయ్‌పూర్‌లలో ఇప్పటి వరకు మహిళల అంతర్జాతీయ మ్యాచ్‌లు జరగలేదు.

- అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఆధ్వర్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిర్వహించనున్న మహిళల వన్డే వరల్డ్‌కప్ ఈ ఏడాది సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 26 వరకు జరగనుంది. అయితే ఈ తేదీలను ఐసీసీ, బీసీసీఐ ఇంకా అధికారికంగా ప్రకటించలేదు.
- ఎనిమిది దేశాల మధ్య వన్డే వరల్డ్‌కప్ జరగనుంది. మొత్తం 31 మ్యాచ్‌లు జరుగుతాయి. ఆతిథ్య దేశం భారత్‌తోపాటు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక జట్లు ఇప్పటికే ఈ మెగా టోర్నీకి అర్హత సాధించాయి.
- ఏప్రిల్ 9 నుంచి 19 వరకు లాహోర్‌లో జరిగే క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా చివరి రెండు జట్లు ఖరారవుతాయి. క్వాలిఫయింగ్ టోర్నీలో పాకిస్తాన్, వెస్టిండీస్, స్కాట్లాండ్, బంగ్లాదేశ్, ఐర్లాండ్, థాయ్‌లాండ్ జట్లు పోటీపడనున్నాయి. ఒకవేళ పాకిస్తాన్ వరల్డ్‌కప్‌కు అర్హత సాధిస్తే మెగా టోర్నీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహిస్తారు. పాకిస్తాన్ జట్టు ఆడే మ్యాచ్‌లను శ్రీలంక లేదా యూఏఈలలో నిర్వహిస్తారు.
- భారత్ నాలుగోసారి మహిళల వన్డే వరల్డ్‌కప్ టోర్నీకి ఆతిథ్యమివ్వనుంది. గతంలో భారత్ 1978, 1997, 2013లలో ఈ మెగా టోర్నీని నిర్వహించింది. ఇప్పటి వరకు వన్డే వరల్డ్‌కప్ 12 సార్లు జరగ్గా... భారత్ రెండుసార్లు (2005, 2017) రన్నరప్‌గా నిలిచింది.

# పంజాబ్ తొలి పంచ్

## గుజరాత్ టైటాన్స్‌పై విజయం

### శ్రేయస్, శశాంక్ మెరుపులు ● సుదర్శన్, బట్లర్ పోరాటం వృథా



శ్రేయస్

**కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో పంజాబ్ కింగ్స్ తొలి విజయం నమోదు చేసుకుంది. బ్యాటర్ల జోరుకు బౌలర్ల సహకారం తోడవడంతో... ఐపీఎల్ 18వ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్‌పై పంజాబ్ పంజా విసిరింది. ఆరంభంలో ప్రియాంశ్ ఆర్య మెరుపులు... చివర్లో శశాంక్ సింగ్ ఫినిషింగ్ టచ్... ఇన్నింగ్స్ ఆసాంతం శ్రేయస్ అయ్యర్ దూకుడు... వెరసి పంజాబ్ కింగ్స్ భారీ స్కోరు చేయగా... ఛేదనలో తగ్గేదేలే అన్నట్లు బాదిన గుజరాత్ చివరకు 11 పరుగుల తేడాతో ఓటమి పాలైంది.**

**అహ్మదాబాద్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 టోర్నమెంట్ 18వ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన పోరులో పంజాబ్ 11 పరుగుల తేడాతో మాజీ చాంపియన్ గుజరాత్ టైటాన్స్‌పై గెలిచింది. మొదట పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (42 బంతుల్లో 97 నాటౌట్; 5 ఫోర్లు, 9 సిక్స్‌లు) సెంచరీకి మూడు పరుగుల దూరంలో నిలిచిపోగా... ప్రియాంశ్ ఆర్య (23 బంతుల్లో 47; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), శశాంక్ సింగ్ (16 బంతుల్లో 44 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శ్రేయస్ సిక్సర్లతో రెచ్చిపోగా... శశాంక్, ప్రియాంశ్ ఆర్య బౌండరీల మోత మోగించారు. గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో సాయికిషోర్ 3 వికెట్లు పడగొట్టాడు. లక్ష్య ఛేదనలో గుజరాత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 232 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (41 బంతుల్లో 74; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), బట్లర్ (33 బంతుల్లో 54; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకాలు సాధించగా... కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (14 బంతుల్లో 33; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ (28 బంతుల్లో 46; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) పోరాడినా ఫలితం లేకపోయింది.



శశాంక్

### కెప్టెన్ ఇన్నింగ్స్...

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్‌కు శుభారంభం దక్కలేదు. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (5) తక్కువ స్కోరుకే వెనుదిరగడంతో 28 పరుగుల వద్ద పంజాబ్ తొలి వికెట్ కోల్పోయింది. అయితే మరో ఎండ్‌లో ప్రియాంశ్ దూకుడు కనబర్చడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఇన్నింగ్స్ రెండో బంతికి ఫోర్‌తో ఖాతా తెరిచిన ప్రియాంశ్... సిరాజ్ వేసిన మూడో ఓవర్‌లో 6, 4 బాదాడు. అయ్యర్ వచ్చీరాగానే 4, 6తో చాంపియన్స్ ట్రోఫీ ఫామ్ కొనసాగించగా... ఐదో ఓవర్‌లో ప్రియాంశ్ 4, 4, 6, 4 కొట్టాడు. దీంతో పవర్‌ప్లే ముగిసేసరికి పంజాబ్ 73/1తో నిలిచింది. ఆ తర్వాత గుజరాత్ బౌలర్లు కాస్త ఒత్తిడి పెంచడంతో పరుగుల రాక మందగించగా... సాయికిషోర్ వరుస బంతుల్లో అజ్మతుల్లా (16), మ్యాక్స్‌వెల్ (0)లను పెవిలియన్‌కు పంపాడు. ఎదుర్కొన్న తొలి బంతికే మ్యాక్స్‌వెల్ వికెట్ల ముందు దొరికిపోయాడు. అయితే రివ్యూలో బంతి వికెట్ల మీద నుంచి వెళ్తున్నట్లు తేలింది. 2 రివ్యూలు ఉన్నా పంజాబ్ సరైన సమయంలో వినియోగించుకోలేక స్టార్ బ్యాటర్ వికెట్ కోల్పోయింది. అవన్నీ మరిపించేలా అయ్యర్, శశాంక్ ఆఖర్లో బౌండరీలతో రెచ్చిపోయారు. సాయికిషోర్ ఓవర్‌లో 2 సిక్సర్లు బాదిన శ్రేయస్... రషీద్ ఖాన్ బౌలింగ్‌లోనూ రెండు సిక్స్‌లు కొట్టాడు. కొన్ని చక్కటి షాట్లు ఆడిన స్టొయినిస్ (20; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కూడా సాయికిషోర్‌కు వికెట్ సమర్పించుకోగా... ప్రసిధ్ కృష్ణ వేసిన ఇన్నింగ్స్ 17వ ఓవర్‌లో శ్రేయస్ 6, 4, 6, 6 కొట్టి 90 పరుగుల మీదకు చేరాడు. మరో 3 ఓవర్ల ఆట మిగిలి ఉండటంతో ఐపీఎల్లో అయ్యర్ తొలి సెంచరీ ఖాయమే అనుకుంటే... ఆఖర్లో అతడికి ఎక్కువ బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. 18వ ఓవర్లో 6, 4, 6 కొట్టిన శశాంక్ సింగ్.. చివరి ఓవర్‌లో 5 ఫోర్లు బాది జట్టుకు భారీ స్కోరు అందించాడు.

QR code: **ఐపీఎల్-2025: అప్‌డేట్, వివరాలు, విశ్లేషణ కోసం స్కాన్ చేయండి**



సుదర్శన్

### చివర్లో చిత్తు...

భారీ లక్ష్యం కళ్లెదురుగా ఉన్నా... గుజరాత్ ఏమాత్రం వెనకడుగు వేయలేదు. నాలుగో ఓవర్‌లో గిల్ 6, 6, 4తో మోత ప్రారంభించగా... సుదర్శన్ దాన్ని కొనసాగించాడు. బౌలర్‌తో సంబంధం లేకుండా బంతి తన పరిధిలో ఉంటే దానిపై విరుచుకుపడ్డాడు. వేగంగా ఆడే క్రమంలో గిల్ వెనుదిరగగా... బట్లర్ చక్కటి షాట్లతో అలరించాడు. ఫలితంగా 10 ఓవర్లు ముగిసేసరికి గుజరాత్ 104/1తో నిలిచింది. ఈ క్రమంలో సుదర్శన్ 31 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. 11వ ఓవర్లో బట్లర్ 2 సిక్స్‌లు కొట్టగా... తదుపరి ఓవర్లో సుదర్శన్ 4, 6, 4 బాదాడు. సుదర్శన్ ఔటయ్యాక ఇంపాక్ట్ ప్లేయర్‌గా క్రీజులోకి వచ్చిన రూథర్‌ఫర్డ్ కూడా అలరించాడు. చివర్లో వైశాఖ్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో... లక్ష్యంవైపు సజావుగా సాగుతున్న గుజరాత్ ఒక్కసారిగా వెనుకబడింది. చివరి ఓవర్లో టైటాన్స్ విజయానికి 27 పరుగులు అవసరం కాగా.. ఆ జట్టు 15 పరుగులే చేసింది.

### ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | పా | నె.ర.రే |
|---|---|---|---|---|---|
| హైదరాబాద్ | 1 | 1 | 0 | 2 | 2.200 |
| బెంగళూరు | 1 | 1 | 0 | 2 | 2.137 |
| పంజాబ్ | 1 | 1 | 0 | 2 | 0.550 |
| చెన్నై | 1 | 1 | 0 | 2 | 0.493 |
| ఢిల్లీ | 1 | 1 | 0 | 2 | 0.371 |
| లక్నో | 1 | 0 | 1 | 0 | -0.371 |
| ముంబై | 1 | 0 | 1 | 0 | -0.493 |
| గుజరాత్ | 1 | 0 | 1 | 0 | -0.550 |
| కోల్‌కతా | 1 | 0 | 1 | 0 | -2.137 |
| రాజస్తాన్ | 1 | 0 | 1 | 0 | -2.200 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

### స్కోరు వివరాలు

**పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్:** ప్రియాంశ్ ఆర్య (సి) సాయి సుదర్శన్ (బి) రషీద్ 47; ప్రభ్‌సిమ్రన్ (సి) అర్షద్ (బి) రబడ 5; శ్రేయస్ అయ్యర్ (నాటౌట్) 97; అజ్మతుల్లా (సి) అర్షద్ (బి) సాయికిషోర్ 16; మ్యాక్స్‌వెల్ (ఎల్బీ) (బి) సాయికిషోర్ 0; స్టొయినిస్ (సి) అర్షద్ (బి) సాయికిషోర్ 20; శశాంక్ సింగ్ (నాటౌట్) 44; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 243. వికెట్ల పతనం:** 1–28, 2–79, 3–105, 4–105, 5–162. **బౌలింగ్:** సిరాజ్ 4–0–54–0; రబడ 4–0–41–1; అర్షద్ 1–0–21–0; రషీద్ 4–0–48–1; ప్రసిధ్ కృష్ణ 3–0–41–0; సాయికిషోర్ 4–0–30–3. **గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్:** సుదర్శన్ (సి) శశాంక్ (బి) అర్ష్‌దీప్ 74; గిల్ (సి) ప్రియాంశ్ (బి) మ్యాక్స్‌వెల్ 33; బట్లర్ (బి) యాన్సెన్ 54; రూథర్‌ఫర్డ్ (బి) అర్ష్‌దీప్ 46; తెవాటియా (రనౌట్) 6; షారుక్ (నాటౌట్) 6; అర్షద్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 232. వికెట్ల పతనం:** 1–61, 2–145, 3–199, 4–217, 5–225. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4–0–36–2; అజ్మతుల్లా 2–0–29–0; యాన్సెన్ 4–0–44–1; మ్యాక్స్‌వెల్ 2–0–26–1; స్టొయినిస్ 2–0–31–0; చహల్ 3–0–34–0; వైశాఖ్ 3–0–28–0.

### ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ X కోల్‌కతా
వేదిక: గువాహటి
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

# సాక్షి సినిమా

## కన్నప్పలో మల్లు



● రఘుబాబు

విష్ణు మంచు హీరోగా నటించిన చిత్రం 'కన్నప్ప'. ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో మోహన్‌బాబు, మోహన్‌లాల్, శరత్‌కుమార్, బ్రహ్మానందం, అక్షయ్ కుమార్, ప్రభాస్, కాజల్ అగర్వాల్, రఘుబాబు ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 25న విడుదల కానుంది. తాజాగా 'కన్నప్ప' సినిమాలోని మల్లు పాత్రలో రఘుబాబు నటించినట్లుగా వెల్లడించి, ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. కోపోద్రిక్తుడైన మల్లు పోరాటానికి సిద్ధమవుతున్న హావభావాలు ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నాయి. ఇక 'కన్నప్ప' సినిమా ట్రైలర్‌ను త్వరలోనే విడుదల చేస్తామని యూనిట్ వెల్లడించింది. ఈ సినిమాకు సంగీతం: స్టీఫెన్ దేవస్సీ.

## రామానుజాచార్యుల గొప్పదనం నేపథ్యంలో...



● సాయి వెంకట్

సాయి వెంకట్ నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'జయహో రామానుజ'. సుమన్, జో శర్మ (అమెరికా), ప్రవళ్లిక ఇతర కీలక పాత్రధారులు. సాయిప్రసన్న, ప్రవళ్లిక నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సంస్కృత భాషల్లో త్వరలో విడుదల కానుంది. జయసూర్య, హర్ష సంగీతం అందించారు. ఈ సినిమా పాటల విడుదల కార్యక్రమంలో సాయి వెంకట్ మాట్లాడుతూ– ''రామానుజాచార్యుల గురించి మన తెలుగు రాష్ట్రాల్లో పెద్దగా తెలియదు. కానీ, తమిళనాట ప్రతి ఒక్కరికీ తెలుసు. వెంకటేశ్వరస్వామికి శంఖు చక్రాలు రామానుజాచార్యుల వారే బహూకరించారు. ఆయన గొప్పదనం తెలియజేసేందుకే ఈ చిత్రాన్ని రూపొందించాను. ఇప్పటివరకూ పౌరాణికంలో ఎవరూ 11 పాత్రల్లో నటించలేదు. నేను ఈ చిత్రంలో 11 పాత్రలు చేసి, వరల్డ్ రికార్డ్ క్రియేట్ చేస్తున్నా'' అని చెప్పారు. ''ఈ భారీ చిత్రాన్ని నిర్మించగలనని నమ్మి, నన్ను సపోర్ట్ చేసిన మా నాన్న సాయివెంకట్‌కు థ్యాంక్స్'' అన్నారు ప్రవళ్లిక.

## ఎక్కడికెళ్లినా గర్వంగా ఇక్కడికే వస్తా!



**''ఒక సినిమాతో ప్రేక్షకులకు వినోదం పంచితే, మరో సినిమాతో సందేశం ఇవ్వాలి. ఇలా నా సినిమాలను బ్యాలెన్స్ చేసుకోవాలనుకుంటున్నాను. తెలుగు అమ్మాయిగా, హీరోయిన్‌గా నాపై ఆ బాధ్యత ఉంటుంది'' అని హీరోయిన్ శ్రీలీల అన్నారు. నితిన్, శ్రీలీల జంటగా నటించిన తాజా చిత్రం 'రాబిన్‌హుడ్'. ఆస్ట్రేలియన్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఓ అతిథి పాత్రలో నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రకథానాయిక శ్రీలీల పంచుకున్న విశేషాలు.**

● 'రాబిన్‌హుడ్' సినిమాలో ఫారిన్ నుంచి ఇండియాకు వచ్చిన నీరా వాసుదేవ్ అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తాను. తన ప్రపంచంలో తను ఉంటుంది. ఈ ప్రపంచం అంతా తన చుట్టూనే ఉంటుందని అనుకుంటుంది. నా కెరీర్‌లో నీరా వాసుదేవ్ లాంటి ఫన్ రోల్‌ను ఇప్పటివరకూ చేయలేదు. నితిన్‌గారితో వర్క్ చేయడం ఇది రెండోసారి (గతంలో 'ఎక్స్‌ట్రా' మూవీలో కలిసి నటించారు). చాలా కంఫర్ట్‌గా ఉంటుంది. ఓ ఫ్యామిలీ మెంబర్‌లా ఉంటారు. ఈ సినిమాతో మాకు హిట్ పెయిర్‌గా పేరు వస్తుంది. 'రాబిన్‌హుడ్' సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నాం. ● నీరా వాసుదేవ్ పాత్రకు రష్మికా మందన్నాను అనుకున్నారు. రష్మికకు కూడా నచ్చిన పాత్ర ఇది. కానీ కాల్షీట్స్ విషయంలో సమస్యలు రావడం వల్ల రష్మిక తప్పుకున్నారు. ఆ సమయంలో వెంకీగారు నాకు ఫోన్ చేసి, ఈ రోల్ గురించి చెప్పారు. నాకు నచ్చి ఓకే అన్నాను. ఇటీవల 'పుష్ప: ది రూల్' షూటింగ్‌లో మేం కలుసుకున్నప్పుడు రష్మిక నాకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. నేను మైత్రీ ఫ్యామిలీలో ఉన్నానని గర్వంగా చెప్పగలను. మన ఫ్యామిలీతో సినిమాలు చేస్తే ఎలా ఉంటుందో, వారితో మూవీ చేస్తే అలా ఉంటుంది.

– శ్రీలీల

● 'పుష్ప ది రూల్' సినిమాలో 'కిస్సిక్' స్పెషల్ సాంగ్ చేశాను. ఈ సాంగ్ సక్సెస్ తర్వాత ఆ తరహా స్పెషల్ సాంగ్స్ చేసేందుకు నాకు కొన్ని అవకాశాలు వచ్చాయి. కానీ 'పుష్ప: ది రూల్' అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన భారతీయ సినిమా. సో... ఆ సినిమాలో స్పెషల్ సాంగ్ చేశాను. అయితే ఇకపై ఇలాంటి పెద్ద సినిమాల్లో సాంగ్స్‌కి బదులుగా మంచి రోల్స్ చేయాలనుకుంటున్నాను.

● 2023లో నావి ఐదారు సినిమాలు రిలీజ్ అయ్యాయి. దాంతో త్రీ షిఫ్ట్స్ కూడా వర్క్ చేశాను. అయితే గత ఏడాది హీరోయిన్‌గా ఒకే ఒక్క సినిమా ('గుంటూరు కారం')లో కనిపించాను. నా ఫైనల్ ఇయర్ మెడికల్ ఎగ్జామ్స్ వల్ల ఎక్కువ సినిమాలు చేయలేదు. ఈ గ్యాప్‌లో ఎన్నో మంచి రోల్స్, మంచి చిత్రాలు వదులుకున్నాను.

● ప్రస్తుతం రవితేజగారితో 'మాస్ జాతర', శివ కార్తికేయన్‌గారితో 'పరాశక్తి', కన్నడ–తెలుగు భాషల్లో 'జూనియర్' సినిమా చేస్తున్నాను.

**'రాబిన్ హుడ్'లో కేతికా శర్మ చేసిన స్పెషల్ సాంగ్ 'అదిదా సర్‌ప్రైజ్'లోని కొన్ని డ్యాన్స్ మూమెంట్స్‌కి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మీరు అద్భుతమైన డ్యాన్సర్. ఆ తరహా డ్యాన్స్ మూవ్స్, కొరియోగ్రఫీ గురించి ఓ హీరోయిన్‌గా ఏం చెప్తారు?**

''ఒక అమ్మాయి దృష్టి కోణంలో చెప్పాలంటే... మనం కంఫర్టబుల్‌గా ఉన్నామా? లేదా? అనేది ముఖ్యం. స్టెప్స్ అనేవి చేసేవారి కంఫర్ట్ లెవల్స్‌పై ఆధారపడి ఉంటాయి. కంఫర్ట్ జోన్ అనేది పర్సన్ టు పర్సన్ మారుతుంది. అయితే... అమ్మాయి ఇబ్బంది పడలేదు అన్నప్పుడు ఆలోచించాల్సిన అవసరం లేదు. హీరోయిన్‌గా నేను ఎన్నో సాంగ్స్ చేశాను. శేఖర్ మాస్టర్‌తో కూడా చేశాను. అందరం హ్యాపీ'' అంటున్న శ్రీలీలతో బాలకృష్ణ 'డాకు మహారాజ్' సినిమాలోని డ్యాన్స్ మూవ్స్, అలాగే వేరే సినిమాల్లోని ఈ తరహా డ్యాన్స్ మూవ్స్‌పై మహిళా కమిషన్ కూడా అభ్యంతరం వ్యక్తం చేసింది. మీరేం అంటారు? అన్న ప్రశ్నకు శ్రీలీల బదులిస్తూ... ''మహిళా కమిషన్‌కి మంచి స్థాయి ఉంది. ఏది సరైనదో వారికి తెలుసు. పాత సినిమాల పట్ల కూడా వారికి నాలెడ్జ్ ఉంది. అన్నీ ఆలోచించి నిర్ణయం తీసుకుంటారనుకుంటున్నాను'' అన్నారు.

**హిందీ చిత్ర పరిశ్రమలో బిజీ అవుతున్నారు... అక్కడికే వెళ్లిపోతారని కొందరు అంటున్నారు..**

అన్ని భాషల్లో సినిమాలు చేయాలనుకుంటున్నాను. కానీ శ్రీలీల అంటే ఎవరు? తెలుగింటి అమ్మాయి. తెలుగు చిత్ర పరిశ్రమ నాకు ఇల్లులాంటిది. ఒకవేళ బయటకు వెళ్లినా గర్వంగా ఇక్కడికే (తెలుగు) తిరిగి వస్తాను. మన పిల్లలు చదువుకోవడానికి మరొక చోటుకు వెళతారు. కానీ మళ్లీ మన ఇంటికే వస్తారు కదా! సరిహద్దులు మారినంత మాత్రాన గాలి మారదు. నేను అన్ని భాషలనూ బ్యాలెన్స్ చేస్తూ, సినిమాలు చేయాలనుకుంటున్నాను.

## మేలో రైడ్



● అజయ్ దేవగన్

అజయ్ దేవగన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'రైడ్ 2'. రాజ్‌కుమార్ గుప్తా దర్శకత్వం వహించారు. వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందిన సూపర్ హిట్ మూవీ 'రైడ్' (2018)కి సీక్వెల్‌గా 'రైడ్ 2' రూపొందింది. ఈ మూవీలో వాణీ కపూర్, రితేష్ దేశ్‌ముఖ్ ఇతర పాత్రలు పోషించారు. అభిషేక్ పాఠక్, కుమార్ మంగత్ పాఠక్, భూషణ్ కుమార్, గౌరవ్ నంద, క్రిషన్ కుమార్, ప్రగ్యా సింగ్ నిర్మించారు. ఈ చిత్రాన్ని మే 1న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ''వాస్తవ ఘటనల నేపథ్యంలో రూపొందిన చిత్రం 'రైడ్ 2'. ఈ మూవీలో ఐఆర్‌ఎస్ అధికారి అమయ్ పట్నాయక్‌గా అజయ్ దేవగన్ నటించారు. వాస్తవ ఘటనలకి సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలు జోడించి తనదైన శైలిలో ఈ మూవీని తీర్చిదిద్దారు రాజ్‌కుమార్ గుప్తా. 'రైడ్' సినిమాలా 'రైడ్ 2' కూడా ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

## ఊహించని మలుపుల గేట్



● వి. సముద్ర, వేణుగోపాల్

''ఇప్పటి ట్రెండ్‌కు సరిపోయేలా మాస్, యాక్షన్ అంశాలతో 'సీతన్నపేట గేట్' సినిమా తెరకెక్కింది. ఈ మూవీ పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని దర్శకుడు వి. సముద్ర అన్నారు. వేణుగోపాల్, 8 పీఎం సాయి కుమార్, పార్థు, రఘుమా రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సీతన్నపేట గేట్'. వై. రాజ్‌కుమార్ దర్శకత్వంలో ఆర్. శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 4న విడుదల కానుంది. ఈ చిత్రం విలేకరుల సమావేశానికి వి. సముద్ర అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో వై. రాజ్‌కుమార్ మాట్లాడుతూ– ''వాస్తవ సంఘటనల ఆధారంగా 'సీతన్నపేట గేట్' సినిమాను రూపొందించాను. ఊహించని మలుపులతో ఈ సినిమా సాగుతుంది'' అన్నారు. ''ప్రస్తుత సమాజంలో జరుగుతున్న ఘటనలకు ప్రతిరూపంగా ఈ మూవీ ఉంటుంది'' అని తెలిపారు ఆర్. శ్రీనివాస్. ''ఈ చిత్రంలో నాది స్ట్రాంగ్ ఎమోషన్స్ ఉన్న రోల్'' అని అన్నారు వేణుగోపాల్.

## ఏదో ఏ జన్మలోదో...



● రూపేష్, ఆకాంక్షా సింగ్

రాజేంద్రప్రసాద్, అర్చన ప్రధాన పాత్రల్లో, రూపేష్, ఆకాంక్షా సింగ్ జంటగా నటిస్తున్న చిత్రం 'షష్టిపూర్తి'. పవన్ ప్రభ దర్శకత్వంలో హీరో రూపేష్ నిర్మిస్తున్నారు. ఇళయరాజా సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'ఏదో ఏ జన్మలోదో...' అంటూ సాగే పాటని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ విడుదల చేశారు. ఎంఎం కీరవాణి ఈ పాట రాయగా, అనన్యా భట్ పాడారు. ఈ సందర్భంగా పవన్ ప్రభ మాట్లాడుతూ– ''మా సినిమాలోని మూడో పాటని కీరవాణిగారితో రాయిస్తే అందరికీ అర్థమయ్యేలా, సాహిత్య విలువలతో క్యాచీగా ఉంటుందనిపించి, రూపేష్‌గారికి చెప్పాను. ఆయన పాటల రచయిత చైతన్య ప్రసాద్ గారికి చెప్పారు. వేరే సినిమా రీ రికార్డింగ్ కోసం చెన్నైలో ఉన్న కీరవాణిగారిని సంప్రదించి పాట రాయమని కోరాం. ఇళయరాజాగారి బాణీలో కీరవాణిగారి సాహిత్యం, అనన్యా భట్ గాత్రం కలిసి 'ఏదో ఏ జన్మలోదో...' పాట అద్భుతంగా వచ్చింది'' అన్నారు.

## అభినవ్ సాహసాలు



● సుధాకర్ గౌడ్

'ఆదిత్య, విక్కీస్ డ్రీమ్, డాక్టర్ గౌతమ్' వంటి సందేశాత్మక బాలల చిత్రాలను తెరకెక్కించిన దర్శక–నిర్మాత భీమగాని సుధాకర్ గౌడ్ రూపొందించిన తాజా చిత్రం 'అభినవ్'. సమ్మెట గాంధీ, సత్య ఎర్ర, మాస్టర్ గగన్, గీతా గోవింద్, అభినవ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. శ్రీలక్ష్మీ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ సమర్పణలో భీమగాని సుధాకర్ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ బాలల చిత్రం నవంబరు 14న విడుదల కానుంది. ఈ చిత్రం విలేకరుల సమావేశంలో భీమగాని సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ– ''స్వాతంత్య్ర సమరయోధుడైన తన తాతయ్య నారాయణరావు స్ఫూర్తితో అభినవ్ అనే సాహస బాలుడు ఓ గంజాయి మాఫియాను ఎలా అడ్డుకున్నాడు? అన్నదే 'అభినవ్' చిత్రం. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు డ్రగ్స్ రహిత సమాజం కోసం సినిమా వాళ్లు చిన్న వీడియో చేయాలని కోరారు. నేను డ్రగ్స్ రహిత సమాజం కోసం నా వంతుగా ఈ సినిమాను నిర్మించి, దర్శకత్వం వహించాను'' అని అన్నారు.

# నిందితుడిపై అస్పష్టత!

- ఎంఎంటీఎస్ కేసులో ఓ పాత నేరస్తుడి ఫొటోలో పోలికలు గుర్తించిన బాధితురాలు
- అదుపులోకి తీసుకున్న పోలీసులు.. నేరుగా చూశాక అతడు కాదని వెల్లడి
- ఎంఎంటీఎస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు లేకపోవడంతో నిందితుడి గుర్తింపు కష్టసాధ్యం

**సికింద్రాబాద్:** ఎంఎంటీఎస్ రైలులో జరిగిన అత్యాచార యత్నం కేసులో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసు బృందాల దర్యాప్తు కొనసాగుతోంది. ఈ మార్గంలోని 12 ఎంఎంటీఎస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు లేకపోవడంతో దర్యాప్తునకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు చెబుతున్న వివరాల్లో స్పష్టత లేకపోవడంతో నిందితుడిని గుర్తించడం పోలీసులకు కష్టసాధ్యమవుతోంది. దర్యాప్తులో భాగంగా పోలీసులు బాధితురాలికి పలువురు పాతనేరస్తుల ఫొటోలు చూపించారు. ఇందులో ఒక పాత నేరస్తుడి ఫొటోతో నిందితుడికి పోలికలు ఉన్నట్టు చెప్పింది.


**అదుపులో అనుమానితుడు:** బాధితురాలు చెప్పిన పోలికలు ఉన్న అనుమానితుడు మేడ్చల్ జిల్లా గౌడవెల్లికి చెందిన జంగం మహేశ్‌గా గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పాతనేరస్తుడు అయిన ఏడాది క్రితమే మహేశ్‌ను భార్య వదిలేయడంతో, మాదక ద్రవ్యాల వినియోగానికి బానిసయ్యాడు. యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలి ముందుకు మహేశ్‌ను తీసుకెళ్లారు. నేరుగా అనుమానితుడిని చూశాక, నిందితుడు అతను కాదని ఆమె చెప్పినట్టు సమాచారం. అయినా, మహేశ్‌తోపాటు మరికొందరు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు తమదైన శైలిలో విచారిస్తున్నారు.

**అల్వాల్ స్టేషన్ నుంచి నిందితుడు:** అన్ని స్టేషన్లలో పలు కోణాల్లో విచారణ చేపట్టిన పోలీసులు...నిందితుడు అల్వాల్ రైల్వేస్టేషన్ నుంచి ఎంఎంటీఎస్ రైలు ఎక్కినట్టు నిర్ధారించుకున్నారు. కానీ ఎక్కడ దిగిపోయాడన్న విషయంలో స్పష్టత రావడం లేదు. ఆర్పీఎఫ్, జీఆర్పీతోపాటు పలు విభాగాలకు చెందిన సిటీ పోలీసులు నిందితుడిని గుర్తించడానికి గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. మేడ్చల్–గుండ్లపోచంపల్లి వరకు ఉన్న అన్ని ఎంఎంటీఎస్ స్టేషన్ల వరకు దర్యాప్తు చేస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో సీసీ కెమెరాల పుటేజీల పరిశీలన కొనసాగుతోంది. ఎంఎంటీఎస్‌లలో సీసీ కెమెరాలు లేకపోయినా, పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

## వేధింపులపై మాకు ఫిర్యాదు చేయండి

### మహిళలకు సూచించిన తెలంగాణ పోలీసులు

**సాక్షి, హైదరాబాద్:** ఒంటరిగా ప్రయాణిస్తున్న సమయంలో లేదా మరే సమయంలోనైనా వేధింపులు, ఎదుటి వ్యక్తుల చేతుల్లో హింసకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలంగాణ పోలీసులు సూచించారు. కదులుతున్న ఎంఎంటీఎస్ రైలులో యువతిపై అత్యాచారయత్నం ఘటన నేపథ్యంలో తెలంగాణ పోలీసులు 'ఎక్స్'వేదికగా పలు సూచనలు చేశారు. 'పెరుగుతున్న వేధింపులు, హింస ఘటనల కారణంగా చాలా మంది మహిళలు రాత్రిపూట ఒంటరిగా ప్రయాణించడం సురక్షితం కాదని భావిస్తున్నారు. సరైన అవగాహన ఉంటే వీటిని నివారించవచ్చు. ఒంటరిగా ప్రయాణం చేసే సమయంలో వీలైనంత వరకు వెలుతురు ప్రాంతంలో ఉండేలా చూసుకోండి. మీ ప్రయాణానికి సంబంధించిన వివరాలు ఎవరో ఒక కుటుంబ సభ్యుడితో పంచుకుంటూ ఉండాలి. ఏ ఆపదైనా వస్తే వెంటనే ఉమెన్ సేఫ్టీ హెల్ప్‌లైన్ నంబర్ 1091 లేదా డయల్ 100 లేదా ఎమర్జెన్సీ సర్వీస్ 112 టోల్ ఫ్రీ నంబర్లలో ఫిర్యాదు చేయండి'అని ట్వీట్‌లో పేర్కొన్నారు.





మంగళవారం రాత్రి చార్మినార్ వద్ద రంజాన్ షాపింగ్ సందడి

## 28న అంబేడ్కర్ వర్సిటీ బీఎడ్ కౌన్సెలింగ్

**బంజారాహిల్స్ (హైదరాబాద్):** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2024–25 విద్యాసంవత్సరానికి బీఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్) కౌన్సెలింగ్ ఈనెల 28, 29 తేదీల్లో విశ్వవిద్యాలయ ప్రధాన కార్యాలయంలో నిర్వహించనున్నట్లు విద్యార్థి సేవల డైరెక్టర్ వై.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. బీఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్) ప్రవేశ పరీక్ష–2024లో అర్హత సాధించిన 1వ ర్యాంక్ నుంచి 500వ ర్యాంక్ వరకు ఉన్న అభ్యర్థులు మార్చి 28న హాజరుకావాలని, అలాగే 501వ ర్యాంక్ నుంచి 1000వ ర్యాంక్ వరకు ఉన్న అభ్యర్థులు మార్చి 29న అవసరమైన సర్టిఫికెట్ల పత్రాలతో విశ్వవిద్యాలయ ప్రధాన కార్యాలయానికి రావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 040–23680333/444/544 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
**EDITOR: Dhananjaya Reddy Rakkasi,** (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


SAMSUNG
సరికొత్త
Galaxy A56 | A36 | A26 5G
Awesome Intelligence
Best Face
Instant Slo-mo
Auto Trim
Circle to Search with Google
Awesome Intelligence
Now available in trendy colours
అద్భుతమైన ఆఫర్లు
8/256GB కోసం చెల్లించండి. పొందండి 12/256GB ₹3000" విలువ గల ఆఫర్
లేదా
₹3000* వరకు బ్యాంక్ క్యాష్ బాక్
HDFC BANK
SBI card
+
స్క్రీన్ ప్రొటెక్షన్ @ ₹2999 ₹999*
Samsung Care+
+
18 నెలలు వరకు నో కాస్ట్ EMI**
Samsung Finance+
BAJAJ FINSERV
TVS CREDIT
IDFC FIRST Bank
samsung.com
Scan for an awesome experience.
Or WhatsApp "Galaxy A" to 9870 494949 to buy now at Samsung Exclusive Store
Cheil-25291/25

సాక్షి ప్లస్
బుధవారం । 26-3-2025



వాల్గొండ గోదావరి (గంగ) తీరంలో రాళ్లు ఏరుకుంటున్న మహిళలు





కొబ్బరి కొట్టేందుకు.. పేపర్‌వెయిట్‌కు గంగరాళ్లు

# గంగ రాళ్ల గలగల

## గోదావరి తీర గ్రామాల్లో రంగుల రాళ్ల సేకరణ • ఇంట్లో ఉంటే శుభసూచకమని విశ్వాసం

**కోరుట్ల:** ఎక్కడైనా... ఎవరైనా గోదావరి తీరానికి వెళ్లడం సర్వసాధారణమే.. కానీ అక్కడి తీర గ్రామాల ప్రజల దృష్టి వేరేగా ఉంటుంది. ఇసుక తిన్నెల్లో దొరికే గంగరాళ్లను సేకరిస్తారు. పూజ గదుల్లో భద్రపరుస్తారు. ఇంట్లో అవి ఉంటే శుభప్రదమని విశ్వసిస్తారు. గోదావరి తీరానికి మొక్కులు, శుభకార్యాల కోసం వెళ్లిన ప్రతీ ఒక్కరు రంగురంగుల గంగరాళ్లపై దృష్టి పెడతారంటే అతిశయోక్తి కాదు. జగిత్యాల జిల్లాలో ఇబ్రహీంపట్నం నుంచి ధర్మపురి మండలం రాయపట్నం వరకు సుమారు 90 కిలోమీటర్ల గోదావరి పరివాహక ప్రాంతం ఉంది. ఈ తీర ప్రాంతంలో సుమారు 28 గ్రామాల వరకు ఉన్నాయి. ఈ గ్రామాల్లోనే కాదు.. చుట్టుపక్కల ఉన్న పట్టణ ప్రాంతాల్లోనూ గంగరాళ్ల సెంటిమెంట్ ఉంటుంది.

### శుభకార్యాలతో ముడిపడి..

నీటితోనే మనిషి మనుగడ.. జలం జాడలున్న చోటే జనం అవాసాలు ఏర్పాటు చేసుకోవడం సాధారణం. మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి వచ్చే గోదావరి నది.. నిజామాబాద్ జిల్లా కందకుర్తి వద్ద తెలంగాణలోకి ప్రవేశిస్తుంది. నిర్మల్, జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల సరిహద్దుల వెంబడి ప్రవహిస్తుంది. ఈ ప్రాంతవాసులు గోదావరి గంగ అని పిలుచుకుంటారు. ప్రతీ శుభకార్యానికి గోదావరి నదికి వెళ్లి మొక్కులు తీర్చుకోవడం ఇక్కడి వారి సంప్రదాయం. పుట్టువెంట్రుకలు, గర్భిణులకు గంగ తెప్పలు, పౌర్ణమి పుణ్యస్నానాలు, గంగ మొక్కులు చెల్లించుకోవడమే కాకుండా.. పితృదేవతలకు పిండాలు పెట్టడం, ఎవరైనా చనిపోతే.. ఆ వెంటనే గంగస్నానాలు చేయడం వంటి కార్యక్రమాలను గోదావరి తీరంలోనే చేస్తుంటారు. ఈ క్రమంలో గోదావరి (గంగ)తో ఇక్కడి ప్రాంతవాసుల జీవనశైలి, ఆచార వ్యవహారాలతో విడదీయరాని బంధం ఉంది.



### బెల్లం రంగు రాళ్లు ఇష్టం

గంగరాళ్లు అంటే నాకు చాలా ఇష్టం. వాటిలో బెల్లం రంగులో ఉండే రాళ్లు బాగుంటాయి. ఎప్పుడు గోదావరి తీరానికి వెళ్లినా అలాంటి రాళ్లను వెతికి తెచ్చుకుంటాను. నున్నటి పెద్ద గంగరాయి దొరికితే.. దాన్ని పూజ గదిలో ఉంచుకుంటాం. ఇంట్లో శుభకార్యాలు, దేవునికి పూజలు చేసే సమయాల్లో కొబ్బరి కాయలు కొట్టడానికి వాడతాం.

– కంటాల అనితదేవి, కోరుట్ల



### వ్యాపారం బావుండాలని..

వ్యాపారులు గంగరాళ్లను కౌంటర్ టేబుల్‌పై పెట్టుకుంటారు. దీన్ని ఒకవైపు పేపర్‌వెయిట్‌గా.. మరోవైపు వ్యాపారాల్లో లాభాలు తెచ్చే శుభసూచకంగా వినియోగిస్తారు. మా పిల్లలు గంగకు వెళ్లినప్పుడు ఆసక్తిగా ఇసుకలో రంగురాళ్లను వెతికి తెచ్చుకుని ఆటపాటల్లో వినియోగిస్తారు.

– చిద్రాల వినోద్, వ్యాపారి, కోరుట్ల

### గంగరాళ్ల సెంటిమెంట్

గంగ తీరంలో శుభకార్యాల కోసం బంధుమిత్రులతో కలిసి వెళ్లిన వారు పుణ్యస్నానాలు ముగించుకుని ఇక్కడి ఇసుకలో దొరికే రంగు రంగుల గంగరాళ్ల కోసం వెతకడం కనిపిస్తుంది. వీటిని పెద్దవాళ్లు శుభసూచకంగా భావిస్తే.. చిన్నపిల్లలు ఆట వస్తువులుగా.. గంగరాళ్లను సేకరిస్తారు. గంగ నీటి ప్రవాహంలో వందలాది కిలోమీటర్ల దూరం కొట్టుకువచ్చిన ఈ రాళ్లు.. విభిన్నమైన ఆకృతుల్లో, రంగుల్లో ఉంటాయి. దీంతో వీటిని ఇష్టంగా ఇంటికి తీసుకెళ్తారు. ఇలా తీసుకువచ్చిన గంగరాళ్లను వ్యాపారులు తమకు శుభాలు కలగాలని కౌంటర్ టేబుల్‌పై పేపర్‌వెయిట్‌గా ఉపయోగిస్తారు. చిన్నగా ఉండి లింగాకారంలో ఉండే రంగురాళ్లను శివునికి ప్రతీకగా పూజ గదుల్లో ఉంచుతారు. మరికొంతమంది గంగరాళ్లను దేవుడి గది ముందు ఉంచుతారు. ఇంట్లో శుభకార్యాలు జరిగినపుడు అదే రాయిపై కొబ్బరికాయలు కొట్టి దేవుళ్లకు అభిషేకం చేస్తుంటారు. మరికొంతమంది ఈ రంగురాళ్లను నీళ్లజాడీలో ఉంచి అలంకరణ కోసం వాడతారు. ఇలా ఈ ప్రాంత జనంలో గంగరాళ్ల సెంటిమెంట్ అనాదిగా కొనసాగుతోంది.

## ఆహార భద్రతా వ్యవస్థ బలోపేతానికి కృషి

### ఉన్నతస్థాయి సమీక్షలో ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూ

**సాక్షి, హైదరాబాద్:** ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించడానికి, ఆహార భద్రత పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నట్లు వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూ చెప్పారు. వైద్యారోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు మంగళవారం ఆమె సచివాలయంలో ఆహార భద్రతపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆహార తయారీదారులంతా 'భారత ఆహార భద్రత, ప్రామాణికాల ప్రాధికార సంస్థ'(ఎఫ్ ఎస్ఎస్ఏఐ) నిబంధనలు అమలు చేయాలని స్పష్టంచేశారు. ఆహార భద్రతకు సంబంధించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆహార నమూనాలను పరీక్షించడానికి మినీ ఆహార భద్రతా పరీక్షల ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని క్రిస్టినా సూచించారు. ఫుడ్ సేఫ్టీలో భాగంగా ఫుడ్ తయారీదారులందరూ ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను విధిగా కలిగి ఉండేలా చూడాలన్నారు. ఫుడ్ సేఫ్టీ విభాగంలో అదనపు సిబ్బందిని త్వరలోనే పూర్తిస్థాయిలో నియమిస్తామని చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో సీనియర్ అధికారులను ఫుడ్ సేఫ్టీ నియంత్రణపై పర్యవేక్షకులుగా నియమిస్తామని క్రిస్టినా తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉన్న హైదరాబాద్ వంటకాలు బ్రాండ్ ఇమేజ్‌ని పెంపొందించేలా ఫుడ్ సేఫ్టీ అధికారులు కృషి చేయాలని సూచించారు. సమీక్షలో రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, ఐపీఎం డైరెక్టర్ శివలీల, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ పంకజా, ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

## వరంగల్‌ను ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయండి

### పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య



**సాక్షి, న్యూఢిల్లీ:** గొప్ప చారిత్రక వారసత్వ ప్రదేశాలకు నిలయమైన వరంగల్‌ను ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వానికి వరంగల్ ఎంపీ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. వేయి స్తంభాల గుడి, వరంగల్ కోట, కాకతీయ కళాతోరణం వంటి పర్యాటక ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని మంగళవారం లోక్‌సభ జీరో అవర్‌లో ఆమె కోరారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద జాతరగా నిలిచిన మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతరకు జాతీయ హోదా కల్పించాలని కేంద్ర పర్యాటక శాఖమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు కావ్య విజ్ఞప్తి చేశారు.

## నేరుగా ఎదుర్కోండి.. ఆకాశరామన్న ఉత్తరాలెందుకు?

### నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**సాక్షి, హైదరాబాద్:** సోషల్ మీడియాలో కొందరు కోతి రాముళ్లు ఉన్నారని, వారికి కోతికి కొబ్బరిచిప్ప దొరికినట్టుగా వ్యవహరిస్తున్నారని, ఆ కోతిరాముడు ఎవరో సందర్భం వచ్చినప్పుడు చెబుతానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం (కాంగ్రెస్) పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీ లాబీల్లో ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. నకిరేకల్‌లో పదో తరగతి పరీక్ష లీక్ వ్యవహారంలో కాంగ్రెస్ నేతలపై వస్తున్న ఆరోపణల గురించి పరోక్షంగా స్పందించారు. పరీక్షల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థ ఉంటుందని, ఆ వ్యవస్థను అర్థం చేసుకుంటే అసలు విషయాలు తెలుస్తాయన్నారు. పరీక్ష పేపర్లను లీక్ చేయడం వాళ్లకు అలవాటని, అందుకే అప్పట్లో పల్లీ బఠానీలకు పరీక్ష పేపర్లు అమ్ముకున్నారని వీరేశం మండిపడ్డారు. దమ్ముంటే తనను నేరుగా ఎదుర్కోవాలే తప్ప ఆకాశరామన్న ఉత్తరాలు ఎందుకని వీరేశం ప్రశ్నించారు.



రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాది ఇజ్రాయెల్ హత్య నేపథ్యంలో హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు ఎ.రవీందర్‌రెడ్డి. చిత్రంలో ఉపాధ్యక్షురాలు దీప్తి, కార్యదర్శి సంజీవ్‌రెడ్డి, చిక్కుడు ప్రభాకర్, రఘునాథ్, జగన్ తదితరులు





### మాడు పగిలిపోతోంది

బయటికొస్తే మాడు పగిలే ఎండలు జనాలను తిప్పలు పెడుతున్నాయి. ఇంట్లో ఉక్కపోత.. బయట మండుతున్న ఎండలతో చిన్నాపెద్దా తేడా లేకుండా విలవిల్లాడుతున్నారు. ఉదయం పది గంటలు దాటితే ఇంటి నుంచి బయట అడుగు పెట్టలేకపోతున్నారు. పనులు ఉంటే ఉదయం, సాయంత్రం వేళల్లో చూసుకోవాలని.. అత్యవసరమైతేనే మధ్యాహ్నం వేళ బయటకు వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. భానుడి ప్రతాపానికి ఉపశమనంగా.. నీరు, పండ్ల రసాలు గంటగంటకూ తీసుకుంటూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి




## 30 జిల్లాల్లో 110 పత్తి కొనుగోలు కేంద్రాలు

### కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్

**సాక్షి, న్యూఢిల్లీ:** విపత్తుల సమయంలో మార్కెట్ ధరలు.. ఎంఎస్పీ కంటే తక్కువగా ఉన్నప్పుడు.. పత్తి సేకరణకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ తెలంగాణలోని 30 జిల్లాల్లో 110 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ తెలిపారు. అందులో పెద్దపల్లిలో 3, వరంగల్‌లో 4, ఖమ్మంలో 5 కేంద్రాలను ప్రారంభించామని.. లోక్‌సభలో మంగళవారం కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రస్తుత పత్తి సీజన్ 2024–25లో, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రూ.15,556 కోట్ల విలువైన సుమారు 40.37 లక్షల బేళ్లను కొనుగోలు చేసిందన్నారు. దీనిద్వారా సుమారు 9 లక్షల మంది రైతులు లబ్ధి పొందారన్నారు. వాటిలో పెద్దపల్లి జిల్లాలో 0.63 లక్షల బేళ్ల (రూ.239 కోట్లు), వరంగల్ జిల్లాలో 3.26 లక్షల బేళ్ల (రూ.1,260 కోట్లు), ఖమ్మం జిల్లాలో 1.04 లక్షల బేళ్ల (రూ.406 కోట్లు) కొనుగోలు చేశారని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో 2024లో వరదల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి మెమొరాండం కోసం ఎదురుచూడకుండా, నష్టాలను అక్కడికక్కడే అంచనా వేయడానికి 2024 సెప్టెంబర్ 5న కేంద్ర ప్రభుత్వం ఐఎంసీటీని ఏర్పాటు చేసిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ తెలిపారు. 2024 సెప్టెంబర్ 10 నుంచి 13 వరకు రాష్ట్రంలోని ప్రభావిత ప్రాంతాలను ఐఎంసీటీ సందర్శించి ఇచ్చిన నివేదిక ఆధారంగా, కేంద్ర ప్రభుత్వం 2024 వరదల్లో ఎన్డీఆర్ఎఫ్ నుంచి రూ.231.75 కోట్లు అందజేసిందని కాంగ్రెస్ ఎంపీ కుందూరు రఘువీర్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ ఎస్డీఆర్ఎఫ్‌కు రూ.555.20 కోట్లు (రూ.416.80 కోట్లు కేంద్ర వాటా + రూ.138.40 కోట్లు రాష్ట్ర వాటా) కేటాయించారన్నారు. కేంద్ర వాటా రూ.416.80 కోట్లను ఇప్పటికే రాష్ట్రానికి ముందస్తుగా విడుదల చేశామని తెలిపారు. అదనంగా, 2024 ఏప్రిల్ 1 నాటికి తెలంగాణ రాష్ట్ర ఎస్డీఆర్ఎఫ్ ఖాతాలో రూ.1,345.15 కోట్లు ఉన్నాయని తెలంగాణ అకౌంటెంట్ జనరల్ పేర్కొన్నారని వివరించారు. కాబట్టి, రాష్ట్ర ఎస్డీఆర్ఎఫ్ ఖాతాలో సహాయక చర్యల కోసం తగినన్ని నిధులు అందుబాటులో ఉన్నాయని కేంద్రమంత్రి నిత్యానంద రాయ్ పేర్కొన్నారు.

# గ్రేటర్‌లోనే పారిశ్రామిక ప్రగతి!

- మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోనే ఏర్పాటుకు ఆసక్తి
- 262 పరిశ్రమల స్థాపనతో తొలి స్థానంలో మేడ్చల్
- టీజీ–ఐపాస్ ద్వారా 24,112 పరిశ్రమల ఏర్పాటు
- రూ.1,29,332 కోట్ల పెట్టుబడులు.. 6.6 లక్షల మందికి ఉపాధి
- సామాజిక, ఆర్థిక సర్వే 2024– 2025లో వెల్లడి



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో హైదరాబాద్ చుట్టూ ఉన్న మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే అత్యధికంగా పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. నైపుణ్యం ఉన్న కార్మికుల లభ్యత, తక్కువ జీవన వ్యయం, కాస్మాపాలిటన్ కల్చర్, మెరుగైన మౌలిక వసతులు తదితర కారణాలతో ఫార్మాస్యూటికల్స్, ఇంజనీరింగ్, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలలో ఇక్కడ కంపెనీల స్థాపనకు సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయని ఇటీవల రాష్ట్రప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సామాజిక, ఆర్థిక సర్వేలో వెల్లడించింది. తెలంగాణ పారిశ్రామిక ప్రాజెక్ట్ ఆమోదం, స్వీయ ధ్రువీకరణ వ్యవస్థ (టీజీ–ఐపాస్) ద్వారా ఇప్పటివరకు రాష్ట్రంలో 24,112 సూక్ష్మ, చిన్న, మధ్య, భారీ తరహా సంస్థలు ఏర్పాటయ్యాయి. ఆయా కంపెనీలు రూ.1,29,332 కోట్ల పెట్టుబడులు పెట్టాయి. వీటిల్లో 6,60,428 మంది ఉపాధి పొందుతున్నారని ప్రభుత్వం వెల్లడించింది. పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడులపై ఆర్థిక సర్వేలో పేర్కొన్న మరికొన్ని వివరాలు..

- 2016 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చిన టీజీ–ఐపాస్ ద్వారా రాష్ట్రంలో ఏర్పాటైన కంపెనీలలో సూక్ష్మ తరహా సంస్థలే అత్యధికం.
- రాష్ట్రంలో ఏర్పాటైన మొత్తం పరిశ్రమలలో సూక్ష్మ సంస్థల వాటా 67.23 శాతం ఉండగా, పెట్టుబడుల్లో కేవలం 1.70 శాతం, ఉద్యోగాల్లో 24.97 శాతం వాటా మాత్రమే ఉంది.
- పరిశ్రమల ఏర్పాటులో భారీ సంస్థల వాటా 3.56 శాతం మాత్రమే ఉన్నా.. పెట్టుబడుల్లో 74.96 శాతం, ఉద్యోగ అవకాశాల్లో 35.04 శాతం వాటా కలిగి ఉన్నాయి.
- చిన్న, మధ్య తరహా సంస్థల వాటా 29.21 శాతం ఉండగా.. పెట్టుబడుల్లో 23.34 శాతం, ఉదోగాల్లో 39.99 శాతం వాటా ఉంది.
- 2024–25 ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి చివరి నాటికి రాష్ట్రంలో రూ.9,850.23 కోట్ల పెట్టుబడులతో 1,476 పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా 38,598 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి.
- ఈ పరిశ్రమలలో మేడ్చల్–మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాలు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. అత్యధికంగా మేడ్చల్–మల్కాజిగిరిలో రూ.832.17 కోట్ల పెట్టుబడులతో 262 పరిశ్రమలు ఏర్పాటు కాగా.. 6,760 మంది ఉపాధి పొందారు.
- సంగారెడ్డిలో రూ.543.42 కోట్ల పెట్టుబడులతో 165 యూనిట్లు ఏర్పాటు కాగా.. 5,109 మందికి ఉపాధి దొరికింది. రంగారెడ్డి జిల్లాలో రూ.5,155.35 కోట్ల పెట్టుబడులతో 130 పరిశ్రమలు ఏర్పాటు కాగా.. 8,857 మందికి ఉపాధి లభించింది.
- అత్యల్పంగా హైదరాబాద్‌లో రూ.5.91 కోట్ల పెట్టుబడులతో కేవలం ఏడు యూనిట్లు ఏర్పాటు కాగా.. 515 మందికి పని దొరికింది.
- ఇప్పటివరకు టీజీ–ఐపాస్ ద్వారా హైదరాబాద్‌లో రూ.190 కోట్ల పెట్టుబడులతో కేవలం 50 పరిశ్రమలు ఏర్పాటు కాగా.. 1,828 మందికి ఉపాధి లభించింది.

### గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో టీజీ-ఐపాస్ ద్వారా తయారీ రంగంలో ఏర్పాటైన పరిశ్రమలు

| జిల్లా | పరిశ్రమలు | పెట్టుబడులు (రూ.కోట్లలో) | ఉద్యోగులు |
|---|---|---|---|
| మేడ్చల్–మల్కాజిగిరి | 5,062 | 13,199 | 1,24,176 |
| రంగారెడ్డి | 1,783 | 25,602 | 1,07,002 |
| హైదరాబాద్ | 50 | 190 | 1,828 |

## అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి

### టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి




**సాక్షి, హైదరాబాద్:** న్యాయవాదులకు రక్షణ కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి అమల్లోకి తేవాలని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాది ఇజ్రాయెల్ పాశవిక హత్య హేయమైన చర్యగా అభివర్ణించారు. హంతకులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. న్యాయమూర్తులపై, న్యాయవాదులపై ఇటీవల దేశవ్యాప్తంగా జరుగుతున్న దాడులు, హత్యోదంతాలను దృష్టిలో ఉంచుకొని.. న్యాయవాదుల రక్షణ కోసం అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ బిల్లును వెంటనే అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు.

## 'ఏవోఆర్' ఏర్పుల దేవ్ కృషి అభినందనీయం

### హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** సుప్రీంకోర్టు నిర్వహించే అడ్వొకేట్ ఆన్ రికార్డ్ (ఏవోఆర్.. సుప్రీంకోర్టులో వీరు మాత్రమే పిటిషన్లు వేయగలరు) పరీక్షలో తొలి ప్రయత్నంలోనే అర్హత సాధించిన ఏర్పుల దేవ్ కృషి అభినందనీయమని హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ప్రశంసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన దేవ్.. అక్కడే ఎల్ఎల్ఎం కూడా అభ్యసించారు. ఇటీవల వెలువరించిన అడ్వొకేట్ ఆన్ రికార్డ్‌లో అర్హత సాధించారు. హైదరాబాద్ నగరం ఎస్సీ వర్గానికి చెందిన దేవ్.. అతి పిన్న వయసులోనే న్యాయ వ్యవస్థలో అత్యంత కీలకమైన అర్హత సాధించడం గమనార్హం. ఈ సందర్భంగా హెచ్‌సీఏఏ అతన్ని సన్మానించింది. కార్యక్రమంలో హెచ్‌సీఏఏ కార్యదర్శులు శాంతి భూషణ్, సంజీవ్‌రెడ్డి, అదనపు కార్యదర్శి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



**అరుణ వర్ణ గోదావరి**

అస్తమిస్తున్న సూర్యుడు అరుణ వర్ణాన్ని వెదచల్లుతున్నాడు. ఆ అరుణిమను ఒడిసిపట్టిన గోదావరి జలాలు తేజోవంతంగా మెరిసిపోతున్నాయి. నిశ్చల గోదావరి గంభీరంగా కనిపిస్తుంటే, ఈ మనోహర దృశ్యానికి మేమే సాక్ష్యమంటున్నాయి హేవలాక్ బ్రిడ్జ్, రైల్వే వంతెన. రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద మంగళవారం సాయంత్రం కనిపించిన ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. - సాక్షి ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



**నీరెండిపోయె.. మేత కరువాయె**

తల్లిలాంటి కొల్లేరు తడారిపోవడంతో కొంగబావలు బిత్తర చూపులు చూస్తున్నాయి. ఎప్పుడూ నీటితో కళకళలాడుతూ లక్షలాది పక్షులకు కడుపు నిండా ఆహారంఅందించే కొల్లేరు పరిస్థితి ఇలా అయిపోయిందేంటా అంటూ మదనపడుతున్నాయి. అనధికారిక చెరువులు నీరునింపుకోవడంతో ఆసియాలోనే అతిపెద్ద మంచినీటి సరస్సుకు ఈ దుస్థితి దాపురించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



**పసిడి మబ్బులు**

సాయం సమయాన విశాఖ నగరంలో ఆకాశం మేఘావృతమైంది. అస్తమిస్తున్న సూర్యుడు మబ్బుల చాటునుంచి లేలేత కిరణాలను నేలపైకి విసురుతున్నాడు. మేఘాలపై సూర్యకాంతి పడి అవి బంగారు వర్ణంలో మెరిసిపోతున్నాయి. బీచ్ రోడ్డులోని రామకృష్ణ మఠం వద్ద ఈ సుందర దృశ్యం బీచ్‌లోని సందర్శకులను మైమరపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

## క్లుప్తంగా...

### 'పాపవినాశనం'లో బోటింగ్ ట్రయల్ రన్

**పర్యాటక కేంద్రం చేస్తున్నారంటూ భక్తుల ఆగ్రహం**

**తిరుమల:** పర్యాటకాభివృద్ధిలో భాగంగా తిరుమలలోని పాపవినాశనం డ్యామ్‌లో తిరుపతి అటవీశాఖ అధికారులు మంగళవారం బోటింగ్ ట్రయల్ రన్ నిర్వహించారు. తిరుమలలోని కుమారధార, పసుపుధార నీరు పాపవినాశనం డ్యామ్‌కు చేరుతుంది. ఈ ప్రాంతంలోనే టీటీడీకి చెందిన పాపవినాశనం తీర్థం, గంగాదేవి ఆలయం ఉంది. భక్తులు పెద్ద ఎత్తున ఈ ఆధ్యాత్మిక క్షేత్రానికి వస్తుంటారు. అయితే, అటవీశాఖ పరిధిలో ఉన్న ఈ ప్రాంతం ఇప్పటి వరకూ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. అకస్మాత్తుగా అధికారులు బోటింగ్ ట్రయల్ రన్ నిర్వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆధ్యాత్మిక క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తున్నారంటూ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**తనిఖీల కోసమే బోట్లు**

వెంకటేశ్వర నేషనల్ పార్క్, శేషాచలం బయోస్పేర్ రిజర్వ్‌లోని పాపవినాశనం డ్యామ్ చుట్టూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్టు సమాచారం వచ్చింది. తనిఖీల కోసం బోట్‌లు వినియోగించాం. అనంతరం వాటిని వెనుక్కు తీసుకొచ్చాం.

పి.వివేక్, జిల్లా అటవీశాఖ అధికారి

### అదానీ గంగవరం పోర్టుకు సేఫ్టీ లీడర్‌షిప్ అవార్డు

**పెదగంట్యాడ:** కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) సదరన్ రీజియన్ నిర్వహించిన 4వ ఎడిషన్ ఆంధ్రప్రదేశ్ సేఫ్టీ ఎక్సలెన్స్ అవార్డ్స్–2024లో అదానీ గంగవరం పోర్టుకు సేఫ్టీ లీడర్‌షిప్ అవార్డు లభించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల డైరెక్టర్ మాదిరెడ్డి ప్రతాప్ చేతుల మీదుగా పోర్టు యాజమాన్య ప్రతినిధులు ఈ అవార్డును అందుకున్నారు.

### బాలికపై లైంగిక దాడి


**పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు**

**కనిగిరిరూరల్:** ప్రకాశం జిల్లా కనిగిరి పట్టణ సమీపంలోని ఓ కాలనీకి చెందిన 13 ఏళ్ల బాలికపై మండలంలోని పాతపాడుకు చెందిన పల్నాటి శివ శంకర్‌రెడ్డి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అందిన సమాచారం మేరకు ఈ నెల 23 రాత్రి 7 గంటల సమయంలో బహిర్భూమికి బయటకు వెళ్లిన బాలికపై శివ శంకర్ రెడ్డి లైంగికంగా దాడి చేసినట్లు తెలిసింది. బాలిక విషయాన్ని తల్లికి చెప్పడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

### నాటుసారాతో దొరికిన టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు

**కంచిలి:** శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం పరిధి కుంబరినౌగాం టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు సింహాద్రి జన్ని నాటుసారాతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడు. సింహాద్రి జన్ని ఇంట్లో 5 లీటర్ల నాటుసారా నిల్వ ఉందని సమాచారం రావడంతో సోంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.బేబీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి దాడి చేసి పట్టుకున్నారు.

# నాటి స్టార్టప్ వెలుగులకు కితాబు




**గత ఐదేళ్లలో రాష్ట్రంలో 6,600 స్టార్టప్‌ల ఏర్పాటు**

- అందులో 2,400 స్టార్టప్‌లకు డీపీఐఐటీ గుర్తింపు
- మహిళల నేతృత్వంలో 1,159 స్టార్టప్‌లు
- 2022 స్టార్టప్ ర్యాంకింగ్‌లో లీడర్ హోదాలో ఏపీ
- వచ్చే ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు లక్ష్యంగా నూతన పాలసీ విడుదల
- లక్ష ఉద్యోగాలతోపాటు 20 సూనికార్న్, 10 యూనికార్న్‌ల ఏర్పాటు
- రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌కు రూ.250 కోట్ల గ్రాంట్ బడ్జెట్

**సాక్షి, అమరావతి :** గత ఐదేళ్లలో స్టార్టప్ రంగంలో రాష్ట్రం వేగంగా దూసుకుపోయిన విధానాన్ని నారా లోకేశ్ మంత్రిగా నిర్వహిస్తున్న ఐటీ శాఖ తాజాగా విడుదల చేసిన స్టార్టప్ పాలసీలో ప్రముఖంగా ప్రస్తావించింది. వచ్చే ఐదేళ్లలోనూ స్టార్టప్‌లను ప్రోత్సహించేలా ఏపీ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ పాలసీ 4.0ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. గత ఐదేళ్లలో డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో 50 శాతం ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనే ఏర్పాటయ్యాయని.. రాష్ట్రంలో మొత్తం 6,600 స్టార్టప్స్ ఏర్పాటు కాగా, అందులో 2,400 స్టార్టప్‌లకు డీపీఐఐటీ గుర్తింపు లభించిందని కూటమి ప్రభుత్వం విడుదల చేసిన పాలసీలో పేర్కొంది. అంతే కాకుండా డీపీఐఐటీ గుర్తించిన స్టార్టప్‌లలో 1,159 స్టార్టప్‌లు మహిళల నేతృత్వంలో ఉన్నాయని చెప్పింది. ఇది రాష్ట్రంలో పారిశ్రామికీకరణ అన్ని వర్గాల్లో ఎంత బలంగా విస్తరించిందన్న విషయాన్ని ధృవీకరిస్తోందని పేర్కొంది. డీపీఐఐటీ విడుదల చేసిన 2022 స్టార్టప్ ర్యాంకుల్లో రాష్ట్రం ×లీడర్‌షిప్ హోదా దక్కించుకుందని, వరుసగా మూడేళ్లుగా సులభతర వాణిజ్యంలో మొదటి ర్యాంకును పొందుతూ వ్యాపారానికి ఏపీ అత్యంత అనువైన రాష్ట్రంగా నిలిచిందని ప్రశంసించింది. రాష్ట్రంలో 46 ఇంక్యుబేటర్స్ ఉండటమే కాకుండా కీలకమైన ఐవోటీ–ఏఐ, ఇండస్ట్రీ 4.0, బయోటెక్, మెడికల్ డివైసెస్, మారిటైమ్ అండ్ షిప్పింగ్, రూరల్ ఇన్నోవేషన్ సెంటర్ పేరుతో ఆరు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలు స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపింది.

### ఇదీ స్టార్టప్ పాలసీ 4.0 లక్ష్యం

- వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో కొత్తగా 20 వేల స్టార్టప్‌ల ఏర్పాటు లక్ష్యంగా ఏపీ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ పాలసీ 4.0 విడుదల.
- హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో స్టార్టప్ ఎకో సిస్టమ్ ఏర్పాటు ద్వారా లక్షల మందికి ఉపాధి.
- కొత్తగా 10 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలు, 20 సూని కార్నర్స్, 10 యూనీ కార్నర్స్ ఏర్పాటు.
- కీలకమైన 15 డిపార్ట్‌మెంట్‌లలో స్టార్టప్‌లకు ప్రోత్సాహం. రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు బడ్జెట్ కేటాయింపు.
- అమరావతి కేంద్రంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్) ఏర్పాటు.. దీనితో అనుసంధానం చేస్తూ ఐదు ప్రాంతాల్లో స్పోక్ సెంటర్లు. ఐదేళ్లలో స్టార్టప్‌లకు నిధులు సమకూర్చేలా ఆర్టీఐహెచ్‌కు రూ.250 కోట్లు, ప్రతి స్పోక్ సెంటర్‌కు రూ.100 కోట్ల గ్రాంట్ బడ్జెట్.
- ఎంపికైన ప్రతి కాన్సెప్ట్‌కు రూ.2 లక్షల ప్రారంభ గ్రాంట్.. దశలవారీగా రూ.15 లక్షల వరకు.. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులకైతే రూ.20 లక్షల వరకు గ్రాంట్.. 8 శాతం వడ్డీ రాయితీ, రూ.50 లక్షల చొప్పున సీడ్ ఫండింగ్, మార్కెటింగ్ సపోర్ట్..
- ఈవెంట్స్‌కు వెళ్లినప్పుడు అయ్యే ఖర్చులో 75 శాతం.. గరిష్టంగా రూ.3 లక్షలు అందజేత. ఐదేళ్ల ఎస్‌జీఎస్టీపై 100 శాతం రీయింబర్స్‌మెంట్.
- వేగంగా అనుమతులు మంజూరు చేసేలా ఏపీ స్టార్టప్ వన్ పోర్టల్ ఏర్పాటు. స్టార్టప్ పాలసీ స్టేట్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్న ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ.. త్వరలోనే ఆపరేషనల్ గైడ్‌లైన్స్ విడుదల.

# సాయం పేరుతో స్వాహా!

**వరద సాయం బియ్యాన్ని బొక్కేసిన జనసేన నేత**

**విజయవాడ వరద బాధితుల పేరుతో భారీగా బియ్యం సేకరణ**

- ఇలా సేకరించిన బియ్యం అమ్ముకుని సొమ్ము చేసుకున్న నియోజకవర్గ ఇన్‌చార్జి
- విక్రయించిన సొమ్మును పార్టీకి విరాళంగా ఇస్తానంటూ వెల్లడి
- మంత్రి కందుల దుర్గేష్‌కు చెప్పే చేశానన్న సదరు నేత
- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గోపాలపురంలో కలకలం



**సాక్షి ప్రతినిధి, ఏలూరు :** విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి అందరూ బియ్యం ఇవ్వాలంటూ జనసేన శ్రేణులు గత ఏడాది ఊరూరా తిరిగి సేకరించారు. ఇలా దాతలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థల నుంచి భారీగా సేకరించారు. చివరికి అనుకున్న స్థాయిలో బియ్యం సేకరించాక ఆ మొత్తాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఒకరు అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. ఇప్పుడిది బయటకు పొక్కింది. దీంతో.. ఆ మొత్తం డబ్బును పార్టీకి విరాళంగా ఇస్తానని.. ఇదంతా మంత్రి కందుల దుర్గేష్‌కు చెప్పేచేశానని ఆయన తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయినా వివాదం ముదరడంతో రెండ్రోజుల క్రితం జంగారెడ్డిగూడెంలో దీనిపై పంచాయితీ జరిగింది. అయినా సెటిల్ కాకపోవడంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి వ్యవహారం తీసుకెళ్లారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలో ఇప్పుడీ వ్యవహారం కలకలం రేపుతోంది. ఆ వివరాలు..

**అసలేం జరిగిందంటే..**

విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికంటూ జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు నేతృత్వంలో గతేడాది నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో భారీగా బియ్యం సేకరించారు. కానీ, ఇలా సేకరించిన బియ్యాన్ని విజయవాడలో బాధితులకు పంచకుండా ఆయన విక్రయించేశారు. ఈ సొమ్మును నియోజకవర్గ ఇన్‌చార్జే స్వాహా చేశాడని ఒక వర్గం దుమ్మెత్తిపోస్తుండగా.. ఇన్‌చార్జి వర్గం మాత్రం సొమ్ము తమవద్దే ఉందని, పార్టీకి విరాళం ఇవ్వడానికి ప్రయత్నిస్తుంటే కుదరడంలేదని, మంత్రి కందుల దుర్గేష్‌కు విషయం చెప్పామని, ఆయన విరాళం ఇవ్వడానికి పవన్‌కళ్యాణ్ వద్దకు తీసుకువెళ్తారంటూ చెబుతున్నారు. అయితే, నాలుగు నెలల క్రితం జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురం వచ్చినప్పుడు కూడా ఆయనకు చెక్కు ఇవ్వడం కుదరలేదా అని ప్రత్యర్థి వర్గం నిలదీస్తోంది.

**రూ.10 లక్షలు కాదు.. 16 లక్షలకు అమ్ముకున్నారు..**

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు, ఆయన వ్యతిరేక వర్గం మధ్య ఈ విషయంలో కొద్దిరోజులుగా తారాస్థాయిలో వివాదం నడుస్తోంది. సేకరించిన బియ్యాన్ని రూ.10.27 లక్షలకు విక్రయించానని సువర్ణరాజు చెబుతుంటే.. రూ.16 లక్షలకు అమ్ముకున్నారని వ్యతిరేక వర్గం చెబుతోంది. దీనిపై పార్టీ జిల్లా నేతల వద్ద పంచాయితీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో.. రెండ్రోజుల క్రితం జంగారెడ్డిగూడెంలో జనసేన నాయకుడు కరాటం సాయి పార్టీ ఆదేశాలతో గోపాలపురం నియోజకవర్గ నేతలతో సమావేశం నిర్వహించారు. సువర్ణరాజు అనుకూల, వ్యతిరేక వర్గాలు ఘర్షణకు దిగడంతో సమావేశం రసాభాసగా మారింది. దీంతో కరాటం సాయి చేతులెత్తేసి జిల్లా ఇన్‌చార్జి నాదెండ్ల మనోహర్ దృష్టికి వ్యవహారం తీసుకెళ్తున్నట్లు చెప్పి సమావేశం ముగించారు.

# ఫ్యాన్లు, లైట్లు అమ్ముకోవచ్చు

- ఈపీడీసీఎల్‌కు విద్యుత్ నియంత్రణ మండలి అనుమతి
- వాయిదా పద్ధతిలో డబ్బులు బిల్లుల్లోనే వసూలు

**సాక్షి, అమరావతి:** విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ ఉపకరణాలను అమ్ముకునేందుకు ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)కు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆమోదం తెలిపింది. ఏపీఈఆర్‌సీ వెల్లడించిన వివరాల ప్రకారం.. డిమాండ్ సైడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా సాధారణ ఫ్యాన్ల స్థానంలో బ్రష్‌లెస్ డైరెక్ట్ కరెంట్ మోటర్ (బీఎల్‌డీసీ) ఫ్యాన్లు, సంప్రదాయ ట్యూబులైట్లకు బదులు లైట్ ఎమిటింగ్ డయోడ్ (ఎల్‌ఈడీ) బల్బులను వినియోగదారులకు డిస్కం విక్రయించనుంది. గృహ, వాణిజ్య విద్యుత్ వినియోగదారులకు వీటిని వాయిదా పద్ధతిలో అందించేందుకు టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లను డిస్కం ఎంపిక చేస్తుంది. 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగించే వారికి వీటిని విక్రయించే ఏర్పాటు చేయాలని డిస్కంకు ఏపీఈఆర్‌సీ సూచించింది. అయితే తీసుకున్న పరికరాలకు నెలనెలా వాడుకున్న విద్యుత్ బిల్లులో కలిపి వాయిదా పద్ధతి (ఆన్ బిల్ ఫైనాన్సింగ్)లో డబ్బులు చెల్లించేందుకు వినియోగదారుని నుంచి సమ్మతి పత్రాన్ని తీసుకోవాలి. అలా అంగీకారపత్రం ఇచ్చిన వారు వాయిదా ఏ నెల చెల్లించకపోతే ఆ నెల విద్యుత్ సరఫరా నిలిపివేయాలని ఆదేశించింది. ఈ లైట్లు, ఫ్యాన్ల వినియోగం వల్ల పెద్ద మొత్తంలో విద్యుత్ ఆదా అవుతుందని ఈపీడీసీఎల్ వెల్లడించింది.

**డిస్కం తెలిపిన మేరకు ఈ బల్బులు, ఫ్యాన్ల ద్వారా విద్యుత్ ఆదా ఇలా**

- 10.02 లక్షల గృహ విద్యుత్ వినియోగదారులకు ఎల్ఈడీ బల్బుల ఏర్పాటు ద్వారా పీక్ అవర్ సమయాల్లో ఏడాదికి 22.22 మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌ను తగ్గించవచ్చు. తద్వారా 45.82 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుంది.
- 3.37 లక్షల వాణిజ్య సర్వీసుల ద్వారా 9.09 మెగావాట్ల పీక్‌లోడ్ డిమాండ్ తగ్గి, 18.67 మిలియన్ యూనిట్ల విద్యుత్ మిగులుతుంది.
- బీఎల్‌డీసీ ఫ్యాన్ల వల్ల 8.9 లక్షల గృహ వినియోగదారుల నుంచి 40.06 మెగావాట్ల పీక్ డిమాండ్ తగ్గి, 132.44 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుంది.
- 1.65 లక్షల వాణిజ్య సర్వీసులు బీఎల్‌డీసీ ఫ్యాన్లు వినియోగించడం ద్వారా 7.46 మెగావాట్ల డిమాండ్ తగ్గి, 28.71 మిలియన్ యూనిట్ల విద్యుత్ మిగులుతుంది.

# 50 వేల మందికి డిజిటల్, ఐటీ నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ

**సిస్కోతో ఏపీఎస్ఎస్‌డీసీ ఒప్పందం**



మంత్రి లోకేశ్ సమక్షంలో ఒప్పందం పత్రాలు చూపుతున్న సిస్కో ప్రతినిధులు, అధికారులు

**సాక్షి, అమరావతి:** డిగ్రీ, ఇంజినీరింగ్, వృత్తివిద్యలను అభ్యసిస్తున్న విద్యార్థుల్లో ఐటీ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఐటీ సంస్థ సిస్కో ముందుకు వచ్చింది. ఈ మేరకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ)తో సిస్కో ఒప్పందం చేసుకుంది. విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పందంపై మంగళవారం సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా 50 వేల మంది యువతకు డిజిటల్, ఐటీ నైపుణ్యాభివృద్ధి కల్పించేందుకు సిస్కో శిక్షణ ఇస్తుందని మంత్రి కార్యాలయం పేర్కొంది. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగం కార్యదర్శి కోన శశిధర్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ, సీఈవో జి.గణేష్ కుమార్, సిస్కో సీనియర్ వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ దేద్రిచ్ తదితరులు పాల్గొన్నారు.




### శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూ ఏటీజీహెచ్ వద్దకు చేరుకుంది. సోమవారం అర్ధరాత్రి వరకు 58,358 మంది స్వామి వారిని దర్శించుకోగా 27,024 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.45కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

### వైభవంగా కల్యాణ వెంకన్న పుష్పయాగం



**చంద్రగిరి:** శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మంగళవారం పుష్పయాగ మహోత్సవం వైభవంగా జరిగింది. 12 రకాల పుష్పాలు, 6 రకాల ఆకులతో స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు.

### శ్రీగిరి క్షేత్రం..భక్తజనసంద్రం

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల క్షేత్రం మల్లన్న నామస్మరణతో మారుమ్రోగుతోంది. ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్న ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్రలకు నుంచి వేలాదిగా తరలివస్తున్న భక్తులతో శ్రీగిరి క్షేత్రం జనసంద్రంగా మారింది.

### వైభవంగా ఏకాదశి తిరువీధి



**సింహాచలం:** ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై మదనగోపాలస్వామి తిరువీధి మంగళవారం సాయంత్రం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి డోలీలో వేంజేపచేశారు. సింహగిరి మాడవీధిలో తిరువీధి ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

### స్తంభోద్భవ అలంకారంలో నారసింహుడు

**మంగళగిరి:** మంగళాద్రి వేంచేసివున్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారి అలంకారోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి . ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు స్తంభోద్భవం అలంకారంలో దర్శనమివ్వగా భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.




### దైవభాష అభ్యసనం మహా అదృష్టం

తిరుపతి సిటీ: సంస్కృత భాషకు నిలయమైన ఎన్ఎస్‌యూలో దైవభాషను అభ్యసిస్తున్న, అధ్యయనం చేస్తున్న విద్యార్థులు అదృష్టవంతులని బెంగళూరు డీఆర్‌డీఓ ప్రముఖ శాస్త్రవేత్త ఎల్ఎన్ రాఘవేంద్ర కొనియాడారు. జాతీయ సంస్కృత వర్సిటీలో మంగళవారం వర్సిటీ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, ప్రసంగించారు. సంస్కృతంలో నిక్షిప్తమైన భారతీయ సంస్కృతి ఆధునిక సమాజానికి మార్గదర్శిగా ఉందన్నారు. సంస్కృత భాష ఔన్నత్యం విశ్వవ్యాప్తం చేయాల్సిన బాధ్యత విద్యార్థులు, అధ్యాపకులపై ఉందన్నారు.

### ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన వాయిదా

**గుంటూరు రూరల్:** ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మార్చి 27 నుంచి 29వ తేదీవరకు మూడు రోజులపాటు నిర్వహించనున్న ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శనను కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేయటం జరిగిందని విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మిదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

**ఏఎన్‌యూ(గుంటూరు) :** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ పరీక్ష ఫలితాలను వర్సిటీ వీసీ ఆచార్య కంచర్ల గంగాధర్ రావు మంగళవారం విడుదల చేశారు. మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు ఈనెల 31న తుది గడువుగా నిర్ణయించారు.

### ఏయూ ఆస్తుల పరిరక్షణ అందరి బాధ్యత

**విశాఖ విద్య:** ఆంధ్ర యూనివర్సిటీ ఆస్తులెక్కడున్నాయనేది తెలుసుకునేందుకు వైస్ చాన్సలర్ ఆచార్య రాజశేఖర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఏయూ ఆస్తుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

### మహిళావర్సిటీలో యూఎస్ కాన్సులేట్ జనరల్

**తిరుపతి సిటీ:** యూఎస్ కాన్సులేట్ జనరల్ డిప్లమసీ ఆఫీసర్ ఎమిలియా బి స్మిత్, పబ్లిక్ ఎంగేజ్‌మెంట్ స్పెషలిస్ట్ సెంథిల్ కుమార్ మంగళవారం మహిళా వర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజిని, డీన్లు విజయలక్ష్మి, భారతి, శారద, అధ్యాపకులతో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణపై చర్చించారు. ప్రధానంగా ప్రభుత్వ నిధులతో త్వరలో రానున్న ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఫెలో ప్రోగ్రామ్‌పై చర్చించారు.

సాగుబడి
ఉత్తరాభాద్ర కార్తె: మార్చి 30 వరకు
రేవతి కార్తె: 31 నుంచి

కరువు, భూగర్భ జలాలు అడుగంటడం, సాధారణం కన్నా ఎక్కువగా 4-5 అధిక ఉష్ణోగ్రతలు నమోదవ్వడంతో భూతాపం ముందెన్నడూ ఎరుగనంతగా పెరిగిపోతోంది.. 2024 ఏడాదిలో అన్ని నెలలూ మానవాళి చరిత్రలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎల్‌నినో కారణంగా ఇలా జరిగిందేమో అనుకుంటే.. లానినా దశలో కూడా 2025లో మొదటి 3 నెలలు కూడా రికార్డు స్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మనం ఇప్పుడు క్లైమెట్ ఎమర్జెన్సీ స్థాయిలో పర్యావరణ సంక్షోభాన్ని అనుభవిస్తున్నామని చెప్పకతప్పదు. అందుకు తాజా నిదర్శనం.. రిజర్వాయర్లు ఖాళీ అవుతున్నాయి. జీవ నదులు ఎండిపోతున్నాయి. మట్టి ఉష్ణోగ్రత పెరిగిపోతోంది. పంటలకు గడ్డు కాలం వచ్చింది. ప్రస్తుత రబీ సీజన్‌లో తెలుగునాట కొన్ని జిల్లాల్లో వరి తదితర పంటలు, పండ్ల తోటలు నిలువునా ఎండిపోతున్నాయి.

**ఇది స్పష్టంగా 'క్లైమెట్ ఎమర్జెన్సీ' పరిస్థితే!**

**కిం కర్తవ్యం?**



# సి(రిధాన్య)4 పంటలే సిరి!

**వాతావరణ మార్పులను తట్టుకునేవి, తక్కువ నీటి అవసరం కలిగినవి అయిన చిరుధాన్యాలను ప్రధాన ఆహార పంటలుగా సాగు చేయాలని హైదరాబాద్‌లోని భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ(ఐ.ఐ.ఎం.ఆర్.) సూచిస్తోంది. రైతుకు పర్యావరణ, ఆర్థిక, పౌష్టికాహార భద్రతనిచ్చే ఈ పంటలు వినియోగదారులకు సంపూర్ణ పౌష్టికాహారాన్ని అందిస్తాయి. 'సాక్షి' ప్రత్యేక కథనం..**

ప్రకృతి వనరుల ఆధారంగానే వ్యవసాయం సాగేది. వర్షం మన వ్యవసాయానికి ముఖ్యాధారం. వర్షం ఎప్పుడొస్తుందో.. ఎంత తక్కువ కురుస్తుందో.. వర్షాకాలం మధ్యలో ఎన్ని రోజులు వర్షం మొహం చాటేస్తుందో తలపండిన వారికి కూడా అంతుపట్టని దశకు చేరాం. పెద్ద నదులపై ఉన్న రిజర్వాయర్లు సైతం వేసవి అడుగంటిపోవడంతో ఆయకట్టు భూములకు కూడా సాగు నీటి భద్రత కరువైపోయే పరిస్థితులు వచ్చాయి.

దీని అర్థం ఏమిటంటే.. ఇంతకుముందు వేస్తున్న అధికంగా నీటి అవసరం ఉండే పంటల్నే గుడ్డిగా ఇక మీదట సాగు చేయలేం. నీటి అవసరం అంతగా అవసరం లేని ఆహార పంటల వైపు దృష్టి మరల్చడం రైతులకు, సమాజానికి శ్రేయస్కరం అంటున్నారు నిపుణులు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటలను విజ్ఞతతో ఎంపిక చేసుకోవాలని ఆయన సూచిస్తున్నారు. ఈ కోవలో ముందు వరుసలో ఉండేవి.. చిరుధాన్య పంటలు.

జొన్న, సజ్జ, రాగి, కొర్ర, ఊద, సామ, అరికెలు, ఒరిగెలు.. ఇవీ మనకు ముఖ్యంగా తెలిసిన చిరుధాన్య పంటలు (మిల్లెట్స్). దక్షిణ భారతీయులకు వేలాది ఏళ్ల క్రితమే బాగా పరిచయమైన పంటలివి.. కొత్తవి కాదు. హరిత విప్లవం పేరుతో వరి, గోధుమ వంటి ఆహార పంటలను ప్రభుత్వం వ్యాప్తిలోకి తేవడానికి ముందు వేలాది ఏళ్లుగా మన పూర్వీకులు తింటూ ఆరోగ్యంగా



జీవించడానికి కారణభూతమైన పంటలివి. పర్యావరణ, వాతావరణ సంక్షోభకాలంలో తిరిగి ఈ పంటల వైపు మన ప్రజలు, రైతులు, ప్రభుత్వాలు దృష్టిసారించాల్సిన అవసరం తోసుకు వచ్చిన తరుణం ఇది.

**సి-4 రకం పంటలు మేలు**

నీటి వనరులు అందుబాటులో లేని, సారం పెద్దగా లేని తేలిక, ఎర్ర నేలలు వరి, పత్తి వంటి పంటల సాగుకు అనుకూలం కావు. ఈ పంటలను సాంకేతిక పరిభాషలో 'సి-3' పంటలు అంటారు.




తక్కువ వర్షం తోనే, కరువు కాలంలో సయితం అంతగా సారం లేని తేలిక, ఎర్ర నేలల్లోనూ ఖచ్చితమైన దిగుబడులనిచ్చేవి చిరుధాన్య పంటలు. సాంకేతిక పరిభాషలో వీటిని 'సి-4' పంటలు అంటారు.

చిరుధాన్య పంటలు వరి కన్నా అనేక రకాలుగా మేలైనవి . సమాజానికి పౌష్టికాహార భద్రతతోపాటు రైతులకు కనీస ఆదాయ భద్రతను ఇవ్వడంతోపాటు, వరి గడ్డి కన్నా అధిక పోషక విలువలున్న పశుగ్రాసాన్ని కూడా అందిస్తాయన్నారు.

భూతాపం అసాధారణంగా పెరుగుతున్న సంక్షోభ కాలంలో ఇంతకు ముందు వేసిన పంటే వేస్తామని, ఇంతకు ముందు తినే ఆహారమే తింటామని అనుకుంటూ ఉండకూడదు. వాతావరణ అసమతుల్యతను తట్టుకొని పెరిగే చిరుధాన్యాలను ముఖ్య ఆహారంగా తినటం మొదలుపెడితే రైతులూ పండించడం మొదలు పెడతారు. తెలుగు రాష్ట్రాల వ్యవసాయ శాఖలు, రైతులు అనువు కాని భూముల్లో వరి, పత్తి, మొక్కజొన్న వంటి పంటలను లక్షల ఎకరాల్లో సాగు చేయడం మాని.. చిరుధాన్యాల సాగుపై దృష్టిసారించాలని నిపుణులు సూచిస్తున్నారు.


**జీఎస్టీ ఎత్తివేయాలి**

పర్యావరణానికి హాని కలిగించే వరి, గోధుమ వంటి పంటలకు సబ్సిడీలు ఇస్తున్న ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు దోహదపడే చిరుధాన్యాలపై మాత్రం ప్రభుత్వం జీఎస్టీ విధిస్తుండటం సమంజసం కాదు. జీఎస్టీ రద్దు చేయాలి. చిరుధాన్యాలను ప్రభుత్వాలు మద్దతు ధరకు సేకరించి, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు సబ్సిడీ ధరకు అందివ్వాలి. సి4 రకం పంటలైన సిరిధాన్యాలతోనే ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ, ఆహార, ఆరోగ్య భద్రత చేకూరుతుందని అందరూ గ్రహించాలి.



– డాక్టర్ ఖాదర్ వలి,
ప్రముఖ ఆహార ఆరోగ్య నిపుణులు,
పద్మశ్రీ పురస్కార గ్రహీత





| సి-3 పంటలు | సి-4 పంటలు |
|---|---|
| 1. వరి, గోధుమ, పత్తి, పొద్దుతిరుగుడు.. | 1. కొర్ర, అరిక, సామ, అండుకొర్ర, ఊద, జొన్న, సజ్జ, రాగి. |
| 2. చల్లని వాతావరణం (20–25 డిగ్రీల సెల్షియస్) అనుకూలం. | 2. వేడి వాతావరణ (30–45 డిగ్రీల సెల్షియస్) పరిస్థితులను తట్టుకుంటాయి |
| 3. భూమ్మీద మొక్కల్లో 95% వరకు సి-3 రకం మొక్కలుంటాయి | 3. భూమ్మీద మొక్కల్లో 5% వరకు సి-4 రకం మొక్కలుంటాయి |
| 4. అధిక ఉష్ణోగ్రతను, కరువును తట్టుకునే సామర్థ్యం తక్కువ | 4. అధిక ఉష్ణోగ్రతను, కరువును తట్టుకునే సామర్థ్యం ఎక్కువ |
| 5. వాతావరణంలో బొగ్గుపులుసు వాయువు వల్ల భూతాపం పెరిగేకొద్దీ దిగుబడి తగ్గుతుంది | 5. వాతావరణంలో బొగ్గుపులుసు వాయువు వల్ల భూతాపం పెరుగుతున్నా దిగుబడి తగ్గదు |
| 6. పంట కాలం ఎక్కువ.. 100–140 రోజులు | 6. పంట కాలం తక్కువ.. 60–95 రోజులు (అరికలు 180 రోజులు) |
| 7. సాగు నీరు బాగా అవసరం. బెట్ట పరిస్థితులను ఎక్కువ కాలం తట్టుకోలేవు | 7. సాగు నీటి అవసరం బాగా తక్కువ. నీటి కొరతను ఎక్కువ కాలం తట్టుకోగలవు |
| 8. వరికి 1,250 ఎం.ఎం., చెరకుకు 2,100 ఎం.ఎం., పత్తికి 600 ఎం.ఎం. వర్షపాతం కావాలి | 8. మొక్కజొన్నకు 500 ఎం.ఎం, జొన్నకు 400 ఎం.ఎం., రాగి, సజ్జలకు 350 ఎం.ఎం. చాలు. కొర్ర, సామ, అరిక, ఊద, అండుకొర్రలకు ఇంకా తక్కువ వర్షపాతం చాలు. |
| 9. సారవంతమైన, నీటి వసతి ఉండే భూములు అనుకూలం | 9. తేలిక భూములు, భూసారం తక్కువగా ఉండే మెట్ట భూములు అనుకూలం |
| 10. వాతావరణంలో భూతాపం పెరుగుతున్నకొద్దీ ఈ పంటల్లో పోషకాలు, ఖనిజ లవణాలు తగ్గుతాయి | 10. పౌష్టిక విలువలు ఎక్కువ. పిండి పదార్థంతోపాటు అధిక పీచు, నాణ్యమైన మాంసకృత్తులు, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉన్న సిరిధాన్యాలివి |
| 11. ఎరువుల అవసరం ఎక్కువ | 11. ఎరువుల అవసరం లేదు/తక్కువ |

**సి-4 పంటల విశిష్టత ఏమిటి?**

సి-4 రకం పంటల విశిష్టత ఏమిటంటే.. అతి తక్కువ నీటితో, తక్కువ పంట కాలంలోనే కరువును, అధిక ఉష్ణోగ్రతను తట్టుకొని, అధిక పౌష్టిక విలువలతో కూడిన ఆహార ధాన్యాలను అందిస్తాయి.

వాతావరణం నుంచి బొగ్గుపులుసు వాయువును, సూర్యరశ్మిని గ్రహించి అధిక ఉష్ణోగ్రతలు, కరువు పరిస్థితుల్లో సైతం ఆహారాన్ని ఉత్పత్తి చేసుకొని మంచి దిగుబడులు ఇవ్వడంలో సి-4 పంటలు సి-3 రకం పంటలకన్నా అధిక సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి.

భూతాపాన్ని పెంచే హరిత గృహ వాయువులను చిరుధాన్య పంటలతో పోల్చితే వరి పంట 20 రెట్లు ఎక్కువగా విడుదల చేస్తున్నది.

అందుకే చిరుధాన్యాలు రైతులకు బీమా ఇవ్వగలిగిన పంటలన్నారు. పప్పుధాన్యాలు, నూనెగింజలతో కలిపి సమీకృత వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసినప్పుడు ఎరువుల అవసరం, చీడపీడల బెడద కూడా చిరుధాన్య పంటలకు పెద్దగా ఉండదు.



తేలిక భూముల్లో, ఎర్ర నేలల్లో మొక్కజొన్న, పత్తి సాగు చేస్తే వర్షాలు సక్రమంగా పడనప్పుడు ఈ పంటలు రైతులను తీవ్ర నష్టాల పాలుజేయడానికి అవకాశాలెక్కువ. చెరకు సాగుకు 2,100 ఎం.ఎం, వరికి 1,250 ఎం.ఎం., పత్తికి 600 ఎం.ఎం. నీరు అవసరం.

అయితే, జొన్నలకు 400 ఎం,ఎం., సజ్జ, రాగి, కొర్ర తదితర స్మాల్ మిల్లెట్లకు 350 ఎం.ఎం. నీరు సరిపోతుంది. వేరుశనగకు 450 ఎం.ఎం., పప్పుధాన్యాలకు 300 ఎం.ఎం., మొక్కజొన్నకు 500 ఎం.ఎం. నీరు అవసరమవుతుంది.

వ్యవసాయ శాఖలు రైతులను చైతన్య పరచి జొన్న, సజ్జ, రాగి వంటి పంటలను సూచించాలి. స్మాల్ మిల్లెట్స్ అయిన కొర్రలు, సామలు, ఊదలు, అరికెలు, ఒరిగెలు వంటి పౌష్టిక విలువలు కలిగిన ఈ పంటల సాగును తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయ శాఖలు విస్తృతంగా ప్రోత్సహించాలి.



తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న క్రాప్ కాలనీలలో ఆయా ప్రాంతాన్ని, నేల స్వభావాన్ని బట్టి కొన్ని రకాల పంటలను ప్రోత్సహించి, దగ్గర్లోనే ప్రాసెసింగ్ సెంటర్లను ఏర్పాటు చేయడం వల్ల రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంటుంది. పంటల కాలనీలలో చిరుధాన్య పంటలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉంది.

– పంతంగి రాంబాబు,
సాగుబడి డెస్క్

# వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు

**గత మూడు రోజుల వాతావరణం:**

గడిచిన మూడు రోజులలో రాష్ట్రంలోఅక్కడక్కడ తేలిక పాటి నుండి ఓ మోస్తారు వర్షాలు కురిసాయి. పగటి ఉష్ణోగ్రతలు35నుండి 40డిగ్రీల సెల్సియస్ మరియు రాత్రి ఉష్ణోగ్రతలు18 నుండి 24డిగ్రీల సెల్సియస్ గా నమోదయ్యాయి.

**వచ్చే ఐదు రోజుల్లో పెరగనున్న ఉష్ణోగ్రతలు:**

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వారు (సోమవారం మధ్యాహ్నానికి ఉన్న సమాచారం ఆధారంగా) అందించిన సమాచారం ప్రకారం ఈ నెల 26 (బుధవారం) నుండి 30వ( ఆదివారం) వరకు రాబోయే ఐదు రోజుల్లో వాతావరణం పొడిగా ఉండవచ్చు. పగటి ఉష్ణోగ్రతలు 35 నుండి 42 డిగ్రీల సెల్సియస్ మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 23 నుండి 28 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదుకావచ్చు.

- నీటి వసతి గల ప్రాంతాలలో పచ్చిమేత కోసం పశుగ్రాస పంటలుగా జొన్న, మొక్కజొన్న పంటలను వేసుకోవచ్చు. తక్కువ నీటి వసతి గల ప్రాంతాల్లో పశుగ్రాస పంటలుగా సజ్జ, బొబ్బర పంటలను వేసుకోవచ్చు.
- నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో వరికి ఆరుతడులు ఇవ్వాలి.
- చీడపీడలు, తెగుళ్ళ ఉధృతి అధికంగా కాకుండా చూడటానికి సరైన సమయంలో నివారణ చర్యలు చేపట్టాలి.

**వడగళ్ళ వాన, అధిక వర్షాలు కురిసిన ప్రాంతపు రైతులు పాటించవలసిన యాజమాన్య పద్ధతులు:**

- నేల ద్వారా వ్యాపించే తెగుళ్ళను నివారించడానికి నేల బాగా తడిచే విధంగా 3 గ్రా. కాపర్ ఆక్సీ క్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి మొదళ్ళలో పోయాలి.
- అధిక వర్షాలు కురిసిన ప్రాంతాల్లో పొలం నుంచి నీటిని తీసివేసిన తరువాత పంట త్వరగా కోలుకోవటానికి 2% యూరియా లేదా 1% పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పంటపై పిచికారీ చేయాలి.
- వర్షాలతో శాకీయ దశలో ఉన్న కూరగాయ పంటల్లో నష్టం ఎక్కువగా ఉంటే తిరిగి మొక్కలను నాటుకోవాలి.
- పడిపోయిన మొక్కజొన్న పచ్చి కంకి దశలో ఉనట్లయితే కంకులను కోసి పచ్చి కంకులుగా అమ్ముకోవాలి.
- అధిక వర్షాలు కురిసిన ప్రాంతాలలో వరి పంటలో అగ్గి తెగులు, గింజమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. కావున తెగుళ్ళ ఉధృతి గమనించినట్లయితే 1 మి.లీ. ప్రోపికోనజోల్ లేదా 0.4 గ్రా. టేబుకొనజోల్ + ట్రైఫ్లాక్సిస్ట్రోబిన్ లేదా 2.5 గ్రా. ట్రైసైక్లాజోల్ + మాంకోజెబ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- మామిడి తోటలో పడిపోయిన కాయలను సేకరించి మంచిగా ఉన్న కాయలను మార్కెట్‌కు తరలించాలి. పగిలి పోయిన కాయలను అలాగే తోటలో వదిలేసినట్లయితే తెగుళ్ళు ఆశించే అవకాశం ఉన్నది.
- మామిడిలో కాయమచ్చ తెగులు కనిపిస్తే 1 గ్రా. కార్బండజిమ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**వరి**

- ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో ఆకునల్లి, కంకినల్లి ఆశించే అవకాశం ఉంది. నివారణకు 5 మి.లీ. డైకోఫాల్ లేదా 1 మి.లీ. స్పైరోమేసిఫిన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి (కంకివెన్ను 10 శాతం కన్న తక్కువ ఉన్నప్పుడు మందుల పిచికారీ చేసుకోవాలి. కంకివెన్ను 10 శాతం కన్నా ఎక్కువ పైకి వచ్చినట్లయితే మందుల పిచికారీ చేస్తే దిగుబడి తగ్గుతుంది).
- వరిలో సుడిదోమ గమనించడమైనది. ఉధృతి తక్కువగా ఉన్నప్పుడు నివారణకు, ఎసిఫేట్ + ఇమిడాక్లోప్రిడ్ ៖ 1.5గ్రా. మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వరిలో అగ్గి తెగులు సోకడానికి అనుకూలం. తెగులు గమనించినచో నివారణకు ట్రైసైక్లాజోల్ 0.5 గ్రా. లేదా ఐసోప్రొథైయోలిన్ 0.5 మీ.లీ. లేదా కాసుగామైసిన్ 2.5 మీ.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- వరిలో కాండం తొలిచే పురుగు ఆశించడానికి అనుకూలం. నివారణకు పిలకలు లేదా దుబ్బు చేసే దశలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరాకి 10 కిలోల చొప్పున వేసిన రైతులు పొట్ట దశలో 0.3 మి. లీ. క్లోరాంట్రానిలిప్రోల్ లేదా 0.5 మి.లీ. టెట్రానిలిప్రోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ప్రస్తుత వాతావరణంలో వరికి జింక్ ధాతువు లోపం రావటానికి అనుకూలం. నివారణకు 2గ్రా. జింక్ సల్ఫేట్ మందును లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

**మొక్కజొన్న**

- ప్రస్తుత వాతావరణ పరిస్థితులు (భూమిలో ఎక్కువ తేమ) మొక్కజొన్నలో బాక్టీరియా కాండం కుళ్ళు తెగులు ఆశించడానికి అనుకూలం. నివారణకు 4 కి.గ్రా. బ్లీచింగ్ పౌడి (35 % క్లోరిన్ కలిగిన) మందును లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ళు తడిచేటట్లు పోయాలి.
- పూత అనంతరం ఎండు తెగులు ఆశించటానికి అనుకూలం. నివారణకు 1 గ్రా. కార్బండజిమ్ లేదా 3 గ్రా. కాపర్ ఆక్సి క్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ళు తడిచేలా పోయాలి.
- మేడిస్ ఆకుమాడు తెగులు ఆశంచడానికి అనుకూలం. నివారణకు, 2.5గ్రా. మ్యాంకోజేబ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- కత్తెర పురుగు ఆశించడానికి అనుకూలం. నివారణకు 0.4 మి.లీ. క్లోరంట్రానిలిప్రోల్ లేదా 0.5 మి.లీ. స్పైనటోరం మందును లీటరు నీటికి కలిపి ఆకు సుడుల లోపల తడిచేలా పిచికారీ చేయాలి. మోకాలు ఎత్తు దశలో ఉన్న పైరులో ఒక కిలో సున్నం, 9 కిలోల ఇసుకను కలిపి మొక్క సుడులలో వేసి కత్తెర పురుగును నివారించుకోవాలి.

**వంగ**

- ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వంగలో కొమ్మ, కాయ తొలిచే పురుగులు ఆశించడానికి అనుకూలం. నివారణకు ఎకరానికి 10–15 లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలి. తలలను తుంచి 10,000 పి.పి.యమ్ వేపనూనెను 3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే 0.25 మి.లీ. ఫ్లూబెండమైడ్ లేదా 0.4 గ్రా. ఇమామెక్టిన్ బెంజోయేట్ లేదా 0.3 మి.లీ. క్లోరాంట్రినిలిప్రోల్ పిచికారీ చేయాలి.

**మిరప**

- ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మిరపలో జెమిని వైరస్ (ఆకుముడత) తెగులు ఆశించడానికి అనుకూలం. నివారణకు.. ■ వ్యాధి సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి. ■ పొలం లో కలుపు మొక్కలను నివారించాలి. ■ పసుపు రంగు జిగురు అట్టలను ఎకరాకు 8–10 చొప్పున అమర్చాలి. ■ నివారణకు 1.5 మి.లీ. పైరిప్రాక్సిఫెన్ లేదా 1.0 మి.లీ. పైరిప్రాక్సిఫెన్ + ఫెన్ ప్రోపాత్రిన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- కొమ్మ ఎండు, కాయకుళ్ళు తెగులు ఆశించడానికి అనుకూలం. నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2.5 గ్రా. మాంకోజెబ్ లేదా 1 మి.లీ. ప్రోపికోనజోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- నల్ల తామర పురుగులు ఆశించడానికి అనుకూలం. నివారణకు, 2 మి.లీ. సైంట్రానిలిప్రోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**టమాట**

- ప్రస్తుత వాతావరణ పరిస్థితులు టమాటలో పొగాకు లద్దె పురుగు ఆశించడానికి అనుకూలం. నివారణకు, 1మి.లీ. నోవల్యూరాన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ● ఫ్యుజేరియం ఎండు తెగులు ఆశించడానికి అనుకూలం. నివారణకు 3గ్రా. కాపర్ ఆక్సి క్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి మొదళ్ల చుట్టూ పోయాలి.

**తీగజాతి కూరగాయలు**

- ప్రస్తుత వాతావరణ పరిస్థితులు తీగజాతి కూరగాయల పంటలలో పండు ఈగ ఆశించడానికి అనుకూలం. నివారణకు 2 మి.లీ. మలాథియాన్ లేదా 2 మి.లీ ప్రొఫెనోఫాస్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**మామిడి**

- తరచుగా పండు ఈగ గమనించే మామిడి తోటల్లో కాయ అభివృద్ధి దశ నుంచి పక్వానికి వచ్చే దశలో పాటించవలసిన యాజమన్య పద్ధతులు: ■ తోటలను శుభ్రంగా ఉంచాలి ■ పండు ఈగ సోకిన కాయలను / పండ్లను ఏరి నాశనం చేయాలి. ■ 10,000 పి.పి. యం వేప నూనెను పిచికారీ చేయాలి. ■ పండుఈగ ఎరలను (2 మి.లీ. మలాథియాన్ + 2 మి.లీ. మిథైల్ యూజినాల్ మందును లీటరు నీటికి కలిపి) ఒక్కొక్క ప్లాస్టిక్ కంటైనర్‌లో 200 మి.లీ. ఉంచి ఎకరాకి 6 చొప్పున చెట్టు కొమ్మలకు వేలాడదీయాలి. ఎకరాకి 40 పసుపు రంగు జిగురు అట్టలు అమర్చుకోవాలి.

– డా. పి. లీలా రాణి,
ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి)– అధిపతి,
వాతావరణ ఆధారిత వ్యవసాయ పరిశోధనా కేంద్రం,
ఎఆర్ఎస్, పిజెటిఎయు, రాజేంద్రనగర్.


## బిజినెస్ రీల్

### 28న ఇండస్ఇండ్‌పై నివేదిక




న్యూఢిల్లీ: ఇండస్ఇండ్ బ్యాంక్ డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియోలో అకౌంటింగ్ లోపాలను పరిశీలిస్తున్న ఎక్స్‌టర్నల్ ఆడిటింగ్ సంస్థ పీడబ్ల్యూసీ మార్చి 28న బ్యాంకు బోర్డుకు తమ నివేదికను సమర్పించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అకౌంటింగ్ సమస్యలు, వివిధ స్థాయుల్లో లోపాలు, తీసుకోతగిన దిద్దుబాటు చర్యలతో పాటు బ్యాంకునకు వాస్తవంగా ఎత మేర నష్టం వాటిల్లినది కూడా పీడబ్ల్యూసీ తన నివేదికలో పొందుపర్చే అవకాశం ఉన్నట్లు వివరించాయి. దాదాపు రూ. 2,100 కోట్ల అకౌంటింగ్ లోపాల వల్ల సంస్థ నికర విలువపై 2.35 శాతం మేర ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉన్నట్లు ఇండస్ఇండ్ బ్యాంక్ అంచనా వేసింది. అవసరమైన వివరాలన్నీ వెల్లడించి, ప్రస్తుత త్రైమాసికంలోనే దిద్దుబాటు చర్యలు కూడా తీసుకోవాలని రిజర్వ్ బ్యాంక్ ఆదేశించింది.

### హైదరాబాద్‌లో షిప్‌రాకెట్ సేమ్ డే డెలివరీ సేవలు




ముంబై: ఈ-కామర్స్ డెలివరీ సేవల సంస్థ షిప్‌రాకెట్ తాజాగా హైదరాబాద్‌లో చిన్న, మధ్యతరహా సంస్థల కోసం (ఎంఎస్ఎంఈ) సేమ్ డే డెలివరీ సర్వీసులను ప్రారంభించింది. ఇప్పటికే ఇవి ముంబై, బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, కోల్‌కతా నగరాల్లో అందుబాటులో ఉన్నాయి. కస్టమర్లకు ఉత్పత్తులను వేగవంతంగా అందించడంలో మిగతా పెద్ద సంస్థలతో ఎంఎస్ఎంఈలు పోటీపడేలా తోడ్పాటు అందించడంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు షిప్‌రాకెట్ ఎండీ సాహిల్ గోయల్ తెలిపారు. ఇందుకోసం పిక్ఎన్‌డెల్, పికో, బ్లిట్జ్, షాడోఫ్యాక్స్ తదితర సంస్థలతో జట్టు కట్టినట్లు వివరించారు. దేశీయంగా సేమ్ డే డెలివరీ మార్కెట్ 2028 నాటికి సుమారు 24 శాతం వార్షిక వృద్ధితో 10 బిలియన్ డాలర్ల స్థాయికి చేరుతుందనే అంచనాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

### మెన్ ఆఫ్ ప్లాటినం ధోనీ కలెక్షన్

న్యూఢిల్లీ: ఐపీఎల్ సీజన్ సందర్భంగా ప్రముఖ క్రికెటర్ ఎంఎస్ ధోని సిగ్నేచర్ ఎడిషన్ కింద ప్లాటినం జ్యుయలరీ ప్రవేశపెట్టినట్లు మెన్ ఆఫ్ ప్లాటినం వెల్లడించింది. వీటిలో ప్లాటినం గ్రిడ్ బ్రేస్‌లెట్, ముమెంటం బ్రేస్‌లెట్, క్యూబ్ ఫ్యూజన్ బ్రేస్‌లెట్, బోల్డ్ లింక్స్ బ్రేస్‌లెట్, ప్లాటినం హార్మనీ చెయిన్ ఉన్నట్లు తెలిపింది. వీటిని 95% ప్లాటినంతో తీర్చిదిద్దినట్లు వివరించింది.

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-3-2025

| | |
|---|---|
| విశాఖ | 400-00 |
| చిత్తూరు | 470-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 397-00 |
| విజయవాడ | 405-00 |
| రిటైల్ ధర (డజను) | 60.00 |
| హైదరాబాద్ | 395-00 |
| వరంగల్ | 397-00 |
| రిటైల్ ధర | 4.55 |

### నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| ULTRACEMCO | 11,406.00 | 3.21 |
| TRENT | 5,183.00 | 2.54 |
| BAJAJFINSV | 1,935.45 | 2.18 |
| GRASIM | 2,566.50 | 2.12 |
| INFY | 1,619.25 | 1.66 |

### నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| INDUSINDBK | 635.15 | -5.12 |
| DRREDDY | 1,173.50 | -3.04 |
| ADANIENT | 2,319.50 | -2.08 |
| COALINDIA | 397.9 | -2 |
| ADANIPORTS | 1,179.70 | -1.76 |

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 6,007 |
| ఎన్ఎస్ఈ | 1,08,836 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 4,14,989 |
| ఎఫ్ఐఐ | + 5,372 |
| డీఐఐ | + 2,769 |

### ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 68.84 | $ 69.11 |
| బ్రెంట్ | 72.22 | $ 72.37 |

# ఈ ఏడాది ఐటీఈఎస్ కొలువుల జోరు

**20 శాతం పెరగొచ్చని అంచనా • ఇన్‌స్టాహైర్ ప్లాట్‌ఫాం అధ్యయనంలో వెల్లడి**

న్యూఢిల్లీ: ఈ ఏడాది దేశీ ఐటీఈఎస్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ ఎనేబుల్డ్ సర్వీసెస్) రంగం గణనీయంగా వృద్ధి చెందనుంది. ఉద్యోగావకాశాలు 20 శాతం మేర పెరగనున్నాయి. ఏఐ ఆధారిత నియామకాల సేవల ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాహైర్ రూపొందించిన అధ్యయన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 42,000 మంది ఉద్యోగార్థుల ప్రొఫైల్స్, 11,000 పైచిలుకు రిక్రూటర్-క్యాండిడేట్ల ఇంటర్వ్యూ వివరాల అధ్యయనం ఆధారంగా సంస్థ దీన్ని రూపొందించింది. తమ 'ఇన్‌స్టాహైర్ టెక్ శాలరీ ఇండెక్స్ 2025' ప్రకారం అనుభవం, డొమైన్లవ్యాప్తంగా జీతభత్యాల డైనమిక్స్ కూడా మారుతున్నట్లు తెలిపింది. కొత్త టెక్నాలజీల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఏఐ, సైబర్‌సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ ఉద్యోగావకాశాలు 75 శాతం పెరిగే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. ఇక తాత్కాలిక ఉద్యోగుల గిగ్ ఎకానమీ, రిమోట్ వర్క్ విధానాలు కూడా పరిశ్రమ రూపురేఖలను తీర్చిదిద్దడంలో కీలకంగా ఉంటున్నాయని ఇన్‌స్టాహైర్ నివేదిక తెలిపింది. టెక్నాలజీ పెరిగే కొద్దీ జాబ్ మార్కెట్‌లో పోటీపడేందుకు దాదాపు 40 శాతం మంది ఉద్యోగులు కొత్త నైపుణ్యాల్లో శిక్షణ పొందడమో లేదా ప్రస్తుతమున్న వాటిని మరింతగా మెరుగుపర్చుకోవడంపైనో దృష్టి పెట్టాల్సి ఉంటుందని పేర్కొంది.

**నివేదికలోని మరిన్ని వివరాలు..**

- వివిధ స్థాయుల్లో అనుభవమున్న డెవ్ఆప్స్ నిపుణులకు, ముఖ్యంగా ఏడబ్ల్యూఎస్ నైపుణ్యాలున్న వారికి 10 శాతం మేర వేతన వృద్ధి ఉంటోంది. 0-5 ఏళ్ల అనుభవం ఉన్న ఫ్రంట్ ఎండ్ డెవలపర్ల వేతనం వార్షికంగా సుమారు రూ. 1.5 లక్షలు తగ్గగా, ఆరేళ్ల పైగా అనుభవమున్న ఫ్రంట్ ఎండ్ నిపుణుల శాలరీలు వార్షికంగా సుమారు రూ. 4 లక్షల మేర పెరిగాయి. మొబైల్ డెవలప్‌మెంట్, డేటా సైన్స్ విభాగాల్లోనూ ఇదే ధోరణి నెలకొంది.
- బ్యాక్‌ఎండ్ నైపుణ్యాలకు సంబంధించి పైథాన్ నిపుణులకు అత్యధికంగా వేతనాలు ఉంటున్నాయి. ప్రతి అయిదేళ్ల అనుభవానికి వేతనం రెట్టింపు స్థాయిలో ఉంటోంది. జావాకి కూడా మంచి డిమాండ్ నెలకొంది. ఫ్రెషర్స్ నుంచి పదేళ్ల పైగా అనుభవమున్న వరకు వివిధ స్థాయుల్లోని ఉద్యోగుల వేతనాలు అయిదు రెట్లు పెరిగాయి.
- ప్రతిభావంతులకు హాట్‌స్పాట్‌గా బెంగళూరు కొనసాగుతోంది. దేశీయంగా 35 శాతం మంది టెక్నాలజీ సిబ్బందికి కేంద్రంగా ఉంటోంది. హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్ (చెరి 20 శాతం చొప్పున), పుణె (15 శాతం), చెన్నై (10 శాతం) తదుపరి స్థానాల్లో ఉన్నాయి.
- చండీగఢ్, జైపూర్, ఇండోర్‌లాంటి ద్వితీయ శ్రేణి నగరాలు ఆకర్షణీయమైన టెక్ హబ్‌లుగా ఎదుగుతున్నాయి.
- నిపుణులు, నాన్-మెట్రో ప్రాంతాలకు రీలొకేట్ అయ్యేందుకు రిమోట్ పని విధానపరమైన వెసులుబాటు ఉపయోగకరంగా ఉంటోంది.
- సైబర్‌సెక్యూరిటీ, స్పేస్ టెక్నాలజీ స్టార్టప్‌ల సారథ్యంలో నియామకాలు జోరందుకోనున్నాయి. ఏఐ అనుభవానికి కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నందున వైవిధ్యం కన్నా నైపుణ్యాలను బట్టి నియమించుకునే ధోరణి పెరుగుతోంది.
- కంపెనీలు వినూత్న హైరింగ్ వ్యూహాలను అమలు చేస్తుండటంతో కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడంపై దృష్టి పెట్టే నిపుణులకు కెరియర్ వృద్ధి మెరుగ్గా ఉంటుంది.



## ఐపీవోకు ఇందిరా ఐవీఎఫ్ నో

**ప్రాస్పెక్టస్ వెనక్కి తీసుకున్న కంపెనీ**




న్యూఢిల్లీ: ఫెర్టిలిటీ క్లినిక్ చైన్ ఇందిరా ఐవీఎఫ్ హాస్పిటల్ పబ్లిక్ ఇష్యూ ప్రణాళికలను పక్కనపెట్టింది. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి ప్రాస్పెక్టస్‌ను వెనక్కి తీసుకుంది. కంపెనీ ఇంతక్రితం గోప్యతా మార్గంలో ఐపీవో చేపట్టేందుకు సెబీకి ముందస్తు దరఖాస్తు చేసింది. రహస్య ఫైలింగ్ చేసిన కంపెనీ సంబంధిత వివరాలను గోప్యంగా ఉంచేందుకు వీలుంటుంది. అంతేకాకుండా కచ్చితంగా పబ్లిక్ ఇష్యూ చేపట్టాలన్న నిబంధనలేమీ లేవు. ఫిబ్రవరి 13న సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను సమర్పించిన కంపెనీ కారణాలు వెల్లడించకుండా ఈ నెల 19న ఉపసంహరించుకుంది. ఇంతక్రితం 2023లో హోటళ్ల అగ్రిగేటర్ ఓయో సెబీకి రహస్య ఫైలింగ్ చేసినప్పటికీ ఐపీవో చేపట్టలేదు. అయితే 2024లో రిటైల్ దిగ్గజం విశాల్ మెగా మార్ట్, ఫుడ్ డెలివరీ దిగ్గజం స్విగ్గీ ఐపీవోలు చేపట్టి స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యాయి. ఈ బాటలో గత వారం ఫిజిక్స్‌వాలా సైతం కాన్ఫిడెన్షియల్ రూట్‌లో సెబీకి పత్రాలు దాఖలు చేసింది. కాగా.. 2022 డిసెంబర్‌లో టాటా ప్లే(గతంలో టాటా స్కై) దేశీయంగా తొలిసారి రహస్య ఫైలింగ్ రూట్‌లో సెబీకి దరఖాస్తు చేసింది. 2023 ఏప్రిల్‌లో అనుమతి పొందినప్పటికీ ఐపీవోకు రాకపోవడం గమనార్హం!

**అగ్రివేర్‌హౌసింగ్‌కు చెక్**

అగ్రివేర్‌హౌసింగ్ అండ్ కొలేటరల్ మేనేజ్‌మెంట్ సంస్థ 2024 డిసెంబర్‌లో దాఖలు చేసిన ప్రాస్పెక్టస్‌ను సెబీ తాజాగా వెనక్కి పంపింది. టెక్నాలజీ ఆధారిత అగ్రికల్చర్ సర్వీసులందించే కంపెనీ ఐపీవోలో భాగంగా రూ. 450 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయాలని భావించింది. వీటికి జతగా మరో 2.69 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచాలని ప్రణాళికలు వేసింది. వాటాదారుల్లో టెమాసెక్ 1.19 కోట్ల షేర్లు ఆఫర్ చేయనుంది. సాధారణ ఫైలింగ్ చేస్తే సెబీ అనుమతి పొందిన 12 నెలల్లోగా ఐపీవో చేపట్టవలసి ఉంటుంది.

## తుక్కు పాలసీతో ఆటో విడిభాగాల ధరలు తగ్గుతాయి

**కేంద్ర మంత్రి గడ్కరీ వెల్లడి**

న్యూఢిల్లీ: వాహన స్క్రాపేజీ (తుక్కు) పాలసీతో ఆటో విడిభాగాల ధరలు 30 శాతం మేర తగ్గే అవకాశం ఉందని కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. దీనితో వాహనాల రేట్లు సైతం తగ్గి, అంతిమంగా వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. నగరాల్లో, హైవేలపై చార్జింగ్ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ మరింత పెరుగుతుందని గడ్కరీ వివరించారు. దేశీయంగా లిథియం అయాన్ బ్యాటరీల రేట్లు కూడా తగ్గుతున్నాయని ఆయన చెప్పారు. అదానీ గ్రూప్, టాటా గ్రూప్ వంటి దిగ్గజాలు భారీ స్థాయిలో ఈ బ్యాటరీలను తయారు చేయబోతున్నాయన్నారు. జమ్మూ కశ్మీర్‌లో కనుగొన్న లిథియం నిల్వలతో కోట్ల కొద్దీ బ్యాటరీలను తయారు చేయొచ్చని మంత్రి చెప్పారు.



## ఎఫ్‌పీఐ పెట్టుబడులకు సెబీ దన్ను

**సమాచార వెల్లడిలో వెసులుబాటు**




ముంబై: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా సమాచార వెల్లడి విషయంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లకు (ఎఫ్‌పీఐలు) వెసులుబాటు కల్పించేలా నిర్ణయం తీసుకుంది. సమగ్ర సమాచార వెల్లడికి ప్రామాణికంగా తీసుకునే ఎఫ్‌పీఐల ఏయూఎం (నిర్వహణలోని ఈక్విటీ ఆస్తుల పరిమాణం) పరిమితిని రెట్టింపు చేసింది. ప్రస్తుతం ఈక్విటీ ఏయూఎం రూ. 25,000 కోట్లను దాటితే ఎఫ్‌పీఐలు సమగ్ర సమాచారాన్ని వెల్లడించవలసి ఉంటోంది. తాజా ప్రతిపాదనల ప్రకారం ఇకపై ఈ పరిమితి రూ. 50,000 కోట్లుగా ఉంటుంది. ఇది దాటితే ఇన్వెస్టర్లు, వాటాదారులు తదితర పూర్తి సమాచారాన్ని ఎఫ్‌పీఐలు వెల్లడించాల్సి ఉంటుంది. కొత్త చైర్మన్ తుహిన్ కాంత పాండే అధ్యక్షతన సమావేశమైన సెబీ బోర్డు ఈ ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసింది. ఇటీవల కొంతకాలంగా నగదు విభాగంలో లావాదేవీల పరిమాణం రెట్టింపునకు పైగా పెరిగిన నేపథ్యంలో సెబీ తాజా ప్రతిపాదనలను తెరపైకి తెచ్చింది.

### కేర్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు రూ.100 కోట్ల పన్ను నోటీసు

న్యూఢిల్లీ: కేర్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు రూ.104.77 కోట్ల డిమాండ్ నోటీసును 2020-21, 2021-22 సంవత్సరాలకు ఆదాయపన్ను శాఖ జారీ చేసింది. ముంబై సెంట్రల్ ఆఫీస్, ఆదాయపన్ను అసిస్టెంట్ కమిషనర్ నుంచి నోటీసు వచ్చినట్టు కేర్ హెల్త్ మాతృసంస్థ రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఆర్ఈఎల్) స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం అందించింది. ఆదాయ పన్ను శాఖ డిమాండ్ చేసినట్టుగా పన్ను చెల్లించాల్సి వస్తే, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ నిబంధనల మేరకు నడుచుకుంటుందని స్పష్టం చేసింది.

## టారిఫ్‌లపై ఆందోళన చెందొద్దు

- పోటీతత్వంపై ఫోకస్ పెట్టాలి
- కార్పొరేట్లకు గోద్రెజ్ అండ్ బాయిస్ చైర్మన్ జంషీద్ గోద్రెజ్ సూచన



న్యూఢిల్లీ: అమెరికా ప్రతీకార టారిఫ్‌లతో తలెత్తబోయే ప్రతికూల ప్రభావాల గురించి దేశీ కార్పొరేట్లు ఆందోళన చెందరాదని గోద్రెజ్ అండ్ బాయిస్ సీఎండీ జంషీద్ గోద్రెజ్ సూచించారు. దాని బదులు మరింతగా పోటీపడే సామర్థ్యాలను పెంచుకోవడంపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. పోటీతత్వాన్ని పెంపొందించుకునేందుకు భారతీయ తయారీ సంస్థలు, చైనా లాగా భారీ స్థాయిలో తయారీపై ఫోకస్ చేయాల్సి ఉంటుందని గోద్రెజ్ వివరించారు. తమ ఎగుమతులపై భారత్ విధిస్తున్న స్థాయిలోనే ఏప్రిల్ 2 నుంచి భారత్ ఎగుమతులపై తాము కూడా సుంకాలు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఈ అంశంపై వ్యాపారవర్గాల్లో ఆందోళన నెలకొంది. పలు భారతీయ కంపెనీలు అంతర్జాతీయంగా విజయవంతంగా కార్యకలాపాలు సాగిస్తున్నప్పటికీ స్థానిక కంపెనీలు తయారీ విషయంలో ఇంకా వెనుకబడి ఉన్నాయని గోద్రెజ్ చెప్పారు. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) తయారీ రంగ వాటా గణనీయంగా తగ్గిందని, దీన్ని స్థూల దేశీయోత్పత్తిలో నాలుగో వంతుకు పెంచుకోవాలన్న లక్ష్యం ఇంకా నెరవేరలేదని తెలిపారు.

## సేవలపై ఫిర్యాదుకు వేచి చూడాల్సిందే

- 2024లో 1500 కోట్ల గంటల కాలహరణం
- సర్వీస్‌నౌ కస్టమర్ ఎక్స్‌పీరియెన్స్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: ఏఐ ఏజెంట్లు, చాట్‌బాట్‌లు ఎన్ని కొత్త టెక్నాలజీలు వచ్చినా.. కస్టమర్ సేవల ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారం లభించడం లేదు. ఫిర్యాదు నమోదు చేయడానికే గంటలు, రోజుల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. 2024లో దేశీయ వినియోగదారులు సేవలపై ఫిర్యాదు నమోదు చేయడానికి వేచి చూసిన సమయం 1500 కోట్ల గంటలు. అంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ వివరాలను సర్వీస్ నౌ 'కస్టమర్ ఎక్స్‌పీరియెన్స్' నివేదిక వెల్లడించింది. కస్టమర్ల అంచనాలు, లభిస్తున్న సేవల మధ్య ఉన్న ఎంతో అంతరం ఉన్నట్టు ఈ నివేదిక గుర్తించింది. 5,000 మంది కస్టమర్లు, 204 మంది కస్టమర్ సేవల ఏజెంట్లను ప్రశ్నించి, వచ్చిన వివరాల ఆధారంగా ఫలితాలను విశ్లేషించింది.

**ఓపిక పట్టాల్సిందే..**

80 శాతం భారత వినియోగదారులు కనీస అవసరాలైన ఫిర్యాదుల స్థితిని తెలుసుకోవడం, ఉత్పత్తుల సిఫారసుల కోసం ఏఐ చాట్‌బాట్‌లపై ఆధారపడుతున్నారు. కస్టమర్లు అంతా కలసి ఇందుకోసం ఏటా 1500 కోట్ల గంటల సమయం వెచ్చిస్తున్నారు. 2023తో పోల్చితే 2024లో ఒక ఫిర్యాదు పరిష్కారానికి వేచి చూడాల్సిన సమయం 3.2 గంటలు తగ్గింది. అయినప్పటికీ కస్టమర్ల అంచనాలకు, లభిస్తున్న సేవలకు మధ్య ఎంతో అంతరం ఉంది. 39 శాతం కస్టమర్ల ఫిర్యాదులను హోల్డ్‌లో పెట్టడం, 36 శాతం ఫిర్యాదులను బదిలీ చేయడం కనిపించింది. ఫిర్యాదుల ప్రక్రియ ఎంతో కష్టంగా ఉందని 34 శాతం మంది వినియోగదారులు అభిప్రాయపడుతున్నారు. నాసిరకం సేవల కారణంగా బ్రాండ్లను మార్చడానికి 89 శాతం వినియోగదారులు సంసిద్ధత వ్యక్తం చేశారు. బలహీనమైన సేవలపై ఆన్‌లైన్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై ప్రతికూల అభిప్రాయాలను నమోదు చేస్తామని చెప్పారు. కస్టమర్ల సేవల్లో నెలకొన్న అంతరాన్ని తొలగించడానికి, వేగంగా పెరుగుతున్న కస్టమర్ల అవసరాలను తీర్చడానికి వీలుగా వ్యాపార సంస్థలు చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఈ నివేదిక తెలిపింది. ఏఐ ఆధారిత సామర్థ్యాలను పెంచుకోకుంటే కంపెనీలు కస్టమర్ల విశ్వాసాన్ని కోల్పోవాల్సి వస్తుందని సర్వీస్‌నౌ ఇండియా ఎండీ సుమీత్ మాథుర్ అన్నారు.

# జీడీపీ వృద్ధికి ఎస్అండ్‌పీ కోత

- 6.7 శాతం నుంచి 6.5 శాతానికి సవరణ
- టారిఫ్‌లు, ప్రపంచీకరణ తిరోగమనం ఫలితం
- దేశీ వినియోగం బలంగా ఉంటుందన్న అంచనా

న్యూఢిల్లీ: భారత జీడీపీ వృద్ధి అంచనాలను ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ తగ్గించింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26) 6.7 శాతం వృద్ధి నమోదవుతుందన్న గత అంచనాలను తాజాగా 6.5 శాతానికి సవరించింది. 2024-25 సంవత్సరం మాదిరే వృద్ధి అంచనాలను ఇస్తున్నట్టు ప్రకటించింది. వచ్చే రుతుపవనకాలం సాధారణంగా ఉంటుందని, కమోడిటీ, చమురు ధరలు కనిష్ఠ స్థాయిల్లోనే ఉంటాయన్న అంచనాల ఆధారంగా ఈ వృద్ధి రేటును ఇస్తున్నట్టు ఎస్అండ్‌పీ తెలిపింది. ద్రవ్యోల్బణం తగ్గడం, బడ్జెట్‌లో ప్రకటించిన పన్ను ప్రయోజనాలు, తక్కువ రుణ వ్యయాలు ఇవన్నీ భారత్‌లో విచక్షణారహిత వినియోగాన్ని పెంచుతాయని అంచనా వేసింది. ఆసియా పసిఫిక్ ప్రాంతంపై అమెరికా టారిఫ్‌ల పెంపు ప్రభావం, ప్రపంచీకరణ నుంచి వెనక్కి తగ్గడం వంటి సవాళ్లను ప్రస్తావించింది. అయినప్పటికీ వర్ధమాన దేశాల్లో చాలా వాటిల్లో దేశీ డిమాండ్ బలంగా కొనసాగుతుందని అంచనా వేసింది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో సెంట్రల్ బ్యాంక్‌లు ఈ ఏడాది అంతటా వడ్డీ రేట్లను తగ్గించొచ్చని పేర్కొంది.

**ఒక శాతం వరకు రేట్ల తగ్గింపు..**

"ఆర్‌బీఐ వడ్డీ రేట్లను మరో 0.75 శాతం నుంచి 1 శాతం వరకు ప్రస్తుత సైకిల్‌లో తగ్గించొచ్చు. ద్రవ్యోల్బణం తగ్గడం, తక్కువ చమురు రేట్ల ఫలితంగా ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ లక్షిత స్థాయి 4 శాతానికి సమీపంలో 2025-26లో ఉండొచ్చు" అని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ తన నివేదికలో వెల్లడించింది. బలమైన దేశీ డిమాండ్‌తో వర్ధమాన దేశాలు నిలదొక్కుకుంటాయని పేర్కొంది. దిగుమతులపై టారిఫ్‌లతో అమెరికా వృద్ధి తగ్గడమే కాకుండా, ద్రవ్యోల్బణం పెరుగుతుందని అంచనా వేసింది. దీంతో 2025లో యూఎస్ ఫెడ్ మరొక్కసారే 25 బేసిస్ పాయింట్ల మేర రేటు తగ్గించే అవకాశం ఉన్నట్టు తెలిపింది.





### రోడ్డు ప్రమాదాలతో జీడీపీకి నష్టం

**ఏటా 3 శాతం కోల్పోవాల్సి వస్తోంది: గడ్కరీ**

న్యూఢిల్లీ: దేశంలో ఏటా 5 లక్షల వరకు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని.. వీటి కారణంగా 3 శాతం జీడీపీని నష్టపోవాల్సి వస్తోందని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. యూఎస్-భారత్ భాగస్వామ్యంతో ఢిల్లీలో రహదారి భద్రతపై ఏర్పాటు చేసిన సమావేశంలో భాగంగా మంత్రి మాట్లాడారు. దేశానికి రహదారి ప్రమాదాలు అతి ముఖ్యమైన సమస్యగా ఉన్నట్టు చెప్పారు. ఏటా 4.80 లక్షల రహదారి ప్రమాదాల్లో 1.88 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నట్టు తెలిపారు. ఇందులో 10,000 మంది 18 ఏళ్లలోపు ఉంటుండడంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఇదొక ప్రధానమైన ప్రజారోగ్య సమస్యే కాకుండా, ఏటా 3 శాతం జీడీపీని నష్టపోవాల్సి వస్తుండడంపై ఆవేదన వ్యక్తం చేశారు. బలహీన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్‌లు) రహదారి ప్రమాదాలకు కారణాల్లో ఒకటిగా పేర్కొన్నారు. ఖర్చు ఆదా చేసుకోవడం, ప్రాజెక్టు నిర్మాణాలను సీరియస్‌గా తీసుకోకపోవడం కూడా కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు కారణమవుతున్నట్టు చెప్పారు. రహదారి ప్రమాద బాధితులకు సాయాన్ని ప్రోత్సహించేందుకు నగదు బహుమతి ఇవ్వనున్నట్టు చెప్పారు.

"ప్రమాద బాధితుల సాయానికి ముందుకు వచ్చే మూడో పక్ష వ్యక్తికి రూ.25,000 బహుమతి ఇవ్వాలని నిర్ణయించాం. ప్రమాదం లేదా ప్రమాదం అనంతరం ఎవరైనా ఆస్పత్రిలో చేరాల్సి వస్తే గరిష్ఠంగా రూ.1,50,000 లేదా ఏడేళ్ల పాటు చికిత్స వ్యయాలకు చెల్లింపులు చేయనున్నాం" అని మంత్రి గడ్కరీ వెల్లడించారు.

## జేఎస్‌పీఎల్, జిందాల్ పవర్‌కు బొగ్గు బ్లాకులు



న్యూఢిల్లీ: పదకొండో విడత బొగ్గు బ్లాకుల వేలంలో 10 కంపెనీలు .. బొగ్గు గనులను దక్కించుకున్నాయి. జిందాల్ స్టీల్ అండ్ పవర్ (జేఎస్‌పీఎల్), జిందాల్ పవర్, కోల్ ఇండియా విభాగం వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్, సింఘాల్ బిజినెస్, రుంగ్టా సన్స్, మైన్‌వేర్ అడ్వైజర్స్ తదితర సంస్థలు వీటిలో ఉన్నాయి. గతేడాది డిసెంబర్ 5న ప్రారంభించిన 11వ విడత బొగ్గు గనుల వేలం ప్రక్రియలో భాగంగా మొత్తం 12 గనులను విజయవంతంగా విక్రయించినట్లు బొగ్గు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వీటిల్లో పూర్తిగా మదింపు చేసిన బ్లాక్‌లు ఎనిమిది, పాక్షికంగా మదింపు చేసినవి నాలుగు ఉన్నట్లు పేర్కొంది. ఈ 12 గనుల్లో సుమారు 5,759 మిలియన్ టన్నుల నిల్వలు ఉంటాయని అంచనా. ఇవి రూ. 3,330 కోట్ల మేర వార్షికాదాయాన్ని తెచ్చిపెట్టగలవని (పాక్షికంగా మదింపు చేసినవి మినహాయిస్తే), సుమారు రూ. 2,319 కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలవని అంచనాలు ఉన్నాయి. ఇవి 20,902 ఉద్యోగాలు కల్పించనున్నాయి. 2020లో వాణిజ్యావసరాలకు బొగ్గును వెలికితీసే విధానాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి కేంద్రం 125 బొగ్గు గనులను వేలం వేసింది. వీటి మొత్తం వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 273 మిలియన్ టన్నులు. ఇవన్నీ కలిసి ఏటా రూ. 38,767 కోట్ల మేర ఆదాయాన్ని తెచ్చిపెట్టగలవని, రూ. 40,960 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు 4,69,170 మందికి ఉద్యోకావకాశాలు కల్పించగలవని అంచనాలు ఉన్నాయి.

## భారత ఆర్థిక వ్యవస్థ భేష్

- సమస్యలు, మహమ్మారిని తట్టుకుని నిలబడింది
- ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంక్ నివేదిక

ముంబై: భారత ఆర్థిక వ్యవస్థ వైవిధ్యంతో ఎంతో బలంగా ఉందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) తాజా నివేదిక తెలిపింది. వేగవంతమైన ఆర్థిక వృద్ధితో విపత్తును (కరోనా) తట్టుకుని నిలబడిందని పేర్కొంది. ప్రపంచబ్యాంక్‌తో కలసి ఐఎంఎఫ్ భారత ఆర్థిక వ్యవస్థపై సమగ్ర విశ్లేషణ చేసింది. ఈ నివేదికను విడుదల చేయగా ఆర్‌బీఐ దీన్ని స్వాగతిస్తున్నట్టు ప్రకటించింది. "భారత ఆర్థిక వ్యవస్థ 2010 తర్వాత ఎన్నో కష్టాలను అధిగమించింది. మహమ్మారిని తట్టుకుని నిలబడింది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థల రుణ వితరణ పెరిగింది" అని ఈ నివేదిక వివరించింది. తీవ్రమైన స్థూల ఆర్థిక వాతావరణంలోనూ మోస్తరు రుణ వితరణకు మద్దతుగా బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల వద్ద తగినన్ని నిధులున్నట్టు పేర్కొంది. ఎన్‌బీఎఫ్‌సీలకు సైతం బ్యాంకుల మాదిరే లిక్విడిటీ కవరేజీ రేషియో (ఎల్‌సీఆర్)ను అమలు చేయడాన్ని ప్రశంసించింది. రిస్కుల నివారణ, నిర్వహణ పరంగా అంతర్జాతీయ విధానాలకు అనుగుణంగా సెక్యూరిటీల మార్కెట్ నియంత్రణలు మెరుగుపడినట్టు పేర్కొంది. భారత బీమా రంగం సైతం బలంగా వృద్ధి చెందుతున్నట్టు తన నివేదికలో ప్రస్తావించింది.

**సైబర్ భద్రతా పర్యవేక్షణ**

బ్యాంకుల్లో వ్యవస్థలు, మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పరంగా భద్రతా చర్యలను సైతం ఐఎంఎఫ్ విశ్లేషించింది. బ్యాంక్‌లకు సంబంధించి అత్యాధునిక సైబర్ భద్రతా పర్యవేక్షణను భారత అధికారులు కలిగి ఉన్నట్టు తెలిపింది. స్ట్రెస్ టెస్ట్‌ల నిర్వహణ ద్వారా దీన్ని మరింత బలోపేతం చేయొచ్చని సూచించింది.

## క్వార్టర్ ఫైనల్లో అనాహత్, జోష్నా




ముంబై: జేఎస్‌డబ్ల్యూ ఇండియన్ ఓపెన్ కాపర్ లెవెల్ స్క్వాష్ టోర్నమెంట్‌లో భారత స్టార్ అనాహత్ సింగ్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో అనాహత్ 11–5, 9–11, 11–5, 11–2తో క్రిస్టినా గోమెజ్ (స్పెయిన్)పై విజయం సాధించింది. ఐదో సీడ్ జోష్నా చిన్నప్ప, టాప్ సీడ్ ఆకాంక్ష సాలుంఖే కూడా క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో జోష్నా 11–1, 11–7, 11–8తో సోఫియా మటియోస్ (స్పెయిన్)పై, ఆకాంక్ష 6–11, 11–8, 11–7, 11–4తో తన్వీ ఖన్నా (భారత్)పై గెలుపొందారు. పురుషుల సింగిల్స్‌లో వీర్ చోత్రాని (భారత్), అభయ్ సింగ్ (భారత్) కూడా క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. రెండో రౌండ్‌లో వీర్ 11–4, 10–12, 16–14, 11–6తో ఐదో సీడ్ సిమోన్ హెర్బర్ట్ (ఇంగ్లండ్)పై సంచలన విజయం సాధించగా... అభయ్ సింగ్ 11–5, 11–8, 11–7తో మెల్విల్ సియానిమనికో (ఫ్రాన్స్)ను ఓడించాడు. భారత నంబర్‌వన్, టాప్ సీడ్ రమిత్ టాండన్ 11–5, 11–1, 6–11, 4–11, 6–11తో అమీషెన్‌రాజ్ చందరన్ (మలేసియా) చేతిలో ఓడిపోయాడు.



# 2032 తర్వాత 'గాబా' కనుమరుగు



**బ్రిస్బేన్ ఒలింపిక్స్ తర్వాత క్రికెట్ స్టేడియం కూల్చివేత ● ఒలింపిక్స్ స్టేడియంలో తదుపరి క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణ**

బ్రిస్బేన్: ఆస్ట్రేలియాలోని ప్రఖ్యాత క్రికెట్ స్టేడియం 'గాబా' కనుమరుగు కానుంది. సుదీర్ఘకాలంగా ఎన్నో చిరస్మరణీయ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన బ్రిస్బేన్‌లోని 'గాబా' మైదానాన్ని 2032 ఒలింపిక్స్ తర్వాత కూల్చివేయనున్నారు. 2028 ఒలింపిక్స్‌కు లాస్ ఏంజెలిస్ ఆతిథ్యమిస్తుండగా... మరో నాలుగేళ్ల తర్వాత బ్రిస్బేన్ వేదికగా విశ్వక్రీడలు జరగనున్నాయి. దాని కోసం ఆస్ట్రేలియా ఇప్పటి నుంచే కసరత్తులు చేస్తోంది. ఇందులో భాగంగా... క్వీన్స్‌లాండ్ ప్రభుత్వం వేదికలపై కీలక నిర్ణయాలు తీసుకుంది. ఒలింపిక్స్ కోసం విక్టోరియా పార్క్‌లో 63 వేల మంది ప్రేక్షకుల సామర్థ్యంతో కూడిన నూతన అధునాతన స్టేడియం నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించింది. ఇందులోనే ఒలింపిక్స్ ఆరంభ, ముగింపు వేడుకలు నిర్వహించనున్నారు. విశ్వక్రీడలు ముగిసిన అనంతరం 'గాబా' మైదానాన్ని పూర్తిగా పడగొట్టి ఒలింపిక్స్ కోసం నిర్మించిన కొత్త స్టేడియంలోనే క్రికెట్ మ్యాచ్‌లు జరపనున్నారు. ఒకవేళ 2032 ఒలింపిక్స్ క్రీడల్లో క్రికెట్ మెడల్ ఈవెంట్‌గా కొనసాగితే క్రికెట్ ఈవెంట్ స్వర్ణ పతక పోరుకు మాత్రం పాత 'గాబా' మైదానమే ఆతిథ్యమివ్వనుంది. 'గాబా స్టేడియానికి ఎంతో చరిత్ర ఉంది. దశాబ్దాలుగా ఇక్కడ ఎన్నో మరపురాని మ్యాచ్‌లు జరిగాయి. ఆటగాళ్లకు, అభిమానులకు ఈ మైదానంతో ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి. అయితే భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఈ మైదానాన్ని కూల్చివేయనున్నారు. దీని స్థానంలో క్వీన్స్‌ల్యాండ్‌లో మరో కొత్త స్టేడియం సిద్ధమవుతుంది. అందులో ఐసీసీ ఈవెంట్‌లు, యాషెస్ సిరీస్, 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' వంటి ప్రతిష్టాత్మక మ్యాచ్‌లు యథావిధిగా జరుగుతాయి' అని క్వీన్స్‌ల్యాండ్ క్రికెట్ సీఈవో టెర్రీ స్వెన్సన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

- 1931 నుంచి టెస్టు మ్యాచ్‌లకు ఆతిథ్యమిస్తున్న 'గాబా' స్టేడియంలో ఇప్పటి వరకు 67 పురుషుల టెస్టు మ్యాచ్‌లు, 2 మహిళల టెస్టులు జరిగాయి.
- పేస్‌కు పెట్టింది పేరైన 'గాబా' పిచ్‌పై ఆస్ట్రేలియా జట్టు 1988 నుంచి 2021 వరకు ఒక్క టెస్టు మ్యాచ్ కూడా ఓడలేదు. 2020–21 పర్యటనలో భాగంగా ఆతిథ్య ఆస్ట్రేలియాపై టీమిండియా విజయం సాధించింది.
- 2032 ఒలింపిక్స్ ప్రణాళికల్లో భాగంగా 'గాబా' మైదానాన్ని ఆధునీకీకరించాలని తొలుత భావించారు. అయితే అధిక వ్యయం కారణంతో ఆ ప్రణాళికను పక్కన పెట్టి పార్క్‌ల్యాండ్ ఇన్నర్ సిటీలో కొత్త స్టేడియం నిర్మాణం చేపడుతున్నారు.
- ఒలింపిక్స్ ఆతిథ్య హక్కులు దక్కించుకున్న సమయంలో 'గాబా' మైదానాన్ని మరింత మెరుగు పరచాలని భావించినా... ఇప్పటికి నాలుగేళ్లు గడిచినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు.
- విశ్వక్రీడలకు మరో ఏడేళ్ల సమయమే ఉండటంతో కొత్త స్టేడియం నిర్మాణానికే మొగ్గుచూపారు.
- ఇటీవల ఐఓసీ అధ్యక్షురాలిగా ఎన్నికైన క్రిస్టీ కొవెంట్రీ ప్రణాళికల విషయంలో పక్కాగా ఉండటంతో... ఆస్ట్రేలియా ప్రభుత్వం వేదికల నిర్మాణాన్ని వేగవంతం చేసింది.

## సెమీస్‌లో సిమ్రన్



గ్రేటర్ నోయిడా: జాతీయ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పంజాబ్‌కు చెందిన సిమ్రన్‌జీత్ కౌర్ (65 కేజీలు) సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సిమ్రన్‌జీత్ 5–0తో ప్రాచీ (రైల్వేస్)పై ఏకపక్షంగా గెలిచింది. 29 ఏళ్ల సిమ్రన్‌జీత్ 2018 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం... 2019 ఆసియా చాంపియన్‌షిప్‌లో రజతం, 2021 ఆసియా చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించింది. 57 కేజీల విభాగంలో సర్వీసెస్ బాక్సర్ జైస్మీన్ లంబోరియా సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్లో జెస్మీన్ పంచ్‌ల ధాటికి తట్టుకోలేక ఆమె ప్రత్యర్థి హనా జాయ్ (తమిళనాడు) బౌట్ మధ్యలోనే వైదొలిగింది. 51 కేజీల విభాగంలో కలైవాణి (తమిళనాడు) 5–0తో దేవిక (మహారాష్ట్ర)పై, అనామిక హుడా (హరియాణా) 5–0తో మెహక్ ధారా (ఢిల్లీ)పై గెలిచారు.

## మూడో స్థానంలోనే స్మృతి, దీప్తి




దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మహిళల టి20 బ్యాటింగ్, బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్స్ స్మృతి మంధాన, దీప్తి శర్మ మూడో స్థానంలోనే కొనసాగుతున్నారు. మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో... బ్యాటింగ్ విభాగంలో స్మృతి మంధాన 753 పాయింట్లతో మూడో ర్యాంక్‌లో... బౌలింగ్ విభాగంలో దీప్తి శర్మ 737 పాయింట్లతో మూడో ర్యాంక్‌లో నిలిచారు. స్మృతి మినహా టాప్–10లో మరో భారత బ్యాటర్ లేకపోయినా... కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఒక స్థానం మెరుగుపర్చుకొని 11వ ర్యాంక్‌కు చేరుకుంది. జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ వరుసగా 15వ, 16వ స్థానాల్లో ఉన్నారు. ఆస్ట్రేలియాకు చెందిన బెత్ మూనీ 798 పాయింట్లతో 'టాప్' ర్యాంక్‌ను నిలబెట్టుకోగా... తాలియా మెక్‌గ్రాత్ (ఆస్ట్రేలియా; 756 పాయింట్లు) రెండో స్థానంలో కొనసాగుతోంది. బౌలింగ్ విభాగంలో భారత్‌కే చెందిన రేణుకా సింగ్ ఠాకూర్ ఒక స్థానం పడిపోయి ఐదో ర్యాంక్‌లో నిలిచింది. ఇంగ్లండ్ స్పిన్నర్ సోఫీ ఎకిల్‌స్టోన్ 756 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా... పాక్ బౌలర్ సాదియా ఇక్బాల్ 746 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది.




# నితిన్ చోటు పదిలం

**ఎలీట్ అంపైర్ల జాబితాను విడుదల చేసిన ఐసీసీ**



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) 2025–2026 సీజన్‌కుగాను 12 మందితో కూడిన ఎలీట్ అంపైర్ల ప్యానెల్ జాబితాను ప్రకటించింది. భారత్‌కు చెందిన నితిన్ మేనన్ తన స్థానాన్ని నిలబెట్టుకోగా... మైకేల్ గాఫ్ (ఇంగ్లండ్), జోయల్ విల్సన్ (ట్రినిడాడ్) చోటు కోల్పోయారు. మైకేల్ గాఫ్, జోయల్ విల్సన్ స్థానాల్లో అల్లావుద్దీన్ పాలేకర్ (దక్షిణాఫ్రికా), అలెక్స్ వార్ఫ్ (ఇంగ్లండ్) తొలిసారి ఎలీట్ అంపైర్ల జాబితాలోకి వచ్చారు. మధ్యప్రదేశ్‌కు చెందిన 41 ఏళ్ల నితిన్ 23 ఏళ్లకే అంపైర్‌గా మారాడు. ఇప్పటి వరకు నితిన్ పురుషుల విభాగంలో 30 టెస్టులు, 60 వన్డేలు, 50 టి20 మ్యాచ్‌ల్లో... మహిళల విభాగంలో 20 టి20 మ్యాచ్‌ల్లో అంపైర్‌గా విధులు నిర్వర్తించాడు. భారత్‌కే చెందిన జయరామన్ మదనగోపాల్‌కు ఎమర్జింగ్ అంపైర్ల ప్యానెల్‌లోకి ప్రమోషన్ లభించింది. 'ఎమర్జింగ్' జాబితాలో ఉన్న వారికి విదేశాల్లో జరిగే అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో కూడా అంపైరింగ్ చేసే అవకాశం లభిస్తుంది. తమిళనాడుకు చెందిన 50 ఏళ్ల జయరామన్ ఇప్పటి వరకు ఒక టెస్టు, 22 వన్డేలు, 42 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌ల్లో అంపైరింగ్ చేశారు.

**ఎలీట్ అంపైర్ల జాబితా:** నితిన్ మేనన్ (భారత్), కుమార్ ధర్మసేన (శ్రీలంక), రిచర్డ్ కెటిల్‌బరో (ఇంగ్లండ్), క్రిస్టోఫర్ గాఫ్నీ (న్యూజిలాండ్), అడ్రియన్ హోల్డ్‌స్టాక్ (దక్షిణాఫ్రికా), రిచర్డ్ ఇలింగ్‌వర్త్ (ఇంగ్లండ్), ఎహసాన్ రజా (పాకిస్తాన్), పాల్ రీఫెల్ (ఆస్ట్రేలియా), షర్ఫుద్దౌలా షాహిద్ (బంగ్లాదేశ్), రాడ్నీ టకర్ (ఆస్ట్రేలియా), అల్లావుద్దీన్ పాలేకర్ (దక్షిణాఫ్రికా), అలెక్స్ వార్ఫ్ (ఇంగ్లండ్).

# ఇంగ్లండ్ లయన్స్‌తో భారత్ 'ఎ' జట్టు రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌లు

**టెస్టు సిరీస్ ప్రారంభానికి ముందు నాలుగు రోజుల మ్యాచ్‌లు**


కరుణ్ నాయర్

న్యూఢిల్లీ: ఐపీఎల్ అనంతరం జరగనున్న ఇంగ్లండ్ పర్యటనకు బీసీసీఐ ప్రత్యేక ప్రణాళికలు వేస్తోంది. ఈ టూర్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో టీమిండియా 5 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడనుంది. 2007 తర్వాత ఇంగ్లండ్ గడ్డపై భారత జట్టు టెస్టు సిరీస్ గెలవలేదు. దీంతో ఈసారి మెరుగైన ఫలితం సాధించాలనే ఉద్దేశంతో టెస్టు సిరీస్ ఆరంభానికి ముందు ఇంగ్లండ్ లయన్స్ జట్టుతో భారత 'ఎ' టీమ్ రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడనుంది. ఎర్రబంతితో నాలుగు రోజుల పాటు సాగనున్న ఈ మ్యాచ్‌ల్లో ప్రధాన ఆటగాళ్లు కూడా బరిలోకి దిగే అవకాశాలున్నాయి. భారత్, ఇంగ్లండ్ మధ్య జూన్ 20 నుంచి హెడింగ్లే వేదికగా తొలి టెస్టు జరగనుంది. దానికంటే ముందే భారత 'ఎ' జట్టు ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. 'ఇంగ్లండ్ లయన్స్, భారత్ 'ఎ' జట్ల మధ్య మే 30న కాంటర్‌బరీలో తొలి ప్రాక్టీస్ మ్యాచ్ జరుగుతుంది. జూన్ 6 నుంచి నార్తంప్టన్‌లో రెండో మ్యాచ్ నిర్వహిస్తాం' అని ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) వెల్లడించింది. ప్రస్తుతం టీమిండియా ప్లేయర్లంతా ఐపీఎల్‌లో బిజీగా ఉన్నారు. మే 25 ఐపీఎల్ ఫైనల్ జరగనుండగా... ఆ తర్వాతే ఇంగ్లండ్ పర్యటన ప్రారంభం కానుంది.

**కరుణ్ నాయర్‌కు పిలుపు..**

దేశవాళీల్లో నిలకడగా రాణిస్తున్న సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్‌ను భారత్ 'ఎ' జట్టు తరఫున ఇంగ్లండ్‌కు పంపాలని బీసీసీఐ భావిస్తోంది. విదర్భ జట్టు రంజీ ట్రోఫీ చేజిక్కించుకోవడంలో కీలకపాత్ర పోషించిన కరుణ్ నాయర్.. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. 'జట్టును ప్రకటించేందుకు ఇంకా చాలా సమయం ఉంది. ఐపీఎల్ ప్లేఆఫ్స్‌కు ముందు ఆటగాళ్ల ఎంపికపై ఒక స్పష్టత వస్తుంది' అని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఇక సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో 'వైట్ వాష్'కు గురైన టీమిండియా... ఆ తర్వాత ఆస్ట్రేలియాతో 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లోనూ ఓటమి పాలైంది. దీంతో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది. ఇంగ్లండ్ పర్యటనతో టీమిండియా 2025–27 డబ్ల్యూటీసీ సైకిల్‌ను ప్రారంభించనుంది.

# నిలకడగా తమీమ్ ఆరోగ్యం

**విశ్రాంతి అవసరమన్న వైద్యులు**



ఢాకా: బంగ్లాదేశ్ మాజీ క్రికెట్ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. సోమవారం ఢాకా ప్రీమియర్ లీగ్ (డీపీఎల్) మ్యాచ్ ఆడుతున్న సమయంలో 36 ఏళ్ల తమీమ్‌కు గుండెపోటు వచ్చింది. దీంతో ఆస్పత్రికి తరలించగా... వైద్యులు ఏంజియోప్లాస్టీ నిర్వహించారు. ప్రస్తుతానికి అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని... మరో 48 గంటలు పర్యవేక్షణలో ఉండాలని వైద్యులు తెలిపారు. ఆ తర్వాత కూడా విశ్రాంతి అవసరమని వెల్లడించారు. 'అతడి గుండె పనితీరు మెరుగ్గానే ఉంది. అయితే ఎలాంటి చాన్స్ తీసుకోవాలనుకోవడం లేదు. తమీమ్ మా జాతీయ ఆస్తి. మరో రెండు మూడు రోజులు పర్యవేక్షణలో ఉంచుతాం' అని డాక్టర్ అబ్దుల్ వదూద్ అన్నారు. ప్రస్తుతానికి విశ్రాంతి అవసరమని... ఎలాంటి అంశాలకైనా అతిగా స్పందించకూడదని సూచించాడు. మూడు నెలల తర్వాత తమీమ్ తిరిగి క్రికెట్ ఆడొచ్చని పేర్కొన్నారు. మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్‌కు తమీమ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. సోమవారం షినెపుకూర్ జట్టుతో మ్యాచ్ సందర్భంగా అస్వస్థతకు గురికాగా... వైద్య సిబ్బంది ఏంజియోప్లాస్టీ నిర్వహించారు. క్లిష్ట సమయంలో అండగా నిలిచిన వారికి తమీమ్ ధన్యవాదాలు తెలిపాడు. 'ఆ దేవుడి దయ, మీ అందరి ప్రార్థనలతో తిరిగి బతికాను. ఇలాంటి మంచి మనుషుల మధ్య ఉండటం నా అదృష్టం. తోటివాళ్లకు అండగా నిలవడం చాలా గొప్ప విషయం. ప్రతి ఒక్కరూ ఇలాగే ఉండాలి. అందరికీ ధన్యవాదాలు' అని తమీమ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

## మహిళల ముక్కోణపు వన్డే టోర్నీ షెడ్యూల్‌లో మార్పులు

కొలంబో: శ్రీలంక వేదికగా జరగనున్న మహిళల ముక్కోణపు వన్డే టోర్నమెంట్ షెడ్యూల్‌లో మార్పులు సంభవించాయి. స్థానిక ఎన్నికల నేపథ్యంలో ముందుగా ప్రకటించిన షెడ్యూల్‌లో మార్పులు చేసినట్లు శ్రీలంక క్రికెట్ బోర్డు (ఎస్‌ఎల్‌సీ) మంగళవారం ప్రకటించింది. ఈ ముక్కోణపు టోర్నీలో భారత్, దక్షిణాఫ్రికా, శ్రీలంక జట్లు పాల్గొంటున్నాయి. ముందస్తు షెడ్యూల్ ప్రకారం మే 1, 4, 6, 8న మ్యాచ్‌లు జరగాల్సి ఉండగా... మే 6న స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మార్పులు చేశారు. కొత్త షెడ్యూల్ ప్రకారం మే 2, 4, 7, 9న మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో ఏప్రిల్ 27న ఆతిథ్య శ్రీలంకతో భారత మహిళల జట్టు తలపడుతుంది. ఏప్రిల్ 29న దక్షిణాఫ్రికాను భారత్ ఢీ కొటుంది. మే 4న శ్రీలంకతో, 7న దక్షిణాఫ్రికాతో భారత్ మ్యాచ్‌లు ఆడుతుంది. మూడు జట్లు నాలుగేసి మ్యాచ్‌లు ఆడనున్న ఈ టోర్నీ ఫైనల్ మే 11న కొలంబోలోని ప్రేమదాస అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతుంది.



# డాటిన్ లేకుండానే...

**మహిళల వన్డే వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ టోర్నీకి వెస్టిండీస్**

బ్రిడ్జ్‌టౌన్: వచ్చే నెలలో జరిగే మహిళల క్రికెట్ వన్డే వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ టోర్నీలో పాల్గొనే వెస్టిండీస్ జట్టును ప్రకటించారు. విండీస్ జట్టు స్టార్ ఆల్‌రౌండర్ డియాండ్ర డాటిన్ గాయం కారణంగా ఈ టోర్నీకి దూరమైంది. భారత్‌లో జరిగిన మహిళల ప్రీమియర్ లీగ్ టోర్నీ సందర్భంగా డాటిన్ గాయపడింది. గత ఏడాది టి20 వరల్డ్‌కప్‌లో డాటిన్ విండీస్ తరఫున టాప్ స్కోరర్‌గా నిలిచింది. 15 మంది సభ్యులతో కూడిన వెస్టిండీస్ జట్టుకు మరో ఆల్‌రౌండర్ హేలీ మాథ్యూస్ నాయకత్వం వహిస్తుంది. ఏప్రిల్ 9 నుంచి 19వ తేదీ వరకు పాకిస్తాన్‌లోని లాహోర్ నగరంలో ఈ టోర్నీ జరుగుతుంది. వెస్టిండీస్‌తోపాటు ఈ టోర్నీలో పాకిస్తాన్, స్కాట్లాండ్, బంగ్లాదేశ్, ఐర్లాండ్, థాయ్‌లాండ్ జట్లు పోటీపడనున్నాయి. ఈ టోర్నీలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెప్టెంబర్–అక్టోబర్‌లలో భారత్ వేదికగా జరిగే వన్డే వరల్డ్‌కప్ టోర్నీకి అర్హత సాధిస్తాయి.

**వెస్టిండీస్ జట్టు:** హేలీ మాథ్యూస్ (కెప్టెన్), షెర్మయిన్ క్యాంప్‌బెల్, అలియా అలెన్, అఫీ ఫ్లెచర్, చెర్రీ ఆన్ ఫ్రేజర్, షబీకా గజ్నబీ, జనీలియా గ్లాస్గో, చినెల్లీ హెన్రీ, జైదా జేమ్స్, కియానా జోసెఫ్, మాండీ మంగ్రూ, అష్మిని మునిసార్, కరిష్మా రాంహరాక్, స్టెఫానీ టేలర్, రషాదా విలియమ్స్.

# బంగ్లాదేశ్‌తో భారత్ మ్యాచ్ 'డ్రా'



షిల్లాంగ్: ఆసియా కప్–2027 క్వాలిఫయింగ్ టోర్నమెంట్ మూడో రౌండ్‌ను భారత జట్టు 'డ్రా'తో ప్రారంభించింది. బంగ్లాదేశ్ జట్టుతో మంగళవారం జరిగిన మ్యాచ్‌ను భారత్ 0–0తో 'డ్రా'గా ముగించింది. నిర్ణీత 90 నిమిషాల్లో రెండు జట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. తొలి అర్ధభాగంలో బంగ్లాదేశ్ దూకుడు ప్రదర్శించగా... రెండో అర్ధభాగంలో భారత్ జోరు కనబరిచింది. రెండు జట్లు గోల్స్ అవకాశాలు సృష్టించుకున్నా వాటిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమయ్యాయి. 68వ నిమిషంలో శుభాశీష్ బోస్, 81వ నిమిషంలో భారత కెప్టెన్ సునీల్ ఛెత్రి బంగ్లాదేశ్ గోల్‌పోస్ట్ లక్ష్యంగా కొట్టిన షాట్‌లు బయటకు వెళ్లాయి. గ్రూప్ 'సి'లో భారత్‌తోపాటు బంగ్లాదేశ్, హాంకాంగ్, సింగపూర్ జట్లున్నాయి. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను జూన్ 10న సింగపూర్‌తో ఆడుతుంది. గ్రూప్ 'సి'లో అగ్రస్థానంలో నిలిచిన జట్టు 2027 ఆసియా కప్ టోర్నీకి అర్హత సాధిస్తుంది.

## ఇజ్రాయెల్ దాడుల్లో మరో 23 మంది మృతి

దెయిర్ అల్–బలాహ్: ఇజ్రాయెల్ సైన్యం గాజాపై సోమవారం రాత్రి చేపట్టిన దాడు ల్లో మహిళలు, చిన్నారులు సహా మరో 23 మంది పాలస్తీనియన్లు అసువులు బాశారు. ఖాన్‌యూనిస్‌లోని మూడు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన దాడుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురితోపాటు మొత్తం 9 మంది చనిపోయారని నాసర్ ఆస్పత్రి వర్గాలు మంగళవారం ఉదయం తెలిపాయి. మరో చోట జరిపిన మూడు దాడుల్లో ఆరుగురు మృతి చెందారని, ఈ మృతదేహాలను సహాయక సిబ్బంది తమ ఆస్పత్రికి తీసుకు వచ్చినట్లు సెంట్రల్ గాజాలోని అల్ అక్సా ఆస్పత్రి సిబ్బంది వెల్లడించారు. నుసెయిరత్ శరణార్థి శిబిరంలోని శిబిరంపై జరిగిన దాడిలో మరో ముగ్గురు చనిపోయినట్లు ఔదా ఆస్పత్రి తెలిపింది. గాజాలోని నివాస భవనంపై ఇజ్రాయెల్ జరిపిన మరో వైమానిక దాడిలో ఐదుగురు తనువు చాలించగా, 12 మంది క్షతగాత్రులైనట్లు ఆరోగ్య విభాగం వెల్లడించింది.



దట్టంగా మంచు పేరుకుపోవడంతో అట్లాంటిక్ సముద్ర తీరాన్న ఉన్న గ్రీన్‌ల్యాండ్ రాజధాని నూక్ నగరం రాత్రి వేళ కెమెరా కంటికి ఇలా చిక్కింది.

# అమెరికాను వీడుతున్న శాస్త్రవేత్తలు

అమెరికా నుంచి శాస్త్రవేత్తలు నిష్క్రమిస్తున్నారు. పరిశోధనలకు నిధులను తగ్గించడంతోపాటు వర్క్ వీసాలపై నిబంధనలను కఠినతరం చేయడంతో విసుగు చెందిన పలువురు అగ్రశ్రేణి శాస్త్రవేత్తలు దేశం వీడే ఆలోచనలో ఉన్నారు. స్థిరమైన అవకాశాలున్న యూరప్, ఆస్ట్రేలియా, కెనడాలకు మకాం మార్చాలని వారు ఆలోచిస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఫ్రాన్స్, స్వీడన్ ప్రయత్నిస్తున్నాయి. శాస్త్రవేత్తలను తమ దేశాలకు స్వాగతిస్తున్నాయి.

### ప్రభుత్వ నిధుల కోతతో అనిశ్చితి

ట్రంప్ ప్రభుత్వం నేషనల్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఐహెచ్) వంటి ప్రముఖ పరిశోధనా సంస్థలకు వేల కోట్ల రూపాయల నిధులను నిలిపేయాలని నిర్ణయించింది. అమెరికా ఆతిథ్యం ఇస్తున్న 7,400 మంది విదేశీ స్కాలర్లకు ట్రంప్ ప్రభుత్వం నిధులను ఇప్పటికే నిలిపేసింది. దీంతో శాస్త్రవేత్తలకు అనిశ్చిత వాతావరణం నెలకొంది. వారు ఆర్థికంగా చితికిపోయారు. నిధుల నిలిపివేత కారణంగా కేన్సర్ వంటి వైద్య పరిశోధన సహా అంతరిక్ష పరిశోధన వంటి రంగాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడనుంది. ప్రభుత్వ నిర్ణయంపై 22 అమెరికా రాష్ట్రాల అటార్నీ జనరల్స్ ఇప్పటికే దావా వేశారు. యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (యూఎస్ఏఐడీ)లో మలేరియా పరిశోధనలో ఉన్న అమెరికన్ అలెక్స్ కాంగ్ ఫెలోషిప్‌ను ఫిబ్రవరిలో ఆకస్మికంగా రద్దు చేశారు. అమెరికా ఇకపై సైన్స్ లేదా ప్రజారోగ్య పరిశోధనలు చేయడానికి ఉత్తమమైన ప్రదేశం కాదని ఆయన ఇటీవల వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఆయన

### యూరప్ వెళ్లేందుకు సుముఖత

యూరప్‌కు వెళ్లే ఆలోచనలో ఉన్నారు. వీసా పొందడం కష్టమేనని ఆయన అన్నారు. అమెరికాలోని చాలా మంది పరిశోధకులది ఇదే పరిస్థితి. 'పరిశోధనలంటే నాకు ఇష్టం. కానీ అమెరికాలో ఇప్పుడందుకు అనుకూల పరిస్థితి లేదు' అని ప్రతిష్టాత్మక అమెరికన్ సంస్థలో కేన్సర్, జన్యుశాస్త్రంపై అధ్యయనం చేస్తున్న పోస్ట్ డాక్టోరల్ పరిశోధకుడు ఒకరు వ్యాఖ్యానించారు.

### తలుపులు తెరిచిన కెనడా, చైనా

కెనడా, చైనాలు కూడా పరిశోధకులకు తలుపులు తెరుస్తున్నాయి. అమెరికాకు చెందిన పరిశోధకులను ఆకర్షించేందుకు ఆస్ట్రేలియా, కెనడా, చైనా మార్గాలను అన్వేషిస్తున్నాయి. ఒక అడుగు ముందుకేసి ఆస్ట్రేలియన్ స్ట్రాటజిక్ పాలసీ ఇనిస్టిట్యూట్‌కు చెందిన డేనియల్ కేవ్... శాస్త్రవేత్తలను ఆకర్షించడానికి ఫాస్ట్ ట్రాక్ వీసాలను ప్రతిపాదించారు. అమెరికాతో టారిఫ్ వార్‌లో ఉన్న కెనడాకు ఇప్పటికే ఉన్నత విద్యా సంస్థలకు నిధుల కొరతను ఎదుర్కొం

### స్వాగతిస్తున్న యూరప్ దేశాలు

టోంది. పరిశోధకులకు పోటీ ప్యాకేజీలను అందించే సామర్థ్యం తక్కువే ఉన్నా.. అవకాశమివ్వాలని ఆలోచనలో ఉంది. చైనీస్–అమెరికన్ శాస్త్రవేత్తలను తిరిగి ఆహ్వానిస్తూ చైనా ఇప్పటికే ప్రకటన చేసింది. జాతీయ భద్రత ముసుగులో శాస్త్రీయ పరిశోధనా రంగాన్ని అమెరికా అస్తవ్యస్తం చేస్తోందని చైనా విమర్శించింది. చాలా మంది చైనీస్–అమెరికన్ శాస్త్రవేత్తలు అమెరికాలో తమ కెరీర్‌ను ఇక్కడే కొనసాగించాలా వద్దా అనే పునరాలోచనలో పడ్డారని, చైనాలో స్థిరపడాలనే ఆలోచనలో ఉన్నారని ఆస్ట్రేలియన్ స్ట్రాటజిక్ పాలసీ ఇనిస్టిట్యూట్ పేర్కొంది.

### చైనాలో బిగ్ ఏఐ న్యూస్!

పదేళ్ల పాటు అమెరికాలో పనిచేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దిగ్గజం డాక్టర్ గువో–జున్ క్వి తిరిగి చైనాకు రావాలని నిర్ణయించుకున్నారు! అతను అమెరికాను వదిలి చైనాకు వెళ్లడం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో రీసెర్చ్ ట్రెండ్స్‌కు పెద్ద మేల్కొలుపు అని మరో పరిశోధకుడు ఎక్స్‌లో పేర్కొన్నారు. అమెరికా వెలుపల పరిశోధకులు ఆప్షన్ల కోసం వెతుకుతున్నట్లు మీడియాలో వార్తలు, సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇది నిజంగా వలస అవుతుందా, అమెరికాపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది రాబోయే కొన్ని నెలల్లో తెలియనుంది.

### రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఇన్నాళ్లకు మేధో వలస

అమెరికాలో వలసలపై ఆంక్షలు విధించిన సమయంలో పరిశోధకుల నిష్క్రమణ జరగడం గమనార్హం. ఇక రెండో ప్రపంచ యుద్ధం తరువాత ఒక దేశం నుంచి మేధోవలసలు ఈ స్థాయిలో జరగడం ఇదేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత, అమెరికా తన శాస్త్రీయ, పారిశ్రామిక కార్యక్రమాలను పెంచడానికి కొత్త గుర్తింపు పత్రాలను అందించింది. జర్మన్, ఆస్ట్రియన్ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులకు పునరావాసం కల్పించింది. అయితే ఇప్పుడు అందుకు విరుద్ధంగా జరుగుతోందని స్థానిక అమెరికన్ సమాజం ఆవేదన వ్యక్తం చేసింది. శాస్త్రవేత్తల వలసలపై ఇంటర్నెట్‌లో పలువురు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ''ప్రపంచంలో అతిపెద్ద సమస్యలను అమెరికానే పరిష్కరించింది. అలాంటిది ఇప్పుడు శాస్త్రవేత్తలను పట్టించుకోవడం మానేసింది. డేటాను తుడిచిపెట్టేస్తోంది. పరిశోధనలను రద్దు చేసింది. తమ ఉద్యోగాలను కాపాడుకోవాలంటే కొన్ని పదాలను ఉపయోగించలేమని నిపుణులు చెబుతున్నారు. బెస్ట్ మైండ్స్ అమెరికా నుంచి వెళ్లిపోతున్నాయి'' అని ఓ వ్యక్తి ఎక్స్‌లో రాశాడు.

### స్వాగతించేందుకు యూరప్ సన్నాహాలు

అమెరికాను వీడుతున్న శాస్త్రవేత్తలకు సహాయం చేయాలంటూ పలువురు అమెరికన్ చట్టసభల సభ్యులు, సభ్యదేశాలు, కంపెనీలు యురోపియన్ కమిషన్‌ను కోరినట్లు వార్తలొచ్చాయి. అమెరికాలోని వాతావరణం స్వతంత్ర పరిశోధకుల పరిశోధనలకు నిరుత్సాహం కలిగిస్తోందని యురోపియన్ పరిశోధనా మండలి అధ్యక్షురాలు మారియా లెప్టిన్ అన్నారు. పలువురు శాస్త్రవేత్తలు, పరిశోధకుల భవిష్యత్ అగమ్యగోచరంగా ఉందన్నారు. ఫ్రాన్స్, స్వీడన్, కెనడా వంటి దేశాలు అమెరికాను వీడాలనుకుంటున్న అగ్రశ్రేణి పరిశోధకులను తమ దేశాలకు రప్పించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇక్కడి బలమైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ, ఉన్నతస్థాయి జీవన ప్రమాణాలు, వృత్తి,వ్యక్తిగత జీవితాల మధ్య సమతుల్యం, సాంస్కృతిక చైతన్యాన్ని చూపించి ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. ఇక్కడికి వచ్చే పరిశోధకులకోసం నిధులను రెట్టింపు చేయాలని కమిషన్ అధ్యక్షుడు వాన్ డెర్ లేయన్ యురోపియన్ రీసెర్చ్ కౌన్సిల్‌కు పిలుపునిచ్చారు. బ్రిటన్‌కు చెందిన కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ఇప్పటికే బయో మెడిసిన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాల్లో అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలను నియమించుకునేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ విషయాలను కేంబ్రిడ్జ్ వైస్ ఛాన్స్‌లర్ దెబోరా ప్రింటిస్ వెల్లడించారు. అమెరికా ప్రతిభావంతులకు ఫ్రెంచ్ విశ్వవిద్యాలయం 'సైంటిఫిక్' ఆశ్రయం కల్పిస్తోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

## కశ్మీర్‌లో వేర్పాటువాదం గత చరిత్ర కానుంది

### అమిత్ షా వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఏకీకృత విధానాలు సత్ఫలితాలనిస్తున్నాయని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. జమ్మూకశ్మీర్ నుంచి వేర్పాటువాదాన్ని తరిమేశామన్నారు. అక్కడి వేర్పాటువాదం గత చరిత్రగా మిగిలిపోనుందని వ్యాఖ్యానించారు. తాజాగా, జమ్మూకశ్మీర్‌లోని వేర్పాటువాద పార్టీల కూటమి హురియత్ కాన్ఫరెన్స్‌తో మూడు పార్టీలు తెగదెంపులు చేసుకున్నాయని అమిత్ షా ప్రకటించారు. ఇది ఐక్య భారత్‌కు మరింత బలాన్నిచ్చే పరిణామమని ఆయన 'ఎక్స్'లో తెలిపారు. అంతకుముందు, హురియత్ కాన్ఫరెన్స్ నుంచి వైదొలుగుతున్నట్లు జమ్మూకశ్మీర్ పీపుల్స్ మూవ్‌మెంట్(జేకేపీఎం)చైర్‌పర్సన్ షాహిద్ సలీం ప్రకటించారు. భారతదేశం, రాజ్యాంగానికి బద్ధుడనై ఉంటానని ప్రకటించారు. ఇకపై జేకేపీఎం హురియత్, ఇతర వేర్పాటువాద గ్రూపులతో ఎటువంటి సంబంధాలు పెట్టుకోబోదని స్పష్టం చేశారు. ఈ గ్రూపులు కశ్మీర్ ప్రజల న్యాయబద్ధమైన ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడం లేదని ఆయన ఆరోపించారు. శ్రీనగర్‌లోని గుల్బర్గ్ కాలనీకి చెందిన మరో నేత, లాయర్ మహ్మద్ షఫీ రేషీ కూడా హురియత్ కాన్ఫరెన్స్ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. 2017 వరకు జమ్మూకశ్మీర్ డెమోక్రాటిక్ పొలిటికల్ మూవ్‌మెంట్‌కు ఈయన అధ్యక్షుడిగా పనిచేశారు. వేర్పాటువాద గ్రూపులకు ఇక నుంచి దూరంగా ఉంటానని స్పష్టం చేశారు. భారత పౌరుడిగా, చట్టానికి లోబడి పనిచేస్తానని చెప్పారు. మహ్మద్ షరీఫ్ సర్తాజ్ సారథ్యంలోని జమ్మూకశ్మీర్ ఫ్రీడం మూవ్‌మెంట్ కూడా హురియత్‌ను వీడుతున్నట్లు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్ సారథ్యంలోని హురియత్ కాన్ఫరెన్స్‌లోని అవామీ యాక్షన్ కమిటీ, జమ్మూకశ్మీర్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అనే గ్రూపులపై ఉపా చట్టం కింద ఐదేళ్ల నిషేధం విధించింది.

# ఆ నిర్దోషికి భారీ నష్టపరిహారం

### జపాన్ కోర్టు సంచలన తీర్పు




హకమట

టోక్యో: హత్యల కేసులో ఓ వ్యక్తికి మరణ శిక్ష పడింది. దాదాపు 50 ఏళ్లు గడిచినా ఆ శిక్ష అమలు కాలేదు. కేసు పునర్విచారణ అనంతరం గతేడాది 89 ఏళ్ల వయస్సులో కోర్టు ఆయన్ను నిర్దోషిగా విడుదల చేసింది. మానసికంగా ఆయన తీవ్రంగా దెబ్బతినడంతో జైలులో పడిన వేదనకు ప్రతిఫలంగా రూ. 12.41 కోట్లు చెల్లించాలని తాజాగా ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. జపాన్‌లోనే కాదు ప్రపంచ క్రిమినల్ కేసుల చరిత్రలో ఇదే అత్యంత భారీ నష్ట పరిహారంగా చెబుతున్నారు. 1966లో టోక్యోకు పశ్చిమాన ఉన్న షిజౌకాలోని ప్రాసెసింగ్ ప్లాంట్‌లో ఇవావో హకమట అనే వ్యక్తి పనిచేసేవారు. ఒక రోజు ఆ ప్లాంట్ యజమాని, భార్య, ఇద్దరు పిల్లలు వారి ఇంట్లో హత్యకు గురయ్యారు. రూ.కోటి వరకు నగదు మాయమైంది. నలుగురూ కత్తిపోట్లతోనే మరణించినట్లు తేల్చారు. ఇందుకు హకమటాయే కారణమని ఆరోపణలొచ్చాయి. తనకేపాపం తెలియదని హకమట వాదించారు. అయినా అధికారులు వినిపించుకోలేదు. జైలులో ఆయన్ను చిత్ర హింసలు పెట్టారు. రోజుకు 12 గంటలపాటు ఆయన్ను విచారించారు. తట్టుకోలేక ఆ నేరం తానే చేసినట్లు హకమట ఒప్పుకున్నారు. 1968లో కోర్టు ఆయనకు మరణ శిక్ష విధించింది. తన సోదరుడు అమాయకుడంటూ సోదరి హిడెకు అప్పటి నుంచి, గత 56 ఏళ్లుగా న్యాయం పోరాటం సాగిస్తూనే ఉన్నారు. హతుల దుస్తుల్లో లభ్యమైన డీఎస్ఏ తన సోదరుడిది కాదని తెలిపారు. ఈ కేసులో ఇరికించేందుకు ఉద్దేశపూర్వకంగానే అతడికి సంబంధించిన ఆధారాలను అక్కడ ఉంచి ఉంటారని ఆమె అంటున్నారు. ఆమె సుదీర్ఘ పోరాటం ఫలించింది. కేసును తిరిగి విచారించేందుకు 2014లో న్యాయస్థానం అంగీకరించింది. హకమట కేసు అత్యంత ప్రముఖ న్యాయ పోరాటంగా మారింది. గత సెప్టెంబర్‌లో షిజౌకా కోర్టు హకమటను విడుదల చేస్తూ తీర్పు వెలువరించింది. కోర్టు వద్ద వందలాదిగా గుమికూడిన జనం హకమటను నిర్దోషిగా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. మానసికంగా తీవ్రంగా దెబ్బతిన్న హకమట ఇప్పుడు 91 ఏళ్ల తన సోదరి సంరక్షణలో ఉన్నారు. అందుకే విచారణ నుంచి కోర్టు ఆయనకు మినహాయించింది. సోమవారం ఈ కేసును విచారించిన జడ్జి కుని కోషి... హకమట దాదాపు 47 ఏళ్లపాటు జైలులో అత్యంత తీవ్రమైన మానసిక, శారీరక వేదనను అనుభవించారని పేర్కొన్నారు. అందుకు గాను రూ.12.41 కోట్లు పరిహారంగా చెల్లించాలని జైలు అధికారులను ఆదేశించారు.

# మరో వీడియోతో ముందుకొచ్చిన కమ్రా

- తాను ప్రోగ్రామ్ చేసిన స్టూడియోను కూల్చడాన్ని తప్పుబట్టిన స్టాండప్ కమేడియన్
- యాక్షన్‌కు రియాక్షన్ ఉంటుంది: షిండే



ముంబై/న్యూఢిల్లీ: మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి, గతంలో శివసేన పార్టీని చీల్చిన ఏక్‌నాథ్ షిండేను ఒక పేరడి పాట ద్వారా గద్దార్(ద్రోహి) అని పరోక్షంగా పోల్చిన స్టాండప్ కమేడియన్ కునాల్ కమ్రా మరోసారి వివాదాస్పద పాట పాడారు. గతంలో 'దిల్‌తో పాగల్ హై'హిందీ చిత్రంలోని ఓ సినీ గీతంలోని చరణాలను రాజకీయాలకు అనుగుణంగా మార్చిపాడిన కునాల్ కమ్రా ఈసారి 'హమ్ హోంగే కన్యాబ్'పాటను 'హమ్ హోంగే కంగాల్'గా మార్చి పాడిన వీడియోను షేర్‌చేశారు. ఈ వీడియోలో ఆయన పాడుతున్నట్లు, మధ్య మధ్యలో యూనికాంటినెంటల్ హోటల్‌లోని హాబిటాట్ కామెడీ స్టూడియోను శివసేన కార్యకర్తలు ధ్వంసం చేయడం, తన దిష్టిబొమ్మను దగ్ధంచేసిన దృశ్యాలను చూపించారు. విమర్శించే, బెదిరించే శివసేన నేతలను నాథూరాం గాడ్సే, స్వయం ప్రకటిత గురువు ఆశారాంలు బుద్ధిచెప్పాలని పాడారు. 'హమ్ హోంగే కంగాల్ ఏక్ దిన్, మన్ మే హై అంధ్‌విశ్వాస్, దేశ్ కా సత్యానాశ్(మనమంతా ఓ రోజు పేదలమైపోతాం. అప్పుడు మనలో అంధ విశ్వాసాలు గూడుకట్టుకుపోతాయి. దేశంలో విధ్వంసం దిశలో పయనిస్తుంది) అని అర్థం వచ్చేలా పాడారు. మరో నగరంలో స్టాండప్ కామెడీ చేసిన సందర్భంగా ఈ పాట పాడినట్లు తెలుస్తోంది. 'వికసిత భారత్ కోసం మరో గీతం'అంటూ ఈ పాటను ఆయన పాడారు. షిండేపై జోక్ చేసినందుకు నమోదైన కేసులో విచారణ సందర్భంగా తమ ఎదుట హాజరవ్వాలని కమ్రాను ముంబై పోలీసులు కోరిన కొద్దిసేపటికే ఈ వీడియో బహిర్గతం కావడం గమనార్హం. డిప్యూటీ సీఎంపై పేరడీపాట పాడారని ఆరోపిస్తూ మహారాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పోలీసులు కేసు నమోదుచేయగా తదుపరి దర్యాప్తు కోసం కేసును ఖర్ పోలీసులకు అప్పగించారు.

#### సారీ చెప్పే ప్రసక్తే లేదు

షిండేపై పాటకు క్షమాపణ చెప్పాలంటూ శివసేన కార్యకర్తల నుంచి డిమాండ్లు, బెదిరింపులు పెరిగిన నేపథ్యంలో కమ్రా స్పందించారు. ''అల్లరిమూక ఒత్తిళ్లకు తలొగ్గబోను. క్షమాపణలు చెప్పను. నేను ఎక్కడా దాక్కోను. సమస్య సద్దుమణిగేదాకా ఎక్కడికీ పారిపోను''అని కమ్రా వ్యాఖ్యానించారు.

#### స్పందించిన షిండే

జోక్‌పై షిండే మంగళవారం మౌనం వీడారు. వ్యంగ్యాన్ని తాను అర్థం చేసుకోగలనని, కాని దానికీ ఓ హద్దుంటుందని అసహనం వ్యక్తం చేశారు. శివసేన కార్యకర్తలు స్టూడియోను ధ్వంసం చేయడాన్ని సమర్థించారు. చర్యకు ప్రతిచర్య ఉంటుందన్నారు. ''ఎవరైనా తమ తమ స్థాయిల్లో మాట్లాడాలి. లేదంటే చర్యకు ప్రతి చర్య ఉంటుంది. భావ ప్రకటనా స్వేచ్ఛ ఉండాల్సిందే. కానీ.. అది ఒకరికి వ్యతిరేకంగా మాట్లాడేందుకు మరొకరి నుంచి సుపారీ తీసుకున్నట్లు ఉండొద్దు''అని షిండే అన్నారు.

#### ఏమిటీ వివాదం?

ముంబైలో హాబిటాట్ స్టూడియోలో తన ప్రదర్శనకు సంబంధించిన వీడియోను కునాల్ కమ్రా షేర్ చేశారు. 2022 శివసేన తిరుగుబాటును 1997 బాలీవుడ్ హిట్ సాంగ్ 'దిల్ తో పాగల్ హై'కి పేరడీ పాడిన ఆయన.. సేనను చీల్చిన షిండేను గద్దార్ (ద్రోహి)గా అభివర్ణించారు. కమ్రా వ్యాఖ్యల క్లిప్ వైరల్ కావడంతో శివసేన కార్యకర్తలు షో జరిగిన హాబిటాట్ కామెడీ క్లబ్‌ను ధ్వంసం చేశారు. కమ్రాపై పరువు నష్టం కేసు నమోదు చేసిన పోలీసులు.. స్టూడియోను ధ్వంసం చేసినందుకు కార్యకర్తలపై కేసు పెట్టారు. అనుమతిలేకుండా బేస్‌మెంట్‌లో కట్టిన స్టూడియోలోని కొంత నిర్మాణాన్ని బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సోమవారం కూల్చేశారు.

## పాస్‌పోర్టు మర్చిపోయిన పైలట్

శాన్ ఫ్రాన్సిస్కో: విమానంలో ప్రయాణించే ప్రయాణికులకే కాదు.. విమానం నడిపించే పైలట్‌కు కూడా పాస్‌పోర్టు ఉండాల్సిందే. లేకపోతే ఇబ్బందులు తప్పవు. అలాంటి ఇబ్బందే ప్రయాణికులకు అనుభవంలోకి వచ్చింది. ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరిన విమానం పైలట్ పాస్‌పోర్టు మర్చిపోవడంతో వెనక్కి మళ్లింది. అసలేం జరిగిందో తెలియక ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. అసలు విషయం తెలుసుకొని ఊపిరి పీల్చుకున్నారు. ఈ నెల 22వ తేదీన ఈ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. అమెరికాలోని లాస్ ఏంజెలెస్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి యునైటెడ్ ఎయిర్‌లైన్స్ విమానం 257 మంది ప్రయాణికులతో మధ్యాహ్నం చైనాలోని షాంఘైకి బయలుదేరింది. టేకాఫ్ అయిన 2 గంటల తర్వాత పైలట్ వద్ద పాస్‌పోర్టు లేదని గుర్తించారు. అతడు పాస్‌పోర్టు ఇంట్లో మర్చిపోయి వచ్చాడు. దీంతో చేసేది లేక ఎయిర్‌పోర్టు అధికారుల ఆదేశాల మేరకు విమానాన్ని వెనక్కిమళ్లించాడు. యూ–టర్న్ తీసుకున్న విమానం సాయంత్రం 5 గంటలకు మళ్లీ లాస్ ఏంజెలెస్ ఎయిర్‌పోర్టులో ల్యాండయ్యింది. ప్రయాణికుల కోసం అధికారులు మరో విమానాన్ని, పైలట్‌ను సిద్ధం చేశారు. రాత్రి 9 గంటలకు అది టేకాఫ్ అయ్యింది. 12 గంటలు ప్రయాణించి ఎట్టకేలకు షాంఘైకి చేరుకుంది. పైలట్ వద్ద పాస్‌పోర్టు లేకపోవడంతో విమానాన్ని వెనక్కి మళ్లించిన సంగతి నిజమేనని యునైటెడ్ ఎయిర్‌లైన్స్ అధికార ప్రతినిధి నిర్ధారించారు. లాస్ ఏంజెలెస్‌లో ల్యాండైన వెంటనే ప్రయాణికులకు ఆహార కూపన్లు, పరిహారం అందించామని చెప్పారు. ఒక్కో కూపన్ విలువ 15 డాలర్లు(రూ.1,283) అని తెలిపారు.

## ఉదయం గర్ల్‌ఫ్రెండ్. సాయంత్రం మరొకరు

### ఒకే రోజు రెండు పెళ్లిళ్లు చేసుకున్న ఘనుడు

లక్నో: ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ యువకుడు ఒకే రోజు రెండు పెళ్లిళ్లు చేసుకున్నాడు. ప్రియురాలి మెడలో ఉదయం తాళికట్టిన అతడు..పెద్దలు కుదిర్చిన యువతితో సాయంత్రం ఏడడుగులు నడిచాడు. మోసపోయినట్లు తెలుసుకున్న ప్రియురాలు పోలీసులను ఆశ్రయించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. గోరఖ్‌పూర్ జిల్లా హర్పూర్ బుధాట్ ప్రాంతంలో చోటుచేసుకుందీ ఘటన. ఓ యువకుడు నాలుగేళ్లుగా ఓ యువతితో సంబంధం నెరుపుతున్నాడు. ఈ క్రమంలో యువతి గర్భం దాల్చగా రెండుసార్లు అబార్షన్ చేయించాడు. ఒకసారి గుడిలో కూడా పెళ్లి చేసుకున్నాడు. ఆతర్వాత గర్భం దాల్చడంతో డెలివరీ కోసం ఆస్పత్రికి తీసుకెళ్లాడు. జన్మించిన బిడ్డను నర్సుకు అప్పగించాడు. రిజిస్టర్ ఆఫీసులో పెళ్లి చేసుకుంటే తన కుటుంబం కూడా ఒప్పుకుంటుందని నమ్మబలికాడు. ఒక రోజు ఉదయం రిజిస్టర్ ఆఫీసుకు తీసుకెళ్లి, తాళి కట్టాడు. అదే రోజు రాత్రి పెద్దలు కుదిర్చిన విధంగా సంప్రదాయబద్ధంగా మరో యువతిని పెళ్లాడాడు. విషయం తెలిసి అక్కడికి వెళ్లిన బాధితురాలిని అతడి కుటుంబీకులు దూషించి, వెళ్లగొట్టారు. దీంతో, ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీనియర్ పోలీస్ అధికారి జితేంద్ర కుమార్ తెలిపారు.

## 'ఉపాధి' నిర్వీర్యంపై రాహుల్, ప్రియాంక నిరసన

సాక్షి, న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎన్‌జీఎన్ఆర్‌జీఈఎస్)ను బీజేపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా ఆరోపించారు. మంగళవారం వీరు పార్లమెంట్ ప్రాంగణం వెలుపల కేరళ ఎంపీలతో కలిసి నిరసనలో పాల్గొన్నారు. పథకంపై కేంద్రం నిర్లక్ష్య ధోరణి లక్షలాది కుటుంబాల జీవనోపాధిని దెబ్బతీసిందన్నారు. పేదరికం వారి బాధలను మరింత పెంచిందని ప్రియాంక 'ఎక్స్'లో ఆరోపించారు. ఈ సంక్షోభంపై తక్షణ దృష్టి పెట్టి, దీర్ఘకాలంగా బకాయి ఉన్న వేతనాలు విడుదల చేసి బాధిత కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని తట్టుకోవడానికి వేతనాల పెంపు చాలా అవసరమని, పనిదినాలను 150 రోజులకు పెంచాలని కోరారు. ఇదే అంశమై కాంగ్రెస్ నేతలు కేసీ వేణుగోపాల్, శశిథరూర్ మాట్లాడుతూ, 'చట్టంలోని నిబంధనల మేరకు వేతనాల విడుదలలో జాప్యం 15 రోజులకు మించి ఉంటే వాటికి వడ్డీని చెల్లించాలని కోరారు. దీనిపై కేంద్ర మంత్రి నుంచి స్పష్టమైన సమాధానం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## యూఎస్ పోస్ట్‌మాస్టర్ జనరల్ రాజీనామా

### మస్క్‌తో విభేదాలే కారణం

వాషింగ్టన్: డిపార్టుమెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ(డోజ్)చీఫ్ ఎలాన్ మస్క్‌తో విభేదాల నేపథ్యంలో యూఎస్ పోస్ట్ మాస్టర్ జనరల్ లూయిస్ డిజాయ్ రాజీనామా చేశారు. తన శాఖకు సంబంధించిన సమస్త సమాచారాన్ని అందివ్వాలన్న మస్క్ నిర్దేశాలను ఆయన ఖాతరు చేయలేదని ఇటీవల వార్తలు వచ్చాయి. నష్టాలను తగ్గించేందుకు యూఎస్ పోస్టల్ సర్వీస్‌ను ప్రైవేటీకరించాలని అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయించుకున్నారు. ఈ విభాగాన్ని కామర్స్ విభాగంలో ఆధ్వర్యంలో ఉంచాలని ప్రకటించారు కూడా. రిపబ్లికన్ పార్టీకి విరాళాలిచ్చే ప్రముఖుల్లో ఒకరైన లూయిస్‌ను ట్రంప్ మొదటి సారి అధ్యక్ష పదవి చేపట్టినప్పుడు 2020లో యూఎస్‌పీఎస్ చీఫ్‌గా నియమించారు. డోజ్ సిఫారసుతోనే పోస్టల్ శాఖలో కనీసం 10 వేల మందిని తొలగించేందుకు ఈ నెల ప్రారంభంలోనే లూయిస్ అంగీకరించారు. ఇతర మార్పులను కాంగ్రెస్ ద్వారా చేయాలని ఆయన వాదిస్తున్నారు. ఈ విషయంలో మస్క్‌తో తలెత్తిన విభేదాల నేపథ్యంలోనే ఆయన రాజీనామా చేసినట్లుగా భావిస్తున్నారు.

## రంజాన్ వేళ సౌగత్-ఇ- మోదీ

న్యూఢిల్లీ: రంజాన్ పండుగను పురస్కరించుకుని మైనారిటీ వర్గాలకు చేరువయ్యేందుకు బీజేపీ కొత్తగా సౌగత్–ఇ–మోదీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా ముస్లిం మహిళలకు తినుబండారాలు, బట్టలను బీజేపీ పంపిణీచేయనుంది. సౌగత్–ఇ–మోదీ కార్యక్రమంలో భాగంగా ముస్లింలకు మాత్రమేకాకుండా ఇతర మైనారిటీల్లో ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు ఈ తరహా కిట్‌లను అందజేస్తామని బీజేపీ ప్రకటించింది. సౌగత్–ఇ–మోదీని మంగళవారం బీజేపీ మైనారిటీ మోర్చా జాతీయ అధ్యక్షుడు జమాల్ సిద్ధిఖీ ఢిల్లీలో ప్రారంభించారు.

## సూడాన్‌లో సైన్యం దాడి.. 54 మంది మృతి

కైరో: సూడాన్‌లోని పశ్చిమప్రాంతంలో జరిగిన వైమానిక దాడుల్లో కనీసం 54 మంది చనిపోయారు. నార్త్ దార్ఫుర్ ప్రావిన్స్‌లోని టోరా గ్రామంలో జరిగే సంతపై సోమవారం ఈ దాడి చోటుచేసుకుంది. దాడి తీవ్రతకు పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. మృతుల్లో సగానికిపైగా మహిళలు ఉన్నట్లు చెబుతున్నారు. అయితే, తాము పౌరులపై దాడి చేయలేదని సైన్యం అంటోంది. సైన్యం ఆధీనంలోనే టోరా ఉంది. అయితే, పారా మిలటరీ బలగాల దాడులు ఇక్కడ సర్వసాధారణంగా మారాయని బాధితుల సహాయక బృందాలు అంటున్నాయి.

## సంపన్నుల దళారీ శివరాజ్‌సింగ్ చౌహాన్

### తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ ధ్వజం

న్యూఢిల్లీ: కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కేవలం సంపన్నుల దళారీగా పని చేస్తున్నారని, పేదలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని పశ్చిమ బెంగాల్‌కు చెందిన టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ మండిపడ్డారు. పేదలను పక్కనపెట్టి, బడాబాబుల సేవల్లో మునిగి తేలుతున్నందుకే ఆయనను గతంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించారని చెప్పారు. మంగళవారం పార్లమెంట్ ప్రాంగణంలో కల్యాణ్ బెనర్జీ మీడియాతో మాట్లాడారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంటి పథకాల కింద పశ్చిమ బెంగాల్‌కు ఇవ్వాల్సిన నిధులను కేంద్రం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ నిధులు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని ఆక్షేపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బెంగాల్ ప్రజలు బీజేపీని ఓడించడంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై కక్షగట్టిందని, తీవ్ర వివక్ష చూపుతోందని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీతోపాటు శివరాజ్‌సింగ్ బెంగాల్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారన్నారు. అంతకుముందు లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో డీఎంకే, టీఎంసీ ఎంపీలు నిధుల అంశాన్ని లేవనెత్తారు. తమ రాష్ట్రాలకు హక్కుగా రావాల్సిన నిధులను కేంద్రం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ నిరసనకు దిగారు. దీనిపై శివరాజ్ సింగ్ చౌహాన్ బదులిచ్చారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల కేటాయింపులో రాష్ట్రాల మధ్య వివక్ష చూపడం లేదన్నారు. పెండింగ్ నిధులను త్వరలో విడుదల చేస్తామని ప్రకటించారు.

# కాకతీయ రాజ్యాన్ని నిలబెట్టిన వంశం ఏది?

**గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం**
**జనరల్ స్టడీస్**
**తెలంగాణ చరిత్ర**

## కాకతీయుల సామంతులు

### చెరకురెడ్డి వంశం

కాకతీయ సేనానులు, సామంతుల్లో చెరకురెడ్డి వంశీయులు ప్రసిద్ధి చెందినవారు. వీరు రుద్రదేవుడు, మహాదేవుడు, గణపతిదేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్రుల కాలంలో సామంతులుగా పనిచేశారు. నల్గొండ జిల్లాలోని జమ్మలూరు, మహబూబ్‌నగర్ జిల్లాలోని అమరాబాద్, కర్నూలు జిల్లాలోని వేల్పూరు ప్రాంతాలను పాలించారు.

నల్గొండ జిల్లాలోని దేవరకొండ, నకిరేకల్ తాలూకాల్లో ఉన్న చెరకుపల్లి గ్రామాలు వీరి తొలి నివాసమని భావిస్తున్నారు. వీరి తొలి రాజధాని జమ్మలూరు. నల్గొండ జిల్లా తిరుమలగిరి మండలంలోని జలాలుపురమే జమ్మలూరు కావచ్చు. జలాలుపురంలో చెరకు బొల్లయ్యరెడ్డి తన వంశీయుల పేరుమీద నిర్మించిన కేతేశ్వర, కోటేశ్వర, మారేశ్వర, సూర్యదేవర ఆలయాలే ఇందుకు నిదర్శనం. వీరు 1158 నుంచి 1323 వరకు పరిపాలించారు. ఈ వంశానికి ఆద్యుడు కాటసేనాని(1080-1140). జలాలుపురం శాసనంలో ఇతడి ప్రస్తావన ఉంది. పొలవాస మేడరాజు,కొలనుపాక జగద్దేవుడు కాకతీయ రాజ్యంపై దండెత్తగా.. వీరిని ఓడించడంలో రెండో బేతరాజుకు కాటసేనాని తోడ్పడ్డాడు. యుద్ధంలో సహాయం చేసిన కాటసేనానికి బేతరాజు చెరకుపల్లి సహా 12 గ్రామాలను ఇచ్చాడు. చెరకుపల్లి ప్రాంతాన్ని పాలించినందువల్ల ఈ వంశీయులు చెరకు రెడ్లు అయ్యారు.

కాటసేనాని పెద్దకుమారుడు కేతసేనాని. ఇతడి మొదటి భార్యకు కాట, మార, ఎర్ర అనే ముగ్గురు కుమారులు. చెరకు రెడ్ల సైనిక సహకారానికి మెచ్చిన రుద్రదేవుడు వారికి గుండియపూండి, బెరపూడి, గొట్టిపల్లి, పసువల, తొర్రూరు గ్రామాలను ఇచ్చాడు. కేతసేనాని రెండో భార్యకు కాట, మార, బొల్ల అనే కుమారులు ఉన్నారు. కేతసేనాని, ఈ ముగ్గురు కుమారులు కందూరు చోడులను ఓడించడంలో రుద్రదేవుడికి సహకరించారు. అందువల్ల రుద్రదేవుడు వీరికి జమ్మలూరు రాజ్యమిచ్చి సామంతులుగా నియమించాడు. ఈ ముగ్గురిలో చివరివాడైన బొల్లయరెడ్డి ప్రసిద్ధుడు. తండ్రి తర్వాత ఇతడు జమ్మలూరు రాజ్యాధిపతి అయ్యాడు.

సంక్షోభంలో కూరుకుపోయిన కాకతీయ రాజ్యాన్ని రక్షించడంలో రేచర్ల రుద్రసేనానికి బొల్లయరెడ్డి సహాయం చేశాడు. అందుకే గణపతిదేవుడు సింహాసనం అధిష్ఠించగానే బొల్లయరెడ్డిని జమ్మలూరు రాజ్యంతోపాటు అమరాబాద్, వేల్పూరు రాజ్యాలకు సామంతుడిగా నియమించాడు. తర్వాత ఇతడి పెద్ద సోదరుడి కుమారులు, మనుమలు, మునిమనమలు ఈ రాజ్యాలను పాలించారు. వీరు ఈ ప్రాంతాల్లో 22 శాసనాలు వేయించారు. జలాలుపురం, కలువకొలను, అమరాబాద్, ఉడిమళ్ల, కూరెళ్ల తదితర ప్రాంతాల్లో దేవాలయాలను నిర్మించారు. వీరి శాసనాలు నాటి తెలుగు భాషా స్వరూపాన్ని తెలుపుతున్నాయి. వీరు శైవ మతాన్ని అవలంబించారు.

**కాకతీయ రాజ్యంపై దండెత్తిన పొలవాస మేడరాజు, కొలనుపాక జగద్దేవుడిని ఓడించడంలో రెండో బేతరాజుకు కాటసేనాని తోడ్పడ్డాడు. యుద్ధంలో సహాయం చేసిన కాటసేనానికి బేతరాజు చెరకుపల్లి సహా 12 గ్రామాలను ఇచ్చాడు. చెరకుపల్లి ప్రాంతాన్ని పాలించినందువల్ల ఈ వంశీయులు చెరకు రెడ్లు అయ్యారు.**



### మల్యాల వంశం

మల్యాల వంశీయులు కాకతీయులకు విధేయులుగా ఉన్నారు. ఎన్నో యుద్ధాల్లో పాల్గొని కాకతీయుల విజయ సాధనకు తోడ్పడ్డారు. వీరు దుర్జయ కులస్థులు. ఈ వంశానికి ఆద్యుడు దన్నసేనాని. కటుకూరు, కొండిపర్తి, బూదపూర శాసనాలు ఇతడిని కాకతీయ సేనానిగా పేర్కొంటున్నాయి. దన్నసేనానికి ఇద్దరు కుమారులు. పెద్దవాడైన సబ్బసేనాని సంకీసపుర రాజ్యాన్ని, రెండోవాడైన బాచసేనాని బూదపూర రాజ్యాన్ని పొందారు. సబ్బ సేనాని కుమారుడు కాటసేనాని. ఇతడికి ఇద్దరు కుమారులు. చిన్నవాడైన చౌండసేనాని ప్రసిద్ధుడు. ఇతడు గణపతిదేవుడి ఆజ్ఞ మేరకు దివిసీమపై దండెత్తి చోడియ రాజును ఓడించాడు. వెలనాటి పృథ్వీశ్వరుడి కోశాగారాన్ని గణపతిదేవుడికి అప్పగించాడు. విరియాల వంశానికి చెందిన మైలమను వివాహమాడి మల్యాల రాజ్యంతో పాటు విరియాల రాజ్యాన్ని కూడా పాలించాడు. చౌండసేనాని మల్యాల రాజ్య పాలకుడైనప్పటికీ ఓరుగల్లు దుర్గ రక్షణ కోసం ఉంచిన సైన్యాధ్యక్షుడిగా కొండపర్తిలో ఉండేవాడు. రాజ్యపాలనా వ్యవహారాలను ఇతడి అన్న పోతసేనాని చూసుకునేవాడు. బాచసేనాని కుమారుడు గుండ దండాధీశుడు కూడా ఈ వంశంలో ప్రసిద్ధుడు. ఇతడు గణపతిదేవుడు, రుద్రమదేవి కాలంలో సామంతుడిగా, దండనాయకుడిగా పనిచేశాడు. బూదపుర, వర్ధమానపుర ప్రాంతాలపై ఆధిపత్యం వహించి కృష్ణానది ఉత్తర ప్రాంతాలను పాలించాడు. ఇతడి భార్య గోన గన్నారెడ్డి సోదరి అయిన కుప్పాంబిక(కవయిత్రి). 1276లో ఈమె వేయించిన బూదపూర శాసనాన్ని బట్టి గుండ దండాధీశుడు అప్పటికే మరణించాడని తెలుస్తోంది. తర్వాత ఇతడి కుమారులు రాజ్యపాలన చేశారు.

### విరియాల వంశం

కాకతీయ మొదటి బేతరాజుకు రాజ్యాన్ని ఇప్పించి కాకతీయ రాజ్యాన్ని నిలబెట్టింది వీరే. ఈ వంశీయులు వీరులైనప్పటికీ స్వతంత్ర పాలకులు కాలేదు. రాష్ట్ర కూటులు, కల్యాణీ చాళుక్యుల వద్ద సామంతులుగా, దండనాయకులుగా పనిచేశారు. వీరు కూడా దుర్జయ కులస్థులే. విరియాల వంశానికి ఆద్యుడు పోరంటి వెన్న సేనాని. ఇతడి తర్వాత ఎర్ర భూపతి, భీముడు రాష్ట్ర కూటసేనానులుగా పనిచేశారు. భీముడి కుమారుడైన ఎర్రనరేంద్రుడు విరియాల వంశంలో ప్రసిద్ధుడు. ఇతడి కాలంలోనే రెండో తైలపుడు రాష్ట్రకూటులను ఓడించి 973లో కల్యాణీ చాళుక్య రాజ్యాన్ని స్థాపించాడు. ఎర్రనరేంద్రుడు ఇతడి సేనాని అయ్యాడు. ఆ సమయంలో ముదిగొండ చాళుక్యులు, తొలి కాకతీయులు పరస్పరం ఘర్షణ పడేవారు. అంతకు ముందే కాకతీయ నాలుగో గుండరాజు ముదిగొండ చాళుక్య బొట్టు బేతరాజును ఓడించి తమ పూర్వ రాజ్యమైన కొరవి సీమను ఆక్రమించాడు.

తైలపుడు చక్రవర్తి కాగానే బొట్టు బేతరాజు అతడిని ఆశ్రయించాడు. చక్రవర్తి ఆజ్ఞ మేరకు విరియాల ఎర్రనరేంద్రుడు కాకతీయ నాలుగో గుండరాజును సంహరించి చాళుక్యబొట్టు బేతరాజును కొరవి సీమకు రాజును చేశాడు. ఎర్రనరేంద్రుడి భార్య అయిన కామసాని సోదరుడే గుండరాజు. కామసాని తన భర్త సహకారంతో మేనల్లుడైన మొదటి బేతరాజు(గరుడ)కు రెండో తైలపుడి నుంచి అనుమకొండ రాజ్యాన్ని ఇప్పించింది. ఈ విధంగా విరియాల వంశం కాకతీయ రాజ్యాన్ని నిలబెట్టింది.

ఎర్రసేనాని(నరేంద్రుడు) తర్వాత ఇతడి వంశీయులైన సూరసేనాని, బేతన, రుద్రయ రాజు, సూరన్నపతి, మల్లచమూపతి, అన్నయ మొదలైనవారు సేనానులుగా పనిచేశారు. వీరిలో కొందరు కాకతీయుల దగ్గర పనిచేశారని బి.ఎన్.శాస్త్రి తెలిపారు. కానీ ఇందుకు ఆధారాలు లభించలేదు.

### యాదవ రాజులు

తెలంగాణకు పశ్చిమ-ఉత్తరంగా ఉన్న ప్రాంతాన్ని దేవగిరి రాజధానిగా యాదవరాజులు పాలించేవారు. వీరు 9వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం వరకు అధికారంలో ఉన్నారు. కాకతీయుల కాలంలో హోయసాల, దేవగిరి బలమైన రాజ్యాలు. దేవగిరి యాదవరాజులు కొంతకాలం కాకతీయులకు పక్కలో బల్లెంలా ఉండేవారు. దేవగిరి యాదవ రాజ వంశానికి చెందిన ఒక శాఖ కాకతీయుల సామంతులుగా కొన్ని ప్రాంతాలను పాలించింది.

అద్దంకి శాఖకు చెందిన యాదవ రాజుల్లో మొదటి వాడు మొదటి సారంగధరుడు. ఇతడు కాకతీయ రుద్రదేవుడికి యుద్ధాల్లో తోడ్పడ్డాడు. ప్రతిఫలంగా కాకతీయులు ఇతడిని అద్దంకి రాజ్యానికి సామంతుడిగా నియమించారు. ఈ శాఖకు చెందిన మాధవ దేవుడు, సింగల దేవుడు, రెండో సారంగ దేవుడు వేయించిన శాసనాలను బట్టి వీరు గణపతి దేవుడికి సామంతులుగా ఉన్నారని తెలుస్తోంది.

దేవగిరి యాదవరాజు జైతుగీ(జైత్రపాలుడు) కాకతీయ రాజైన మహాదేవుడిని సంహరించాడు. సింఘన ఇతడి కుమారుడు. సింఘన మూడో కుమారుడైన సారంగపాణి దేవుడు తెలంగాణకు వచ్చి రుద్రమదేవి సామంతుడిగా పానగల్లు రాజధానిగా పరిసర ప్రాంతాలను పాలించాడు. ఇతడు వేయించిన పానగల్లు శాసనం(క్రీ.శ.1267) ద్వారా ఈ విషయాలు తెలుస్తున్నాయి. ఇతడి వంశీయులు పానగల్లు, సూర్యాపేట పరిసర ప్రాంతాలను పాలించారని పాతర్లపాడు శాసనం తెలుపుతోంది.

### నాగ వంశస్థులు

ఈ వంశీయులు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలను పాలించారు. ఈ వంశంలోని కొందరు నల్గొండ జిల్లా, కోదాడ ప్రాంతాలను పాలించినట్టు అనంతగిరి శాసనం ద్వారా తెలుస్తోంది.

### మాదిరి ప్రశ్నలు

1. పానగల్లు శాసన కాలం?
   1) 1263 2) 1267
   3) 1265 4) 1269
2. నతవాడి వంశ మూలపురుషుడు?
   1) దన్నసేనాని 2) పోరంటి వెన్న
   3) సారంగధరుడు 4) బేతరాజు
3. గణపతిదేవుడి సోదరి 'మైలాంబ'ను వివాహమాడింది ఎవరు?
   1) వక్కడి మల్లరుద్రుడు 2) బుద్ధరాజు
   3) దుర్గరాజు 4) బేతరాజు
4. అనంతగిరి శాసనం ఏ వంశ పాలకుల గురించి తెలుపుతోంది?
   1) గోనవంశం 2) నాగవంశం
   3) వావిలాల వంశం 4) నతవాడి వంశం
5. 1259లో బూదపూర శాసనాన్ని వేయించింది ఎవరు?
   1) గోనబుద్ధ 2) గోన గన్నారెడ్డి
   3) గుండ దండాధీశుడు
   4) గోన విటయ
6. 1276లో గుండేశ్వరాలయాన్ని నిర్మించినవారు?
   1) గోనబుద్ధ 2) గోనగన్నారెడ్డి
   3) గుండ దండాధీశుడు 4) కుప్పాంబిక
7. కాయస్థ వంశ మూలపురుషుడు?
   1) బేతరాజు 2) గంగయ సాహిణి
   3) ఎర్రనరేంద్రుడు 4) సారంగధరుడు
8. తొలి కాకతీయులు అవలంబించిన మతం?
   1) బౌద్ధం 2) జైనం
   3) శైవం 4) వైష్ణవం
9. సమ్మక్క భర్త?
   1) మేడరాజు 2) గోవిందరాజు
   3) పగిడిద్దరాజు 4) జంపన్న
10. 'ముప్పడినాయకుడు' ఎవరి మహాప్రధాని?
   1) గణపతిదేవుడు 2) రుద్రదేవుడు
   3) రుద్రమదేవి 4) ప్రతాపరుద్రుడు
11. ప్రతాపరుద్రుడి కాలంలో నాయంకరుల సంఖ్య?
   1) 70 2) 75 3) 80 4) 85
12. కాకతీయుల కాలంలో 'అయగార్లు' ఏ విభాగ పాలకులు?
   1) స్థలాలు 2) సీమ
   3) గ్రామాలు 4) నాడులు
13. కాకతీయుల కాలంనాటి 'అయగార్ల' సంఖ్య?
   1) 10 2) 25 3) 12 4) 17
14. కాకతీయుల కాలంలో దేశీయ వాణిజ్యానికి ప్రధాన కేంద్రం?
   1) మంథెన 2) పిల్లలమర్రి
   3) ఓరుగల్లు 4) పేరూరు
15. కాకతీయుల కాలంలో విదేశీ వాణిజ్యానికి ప్రసిద్ధి చెందిన రేవు పట్టణం?
   1) మోటుపల్లి 2) మంథెన
   3) ఓరుగల్లు 4) పేరూరు
16. క్రీడాభిరామం రచయిత?
   1) ఏకామ్రనాథుడు
   2) పాల్కురికి సోమన
   3) ప్రతాపరుద్రుడు
   4) వినుకొండ వల్లభరాయుడు
17. కాకతీయుల కాలంలో 'సమయములు' అని వేటిని వ్యవహరించేవారు?
   1) వ్యాపార కేంద్రాలు 2) కుల సంఘాలు
   3) గ్రామాలు 4) నగరాలు
18. బౌద్ధమతం కాలక్రమంలో ఏ మతంలో కలిసిపోయిందని చరిత్రకారుల అభిప్రాయం?
   1) హిందూ 2) జైన
   3) వైష్ణవ 4) ఏదీకాదు
19. కిందివారిలో జైనమతాన్ని అవలంబించిన కాకతీయ రాజులు?
   1) మొదటి బేతరాజు, ప్రోలరాజు
   2) రుద్రదేవుడు, గణపతిదేవుడు
   3) రుద్రదేవుడు, ప్రతాపరుద్రుడు
   4) ప్రతాపరుద్రుడు, ప్రోలరాజు
20. కాకతీయల కాలంలో జైనమత కేంద్రం?
   1) హనుమకొండ 2) పానగల్లు
   3) జోగిపేట 4) కొలనుపాక
21. కాకతీయుల కాలంలో ప్రజాదరణ పొందిన శైవమత శాఖ?
   1) కాలాముఖ 2) వీరశైవం
   3) పాశుపతం 4) కాపాలికం

**సమాధానాలు**

1) 2 2) 4 3) 1 4) 2 5) 3
6) 4 7) 2 8) 2 9) 3 10) 4
11) 2 12) 3 13) 3 14) 3 15) 1
16) 4 17) 2 18) 1 19) 1 20) 3
21) 3

# విద్యార్థి సామర్థ్యాన్ని సూచించేవి?



**టెట్/డీఎస్సీ- ప్రత్యేకం**
**ఎస్జీటీ - సైన్స్ మెథడాలజీ**

### విజ్ఞానశాస్త్ర బోధన లక్ష్యాలు

- సాధారణంగా ఉద్దేశాలు, గమ్యాలు, లక్ష్యాలు అనే పదాలను పర్యాయపదాలుగా వాడతారు.
- **గమ్యాలు:** విశాలమైన, దీర్ఘకాలిక అంతిమ ప్రయోజనాన్ని తెలిపేవి గమ్యాలు.
  **ఉదా:** విద్యకు పరమార్థం మోక్షం.
  **- ఉపనిషత్తులు**
- **ఉద్దేశాలు:** గమ్యాల నుంచి ఏర్పడినవి ఉద్దేశాలు. ఇవి గమ్యాల కంటే నిర్దిష్టమైనవే కాకుండా విద్యా దిశలను కూడా సూచిస్తాయి.
  **ఉదా:** విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్ర జ్ఞానం కలిగించడం.
- **లక్ష్యాలు:** స్వల్పకాలంలో చేరగలిగే గమ్యాలను లక్ష్యాలనవచ్చు.
  **ఉదా:** డీఈడీ పరీక్ష పాసవడం.

**విజ్ఞానశాస్త్ర అధ్యయన విలువలు:**
1. సామాజిక విలువలు
2. సాంస్కృతిక విలువలు
3. నైతిక విలువలు
4. వృత్తిపరమైన విలువలు
5. ఔపయోగిక విలువలు

**సామాజిక విలువలు- రకాలు:**
1. బౌద్ధిక విలువ 2. సృజనాత్మక విలువ 3. సౌందర్య విలువ.

విద్యా లక్ష్యాలు
↓
స్థాయిలవారీగా విద్యా లక్ష్యాలు
↓
సబ్జెక్టుల వారీగా విద్యా లక్ష్యాలు
↓
తరగతుల వారీగా విద్యా లక్ష్యాలు

విద్యా లక్ష్యాలను ఈ కింది విధంగా చూపొచ్చు
- **గాగ్నే అనే విద్యావేత్త సూచించిన వర్గీకరణ:** గాగ్నే అభ్యసనాన్ని వివిధ రకాలుగా విడమర్చి చెప్పారు. అవి..

సూచీ అభ్యసనం- ఉద్దీపన- ప్రతిస్పందన అభ్యసనం, భావనాభ్యసనం, సూత్రాల అభ్యసనం, సమస్యా పరిష్కారం. ఇవి సరళం నుంచి సంక్లిష్టం వరకు ఒక క్రమ పద్ధతిలో అమిరి ఉంటాయి.

- **బెంజిమన్ బ్లూమ్, క్రాత్‌హోల్, డేవిడ్ సూచించిన వర్గీకరణ:** వీరు విద్యా లక్ష్యాలను మూడు వర్గాలుగా విభజించారు. అవి..
  ఎ) జ్ఞానాత్మక రంగం
  బి) భావావేశ రంగం
  సి) మానసిక చలనాత్మక రంగం
- జ్ఞానాత్మక రంగంపై బెంజిమన్ బ్లూమ్, భావావేశ రంగంపై డేవిడ్.ఆర్. క్రాత్‌హోల్, మానసిక చలనాత్మక రంగంపై ఎలిబత్ సింప్సన్, ఆర్.హెచ్. దవే కృషి చేశారు.
- జ్ఞానాత్మక రంగం మెదడుకు, భావావేశ రంగం హృదయానికి, మానసిక చలనా త్మక రంగం మనసుకు, శరీరానికి సంబం ధించినవి.
- ఏ అంశం గురించి అయినా ఈ మూడు రంగాల్లో విద్యార్థులను అభివృద్ధి చేయాలి.

**విజ్ఞాన శాస్త్రంలో లక్ష్యాలు - స్పష్టీకరణలు -వివరణలు**

**ఎ. జ్ఞాన రంగంలో లక్ష్యాలు:**
- జ్ఞప్తికి తెచ్చుకోవడం • గుర్తించడం

**లక్ష్యం-I**
1. **జ్ఞప్తికి తెచ్చుకోవడం :** విద్యార్థి విజ్ఞానశాస్త్ర సంబంధమైన పదాలు, సత్యాలు, భావన లు, సూత్రాలు, నిర్వచనాలు, నియమాలు పద్ధతులు జ్ఞప్తికి తెచ్చుకొంటాడు.
   **ఉదా:** చంద్ర గ్రహణం అంటే ఏమిటి?
2. **గుర్తించడం:** విద్యార్థి విజ్ఞానశాస్త్ర సం బంధమైన సత్యాలు, భావనలు, సూత్రా లు, నియమాలు, పద్ధతులు గుర్తిస్తాడు.
   **ఉదా:** కుంభాకార, పుటాకార దర్పణాల్లో భేదాలను గుర్తించడం.

**లక్ష్యం-II అవగాహన:**

విద్యార్థి విజ్ఞానశాస్త్ర సంబంధమైన పదా లు, సత్యాలు, భావనలు మొదలైన వాటిని అవగాహన చేసుకుంటాడు.

**స్పష్టీకరణలు:**
- భావనలు, నియమాలు, సూత్రాలకు ఉదాహరణలిస్తాడు.
  **ఉదా:** సజీవులకు ఉదాహరణనిస్తాడు.
- వివిధ భావనలు, సూత్రాలు, నియమాలను వివరిస్తాడు.
- ఇచ్చిన వాక్యంలోని దోషాన్ని సవరించి సరి చేస్తాడు.
- వివిధ భావనలు, సూత్రాలు నియమా లను సరి చేస్తాడు.
- చిత్రపటాలకు, రేఖా పటాలకు, దత్తాంశాలకు వ్యాఖ్యానం రాస్తాడు.
- విజ్ఞాన సూత్ర సత్యాలను, భావాలను వర్గీకరిస్తాడు.
- సమస్యలను సాధిస్తాడు.
- విజ్ఞానశాస్త్ర పరికరాలను, రసాయనాలను ఎంపిక చేసుకుంటాడు.
- భౌతిక రాశులకు సరైన ప్రమాణాలు తెలుపుతాడు.
- శాస్త్ర సత్యాలు, భావనలను, ప్రక్రియలను సరిపోల్చుతాడు.

**లక్ష్యం - III వినియోగం:** విద్యార్థి తాను నేర్చుకున్న విజ్ఞానశాస్త్ర విజ్ఞానాన్ని పరిస్థితులకనుగుణంగా వినియోగిస్తాడు.

**స్పష్టీకరణలు:**
- భావనలు, సూత్రాలు, నియమాలు మొదలైన వాటిని విశ్లేషిస్తాడు.
- విద్యార్థులు నేర్చుకున్న జ్ఞానాన్ని నేరుగా వినియోగిస్తారు.
- శాస్త్ర ప్రక్రియలకు, దృగ్విషయాలకు కారణాలను తెలుపుతాడు.
- కారణానికి, ఫలితానికి మధ్య సంబం ధాన్ని ఏర్పరుస్తాడు.
- శాస్త్ర పరిశీలనలను వ్యాఖ్యానిస్తాడు.
- సామాన్యీకరణలను ప్రతిపాదిస్తాడు.
- సరైన ప్రయోగ విధానాలు, పరికరాలను సూచిస్తాడు.
- ప్రాగుక్తీకరించగలడు.
- దత్తాంశం ఆధారంగా నిర్ణయం తీసుకుంటాడు.

**భావావేశ రంగం లక్ష్యాలు:**

లక్ష్యం I: శాస్త్రీయ వైఖరుల అభివృద్ధి
లక్ష్యం II: అభిరుచి
లక్ష్యం III: అభినందన

**మానసిక చలనాత్మక రంగ లక్ష్యాలు**

లక్ష్యం I: చిత్రలేఖన నైపుణ్యం
లక్ష్యం II: హస్త నైపుణ్యాలు
లక్ష్యం III: పరిశీలన నైపుణ్యాలు
లక్ష్యం IV: అభివ్యంజన నైపుణ్యాలు
లక్ష్యం V: నివేదన నైపుణ్యాలు

**విజ్ఞాన శాస్త్రం- సహ సంబంధం**

**సహ సంబంధం ఆవశ్యకత:**
- జ్ఞానాన్ని సంయుక్తపరచడం
- సమర్థవంతమైన అభ్యసనం
- శ్రమ ఆదా
- అభ్యసన బదలాయింపు

**సహ సంబంధం- రకాలు:**
- సహజసిద్ధం
- కృత్రిమ సహ సంబంధం
- వ్యవస్థీకృత సహ సంబంధం
- విజ్ఞానశాస్త్రానికి విద్యా ప్రణాళికలోని ఇతర పాఠ్యవిషయాలకు సంబంధం
- విజ్ఞానశాస్త్రం- భాష
- విజ్ఞానశాస్త్రం - చరిత్ర
- విజ్ఞానశాస్త్రం - భౌగోళిక శాస్త్రం
- విజ్ఞానశాస్త్రం- గణితం
- విజ్ఞానశాస్త్రం - చిత్రలేఖనం
- విజ్ఞాన శాస్త్రం - చేతిపని
- విజ్ఞాన శాస్త్రం-దైనందిన జీవితానికి సంబంధం

**విద్యా లక్ష్యాలు**
- **జ్ఞాన రంగం:** జ్ఞానానికి సంబంధించిన వాటిని జ్ఞప్తికి తెచ్చుకోవడం, గుర్తించడం, మానసిక సామర్థ్యాలు, నైపుణ్యాలను అభివృద్ధి పరచడం.
- **భావావేశ రంగం:** ఆసక్తులు, విలువల్లో మార్పులు, అభినందనను పెంపొందించడం
- **మానసిక చలనాత్మక రంగం:** హస్తలాఘవ, మోటార్ నైపుణ్యాలు అభివృద్ధి చేయడం

**బ్లూమ్ సూచించిన లక్ష్యాల వర్గీకరణ**

శిశువు (ప్రవర్తన)

| జ్ఞాన రంగం | భావావేశ రంగం | మానసిక చలనాత్మక రంగం |
|---|---|---|
| 1. జ్ఞానం | 1. గ్రహించడం | 1. అనుకరణ |
| 2. అవగాహన | 2. ప్రతిస్పందించడం | 2. హస్తలాఘవం |
| 3. వినియోగం | 3. విలువకట్టడం | 3. సునిశితత్వం |
| 4. విశ్లేషణ | 4. వ్యవస్థాపనం | 4. ఉచ్చారణ |
| 5. సంశ్లేషణ | 5. శీలస్థాపనం | 5. స్వాభావీకరణం |
| 6. మూల్యాంకనం | | |

### గతంలో అడిగిన ప్రశ్నలు

1. విద్యార్థులు చేసే ప్రయోగాలకు కావాల్సిన పరికరాలను, వస్తు సామగ్రిని వారే తయారుచేసుకోవడాన్ని సూచించే విలువ? (డీఎస్సీ-2008)
   ఎ) క్రమశిక్షణ విలువ
   బి) ఉపయోగిత విలువ
   సి) సృజనాత్మక విలువ
   డి) వృత్తిపరమైన విలువ
2. అవగాహనలో ప్రవర్తనాత్మకమైన స్పష్టీకరణం ఎక్స్‌ట్రాపొలేషన్‌కు ఉదాహరణ? (డీఎస్సీ-2008)
   ఎ) కార్యనిర్వాహక సంబంధం తెలపడం
   బి) అన్వయం చేయడం, వర్ణించడం
   సి) పోల్చడం, తేడాలు చెప్పడం
   డి) ఒక పరిష్కారం నుంచి మరొక పరిష్కారానికి
3. సామర్థ్యాలను స్పష్టీకరించడంలో ఒక మౌలికాంశం? (డీఎస్సీ-2006)
   ఎ) అభ్యసన ఔచిత్యం బి) పరిస్థితులు
   సి) పరిసరాల అనుగుణ్యత
   డి) పాఠ్యాంశాలు
4. మానసిక చలనాత్మక రంగంలోని లక్ష్యాల క్రమం? (డీఎస్సీ-2006)
   ఎ) అనుకరణ, నిర్వహణ, సునిశితత్వం, సమన్వయం, స్వాభావీకరణం
   బి) అనుకరణ, ప్రతిస్పందన, విలువ, సమన్వయం, శీలస్థాపనం
   సి) గ్రహించడం, నిర్వహణ, సునిశితత్వం సమన్వయం, శంకుస్థాపన
   డి) గ్రహించడం, ప్రతిస్పందన, విలువ, సమన్వయం, స్వాభావీకరణం
5. ఇందులో ఒకటి మానసిక చలనాత్మక రంగంలోని లక్ష్యం? (డీఎస్సీ-2001)
   ఎ) పరిసరాల్లో ఉన్న వాటిపై ఆసక్తి ప్రదర్శించడం
   బి) శాస్త్ర సంబంధమైన భావనలు గుర్తించడం
   సి) పటాలు గీయడంలో నైపుణ్యం
   డి) శాస్త్ర జ్ఞానాన్ని వినియోగించడం
6. మన ప్రకృతి సంపదను, వనరులను సద్వినియోగం చేసుకోవడం అనేది శాస్త్రపరంగా ఏ విలువను పెంపొందిస్తుంది? (డీఎస్సీ-2001)
   ఎ) బౌద్ధిక విలువ బి) సౌందర్య విలువ
   సి) ఉపయోగిత విలువ డి) వృత్తి విలువ
7. విద్యార్థి గడించిన సామర్థ్యాలను సూచించేవి? (డీఎస్సీ-2001)
   ఎ) ఉద్దేశాలు బి) లక్ష్యాలు
   సి) నైతిక విలువలు డి) స్పష్టీకరణలు
8. విజ్ఞానశాస్త్రాన్ని ఇతర సబ్జెక్టులతో సహసంబంధం కలిగించడం? (డీఎస్సీ-2000)
   ఎ) కష్టం బి) సులువు
   సి) ఇవేవీ కావు డి) మౌలికమైంది
9. ప్రయోగాలు/ కృత్యాలు చేయడం దేనికి సంబంధించింది? (డీఎస్సీ-2000)
   ఎ) అవగాహన బి) జ్ఞానం
   సి) నైపుణ్యం డి) అభినందన
10. క్షేత్ర పర్యటన ఏ రంగంలోనిది? (డీఎస్సీ-1998)
   ఎ) జ్ఞానాత్మక రంగం
   బి) మానసిక చలనాత్మక రంగం
   సి) భావావేశ రంగం డి) పైవేవీ కావు
11. 'విద్యార్థి నమ్మకంగా తన పరిశీలనలను నమోదు చేయడం' ఏ ముఖ్య లక్షణాన్ని సూచిస్తుంది? (డీఎస్సీ-1994)
   ఎ) అవగాహన బి) వైఖరి
   సి) నైపుణ్యం డి) జ్ఞానం

**సమాధానాలు**

1) సి; 2) ఎ; 3) ఎ; 4) ఎ; 5) సి; 6) సి; 7) డి; 8) డి; 9) సి; 10) సి; 11) సి.

### మాదిరి ప్రశ్నలు

1. విద్యా విషయక లక్ష్యాలను వర్గీకరించింది?
   ఎ) R.C. రాస్ బి) C.P.S. నాయర్
   సి) బ్లూమ్ డి) స్మిత్
2. ఎక్స్‌ట్రాపొలేషన్ దేనికి సంబంధించింది?
   ఎ) అనునాదం బి) అవగాహన
   సి) పరికల్పన డి) హేతుకీకరణ
3. 'Taxonomy of Educational Objectives'.. ఎవరి రచన?
   ఎ) బ్లూమ్ బి) థార్న్‌డైక్
   సి) అరిస్టాటిల్ డి) గాగ్నే
4. ఎత్తుకు, గురుత్వ త్వరణానికి సంబంధం తెలపడం ____
   ఎ) వినియోగం బి) జ్ఞానం
   సి) అవగాహన డి) సంశ్లేషణ
5. బొమ్మలు గీయడం ఏ రంగానికి చెందింది?
   ఎ) భావావేశ బి) జ్ఞానాత్మక
   సి) మానసిక చలనాత్మక డి) ఏదీకాదు
6. భావావేశ రంగాన్ని వివరించినవారు?
   ఎ) గేట్స్ బి) విలియమ్స్
   సి) క్రాత్‌హోల్ డి) బ్లూమ్

**సమాధానాలు**

1) సి; 2) బి; 3) ఎ; 4) సి; 5) సి; 6) సి.

# స్టెయిన్‌లెస్ స్టీల్ ఏ లోహాల మిశ్రమం?

## లోహశాస్త్రం

ప్రకృతిలో లోహం లభించే వివిధ సమ్మేళనాలనే 'ఖనిజాలు' అంటారు. ఖనిజాలన్నింటిలో దేని నుంచి వ్యాపారాత్మకంగా లాభదాయకమైన పద్ధతిలో లోహాన్ని వెలికితీయగలమో దాన్ని 'ధాతువు' అంటారు. అంటే ఖనిజాలన్నీ ధాతువులు కావు. ఉదాహరణకు అల్యూమినియం ఖనిజాలు – కోరండం, బాక్సైట్, క్రయొలైట్. వీటిలో బాక్సైట్ నుంచి మాత్రమే వ్యాపార సరళిలో అల్యూమినియం లోహాన్ని ఉత్పత్తి చేస్తారు. కాబట్టి అల్యూమినియం ధాతువు బాక్సైట్. ధాతువులో ఉండే మలినాలను 'గాంగ్' లేదా 'మాట్రిక్స్' అంటారు.

- ధాతువును గాలి లేకుండా బాగా వేడిచేసి బాష్పశీల మలినాలను తొలగించడాన్ని భస్మీకరణం (Calcination) అంటారు. ఉదాహరణకు లైమ్‌స్టోన్ ($CaCO_3$)ను వేడిచేస్తే విఘటనం చెంది $CO_2$ విడుదల చేస్తూ కాల్షియం ఆక్సైడ్‌ను ఏర్పరుస్తుంది.
- ధాతువును గాలి సమక్షంలో అధిక ఉష్ణోగ్రతలకు వేడి చేయడాన్ని భర్జనం (Roasting) అంటారు.
- సాధారణంగా ధాతువు అనేది లోహం మాత్రమే కాకుండా రాళ్లు, ఇసుక, బంకమన్ను, మైకా, క్వార్ట్జ్ మొదలైన మలినాలతో కలిసి ఉంటుంది.
- ఒక ధాతువును ద్రవకారి (ద్రవీభవన ఉష్ణోగ్రత తగ్గించేది)ని కలిపి లేదా కలపకుండా అధిక ఉష్ణోగ్రత వద్ద వేడి చేయడం ద్వారా లేదా సల్ఫైడ్ ఖనిజాన్ని ద్రవస్థితిలో పొందడాన్ని 'ప్రగలనం' అంటారు.
- శుద్ధలోహం కంటే మిశ్రమలోహం ఉపయోగకర గుణాలు అధికం. ఉదాహరణకు స్వచ్ఛమైన బంగారానికి కొద్దిగా రాగిని కలిపితే దాని గట్టితనం పెరుగుతుంది.

**ప్రకృతిలో బంగారం, ప్లాటినం లాంటి లోహాలు మాత్రమే స్వేచ్ఛాస్థితిలో లభిస్తాయి. మిగిలినవి ఆక్సైడ్‌లు, సల్ఫైడ్‌లు, కార్బొనేట్లు, బై కార్బొనేట్లు లాంటి సమ్మేళనాల రూపంలో లభిస్తాయి. వీటి నుంచి స్వచ్ఛమైన లోహాన్ని నిష్కర్షణ (వెలికితీసే పద్ధతి) చేసే ప్రక్రియల గురించి చర్చించేదే లోహశాస్త్రం.**



### మాదిరి ప్రశ్నలు

1. అత్యంత సాగే గుణం ఉన్న లోహం ఏది?
   1) వెండి 2) బంగారం
   3) రాగి 4) ఇనుము
2. కిందివాటిలో అల్యూమినియం ధాతువు ఏది?
   1) హెమటైట్ 2) సిన్నబార్
   3) గెలీనా 4) బాక్సైట్
3. జతపరచండి.

| లోహం | ఖనిజం |
|---|---|
| ఎ) ఇనుము | 1. గెలీనా |
| బి) రాగి | 2. సిన్నబార్ |
| సి) సీసం | 3. మాగ్నటైట్ |
| డి) మెర్క్యురీ | 4. మాలకైట్ |

| | ఎ | బి | సి | డి |
|---|---|---|---|---|
| 1) | 1 | 3 | 2 | 4 |
| 2) | 3 | 1 | 4 | 2 |
| 3) | 3 | 4 | 1 | 2 |
| 4) | 2 | 4 | 3 | 1 |

4. ఇనుమును శుద్ధి చేసే బ్లాస్ట్ కొలిమిలో కార్బన్ మోనాక్సైడ్ సమక్షంలో ఐరన్ ఆక్సైడ్‌పై జరిగే ప్రక్రియ?
   1) ఆక్సీకరణం 2) క్షయకరణం
   3) జలవిశ్లేషణ 4) విద్యుద్విశ్లేషణ
5. బ్లాస్ట్ కొలిమిలో ఉపయోగించే గరిష్ఠ ఉష్ణోగ్రత?
   1) 500 °C 2) 1500 K
   3) 1500 °C 4) 750 °C
6. గుల్లబారి ఉండే ఇనుమును ఏమంటారు?
   1) పిగ్ ఐరన్ 2) స్పాంజ్ ఐరన్
   3) కాస్ట్ ఐరన్ 4) పోరస్ ఐరన్
7. లైమ్‌స్టోన్‌లో లభించే ప్రధాన ఖనిజం?
   1) మెగ్నీషియం 2) సోడియం
   3) కాల్షియం 4) బేరియం
8. పొటాషియంతో పాటు మెగ్నీషియం లభించే ఖనిజం?
   1) కార్నలైట్ 2) హెమటైట్
   3) మాగ్నసైట్ 4) మాగ్నటైట్
9. జతపరచండి.

| | |
|---|---|
| ఎ) కార్బొనేట్ ఖనిజం | 1. కార్నలైట్ |
| బి) సల్ఫైడ్ ఖనిజం | 2. పిచ్ బ్లెండ్ |
| సి) ఆక్సైడ్ ఖనిజం | 3. కాపర్ పైరెటీస్ |
| డి) క్లోరైడ్ ఖనిజం | 4. లైమ్ స్టోన్ |

| | ఎ | బి | సి | డి |
|---|---|---|---|---|
| 1) | 2 | 1 | 3 | 4 |
| 2) | 1 | 3 | 2 | 4 |
| 3) | 4 | 3 | 2 | 1 |
| 4) | 3 | 2 | 4 | 1 |

10. మోనోజైట్ ఇసుకలో ప్రధానంగా లభించేది?
   1) థోరియం 2) రేడియం
   3) ప్రాన్షియం 4) పొలోనియం
11. ఇనుము రకాలలో అత్యంత శుద్ధమైంది?
   1) పోత ఇనుము 2) చేత ఇనుము
   3) స్పాంజ్ ఇనుము 4) దుక్క ఇనుము
12. గాలి లేకుండా ధాతువును వేడిచేసే ప్రక్రియను ఏమంటారు?
   1) భర్జనం 2) భస్మీకరణం
   3) నిక్షాళనం 4) ప్రగలనం
13. భూ పటలంలో పుష్కలంగా లభించే లోహం ఏది?
   1) జింక్ 2) ఇనుము
   3) అల్యూమినియం 4) రాగి
14. తన ద్వారా విద్యుత్తును ప్రవహింపజేయ నివ్వనప్పటికీ (అథమ విద్యుత్ వాహకం) ఉష్ణాన్ని ప్రవహింపజేయనిచ్చేది (ఉష్ణవాహకం) ఏది?
   1) ఆస్బెస్టాస్ 2) మైకా (అభ్రకం)
   3) సెల్యులాయిడ్ 4) స్టీల్
15. స్టెయిన్‌లెస్ స్టీల్ వేటి మిశ్రమ లోహం?
   1) ఐరన్ 2) కార్బన్
   3) క్రోమియం 4) పైవన్నీ
16. ఇత్తడి (బ్రాస్) ఏయే లోహాల మిశ్రమ లోహం?
   1) జింక్, రాగి 2) నికెల్, ఐరన్
   3) నికెల్, జింక్ 4) నికెల్, రాగి
17. కంచు (బ్రాంజ్) వేటి మిశ్రమ లోహం?
   1) కాపర్, టిన్ 2) జింక్, రాగి
   3) నికెల్, జింక్ 4) ఐరన్, కార్బన్
18. సౌరశక్తి పానెల్‌లో ఉపయోగించే మూలకం ఏది?
   1) టైటానియం 2) ఐరన్
   3) సిలికాన్ 4) టిన్
19. గన్ మెటల్‌లో ఉండే లోహాలేవి?
   1) ఇనుము, నికెల్ 2) ఇనుము, తగరం
   3) రాగి, తగరం 4) రాగి, జింక్
20. పాదరసం ఒక అనుఘటకంగా ఉన్న మిశ్రమ లోహం?
   1) అమాల్గం 2) స్టీల్
   3) ఎమల్షన్ 4) పాలీమర్
21. మిశ్రమ లోహం అనేది?
   1) ద్రావణం 2) ఎమల్షన్
   3) కొల్లాయిడ్ 4) పాలీమర్
22. లోహంలో ధాతువుతో పాటు ఉండే మలినాలను ఏమంటారు?
   1) ఖనిజం 2) గాంగ్
   3) ద్రవకారి 4) ఫ్లక్స్

**కొన్ని లోహాల ముఖ్య ఖనిజాలు**

| లోహం | ఖనిజం |
|---|---|
| అల్యూమినియం | బాక్సైట్, కోరండం క్రయొలైట్ |
| ఇనుము | హెమటైట్, మాగ్నటైట్, సిడిరైట్, లియొనైట్, ఐరన్ పైరెటీస్ |
| రాగి (తామ్రం) | కాపర్ గ్లాన్స్, కాపర్ పైరెటీస్ మాలకైట్ |
| సీసం (లెడ్) | గెలీనా, సెరలైట్ |
| పాదరసం | సిన్నబార్ |
| యురేనియం | పిచ్‌బ్లెండ్ |
| జింక్ | జింక్ బ్లెండ్ (స్ఫాలరైట్) కాలమైన్, జింకైట్ (ఫిలాసఫర్ ఊల్) |

**గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం**

**జనరల్ స్టడీస్**

**కెమిస్ట్రీ**

23. ఇనుము సల్ఫైడ్ ధాతువు ఏది?
   1) మాగ్నటైట్ 2) హెమటైట్
   3) ఐరన్ పైరెటీస్ 4) మాలకైట్
24. లోహ నిష్కర్షణలో ఉపయోగించే చార్జ్ అనేది?
   1) విద్యుదావేశ ఎలక్ట్రోడ్
   2) ధాతువు + కోక్
   3) ధాతువు + సున్నపురాయి + కోక్
   4) ధాతువు + సున్నపురాయి
25. చేత ఇనుములో ఉండే కార్బన్ శాతం?
   1) 0.1% 2) 0.2%
   3) 1% 4) 2%
26. కిందివాటిలో సిల్వర్ అనుఘటకంగా లేని మిశ్రమ లోహం ఏది?
   1) హార్న్ సిల్వర్ 2) జర్మన్ సిల్వర్
   3) రూబీ సిల్వర్ 4) స్టెర్లింగ్ సిల్వర్
27. హెల్మెట్ల తయారీలో వాడే మిశ్రమ లోహం?
   1) మాగ్నాలియం 2) క్రోమ్ స్టీల్
   3) మాంగనీస్ స్టీల్ 4) నికెల్ స్టీల్
28. ముడి ఖనిజంలో లోహంతో పాటు ఇసుక, రాళ్లు, బంకమన్ను మొదలైన మలినాలతో ఉండే మిశ్రమాన్ని ఏమంటారు?
   1) ఫ్లక్స్ 2) గాంగ్
   3) పోలింగ్ 4) లోహ మలం
29. జర్మన్ సిల్వర్‌లో ఉండే లోహాలేవి?
   1) కాపర్ 2) నికెల్
   3) జింక్ 4) పైవన్నీ
30. కిందివాటిలో కాయినేజ్ లోహాలు ఏవి?
   1) కాపర్ 2) బంగారం
   3) వెండి 4) పైవన్నీ
31. బ్లేడ్ల తయారీలో వాడే స్టీల్ ఏది?
   1) క్రోమ్ స్టీల్ 2) మాంగనీస్ స్టీల్
   3) ఇన్వార్ స్టీల్ 4) టంగ్‌స్టన్ స్టీల్
32. శస్త్ర చికిత్స సాధనాల తయారీలో ఉపయోగించే మిశ్రమ లోహం?
   1) స్టెయిన్‌లెస్ స్టీల్ 2) మాంగనీస్ స్టీల్
   3) నిక్రోమ్ 4) మాగ్నాలియం
33. ఉక్కు (స్టీల్) తుప్పు పట్టకుండా నిరోధించేది?
   1) నికెల్ 2) ఇనుము
   3) క్రోమియం 4) కార్బన్
34. స్టెయిన్‌లెస్ స్టీల్‌లో ఎంతశాతం క్రోమియం ఉంటుంది?
   1) 5–8 2) 12–20
   3) 10–15 4) 1–5
35. అయస్కాంతాల తయారీకి వాడే మిశ్రమ లోహం?
   1) స్టీల్ 2) నిక్రోమ్
   3) ఆల్నికో 4) స్టెయిన్‌లెస్ స్టీల్
36. ఎమాల్గం ఏర్పరచని లోహం ఏది?
   1) ఐరన్ 2) ప్లాటినం
   3) సోడియం 4) 1, 2
37. వంటపాత్రల తయారీకి వాడే స్టీలు ఏది?
   1) ఎక్కువ కార్బన్ ఉన్న స్టీల్
   2) ఎక్కువ క్రోమియం ఉన్న స్టీల్
   3) ఇన్వార్ స్టీల్
   4) ఎక్కువ నికెల్ ఉన్న స్టీల్
38. స్టెయిన్‌లెస్ స్టీల్ ఏ లోహాల మిశ్రమం? *(పోలీస్ కానిస్టేబుల్-2011)*
   1) ఇనుము + కార్బన్ + నికెల్
   2) ఇనుము + క్రోమియం + నికెల్
   3) ఇనుము + క్రోమియం + జింక్
   4) ఇనుము + లెడ్
39. ఫ్యూజులు, నిరోధక తీగల తయారీలో వాడే మిశ్రమం?
   1) నిక్రోమ్ 2) ఇన్వార్ స్టీల్
   3) బెల్ మెటల్ 4) కంచు
40. గేర్లు, బేరింగ్‌ల తయారీలో వాడే మిశ్రమ లోహం?
   1) గన్ మెటల్ 2) ఎలక్ట్రాన్
   3) మాగ్నాలియం 4) బెల్ మెటల్

**సమాధానాలు**

1) 2; 2) 4; 3) 3; 4) 2; 5) 3; 6) 2; 7) 3; 8) 1; 9) 3; 10) 1; 11) 2; 12) 2; 13) 3; 14) 2; 15) 4; 16) 1; 17) 1; 18) 3; 19) 3; 20) 1; 21) 1; 22) 2; 23) 3; 24) 3; 25) 2; 26) 2; 27) 3; 28) 2; 29) 4; 30) 4; 31) 1; 32) 1; 33) 3; 34) 2; 35) 3; 36) 4; 37) 2; 38) 2; 39) 1; 40) 1.

## విద్య, ఉద్యోగ సమాచారం

### సీఐటీడీ, హైదరాబాద్‌లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్ బాలానగర్‌లోని ఎంఎస్ ఎంఈ టూల్ రూం-సెంట్రల్ ఇన్‌స్టిట్యూ ట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ).. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం సీట్ల సంఖ్య:** 240
- **కోర్సులు–సీట్ల వివరాలు:** డిప్లొమా ఇన్ టూల్, డై అండ్ మౌల్డ్ మేకింగ్(డీటీడీఎం)–60 సీట్లు, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(డీఈసీఈ)–60 సీట్లు, డిప్లొమా ఇన్ ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఇంజనీరింగ్(డీఏఆర్ఈ)–60 సీట్లు,డిప్లొమా ఇన్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్(డీపీఈ) 60 సీట్లు.
- **కోర్సు వ్యవధి:** డీటీడీఎం కోర్సుకు నాలుగేళ్లు మిగిలిన కోర్సులకు మూడేళ్లు.
- **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 22.05.2025 నాటికి 15 నుంచి 19 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్ల వరకు సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష ద్వారా సీటు కేటాయిస్తారు.
- **పరీక్ష విధానం:** ప్రవేశ పరీక్షలో ఆబ్జెక్టివ్ విధానంలో ప్రశ్నలు ఉంటాయి. మ్యాథ్‌మేటిక్స్, సైన్స్, ఇంగ్లిష్, ఆప్టిట్యూడ్ అండ్ జనరల్ నాలెడ్జ్ సబ్జెక్ట్‌ల నుంచి పదో తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం 1 1/2 గంటలు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.05.2025.
- **ప్రవేశ పరీక్ష తేది:** 25.05.2025.
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్.
- **వెబ్‌సైట్:** https://citdindia.org/

### ఎన్‌సీఈఎస్ఎస్, కేరళలో సైంటిస్ట్ పోస్టులు

కేరళలోని నేషనల్ సెంటర్ ఫర్ ఎర్త్ సైన్స్ స్టడీస్(ఎన్‌సీఈఎస్ఎస్) గ్రూప్–ఎ కేటగిరీకి చెందిన సైంటిస్ట్‌బి(1, 2) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.


- **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ, బీటెక్(సివిల్ ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** సైంటిస్ట్ బీ1 పోస్టుకు 35 ఏళ్లు, సైంటిస్ట్ బీ2 పోస్టుకు 38 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 7.4.2025.
- **వెబ్‌సైట్:** https://www.ncess.gov.in/

# Simple problem must have..

## MODEL QUESTIONS

**BANK EXAMS**

**REASONING**



***Reasoning based on logic contains of the following topics..***

**Statements And Assumptions:**

Questions of this type are a regular feature of all the competitive examinations, these days. In these questions, a statement is followed by two or more assumptions. The candidate is required to assess the given statement and decide which of the given assumptions is implicit in the statement. To understand the pattern of these questions, it is very essential to know what the terms statement and assumption stand for. Whenever we communicate with others, we make several statements. Therefore, statement is a part of our speech or what we speak to others.

In the process of communication, most of the ideas remain unuttered. As a result, these ideas may not find expression in the statement. However, this unuttered message is very much implied in a statement. Implied, an assumption is something that can be supposed or assumed on the basis of a given statement.

**Statements And Course Of Action:**

Course of action is a decision which a person makes invariably in his life following a problem. In these questions a problem is given in the form of a statement and is followed by two or more decisions in the form of course of action.

***For solving these questions, remember the following points:***

1. Correct course of action should either lessen the problem or improve the situation created by the problem.
2. Simple problem must have simple course of action and not a complex one which may create more problems than to solve or reduce it.
3. Course of action should be feasible and should relate with the practical aspect of life

**Cause and Effect:**

Any occurrence of incident definitely has a cause behind it. The occurrence is called event and the reason behind this occurrence is its cause.

- **Principal Cause:** This is major condition that governs occurrence or non occurrence of an event. Though only its presence does not guarantee happening of that event (as event might need some more occurrences too) but its absence would definitely lead to non-occurrence of this event.
- **Immediate Cause:** This is the condition that triggers the event, so is an important cause that has just happened before occurrence of an event, and caused the event to happen.
- **Principal and Immediate cause:** Generally, examinations have questions to find principal and immediate cause. These are causes that are most proximate in time and one of the most important reasons for the occurrence of this 'event'.

**Statements and Arguments:**

Question based on statement and arguments are the common features of all competitive examinations. In these questions a statement is followed by two arguments. Candidates are required to distinguish between the strong and weak arguments. Generally, both the arguments are contrary to each other and refer to the positive and negative results of the action as mentioned in the statement. A strong argument is that which touches the practical and real aspect of the situation as described in the statement. A weak argument is very simple, superfluous, ambiguous and long drawn one.

***Following points should be taken into consideration while choosing a strong argument.***

1. A strong argument should give the realistic diagnosis while choosing a strong argument.
2. A strong argument should be the deep analysis of the topic dealt within the statement.
3. A strong argument should relate with the statement and be supported up by facts or established notations.
4. A strong argument should not be mere reiteration of the situation given in the statement.
5. **Statements and Inferences:** An inference is something which is not directly stated but can be inferred from the given facts.

**Read the following information carefully and answer the given questions:**

The convenience of online shopping is what I like best about it. Where else can you shop even at midnight wearing your night suit? You do not have to wait in a line or wait till the shop assistant is ready to help you with your purchases. It is a much better experience as compared to going to a retail store. - A consumer's view

1. **Which of the following can be a strong argument in favour of retail store owners?**
   1) Online shopping portals offer a great deal of discounts which retail stores offer only during the sale season.
   2) One can compare a variety of products online which cannot be done at retail stores.
   3) Many online shopping portals offer the 'cash on delivery' feature which are sceptical about online payments.
   4) Many consumers prefer shopping at retail stores which are nearer to their houses.
   5) In online shopping the customer may be deceived as he cannot touch the product he is paying for.

A: 5; The argument in favour of the retail store owners should highlight short-comings or disadvantages of the online shopping and same is effectively done by the argument given in option (5).

2. **Which of the following can be inferred from the given information? (An inference is something that is not directly stated but can be inferred from the given information)**
   1) One can shop online only at night.
   2) Those who are not comfortable using computers can never enjoy the experience of online shopping.
   3) All retail stores provide shopping assistants to each and every customer.
   4) The consumer whose view is presented has shopped at retail stores as well as online.
   5) The consumer view is presented does not have any retail stores in her vicinity.

A: 4; The statement given by the consumer highlights the advantages of online shopping in comparison to shopping in a retail store. Therefore it can be inferred that the consumer has shopped at both retail stores and on online.

**Read the following information carefully and answer the given question:**

Many manufacturing companies are now shifting base to the rural areas of the country as there is a scarcity of space in urban areas. Analysts say that this shift will not have a huge impact on the prices of the products manufactured by these companies as only about 30% consumers live in urban areas.

3. **Which of the following may be a consequence of the given information?**
   1) The prices of such products will decrease drastically in the urban areas.
   2) People living in urban areas will not be allowed to work in such manufacturing companies.
   3) These manufacturing companies had set-ups in the urban areas before shifting base.
   4) Those who had already migrated to the urban areas will not shift back to rural areas.
   5) The number of people migrating from rural to urban areas in search of jobs may reduce .

A: 5; As the manufacturing companies are shifting their base to rural areas, the educated and eligible rural youth will get the jobs in rural areas thereby reducing the migration to urban areas.

**Read the following information carefully and answer the given questions:**

Despite repeated announcements that mobile phones were not allowed in the examination hall, three students were caught with their mobile phones.

A) Mobile phones nowadays have a lot of features and it is easy to cheat with their help.
B) The invigilator must immediately confiscate the mobile phones and ask the students to leave the exam hall immediately.
C) Mobile phones are very expensive and leaving them in bags outside the exam hall is not safe.
D) There have been incidents where students who left the exam hall early stole the mobile phones kept in the bags of the students who were writing the exam.
E) The school authorities must ask the students to leave their phones in the custody of the invigilator before the exam in order to avoid thefts of mobile phones.
F) None of the other students were carrying their phones in the exam hall.

4. **Which of the following among A, B, E and F may be the reason behind the school making such announcements before the exam?**
   1) Only B 2) Both B& E
   3) Only F 4) Only A
   5) Both E & F

A: 4; As the mobile phones have a lot of features, the students can cheat in the examination by getting the answers through the tools using internet and google search engines. This is the reason behind such announcement.